వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 5 హైదరాబాద్ 106 మే 2010 పేజీలు : 60 రు. 10

- ఫోకస్ : కార్మిక జీవితాలు - స్థితిగతులు
- దంతెవాడ ఘటన - నాలుగు కోణాలు
- విద్యా హక్కు చట్టం పూర్వాపరాలు
- హైదరాబాద్ - 'మతఘర్షణ'లేనా?
- తెలంగాణ ఉద్యమం - ప్రశ్నలు
- రాయలసీమను వెనుకకు తోసిందెవరు?
- ప్రాచీన యుగాల్లో శ్రమ విభజన

వీక్షణంకు రాష్ట్రంలోనేకాదు, దేశమంతటా, విదేశాలలోనూ విస్తృతంగా పాఠకులున్నారు

మేధావులు, విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు,
పత్రికా రచయితలు, ఉద్యమాల కార్యకర్తలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలు,
ప్రజా నాయకులు, విధానకర్తలు...
ఒకరేమిటి తెలుగు సమాజంలో ప్రభావశీల వ్యక్తులందరికీ
కరదీపిక వీక్షణం

ప్రపంచానికి మీ మాట అందాలంటే
వీక్షణంలో ప్రకటించక తప్పదు

వీక్షణంలో మీ ప్రకటనలకై చెల్లించాల్సిన రుసుం

చివరి కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు.	20,000
రెండవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు.	15,000
మూడవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	:	రు.	15,000
లోపలి పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో ఫుల్ పేజీ)	:	రు.	12,000
లోపలి పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో హాఫ్ పేజీ)	:	రు.	7,500

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

106

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

మే 2010
సంపుటి : 8
సంచిక : 5

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com
www.veekshanam.wordpress.com
వీక్షణం అకౌంట్ నెంబర్ –
013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

లోలోపల రాజుకుంటున్న రాష్ట్రం

రాష్ట్రం ఒక అగ్నిగుండంలా ఉన్నది. ఈసారి మండుటెండల వాతావరణం వల్ల మాత్రమే కాదు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వల్ల. ఆ సమస్యలకు లెక్కలేదు. వాటి తీవ్రత కూడ భరించ శక్యం కానంత ఎక్కువగా ఉన్నది. అయినా పాలకపక్షాలకు చీమ కుట్టినట్టయినా లేదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో కొన్ని చారిత్రక కారణాలవల్ల తలెత్తినవి కాగా, మరికొన్ని స్వయంగా పాలకులు అనుసరిస్తున్న విధానాల పర్యవసానాలే. పాలకులు ఆ సమస్యలను పట్టించుకోకపోవడంలో ఆశ్చర్యపోవలసింది పెద్దగా లేదు. కాని తమను తాము ప్రతిపక్షాలుగా పిలుచుకునే రాజకీయ పక్షాలకు కూడ ఆ సమస్యలు పట్టడం లేదు. ఏదో ఒకరోజు ప్రచారసాధనాల ముందు నిర్వహించే ఆందోళనా కార్యక్రమాల కోసం తప్ప ప్రతిపక్షాలకు కూడ ప్రజాసమస్యలు కనబడడం లేదు. ఇవాళ్టికివాళ రాష్ట్రంలో ప్రధానమైన ప్రజాసమస్యలు ఒక డజనుకు పైగా, ప్రతి జిల్లాలో స్థానిక సమస్యలు జిల్లాకు డజను చొప్పునా ఉన్నాయి. నవంబర్ చివరి నుంచి రగులుతున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆందోళన నిప్పు పైన నివురు కప్పినట్టు కనబడుతున్నా పది జిల్లాలలో లోలోపల రగుల్కొంటూనే ఉన్నది. నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు రోజువారీగా పెరుగుతూ సాధారణ ప్రజానీకాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. రాజధానీ నగరంలో అతిచిన్న, నివార్యమైన అంశం మీద స్వయంగా పాలకపక్షాలు, రాజకీయపక్షాలు ఘర్షణలను రెచ్చగొట్టి అశాంతికి, హింసకు కారకులయ్యారు. చాల సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకసారి కర్ఫ్యూకు కారణమయ్యారు. ఎండాకాలం ప్రారంభం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా మంచినీటి ఎద్దడితో గొంతు ఎండుకుపోతున్నది. విద్యుచ్ఛక్తి కొరత, సకారణమైనది కొంత, ప్రభుత్వ విధానాల అపసవ్యతవల్ల కొంత కలిసి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను మాత్రమే కాక, సగటు మనిషి జీవితాన్ని దుర్భరం చేస్తున్నది. అటవీ ప్రాంతాలలో విషజ్వరాలతో ఆదివాసుల మరణాలు మళ్లీ మొదలయ్యాయి. ఉత్తరాంధ్ర అంతటా అభివృద్ధి పథకాల పేరిట సాగుతున్న విధ్వంసాన్ని నిరసిస్తూ ప్రజా ఆందోళనలు సాగుతున్నాయి. కాకినాడ నుంచి కృష్ణపట్నందాకా తలపెట్టిన కోస్తాకారిడార్, లక్షలాది రైతు కూలీల, మత్స్యకారుల కుటుంబాలను అక్కడి నుంచి వెళ్లగొట్టి లక్షలాది ఎకరాల పంటభూములను దేశదేశాల పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు కట్టబెట్టబోతున్నదో బైటపడుతున్నది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణల నుంచి అపారమైన ఖనిజ నిలువలను – బాక్సైట్, బైరైటిస్, ఇనుపఖనిజం, బొగ్గు, గ్రానైట్ – పాలకపక్షాల ఆశ్రితులకు, సంపన్నులకు చట్టవిరుద్ధంగా, అక్రమంగా, ప్రజావ్యతిరేకంగా కట్టబెడుతున్నారు. ఓబుళాపురం గనులలో గాలి జనార్ధనరెడ్డి సాగించిన అక్రమాలు, చీమకుర్తి గాలక్సీ గనులలో ప్రమాదానికి దారితీసిన అధికారిక నిర్లక్ష్యం, సింగరేణి బొగ్గుగనుల ప్రైవేటీకరణ దిశగా సాగుతున్న విధానాలు, ఓపెన్ కాస్ట్ తవ్వకాలు, ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టాలు చేకూర్చేలా కాంట్రాక్టులు ప్రభుత్వ ఖనిజ విధానంలోని అక్రమాలకు అద్దం పడుతున్నాయి. మన సమాజపు రాజకీయార్థిక వ్యవహారాలు సక్రమంగా లేవనీ, ప్రజల పేరుమీద గద్దెనెక్కుతున్న పాలకులకు ప్రజల పట్ల కనీస బాధ్యత లేదనీ వస్తున్న విమర్శలు నిజమేనని అంతకంతకూ ఎక్కువమందికి తెలిసివస్తున్నది. నానాటికీ పాలకులు మరింత బహిరంగంగా, నిస్సిగ్గుగా తమ ప్రజావ్యతిరేక కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఎంత దుర్మార్గమైన, అపసవ్యమైన, అక్రమమైన పాలన సాగించినా తమను అడ్డుకునేవారెవరూ లేరని పాలకులు విర్రవీగుతున్నారు. పాలనలో ఇన్ని అక్రమాలు అనునిత్యం జరుగుతుంటే స్పందించవలసిన, నిలదీయవలసిన ప్రజలలో ఎక్కువమంది అనేక కారణాలతో మౌనం వహిస్తున్నారు. ఎదిరిస్తున్న ప్రజాసమూహాల శక్తి సరిపోవడం లేదు. ఆ ప్రతిఘటనలకు, నాయకత్వం వహించడం మాట అలా ఉంచి, కనీస మద్దతు తెలపవలసిన ప్రతిపక్షాలు ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ఎటువంటి ప్రయత్నం చేయడంలేదు. ప్రజా ప్రయోజనాలు భగ్నమవుతున్న తీరు గురించి, పాలకులను ప్రతిఘటించవలసిన అవసరం గురించి సమాచారాన్నీ, విశ్లేషణనూ అందించవలసిన ప్రచారసాధనాలు పనికిమాలిన విషయాలకు విపరీత ప్రచారం ఇస్తూ అవసరమయిన విషయాలవైపు కన్నెత్తయినా చూడడం లేదు. ప్రజా ఆందోళనలకు నాయకత్వాన్నీ, మార్గదర్శకత్వాన్నీ ఇవ్వవలసిన శక్తులు శకలాలుగా మారి ఉన్నాయి. ఈ స్థితి నిరాశకు దారితీయనక్కర లేదు. తెలుగుజాతి ఇటువంటి విపత్కర పరిస్థితులను ఇదివరకు ఎన్నోసార్లు ఎదుర్కొన్నది. ప్రతి సందర్భంలోనూ తెలుగు ప్రజానీకం తాము అన్యాయాన్ని, అక్రమాన్ని సహించబోమనీ, పాలకుల మెడలు వంచి కనీస సంక్షేమ రాజ్య భావననయినా నిలుపుకుంటామనీ రుజువు చేశారు. అంతకన్న మిన్నగా, సమసమాజ ఆదర్శం దిశగా తమ ప్రయాణాన్ని ఎన్నటికీ పక్కనపెట్టబోమనీ రుజువు చేశారు. ఇప్పుడు కూడ సమస్యలు సృష్టించి పెంచి పోషిస్తున్న పాలకులనూ, తమపక్కన నిలబడకుండా దొంగాట ఆడుతున్న ప్రతిపక్షాలనూ, అసలు సంగతులను విస్మరిస్తున్న ప్రచారసాధనాలనూ, మౌనం వహిస్తున్న బుద్ధిజీవులనూ నిలదీయవలసింది ప్రజలే. సామాజిక ప్రయోజనాలకు అడ్డం వచ్చేవారు ఆ క్షణానికి ఎంత బలవంతులుగా కనబడినా, ప్రజాశక్తి ముందర తేలిపోక తప్పదనీ, అంతిమ విజయం ప్రజలదేననీ రుజువు చేయవలసింది ప్రజలే. వీ

దంతెవాడ ఘటన ఎందుకు జరిగింది?

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో తాడిమెట్ల దగ్గర ఏప్రిల్ 6 ఉదయం జరిగిన దాడిలో 76 మంది సి.ఆర్.పి. జవాన్లు మరణించారు. వందలాది మంది మావోయిస్టు గెరిల్లాలు, భూంకాల్ మిలీషియా అనే ఆదివాసి సాంప్రదాయిక సాయుధులు చేసిన ఈ దాడి ఆధునిక భారత చరిత్రలో యుద్ధాలలో మినహా ప్రభుత్వ బలగాలు పెద్ద ఎత్తున మరణించిన మొదటి సంఘటన. కాశ్మీర్‌లో, ఈశాన్య రాష్ట్రాలలో, పంజాబ్‌లో కూడ ప్రభుత్వ సాయుధ బలగాలు మరణించాయి గాని ఎక్కడా ఒకే ఒక్క ఘటనలో ఇంతమంది మరణించిన సందర్భం లేదు. ఇటువంటి సంఘటన దండకారణ్యంలో ఎందుకు జరిగిందో, ఏ నేపథ్యం అందుకు కారణమో పరిశీలించే బదులు రాజకీయ పక్షాలు, ప్రచార సాధనాలు 'దారుణం', 'ఘాతుకం', 'మారణకాండ' వంటి మాటలు వాడి, చరిత్రను పరిశీలించే బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయి. ఈ ఘటనను ఖండించడమా, ఖండించకపోవడమా అనే సమస్యకన్న ముఖ్యమైనది, అది ఎందువల్ల జరిగిందో గుర్తించడం. దాన్ని ఖండిస్తున్నవాళ్లు అటువంటి ఘటన పునరావృతం కాగూడదని నిజంగా కోరుకుంటే అది ఎందుకు జరిగిందో కనిపెట్టి, ఆ మూలకారణాన్ని తొలగించగలమా ఆలోచించ వలసి ఉంటుంది. నిజానికి ఈ ఘటనను తమమీద జరుగుతున్న దౌర్జన్యాలకు ఆదివాసుల ప్రతిఘటనలో భాగంగా చూడాలి. ఆ ఆదివాసులు ప్రతిఘటిస్తున్నది వారి వనరుల మీద బైటివాళ్ల దురాక్రమణను. వంద సంవత్సరాల కింద బ్రిటిష్ వలసవాదుల దోపిడీ మీద జరిగిన భూకాల్ తిరుగుబాటును సంస్మరించుకుంటూ ఇవాళ ఆదివాసులు ఒక అర్ధసాయుధ సైన్యాన్ని ఏర్పరచుకుంటున్నారంటే ఆదివాసుల మీద దోపిడీ పీడనలు వంద సంవత్సరాలలో ఏమీ మారలేదన్నమాట. ప్రత్యేకించి గత ఆరు సంవత్సరాలుగా సాల్వా జుడుం పేరుతో ఆదివాసులను వారి ఆవాసాలనుంచి తొలగించి, ఆ ఖనిజ నిక్షేపాల భూమిని బహుళజాతిసంస్థలకు అప్పగించే కార్యక్రమం ప్రారంభమయింది. భారతీయ జనతా పార్టీకి చెందిన రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్‌కు చెందిన స్థానిక నాయకత్వం కలిసికట్టుగా చేసిన ఈ దాడిలో వేలాది మంది ఆదివాసులను చంపేశారు, వందలాది మంది స్త్రీలపై అత్యాచారాలు చేశారు. తమ క్యాంపులలోకి రానివాళ్లందరినీ మావోయిస్టులుగానే పరిగణిస్తామని బెదిరించారు. ఈ బెదిరింపులకు భయపడి రాష్ట్ర సరిహద్దులుదాటి పారిపోయి వచ్చిన మూడులక్షల మంది ఆదివాసులు ఆంధ్రప్రదేశ్‌లో తలదాచుకుంటున్నారు. ఈ వివరాలన్నిటినీ కనీసం అరడజను స్వతంత్ర నిజనిర్ధారణ బృందాలు, కేంద్ర మానవహక్కుల కమిషన్, సుప్రీంకోర్టు కూడ గుర్తించాయి. ఒకవైపు ఇది సాగుతుండగానే ఈ ప్రాంతంలోనే ఆరునెలలుగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో పారామిలిటరీ బలగాల దాడి ప్రారంభమయింది. ఈ దాడిలో 120 మందికన్న ఎక్కువమంది ఆదివాసులను చంపారని వార్తలు వస్తున్నాయి. ఈ దాడిలో భాగమయిన సి.ఆర్.పి. బెటాలియన్ మీదనే ప్రస్తుతం ఎదురుదాడి జరిగింది. దాడినయినా, ఎదురుదాడినయినా సమర్థించడమో, ఖండించడమో కన్న ముఖ్యం వాటి చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడం. ఘటనమీద వ్యాఖ్యాతల అభిప్రాయాలు ఏమయినా కావచ్చు గాని గడిచిన చరిత్ర మారదు.

థాయిలాండ్, కిర్గిజిస్తాన్ ప్రజాగ్రహం

ఏప్రిల్ 10 న రెండు ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాలు జరిగాయి. మనకు ఉత్తరాన పాత సోవియట్ రిపబ్లిక్ లలో ఒకటయిన కిర్గిజిస్తాన్ లోనూ, ఆగ్నేయాన థాయిలాండ్ లోనూ పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక, ప్రజాగ్రహ ప్రదర్శనలు, విధ్వంసం, రక్తపాతం జరిగాయి. కిర్గిజిస్తాన్ లో జరిగిన ప్రజాందోళనలో 80 మంది మరణించారు. అధ్యక్షుడు కుర్మాన్ బెక్ బకియెవ్ మొదట రాజధాని నుంచి తన సొంత పట్టణం జలాలాబాద్ కు, అక్కడినుంచి కజక్ స్థాన్ కు, అక్కడినుంచి బెలారుస్ కు పారిపోవలసి వచ్చింది. థాయిలాండ్‌లో వేలాది ప్రదర్శకులు ప్రభుత్వాన్ని స్తంభింపజేశారు. సైనికులు విచ్చలవిడిగా కాల్పులు జరిపి పన్నెండు మంది ప్రదర్శకులను, ఒక పత్రికా ప్రతినిధిని చంపివేశారు గాని ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించమని కోరుతూ సాగుతున్న ప్రజాందోళన సమసిపోలేదు. కిర్గిజిస్తాన్‌లో ప్రజాగ్రహానికి తక్షణ కారణాలు అధికార యంత్రాంగపు అవినీతి, అధికధరలు. ఆ అవినీతిని అరికడతాననే, పేదరికాన్ని నిర్మూలిస్తాననే వాగ్దానాలతో, తిరుగుబాటుతో 2005లో అధికారంలోకి వచ్చిన బకియెవ్ ఆ వాగ్దానాల్ని నిలుపుకోలేదు సరిగదా తానే స్వయంగా అవినీతికి ఒడిగట్టాడు. అఫ్ఘనిస్తాన్ మీద దాడికోసం కిర్గిజిస్తాన్ లో యుద్ధ, వైమానిక స్థావరం ఏర్పాటు చేసుకోవడానికి అమెరికాకు అనుమతి ఇచ్చి కోట్ల డాలర్లు ముడుపులు పొందాడు. తన కుటుంబ సభ్యులను ముఖ్యపదవులలో నింపాడు. తనను సమర్థించని పత్రికలన్నిటిమీద విరుచుకుపడ్డాడు. పాత్రికేయులను బెదిరించడం, దాడిచేయడం, చంపడం సాగించాడు. అయినా 2009 ఎన్నికలలో విజయం సాధించాడు. ఆ ఎన్నికలలో లెక్కలేనన్ని అక్రమాలు జరిగాయని పరిశీలకులు అన్నారు. అలా అమెరికాకు, సంపన్నులకు, కుటుంబ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రజావ్యతిరేక పాలన సాగించిన బకియెవ్‌ను ఎన్నికలు కూడ ఏమీ చేయలేకపోయాయి గాని కొద్దినెలలుగా రాజుకుంటున్న అసంతృప్తి రగిలించిన ప్రజాగ్రహం గద్దె దింపి, బయటికి తరిమింది. ఇక థాయిలాండ్ మొదటినుంచీ కూడ లాంఛనప్రాయమైన రాజరిక పాలన కింద జరిగే ఎన్నికలలో 'ప్రజాస్వామిక' ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నప్పటికీ, ఆ ప్రభుత్వాలన్నీ బహుళజాతి సంస్థల, అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసన్నలలోనే సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా ప్రస్తుత అభిశిత్ వెజ్జవీర ప్రభుత్వం సైనిక కుట్రతో అధికారంలోకి వచ్చి, ఎన్నికలు కూడ జరపకుండా నిరంకుశపాలన సాగిస్తోంది. ప్రపంచీకరణ శక్తులతో కలిసి రాచరికం, సైన్యం, నిరంకుశత్వం సాగిస్తున్న పాలన మీద ప్రజల ఆగ్రహానికి అనేక కారణాలున్నాయి. రైతులలో, కార్మికులలో, మధ్యతరగతిలో ఉన్న ఆ ఆగ్రహానికి రెడ్ షర్ట్స్ అని పేరుపెట్టుకున్న ప్రతిపక్షాల కూటమి నాయకత్వం వహిస్తోంది. ప్రజల సహనానికి ఎక్కడో ఒకచోట హద్దు ఉంటుందని, అది దాటితే, సైనిక ప్రభుత్వాలయినా, ఎన్నికలలో గెలిచిన ప్రభుత్వాలయినా, ప్రజలమీద దమనకాండకు దిగినా, ఊచకోతలు కోసినా పతనం కాక తప్పదని ప్రపంచ చరిత్ర అనేకసార్లు పాఠాలు చెప్పింది. ఆ పాఠమే ఇవాళ కిర్గిజిస్తాన్లో, థాయిలాండ్ లో ప్రతిధ్వనిస్తోంది. మన 'ప్రియ భారత జనయిత్రి'లో ఆ ప్రతిధ్వని ఎన్నడో... వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : కార్మిక జీవితాలు - స్థితిగతులు

షికాగో నగరంలో పని గంటల తగ్గింపు కోసం ఉద్యమం నుండి 'మేడే' ఆవిర్భవించింది. కార్మిక వర్గాన్ని, శ్రామికులను పోరాటాలవైపు, ఉద్యమాల వైపు నడిపింది. ఈ ఘటన ఆవిష్కృతమై 124 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. శతాబ్దానికి పైగా గడిచిన ఈకాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు జరిగాయి. నిరంకుశ రాజ్యాలు పతనమయ్యాయి. భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక ప్రాంతాలలో, వివిధ రూపాలలో సాయుధ రైతాంగ పోరాటాలు చోటు చేసుకున్నాయి. కొన్ని విజయాలు సాధించినా ఇంకా సాధించాల్సిన కర్తవ్యం మిగిలే ఉంది.

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028









- **ఆంధ్రప్రదేశ్ విభజన కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి** – కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల వ్యాససంకలనం – జనశక్తి ప్రచురణ, పేజీలు 59, 1/8 డెమీ, రు.15,
- **విభజనవాద – సమైక్యవాద మూలాలు – మార్క్సిస్టు పరిశీలన – కర్తవ్యాలు** – జనశక్తి ప్రచురణ, పేజీలు 24, 1/8 డెమీ, రు.5,

  పై రెండు ప్రతులకు : పి. జశ్వంతరావు, 32–13–26/1, బి.ఎం. రావు రోడ్, మొగల్‌రాజపురం, విజయవాడ – 520 010; మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ–2
- **ఆంధ్ర కాయిన్స్** – సెలెక్టెడ్ ఆర్టికల్స్ – డా. దెమె రాజా రెడ్డి, రామయ్య విద్యాపీఠం, పేజీలు 175, 1/8 డెమీ, రు.150, ప్రతులకు: జూలూరి గౌరి శంకర్, 1–8–702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500044; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **తెలంగాణ సాధనకై – కేంద్ర ప్రభుత్వ కమిటీ, కృష్ణ సారథ్యమా? శల్య సారథ్యమా?** – ఎనిశెట్టి శంకర్ – స్నేహ ప్రచురణలు – పేజీలు 100, 1/16 డెమీ, రు. 10, ప్రతులకు : ఎనిశెట్టి శంకర్, 104, ఎస్‌విటి అపార్ట్‌మెంట్, ఆర్‌టిసి కాలనీ, ముబారక్‌నగర్, నిజామాబాద్ – 503003, సెల్ నెం. 9866630739
- **హమారా హైదరాబాద్** – తెలంగాణ వ్యాస సంకలనం – సంపాదకులు : భోనకుర్తి సోమేశ్వర్ – తెలంగాణ విద్యార్థి గొంతుక ప్రచురణలు – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : హైదరాబాద్‌లోని దిశ పుస్తక కేంద్రం, సహచర బుక్ మార్క్
- **తెలంగాణ జంగ్** – ఉద్యమ కవిత–2009 – వరంగల్లు రచయితల సంఘం, పేజీలు 42, 1/4 క్రౌన్, రు.15, ప్రతులకు : ఇ.నెం. 7–1–384/6, పద్మాక్షి కాలనీ, హన్మకొండ, సెల్ నెం. 9989415571
- **జేమ్స్ పెట్రాస్ – వ్యాస సంకలనం 2** – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ – పేజీలు 106, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నెం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002, సెల్ : 9985377760, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, మైత్రి, దిశ, సహచర, నవయుగ, మణి బుక్‌స్టాల్
- **అంచనా...** – సంగ్రామ్ – విప్లవ రచయితల సంఘం, పేజీలు 43, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : సంగ్రామ్, 5సి – ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్స్, 5వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు – 6
- **కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహ్మారెడ్డి** – బి. యన్. ప్రథమ వర్ధంతి సంస్మరణ సంచిక – సేకరణ, కూర్పు : దేగల జనార్ధన్, భీంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మల్లు కపోతంరెడ్డి, గుండ్లపల్లి లక్ష్మీనర్సింహ్మారావు – సుధాధర పబ్లికేషన్స్, మానవతా పబ్లికేషన్స్ హైదరాబాద్, పేజలు 56, 1/8 డెమీ, ప్రతులకు : సుధాధర పబ్లికేషన్స్, మానవతా పబ్లికేషన్స్, బి–2, ప్రసాద్ ఎన్‌క్లేవ్, ఇ.నెం. 3–4–778, బర్కత్‌పుర, హైదరాబాద్ – 500027, సెల్ : 9848994240
- **రెక్కలు** – సుగమ్‌బాబు – న్యూ లైఫ్ ప్రెసెంటేషన్స్, పేజీలు 120, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: న్యూ లైఫ్ ప్రసంటేషన్స్, 502, సాయి తేజ ఎన్‌క్లేవ్, సురారం క్రాస్ రోడ్స్, వెంకట్రామనగర్, హైదరాబాద్ – 500055, ఫోన్: నెం. 040–23195428, 9392517348




'వీక్షణం ఏప్రిల్ 2010 సంచికలో వచ్చిన 'ఇది అసామాన్యుల బడ్జెట్' శీర్షిక 'ఇది శ్రీమంతుల బడ్జెట్' అనుంటే బాగుండేది. మొదటికాలంలో ఆఖర్న '12 కోట్ల ప్రజానీకానిక'ని ఉంది. బహుశా ఇది 120 కోట్లనుకుంటాను. పాఠకులకు కాసింత గందరగోళం. 'ఆగ్రోప్రాసెసింగ్ అంటే ఏమిటో వివరణ ఉండాలి. తమ స్థాయిలో పాఠకులుంటారనే భావనతో గాక, ఎంత అవగాహన లేని వారికైనా అర్థమయ్యేలా రచన ఉండాలి. అలా రాయకపోవడం, వాళ్లకు కూడా స్పష్టంగా తెలియదనుకోవాల్సి వస్తుంది. రెండవకాలం ఆఖర్న 'కాని ద్రవ్యోల్బణం రేటు 10 నుంచి 12 శాతం, ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం సుమారు 18 శాతం అంటే వచ్చే సంవత్సరంలో ద్రవ్యోల్బణాన్ని గమనంలో తీసుకున్నప్పుడు వచ్చే సంవత్సరంలో ప్రస్తుత సంవత్సరం కన్నా వాస్తవంలో తక్కువ ఖర్చు కాబోతోంది.' దీన్ని అర్థం చేసుకోవాలంటే పాఠకుడు అక్కడ కాస్త ఆగి ముందుకూ వెనక్కూ చదువుకొని, ఏదో తృప్తిపడాలి. ద్రవ్యోల్బణానికి ఒకచోట 'రేటు' అవసరమైంది; వెంటనే వచ్చిన అదే వాక్యంలోని మరో ద్రవ్యోల్బణానికి రేటు అవసరం లేకపోయింది. ఇక్కడ వాక్య సమతుల్యత లోపించి – ఏదో తక్కువైనట్లనిపిస్తుంది. 'అసలు ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం' అంటే ఏమిటో సమాజంలో ఏ కొద్దిమందికో తప్ప అసంఖ్యాకులకర్థం కాదు. నాతో సహా. ఫలితంగా వ్యాసకర్తల శ్రమా, ప్రచురణకర్తల శ్రమా వృథా.

పేజీ 10, రెండవకాలం ఆఖర్న, 'అంటే ఈ విధానాన్ని ప్రజల మాట అలా ఉంచి ఇన్వెస్టర్లు కూడా ఆమోదించలేదు. అయినా కూడా…' ఇన్వెస్టర్లు ఎందుకని ఆమోదించలేదో పాఠకులకెవరికీ అర్థం కాదు. అర్థం చెయ్యాల్సిన బాధ్యత రచయితది. వచ్చే సంచికలో ఇలాంటి అర్థం కాని వాటికి వివరణలుంటే పాఠకులు లాభపడతారు. ఇంకా కొన్ని – 'దీనినే ఆంగ్లంలో సెల్లింగ్ ఫామిలీ సిల్వర్ అంటారు. ఇది ప్రైవేటీకరణపై ప్రజల తీర్పు'. ఇది సందర్భరహితంగా ఉన్నట్లుంది. పోతే దీన్ని తెలుగులో ఏమంటారో తెలుగువాళ్లకు తెలిసేదెలా? అలా తెలియాలంటే, దాన్ని తెలుగులో దించాలి గదా! 'గవర్నమెంట్ హాస్ నో బిజినెస్ టు బి ఇన్ బిజినెస్' వీక్షణం ఆగస్టు, చర్చి, కమ్యూనిస్టు, మార్క్సిస్టు, అరెస్టు – లాంటి తెలుగుకనుగుణంగా ఉండే పదాల్ని ఆంగ్లోచ్చారణకనుగుణంగా – ఆగస్ట్, చర్చ్, కమ్యూనిస్ట్, అరెస్ట్'లుగా రాస్తుంది. (ఇలా బూర్జువా దినపత్రికలు సైతం రాయవని ఇక్కడ గుర్తుంచుకోవాలి). అయితే పై వాక్యంలో ఆంగ్ల పదాల ఉచ్చారణలు అన్ని తప్పే – బడ్జెట్‌తో సహా. అంటే ఆంగ్లోచ్చారణలో లేవు. అవి ఇలా ఉండాలి. 'గవన్నెంట్ హాజ్ నో బిజ్నిస్ టూ బీ ఇన్ బిజ్నిస్' బడ్జెట్ 'బజిట్' గా ఉండాలి. మామూలుగా దినపత్రికలు వాడే పదాల్ని వక్రీకరించి రాసినవారు ముఖ్యమైన ఇలాంటి ఆంగ్ల పదాల్ని ఉచ్చారణలో ఘోరం చేయడం ఎందుకు?

11వ పేజీ రెండవ కాలం, 'వాటి ఆస్తులు పబ్లిక్‌రంగంలో సుమారు రెట్టింపు దాటితే ప్రైవేట్ రంగం నాలుగు రెట్లు పెరిగాయి..' వాటి ఆస్తులు – వేటి ఆస్తులు? తరువాతి వాక్యం ఆధారంగా ఇవి ప్రైవేట్ ఆస్తులు అనుకోవచ్చు. అవి పబ్లిక్ అంటే ప్రభుత్వ రంగ పరిశ్రమలలో రెట్టింపు దాటితే – అంటే – ముందు ఎంతలో ఉండినాయి? ఇలా విషయాన్ని బ్రహ్మపదార్థంగా మార్చడమెందుకు? ఇంకా వాక్యంలో లోపం. పబ్లిక్ రంగంలో అని వాడినపుడు ప్రైవేట్ రంగంలో అనుండాలి. లేనిచో సరిగ్గా చదవదు. అర్థం కాదు.

'దేశంలో, ఆఫ్రికాలో వేల ఎకరాల భూములు కొనివేస్తున్నారు' మన దేశంలోనూ, ఆఫ్రికాలోనూ – అని రాస్తే స్పష్టత ఉంటుంది. పత్రికలు ఎంతో చెత్తకు చోటిస్తుంటారు. రెండు మాటలకు ఎంత పోతుంది? లేక ఇలా రాయడం ఆర్థిక సంస్కరణల్లాగా భాషా సంస్కరణా? పాఠకుల్ని చంపేస్తున్నారు. ఇంకా 'ఫుడ్ కార్పొరేషన్' గోదాముల్లో ఫుడ్ కాదు – ఫూద్. ఆహార సంస్థ గోదాముల్లో బావుండదా?

బ్యాంకులు, ఫ్యామిలీ, లాంటి పదాల్ని అక్షరంపైన శ్లాష్ ఇచ్చి రాయొచ్చుగదా – బా'ంక్, ఫా'మిలీ – వగైరా. గురుజాడ 110 ఏళ్ల క్రితమే కన్యాశుల్కంలో ఈ విధానం పాటించారు. ఆ వ్యాసం ఆంగ్ల పదాలు – వ్యాస గంభీరతను చెడగొడతాయి. సదరు ఆంగ్ల పదానికి తెలుగు వారికి తెలియకపోతే నిఘంటువు చూడాలన్నా మరింత మంచి పదానికి, అనువాదానికి ఇతరుల్ని సంప్రదించవచ్చు.

'రాయలసీమ అస్తిత్వాన్ని గుర్తించాలి' మొదటిభాగం గత సంచికలోనూ, రెండవ భాగం ప్రస్తుత (ఏప్రిల్ 2010) సంచికలోనూ పాణి గారి వ్యాసం చాలా విలువైనదిగానూ, విలక్షణంగానూ ఉంది. అరె! ఈ విషయాలు ఇంతకుముందు మన బుర్రకు ఎందుకు తట్టలేదు! అని విస్మయం కలిగిస్తాయి. రచన నింపాదిగా, గంభీరంగా, మందగమనంతో ఉంది. మంచి పదాల్ని, పదబంధాల్ని వ్యాసంలో ఆయన వాడారు. వాక్యాల్లో ఎక్కడా గంద్రగోళం, అస్పష్టత లేవు. వాక్యాలు నిండుగా ఉన్నాయి, వెలితి లేకుండా. ఒక్క ఆంగ్ల పదం లేదు, కోరస్, డిమాండ్! తప్ప. ఆయనకు ఇంగ్లిష్ రానట్లే ఉంది. అయినా ఫరవాలేదు. చక్కని వ్యాసం. విలువైన వ్యాసం. ఒక చారిత్రక వ్యాసం – వీక్షణం పాఠకులకందించారు. ఆయనకు నా ధన్యవాదాలు. దీన్ని ఒక చిన్న పొత్తంగా వేస్తే బావుంటుంది.

– వి. వెంకటరెడ్డి
ఇంటె ఓబయ్యపల్లె, కడప

'వీక్షణం ఏప్రిల్ సంచికలో వచ్చిన 'సామాన్యుల సంక్షోభం – సంపన్నుల సంక్షేమం' వ్యాసం అర్థం చేసుకోవడం కొద్దిగా కష్టంగా అనిపించింది. సామాన్యులకు అర్థమయ్యే సరళ భాషలో ఉంటే బాగుంటుంది. మధ్యలో ఇంగ్లిష్ పదాలు చాలా ఉన్నాయి. వాటి అర్థాలు అందరికీ తెలియవు. వాటిని గురించి ఇంకా వివరంగా రాస్తే చదివేవారికి ఉపయోగకరంగా, అర్థవంతంగా ఉంటుంది. మహిళా బిల్లు పై వచ్చిన వి. సంధ్య వ్యాసం బాగుంది. అందరికీ ఆమోదయోగ్యంగా మహిళా బిల్లు రావాలి. ముఖ్యంగా బలహీనవర్గాల మహిళలకు ఉపయోగపడేలా ఉండాలన్న వాదన చాలా అభినందించదగింది. మహిళా సమస్యలపై ఇంకా వ్యాసాలు వస్తే బాగుంటుంది.

– టి. రాములు
మిర్యాలగూడ, నల్లగొండ

'చీమకుర్తి గ్రానైట్ దుర్ఘటన' వ్యాసం బాగుంది. గ్రానైట్ లాభాలు పరిశ్రమ పెద్దలు తన్నుకుపోతే, కనీస పద్ధతులు లేకుండా ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మృతుల సంఖ్య కూడా ఇంతవరకు బయటికి రాకుండా కప్పి ఉంచారు. ఇలాంటి ఘటనలలో చనిపోయిన సామాన్యుల పేర్లు, వయస్సు, కులాలు వంటి సమాచారం ఇస్తే బాగుండేది.

– వై. యశోద
వేళంగి, తూర్పు గోదావరి

వీక్షణంకు చందాలు, వీక్షణం పబ్లికేషన్ పుస్తకాల కోసం మీరు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కట్టడానికి వీలుగా
వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101100 2175**, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

– ఏప్రిల్ 2010 సంచికలో వచ్చిన నరేంద్రమోహన్ గారి 'పాలస్తీనా పోరాట నేపథ్యం' వ్యాసంలో 46వ పేజీలో కుడివైపు 5వ లైన్‌లో థియోడర్ హెర్జ్ ను థియోడర్ హెర్జ్‌ల్‌గా సరిచూసుకోగలరు. 47వ పేజీలో 10వ పేరాలో 11వ లైన్‌లో 'సమ్మతికి వ్యక్తీకరణకు' ను 'సమ్మతికి వ్యతిరేకంగా' అని సరిచూసుకోగలరు. 48వ పేజీలోని కుడివైపు రెండవ లైన్‌లో 14 మే, 1978 ను 14 మే 1948గా సరి చూసుకోగలరు.

– ఏప్రిల్ 2010 సంచికలో వచ్చిన ఎన్. శ్రీదేవి గారి 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల సమీక్ష' వ్యాసంలో 14వ పేజీలో 3వ పేరాలోని 5వ లైన్‌లో 'జిఒఐ' ను 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' గా సరి చూసుకోగలరు. 15 పేజీలోని పట్టికలో ఉన్న ఆరు, ఎనిమిది కాలమ్‌లలో 'బడ్జెట్ వ్యయం'ను 'బడ్జెట్ అంచనా'గా సరి చూసుకోగలరు. 18వ పేజీలోని కుడిపక్క మొదటి లైన్‌లో '6.46 శాతం' ను '26.46 శాతం' గా సరి చూసుకోగలరు. ఆఖరు పేరాలో 5వ లైన్‌లో 'ఇంతలో పరిస్థితి' ని 'ఇంతలా పరిస్థితి' గా సరిచూసుకోగలరు. అచ్చు తప్పులకు చింతిస్తున్నాం. – సం.

సొమ్ములింకా అందలేదు

మార్చ్ 22 నాటికి విద్యార్థుల ఖాతాల్లోకి చేరాల్సిన ఫీజులు, ఉపకార వేతనాలు చేరలేదు. ఫీజుల రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లింపులు చతికిలపడ్డాయి. విడుదలైన నిధులలో అధిక భాగం పాత (రెన్యూవల్) విద్యార్థుల బకాయిలకే సరిపోతున్నాయి. ఈ వైఫల్యానికి ప్రభుత్వంతో పాటు ట్రజరీలు, బ్యాంక్‌లు, అధికారులు అందరూ బాధ్యులే. ఫీజుల రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం బి.సి. విద్యార్థులు –13,44,258 మంది, ఎస్.సి. – 6,13,386, ఎస్.టి. – 2,03,000, ఇ.బి.సి. – 2,79,742, వికలాంగులు – 6,739 మంది దరఖాస్తు చేసుకున్నారు. అవసరానికి, కేటాయింపులకు మధ్య అఖాతం ఏర్పడింది.

ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

ప్రజారాజ్యం పార్టీ జిల్లా కార్యాలయాలు నిధులు లేక నీరసించాయంటూ ఎబిఎన్ – ఆంధ్రజ్యోతి ఛానల్ 'బాక్స్ ఖాళీ' పేర ప్రసారం చేసిన కథనానికి నిరసనగా పి.ఆర్.పి. కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంపై మార్చ్ 22న దాడిచేశారు. ఈ దాడికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులు నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. ప్రజాస్వామికవాదులంతా ఈ దాడిని ఖండించారు.

ముస్లిం రిజర్వేషన్‌లకు ఓకే!

రాష్ట్రంలో 14 ముస్లిం తెగలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుమతించింది. మత ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించడం చెల్లదంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించింది. వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించడంలో తప్పులేదని మార్చ్ 25న అత్యున్నత న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఆగస్ట్ 12కు వాయిదా వేసింది. ఉన్నత వర్గాలకు కాకుండా కేవలం 14 తెగలకు (ఫకీర్, బోరేవాలే, లబ్బె, ఖురేషీ, దోబీ, చెక్కథాకరే, అచ్చుకట్లు వాండ్లు, గుద్దేలుగు వాండ్లు, సిద్ది, గారడి, అత్తరు సాయిబు, గోసంగి, షేక్, హజమ్) మాత్రమే రిజర్వేషన్‌లు అమలు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

హైదరాబాద్‌లో అల్లర్లు

మార్చ్ 27 రాత్రి హైదరాబాద్‌లోని మాదన్నపేటలో జెండాల విషయంలో మొదలైన మతపరమైన ఉద్రిక్తతలు, ఆ తరువాత హుసేనీ ఆలం, ముషీరాబాద్‌లకు విస్తరించాయి. ఈ అల్లర్ల వల్ల 25 పోలీసు స్టేషన్ల పరిధిలో 12 రోజులు కర్ఫ్యూ విధించారు. ముగ్గురు చనిపోయారు. వందమందికి పైగా గాయపడ్డారు. పోలీసులు మూడొందల మందిని అరెస్ట్ చేశారు. ఒక గోశాల, మూడు మందిరాలు, ముప్పై ఆరు మసీదులు, నాలుగు దర్గాలు, మూడు నిషాన్‌లు అల్లర్లలో ధ్వంసం అయ్యాయి. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు.

ఆ టీకాను ఆపేయండి

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ను నిరోధించేందుకు ముందు జాగ్రత్తగా ఇచ్చే ఎచ్.పి.వి. (హ్యూమన్ ప్యాపిలోమా వైరస్) టీకాను వెంటనే నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐ.సి.ఎం.ఆర్.) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. సర్వైకల్ టీకా వికటించి ఇప్పటికే నలుగురు గిరిజన బాలికలు చనిపోయారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కొత్తగూడెం, భద్రాచలం మండలాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన టీకా కార్యక్రమం ఇప్పటికే పూర్తయిందనీ, తమకెలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు అందలేదనీ 'శిశు ఆరోగ్య టీకాల విభాగం' సంయుక్త సంచాలకులు డా. సుభద్ర ఏప్రిల్ 8న ఒక ప్రకటనలో తెలిపారు.

నరమేధాన్ని ఆపండి

అమాయకులైన ఆదివాసులపై గ్రీన్‌హంట్ పేరుతో నరమేధానికి పూనుకోవడం సరియైంది కాదని గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏప్రిల్ 12న గ్రీన్‌హంట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సభకు ఎ.పి.సి.ఎల్.సి. ప్రధాన కార్యదర్శి క్రాంతి చైతన్య అధ్యక్షత వహించారు. సభలో ఎస్.సి., ఎస్.టి. కమిషన్ మాజీ అధ్యక్షులు బి.డి. శర్మ, విరసం నేత వరవరరావు, సిని నిర్మాత ఆర్. నారాయణమూర్తి, ఆదివాసీ ఐక్య వేదిక నాయకులు సిడం శంభు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, ఎ.ఐ.కె.ఎం.ఎస్. నాయకులు రంగయ్య, తుడుం దెబ్బ నాయకులు వట్టం ఉపేందర్ పాల్గొన్నారు.

ఇంతలా తాగుతున్నారా?

రాష్ట్రంలో ఏటా పదిహేను వేల కోట్ల రూపాయల మద్యం అమ్మకాలను చూసి గవర్నర్ ఇ.ఎస్. నర్సింహన్ ఆశ్చర్యం ప్రకటించారు. మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును సంక్షేమ పథకాలకు ఉపయోగించడం సరైన విధానం కాదని ఎక్సైజ్ కమిషనర్, ఇతర అధికారులతో ఏప్రిల్ 13న సమీక్షా సమావేశంలో గవర్నర్ అభిప్రాయ పడ్డారు. ఏటా మద్యం అమ్మకాలు 15 నుంచి 25 శాతం పెరుగుతుండడం, గ్రామీణ ప్రజల జీవితం అస్తవ్యస్తం కావడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. రాష్ట్రంలో కల్తీసారా, గుడుంబాలను అరికట్టాలన్నారు.

జనగణన

మన రాష్ట్రంలో జనగణన ఏప్రిల్ 26 నుంచి ప్రారంభం కానున్నది. జనగణన రెండు విడతలలో ఫిబ్రవరి 2011 వరకు జరుగుతుందని జనాభా గణన సంచాలకులు వై.వి. అనురాధ ఏప్రిల్ 20న ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జనాభా గణన – 2011 దేశ చరిత్రలో పదిహేనవది. స్వాతంత్ర్యం వచ్చాక జనగణన నిర్వహించడం ఇది ఏడవ సారి. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఆరవసారి. జనగణన కోసం జనాభా గణన డైరెక్టరేట్ ప్రతి ఆరు వందల మందికి ఒకరు చొప్పున 1.6 లక్షల మంది ఎన్యూమరేటర్లను నియమించింది.

65 వేల విజ్ఞప్తులు

జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి నివేదనలు అందించాల్సిన గడువు ఏప్రిల్ 10న ముగిసింది. గడువు ముగిసేనాటికి వివిధ పార్టీలు, సంస్థలు, సంఘాల నుంచి 65 వేల విజ్ఞప్తులు వచ్చాయని కమిటీ కార్యదర్శి వి.కె.దుగ్గల్ తెలిపారు. వచ్చిన నివేదనలలో తెలంగాణ డిమాండ్ చేసేవీ, రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని కోరేవి అధికంగా ఉన్నాయి. వీటితోపాటు ప్రత్యేకాంధ్ర కావాలని మన్యసీమ పేరుతో మరికొందరు కూడా తమ అభిప్రాయాలు వెల్లడించారు. వీ

ఛత్తీస్‌గడ్, దంతెవాడ జిల్లా తాడిమెట్లలో ఏప్రిల్ 6 ఉదయం భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కు చెందిన పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ, భూంకాల్ మిలీషియా, ఆదివాసీ ప్రజానీకం కలిసి భారత ప్రభుత్వపు కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలకు (సి.ఆర్.పి.ఎఫ్.) చెందిన ఒక బెటాలియన్‌పై దాడి చేశారు. ఈ దాడిలో 76 మంది సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు, అధికారులు, ఎనిమిది మంది గెరిల్లాలు మరణించారు. విదేశాలతో జరిగిన యుద్ధాలలో మినహాయిస్తే ఇంత పెద్ద స్థాయిలో ప్రభుత్వ బలగాలు మరణించిన ఘటన ఇదే మొదటిది. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం నాటి నుంచి భారత చరిత్రలో అధికారిక సాయుధ బలగాలకు, ప్రజా సాయుధ శక్తులకు మధ్య జరిగిన ఘర్షణలలో అతి ఎక్కువ మంది మరణించిన ఘటన ఇది. ఈ చారిత్రక ప్రాధాన్యతకు అనుగుణంగానే దేశవ్యాప్తంగా తాడిమెట్ల ఘటనపై విస్తృత చర్చ జరుగుతున్నది. ఈ చర్చలోని ప్రధాన కోణాలన్నిటినీ వీక్షణం పాఠకులకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి జి.కె. పిళ్లై ఎకనామిక్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ, ఢిల్లీలోని పౌరహక్కుల సంఘం పి.యు.డి.ఆర్. ఇచ్చిన ప్రకటన, ఆ ప్రకటనను విమర్శిస్తూ చరిత్రకారుడు సుమంతా బెనర్జీ రాసిన వ్యాసం, వీక్షణం గౌరవ సంపాదకులు వి. హనుమంతరావు రాసిన వ్యాసం ఇక్కడ ప్రచురిస్తున్నాం. – సం.

రాజ్యాంగంలో రాసుకున్న లక్ష్యాలకు తూట్లు పొడిచి, ప్రజల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలే రాజ్యాంగాన్ని మావోయిస్టులు ధిక్కరిస్తున్నారనడం హాస్యాస్పదం అంటున్నారు వి. హనుమంతరావు

జవాన్లను బలిగొన్నది చిదంబరమే

'చిదంబరం చాలా తెలివైన వాడు. నిజాయితీ, నిబద్ధత గల రాజకీయ వేత్త. కాకపోతే మహా మొండి. అతని మేధోపరమైన తలబిరుసుతనానికి నేను పలుమార్లు బాధితుడనయ్యాను' కాంగ్రెస్ అగ్రనేత దిగ్విజయ్ మండిపాటు ఇది. 'సంకుచితమైన ఒంటెత్తువాద దృక్పథాన్ని ఎంచుకున్నారు' ఇది కూడా ఆయన ఉవాచ.

ఈ మేధోపరమైన తలబిరుసుతనానికే – మావోయిస్టుల వల్ల కాదు – 76 మంది సాయుధ పోలీసులు బలి అయిపోయారు. 1947లో అధికార మార్పిడి జరిగిన నాటి నుంచి కాశ్మీర్ సమస్య రావణాసురుడి కాష్టంలా కాలుతూనే ఉంది. పరిష్కారం లేదు. ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు వాదం సమసిపోలేదు. అస్సాంలో కూడా అదే సమస్య. ముంబైలో 26/11 సమస్య అంతర్జాతీయ వేదికల మీద చర్చ కొనసాగుతోంది. చిదంబరం చాలా తెలివైనవాడై ఉంటే, మొదట ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేసి ఉండేవాడు. ఆయన తెలివి మరింతగా రాణించి ఉండేది. కాని ఇన్ని జాతీయ సమస్యలు హోంశాఖ పరిష్కారానికి ఎదురు చూస్తూండగా, మావోయిస్టుల 'కుంపటి' కొత్తగా తెచ్చి నెత్తిన పెట్టుకొన్నాడు. ఇది తెలివిగల వాళ్లు చేసే పనేనా? ఈ తెలివికి 'మేధోపరమైన తలబిరుసు' తోడైంది. దిగ్విజయ్ అన్నట్లు 'మహామొండి'. పామర భాషలో చెప్పాలంటే, తనకు తోచిందే రైటు. 120 కోట్ల జనాభా గల భారతదేశానికి హోంశాఖామాత్యుడికి ఉండాల్సిన లక్షణమేనా?

మావోయిస్టులు జరుపుతున్నది గెరిల్లా పోరాటం. ఆ గెరిల్లా పోరాటాన్ని ఎదుర్కోవడానికి అందుకు తగిన శిక్షణ, నేర్పుగల భద్రతా దళాలు కావాలి కాని, వేల మందిని అడవుల్లో దించడం, హెలికాప్టర్ల వినియోగం, విమానాశ్రయ నిర్మాణం కాదు. ఇంత తెలివి తక్కువతనం మరొకటి ఉండబోదు. ఇది తెలివా, తెలివి తక్కువతనమా? శిక్షణలేమి, పని ఒత్తిడి, సమాచార లోపం దంతెవాడకు ప్రధాన కారణాలని, వ్యూహాత్మక రచన, విజ్ఞత లోపించాయని పత్రికా ప్రతినిధులు చేపట్టిన పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఆయన తెలివైన వాడనడానికి ఇవా సూచికలు? ఆర్థిక శాఖామాత్యుడిగా, ఆయన గణాంకాలతో ఆడుకొని ఉండవచ్చు. ఆయన తెలివికి (అంటే 'మసుపూసి మారేడుకాయ' చేయగలిగే సమర్థతకు) కార్పొరేట్ సంస్థలు జేజేలు పలికించుకోవడంలో తెలివైన వాడని అంగీకరించవచ్చు. కాని దంతెవాడలో ఆయన ఆడుకొన్నది అంకెలతో కాదు, తన భద్రతా బలగాల ప్రాణాలతో. 76 మంది ప్రాణాలు బలిగొన్నది మావోయిస్టులు కాదు, చిదంబరం వ్యూహాత్మక రచనలోపం, విజ్ఞత లోపం.

ఆయన హోంశాఖ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయనది ఒకటే లక్ష్యం. 39,114 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం (కేవలం బస్తర్ ప్రాంతం) అటవీ భూముల్లో అపారమైన ఖనిజ సంపద ఉంది. తవ్వకాలకు ఇదివరకే కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈ తవ్వకాలు నిరాటంకంగా జరగాలంటే, అక్కడ తరతరాలుగా నివసిస్తున్న ఆదివాసులను ఆ భూముల నుంచి గెంటివెయ్యాలి. 'వేదాంత' అనే బహుళజాతి సంస్థకు ఒరిస్సాలో తవ్వకాలకు అనుమతి ఇవ్వడంలో, ఆ సంస్థతో బీరకాయపీచు సంబంధమున్న చిదంబరం పాత్ర ఉంది. (మంత్రి అయిన తదనంతరం కాగితం మీద సంబంధాలు తెగతెంపులు చేసుకున్నారు). ఆయనకు ప్రపంచబ్యాంక్‌తో ఉన్న సంబంధాలు అందరికీ ఎరుకే. ప్రస్తుతంలోకి వస్తే ఆదివాసులను తరిమి వేయాలంటే, వారికి సహాయంగా ఉంటున్న మావోయిస్టులను మట్టుపెట్టాలి. మావోయిస్టులు హింసకు పాల్పడుతున్నారని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నారని, ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుతగులుతున్నారని చేస్తున్న ఆరోపణలు బయట ప్రపంచంలో ప్రజలను పక్కదారి పట్టించడానికి చేస్తున్న ప్రయత్నం మాత్రమే. తన భద్రత దళాల అప్రకటిత యుద్ధాన్ని సమర్థించుకోవడానికి మాత్రమే. ఉదాహరణకు, మాజీ కేంద్ర భద్రతాదళాల (సి.ఆర్.పి.ఎఫ్.) అధికారి

ఎ.ఎస్. గిల్ ప్రకారం 'నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో, రహదారుల నిర్మాణమే జరగడం లేదు. పాఠశాలల్లో చాలా కొద్దిమంది అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు ఉన్నారా లేదా అన్న పరిస్థితి. విద్యుచ్ఛక్తి సరఫరా నామమాత్రం. పడగొట్టిన టెలికాం టవర్లు, నేలమట్టం చేసిన పాఠశాల భవనాలు' (దక్కన్ క్రానికల్). ఇదేనా చిదంబరం మాట్లాడే అభివృద్ధి? ఆదివాసులు ఘోరంగా వివక్షకు గురవుతున్నారని, అభివృద్ధి కార్యక్రమాలు పూజ్యం అని స్పష్టం చేస్తున్నాయి. పార్లమెంట్‌లో చిదంబరం మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణ రాష్ట్రాలదే. వారే బాధ్యత వహించాలన్నారు. అదెలా సాధ్యం? ఎందుచేతనంటే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి మాజీ సలహాదారుగా పనిచేసిన కె.పి.ఎస్. గిల్ 'ప్రస్తుతం ఆ రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలను ఎదుర్కోవడానికి కేవలం రెండువేల మంది సాయుధ బలగాలు మాత్రమే ఉన్నారు. నేను ఆ రాష్ట్రంలో ఉన్నప్పుడు వీరి సంఖ్య యాభై మాత్రమే'.

అభివృద్ధి అనేది జరగకపోవడం వల్ల ఆదివాసులలో ప్రభుత్వంపై నమ్మకం సడలిపోయింది. వేలమంది గిరిజనులను వారి నివాస ప్రాంతాల నుంచి వెళ్లగొడుతున్నారు. రకరకాల ప్రభుత్వ శాఖలు అనేక రకాలుగా వారిని వేధిస్తున్నాయి. మావోయిస్టులు ఈ ప్రాంతాల్లో ప్రవేశించి వారికి భరోసా కల్పించారు. ఆదివాసులు మావోయిస్టులను తమ మిత్రులుగా భావించారు. కాగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో తీవ్ర వైఫల్యమే మావోయిస్టుల ప్రవేశానికి అవకాశం కల్పించింది. మైదాన ప్రాంతాల్లోనే అభివృద్ధి కార్యక్రమాల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. తీవ్ర విమర్శలకు గురవుతోంది. పాలక పార్టీ కార్యకర్తలు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, అభివృద్ధికి కేటాయించిన నిధులను రెండు చేతులతో భోం చేస్తున్నారు. పరిపాలనా యంత్రాంగం పూర్తిగా అవినీతిమయం. అలాంటిది, బస్తర్, ఛత్తీస్‌గఢ్ లాంటి దట్టమైన అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు అమలుపర్చడానికి అధికారులు వెళతారా? మావోయిస్టులు అడ్డుపడుతున్నారనే ప్రచారాన్ని నమ్మడానికి ప్రజలెవ్వరూ చెవుల్లో పువ్వులు పెట్టుకోలేదు.

'ఆపరేషన్ గ్రీన్‌హంటా? అలాంటిదేమీ లేదే? మా రికార్డుల్లో ఆ మాట ఎక్కడా రాలేదే' అంటున్నారు చిదంబరం. 76 మంది మృత్యువాత పడిన తర్వాత ఆ ప్రాంతానికి వెళ్లిన చిదంబరం అన్న మాటలివి. కాని 'హిందూ' పత్రిక విలేకరి అమన్ సేథి జగ్‌దల్‌పూర్ నుంచి వార్త పంపిస్తూ, భద్రతాదళాల్లో ఒక పోలీస్ 'అలాంటి ఆపరేషన్ అనేదే లేకపోతే, ఎనిమిది నెలల నుంచి ఛత్తీస్‌గఢ్‌లో మేమేమి చేస్తున్నట్లు? ఎందుకున్నట్లు?' అని ఎదురు ప్రశ్నించాడు. ఆ విలేకరి కొంతమంది పోలీసులతో మాట్లాడినపుడు వారు ఆగ్రహంతో, ఆవేదనతో ఉడికిపోతున్నారని, ఉండడానికి వసతి లేదని, మందూ మాకూ లేక ఒక పోలీసు మలేరియాతో మరణించాడని, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాల్లోనే సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపులు నడుస్తున్నాయని, ఒక క్యాంప్ నుంచి ఇంకో క్యాంప్‌కు వెళ్లాలంటే, సరిగ్గా లేని రహదారుల్లో నాలుగు గంటలు (పది కిలోమీటర్లు) ప్రయాణం చేయాల్సి ఉంటుందని ఫిర్యాదులు వినిపించాయి. ఇది ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనే దానికి నిదర్శనం. ఆ రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆర్.కె. విజ్ చెప్పిన విషయమేమంటే భద్రతా దళాల క్యాంప్‌ల కోసం 70 కోట్ల రూపాయలు కేటాయించి కొత్తగా బ్యారక్స్ నిర్మిస్తున్నామని, వాటికి స్వతంగా విద్యుచ్ఛక్తి, ఫోన్ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పడం. ఆపరేషన్ గ్రీన్‌హంట్ కాకపోతే ఈ ఏర్పాట్లన్నీ ఎందుకు? మావోయిస్టుల అణచివేతే ప్రభుత్వ విధానమైనపుడు, 'అవును, ఇది ఆపరేషన్ గ్రీన్‌హంటే' అని ధైర్యంగా చిదంబరం ఎందుకు చెప్పలేకపోతున్నారు? అలా చెబితే, ప్రభుత్వ లొసుగులు చాలా బయటపడతాయి.

చిదంబరం చాలా తెలివైన వాడని ఆయన సహచరుడు కితాబు ఇచ్చారు గాని దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.కున్న పాటి తెలివితేటలు కూడా లేవని అనిపిస్తుంది. మావోయిస్టులను ఆయన చర్చలకు పిలిచినపుడు మీరు హింసను విడనాడండి అని అనకుండా, తుపాకులు కిందపెట్టండి అని మాత్రమే షరతు విధించారు. అదొక రాజీసూత్రం. ఆయన ఎపుడూ చర్చల్లో పాల్గొనలేదు. హోంశాఖ మంత్రి ద్వారానే నాటకం నడిపించారు. కాని చిదంబరం 'మీరు హింసను విడనాడండి' అని షరతు విధించి తన మేధోపరమైన తలబిరుసుతనాన్ని నిరూపించుకున్నారు. వైఎస్ అంతకు ముందు చంద్రబాబు, చర్చలకు ముందు పోలీసులు వందల మందిని ఎన్‌కౌంటర్ చేయించారు. హింసించారు. అటు మావోయిస్టులు ఏమీ తక్కువ తినలేదు. అయినా చర్చలు జరిపినంతకాలం, ఇరువైపుల నుంచి ఎటువంటి దురదృష్టకర సంఘటనలూ జరగలేదు. చర్చలు విఫలమయ్యాయి. తర్వాత షరామామూలే. మావోయిస్టుల గురించి పలు దఫాలుగా సంబంధిత రాష్ట్ర మంత్రులతో చర్చలు జరిపినపుడల్లా ఆంధ్రలో మావోయిస్టులను విజయవంతంగా ఎదుర్కొన్నారని రాష్ట్రానికి కితాబునిచ్చినపుడు, ఆ ఆంధ్ర అనుభవాన్నుంచి ఎందుకు చిదంబరం పాఠం నేర్చుకోలేక పోతున్నారు? 'ఛీ, నేనొకళ్లను అనుకరించడమా?' అని అనుకొన్నారో, ఏమో. దంతెవాడ సంఘటన తర్వాతనైనా తన విధానాన్ని పునఃసమీక్షించుకున్నారా అంటే లేదని తర్వాత వార్తలు సూచిస్తున్నాయి. విమానాలుపయోగించి దాడులు చేద్దామా? మానవరహిత విమానాలను పంపిద్దామా అనే అధికారులు లీక్ చేసే వార్తలు ఒక పక్క నుంచి వస్తూండగా రెండోపక్క నుంచి, అలాంటి తలతిక్క పనులు చేయవద్దే వద్దని మిలిటరీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎయిర్ ఛీఫ్ మార్షల్ నాయక్ కూడా తెలివైన జవాబిచ్చారు. 'దాడులు చేయడానికి మేము సిద్ధమే. కాని దాడులు జరిపే స్థలంలో 250 కిలోల బాంబును వదిలితే, దాని ప్రభావం 800 మీటర్ల పరిధి వరకూ ఉంటుందని, తీవ్రవాదులు కానటువంటి అనేకమంది బాధితులు అవుతారనే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అని చెప్పారు. నక్సల్స్‌తో పోరాటానికి ఇంకా సాయుధ బలగాలు అవసరం లేదని పునరుద్ఘాటించారు. మన భూభాగం మీద మన జనాన్ని బాంబులు వేసి చంపడమా? నిత్య జీవితంలో ఎవరైనా అసంబద్ధంగా, తలాతోకా లేకుండా మాట్లాడితే 'ఏం దిమాక్ ఖరాబైందా?' అని అంటూంటారు. వేరే వ్యాఖ్య అనవసరం.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం నేరం. అలాంటి వాళ్లను క్షమించేది లేదు. మావోయిస్టులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారు. 2050 నాటికి ఈ ప్రభుత్వాన్ని కూలదోస్తామంటున్నారు. మేము చేతులు కట్టుకొని కూర్చోవాలా? అనేది తరచుగా వినవచ్చే మరో వాదన. అవును, నిజమే కదా అని రోజూ పత్రికలు చదివే వారి స్పందన. ఉన్నత మధ్యతరగతి వర్గం సంగతి చెప్పనే అక్కర్లేదు. మావోయిస్టులను అణచివేయాల్సిందేనంటారు. అక్కడికేదో మావోయిస్టులు వచ్చి వాళ్ల సంపాదనంతా దోచుకోవడానికి వచ్చినట్లు! మన దేశంలోనే కాదు, ఏ దేశంలోనైనా, ఎవరు పరిపాలిస్తున్నా రాజ్యాంగ వ్యతిరేక చర్యలను

సహించకూడదు. వారిని శిక్షించాల్సిందే. ఈ విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. రేపు మావోయిస్టులూ అధికారంలోకి వస్తే వారు రచించి అమలు జరిపే రాజ్యాంగాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే పాలకులుగా వాళ్లూరుకుంటారా? కాని వచ్చిన చిక్కేమిటంటే ప్రభుత్వం అలా శిక్షించడం మొదలుపెడితే, మొట్టమొదటగా శిక్షించాల్సింది ప్రభుత్వాన్నే, ఉన్నతాధికారుల్నే, పోలీసులనే! ఉదాహరణలు కోకొల్లలు. ఉదాహరణకు భారత రాజ్యాంగం ప్రస్తావనలోనే 'పౌరులెల్లరు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావం, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన – వీటి స్వాతంత్ర్యంను, అంతస్తులోను అవకాశంలోను, సమానత్వంను చేకూర్చడమే...' అని రాసుకొన్నాం. కాని ఆచరణలో ఒకపక్క రోజుకు 20 రూపాయల సంపాదన, రెండో పక్క ప్రపంచ కుబేరుల జాబితాలో చేరిన వ్యక్తులు – ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం కాదా? కారకులెవరు? ఎవరిని శిక్షించాలి?

అదే రాజ్యాంగంలో 'రాజ్య నిధులతో నిర్వహింపబడుతున్న బావులు, చెరువులు, స్నాన ఘట్టాలు, రహదారులు, విహార స్థలాలు వీటిని వినియోగించుకోవడంలో ఏ వ్యక్తినీ అభ్యంతరపరచరాదు' అని ఉంది. ఇలాంటి అభ్యంతరాలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. ఎవరిని శిక్షించాలి? ఎవరు శిక్షింపగలరు? 'అస్పృశ్యత నిషేధించబడింది' – ఈ రాజ్యాంగ నిబంధన అమలు జరుగుతోందా? అమలు పరచని వారిని ఎంతమందిని శిక్షించారు? ఉచిత, నిర్బంధ విద్యను పొందే హక్కు 6 నుంచి 14 సంవత్సరాల లోపల వయస్సు వారందరికి ఉంది. 1960 నాటికే ఇది అమలు జరిగి ఉండాలి. కాని ఈ నాటికీ అమలు జరగడం లేదంటే, అందుకు ఎవరిని శిక్షించాలి?

రాజ్యాంగం ప్రకారం మన దేశం 'సర్వసత్తాక' 'లౌకిక', 'ప్రజాస్వామ్య' రాజ్యం. ఆచరణలో ఇవెలా అమలు జరుగుతున్నాయి? నేరుగా పరిపాలన అంతరించినా, ఆచరణలో ఆర్థిక సామ్రాజ్యవాదం మన దేశాన్ని ఏలుతోంది. లౌకికత్వం ఎలా అమలు జరుగుతోందంటే అయోధ్యలో అప్పటి పి.వి. నరసింహారావు చూస్తుండగానే వేలమంది సాధువులు అద్వానీ పిలుపు మేరకు మసీదును విధ్వంసం చేశారు. సామ్యవాదాన్ని ఎపుడో బంగాళాఖాతంలో కలిపేశారు. ప్రజాస్వామ్యం ఆచరణ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. రాజ్యాంగం అమలు జరుగుతున్న తీరు ఇది. ఇందుకు బాధ్యులెవరు? పంచాయితీ రాజ్యాన్ని రాజ్యాంగ చట్టం 73వ సవరణ ప్రకారం చట్ట బద్ధ సంస్థలుగా చేసి, వాటికి 27 అధికారాలను, నిధులు, ఉద్యోగులతో సహా పంచాయితీలకు దఖలుపరచమంటే సుమారుగా 20 సంవత్సరాలు అవుతున్నా ఇంకా అమలు పరచని రాష్ట్రాలను కేంద్రం శిక్షిస్తుందా? రాజ్యాంగాన్ని ఇలా ఆరారా తూట్లు పొడుస్తున్న ప్రభుత్వానికి, మేధావులకు మావోయిస్టులు రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నారనే హక్కుందా? వాళ్లది నోరా, తాటిపట్టా? అయినా మావోయిస్టులు ఈ రాజ్యాంగం ప్రకారం నడుచుకొంటామని ఎపుడూ అనలేదే?

అయితే ఈ హింసాకాండ ఇలా సాగవలసిందేనా? ఒకరినొకరు చంపుకొంటూ పోవడమేనా? అనే ప్రశ్నలు సహజంగా ఎవరికైనా ఎదురవుతాయి. నిజమే. ఎవరూ చంపివేయబడరాదు. మావోయిస్టులూ చనిపోతున్నారు, భద్రతా దళాలూ చనిపోతున్నాయి. మావోయిస్టు ముద్రవేసి ఆదివాసులను చంపేస్తున్నారు. కాగా ఈ హింస వల్ల ప్రయోజనం ఎవరికి? గాంధీజీ కలలుకన్న అహింస ధ్యేయంగా రాజ్యం నడపడం, సంఘం నడవడం సాధ్యమా? అయినా, మావోలు హింస తప్పు; పోలీసుల హింస రాజ్య భద్రత కోసం అవసరం. 76 మంది ఒకే ఒకసారి మరణించడంతో ఈ చర్చ మళ్లా ముందుకొచ్చింది. మావోలు ఘోర హత్యాకాండకు పాల్పడ్డారనీ, నరమేధానికి దిగజారారనీ పత్రికలు నిందించాయి. ఒకరకంగా చూస్తే ఇంత సుఖమైన చావు మరొకటి ఉండదు. రాత్రి నిదరపోతూ గుండె ఆగి చనిపోవడం, మంచంలో నెలల తరబడి అవస్థపడి మరణించడం రోగికి నిత్యం చావే. దీనిని మావోయిస్టు – భద్రతా దళాల పోరుతో పోలిస్తే చనిపోయిన 76 మంది రెప్పపాటు లోపల మరణించారు. కాని పోలీసులు చంపడం ఓ పద్ధతిలో జరుగుతుంది. దొరికిన మావోయిస్టును అలా లిప్తపాటులో చంపెయ్యరు. అరెస్టు చేస్తారు. ఎఫ్.ఐ.ఆర్. రాయరు. జైలులోనో, థర్డ్ డిగ్రీ పద్ధతులవంబించే రహస్య స్థలానికో తీసుకొని పోతారు. ఫలానా నాయకుడెక్కడ అని ఆరా తీస్తారు. చెప్పకపోతే 'ట్రీట్‌మెంట్' ప్రారంభమవుతుంది. కొన్నాళ్లు సాగిస్తారు. వారికి సమాచారం లభించదు. అడవుల్లోకి తీసుకొనిపోయి, కాల్చిపారేసి, వాడిపక్కన మావోయిస్ట్ సాహిత్యం, ఓ గన్ పెట్టి దానికి ఎన్‌కౌంటర్ అని నామకరణం చేస్తారు. ఈ ఎన్‌కౌంటర్ కథనాలు పత్రికల్లో చదివి చదివి పాఠకులకు ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఇట్టే తెలిసిపోతుంది.

'పోలీసులు కూంబింగ్ చేస్తూంటే, రహస్యంగా పొంచి ఉన్న మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఒక మావోయిస్టు మరణించారు. అతనివద్ద ఆయుధం, సాహిత్యం లభించాయి. ఆ మావోయిస్ట్ ఫలానా, ఫలానా అతను ఫలానా దళసభ్యుడని గుర్తించారు'. మీరు ఏ ఎన్‌కౌంటర్ కథనమైనా చదవండి. సరిగ్గా ఇలాగే ఉంటుంది. బహుశా పేరు, ఊరు మినహాయించి మిగతాదంతా జిరాక్స్ చేసి ఉంటాయి కాబోలు. ఇపుడిలాంటి కథనాలు మన రాష్ట్రంలో వినరావడం లేదు. కాని ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ కథనాలు వేరు. పాపాలు చేసినవాళ్లు నరకంలోకి వెళతారని, అక్కడ వాళ్లను నానా చిత్రహింసలకు గురిచేస్తారని, పాపులను నూనెలో వేయిస్తారని పురాణ కథలు వింటూంటాం. మానవుడు తప్పు చేయరాదని హెచ్చరించడానికే ఇలాంటి కథలల్లుతుంటారు. కాని మన భద్రతా దళాల ముందు ఆ యమకింకరులు బలాదూర్. సోదిలోకి కూడా రారు. పాపాలు చేయకుండా మానవులను హెచ్చరించడానికి యముడే తన కింకరులను బహుశా కొంతమందిని పోలీసుల్లో చేరమని పంపించి ఉంటాడేమోనని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో భద్రతాదళాల అకృత్యాల కథనాలు చూస్తే అనిపిస్తుంది.

ఉదాహరణకు ముగ్గురు సభ్యుల నిజ నిర్ధారణ కమిటీ ప్రకటించిన రిపోర్ట్ ప్రకారం 'దంతెవాడ జిల్లాలో డెబ్బయి సంవత్సరాల వయస్సు గల దుధి మొయినా వక్షోజాలు కోసి తర్వాత చంపారు. కానాసి గంగ 70 ఏళ్ల ముసలిని మంచంలోనే చంపేసారు. మాద్వి దేవ అనే 25 ఏళ్ల యువకుణ్ని చెట్టుకు కట్టి కాల్చి చంపారు. అతని తాత ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షి. అతని మృతదేహం కూడా దొరకలేదు. మాద్వి (జోగా), హర్మ, మడకంసుల్లాలను పొడిచి చంపారు. అతని భార్య ఎదురుగానే ఈ మారణకాండ జరిగింది. మరో ఆదివాసిని పొలం దున్నుతుండగా బట్టలూడదీసి చంపారు. అన్ని ఇళ్లపై దాడి చేసి తగులబెట్టారు. మరో గ్రామంలో పశువులు కాసుకొంటున్న 60 ఏళ్ల వ్యక్తిని గ్రామంలోకి తీసుకొని వచ్చి ఒక చెట్టుకొమ్మకు వేలాడదీశారు. చెట్టుకింద మంటలో

శాంతి భద్రతలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, రక్షణ శాఖను మరింత బలోపేతం చేసి మావోయిస్టులను అణచివేస్తామని అంటున్నారు **జి.కె. పిళ్లై**

దంతెవాడ : ఒకానొక వెనుకంజ

దేశంలోని జిల్లాలలో నాలుగోవంతు కన్న ఎక్కువ భూభాగాన్ని తమ అధీనంలో ఉంచుకొన్న మావోయిస్టులను ఎదిరించడానికి ప్రభుత్వ వ్యూహం ఏమిటని వివాదం చెలరేగుతున్న సందర్భంలో ఎకనామిక్ టైమ్స్ కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోపాల్ కె. పిళ్లై ని కలుసుకుంది. దేశంలోకెల్లా అతి పెద్ద అంతర్గత భద్రతా సవాల్ అని ప్రధానమంత్రి అభివర్ణించిన సమస్యను పరిష్కరించే వ్యూహాన్ని అమలు చేసే బృహత్తరమైన బాధ్యత పిళ్లై మీద ఉంది. ఈ బాధ్యత దానికదిగా చాలా కష్టతరమైనది. ఎందుకంటే, దేశంలోని సమాఖ్య రాజ్యాంగం ప్రకారం ప్రాంతాల మీద పాలనాధికారం ఎవరిదనేది మొట్టమొదటి సమస్య అవుతుంది. శాంతి భద్రతల పరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారం. అందువల్ల రాష్ట్ర స్థాయి నాయకత్వాల సహకారం, ఆమోదం లేకుండా కేంద్రం తన బలగాలను మోహరించడం గానీ, తన పథకాలను అమలు చేయడం గానీ సాధ్యం కాదు. అది రాజకీయ నాయకత్వానికీ, పాలనా నాయకత్వానికీ కూడా వర్తిస్తుంది. మరొక పక్క మావోయిస్టులు ఏమో దేశంలోని మధ్య, తూర్పు ప్రాంతాలలో పక్కపక్కనే ఉన్న అనేక రాష్ట్రాలలో వ్యాపించి ఉన్నారు. ఆయా రాష్ట్రాలన్ని రాజకీయ పాలనా సంకల్పాలను కేంద్ర ప్రభుత్వం సమన్వయం చేయవలసి ఉంది.

ఎకనామిక్ టైమ్స్ ప్రతినిధి రోహిణీ సింగ్‌తో మాట్లాడుతూ పిళ్లై తమ వ్యూహంలోని కొన్ని అంశాలు వివరించారు. ఆ వ్యూహం తగిన ప్రాధాన్యతను ఇంకా పొందడం లేదు. ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నంలో అభివృద్ధి అంశం కూడా ఇమిడి ఉంది. ఆయా ప్రాంతాల నుంచి మావోయిస్టులను తొలగించిన తరవాత ఆ ప్రాంతాలలో ప్రభుత్వ పాలనను నెలకొల్పవలసి ఉంది. అలాగే, మావోయిస్ట్ అధీనంలో ఉన్న ప్రాంతాలను, ముఖ్యంగాను, ఇతర ప్రాంతాలలోను పోలీసుల సంఖ్యలో తీవ్రమైన కొరత ఉన్నదని ఆయన వివరిస్తున్నారు. లక్ష మంది ప్రజలకు ఎంత మంది పోలీసులు అవసరమో, ఆ సంఖ్యలో మూడోవంతు కన్న తక్కువ మాత్రమే ఉన్నారని, పేద రాష్ట్రాలలో ఇది మరింత తక్కువగా ఉన్నదని, అక్కడే మావోయిస్టుల కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నాయని

నూనె మరిగించి అందులో అతణ్ని పడవేసి, బయటకు లాగి చల్లని నీళ్లు జల్లారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ పోలీసులు కూడా పేద కుటుంబాల నుంచి ఉదర పోషణ కోసం చేరిన వాళ్లే అని సానుభూతి చూపించాలి కదా అని అనిపించింది. కాని, ఇలాంటి ఘటనలు విన్న తర్వాత వీరియెడల జాలి తగునా అనిపించింది.

76 మంది మరణానంతరం చిదంబరం ఆలోచనలు మరింత పెట్రేగిపోతున్నాయి. ఆ ఆలోచనల్లో కసి, కక్ష స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ బలగాలు కూడా దెబ్బకు దెబ్బ తీయాలని ఆదేశాలు అందుకొని ఉండవచ్చు. ఈ దారుణ మారణకాండ ఇలా కొనసాగవలసిందేనా? గ్రామాల్లో ఒకే కుటుంబంలో, లేదా ఇరు వర్గాల మధ్య నరుక్కోవడాలు చంపుకోవడాలు గుర్తుకు వస్తున్నాయి. చిదంబరం అహం దెబ్బతింది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. అలాంటి వ్యక్తి హోంశాఖ మంత్రిగా కొనసాగడం దేశానికే క్షేమం కాదు. ఆయనను మరే శాఖకైనా బదిలీ చేయడం ప్రధానికి మంచిది. ఇది జరగాల్సిన మొదటి పని. చర్చల ప్రస్తావన తరచు అటు చిదంబరం, ఇటు మావోయిస్టుల మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు, ముందస్తు షరతుల వరకూ వచ్చి ఆగిపోతోంది. ఆంధ్రలో ఇలాంటి పరిస్థితి పరిష్కరించడానికి, ప్రముఖులు లవణం, సైంటిస్ట్ పి.ఎం. భార్గవా లాంటి వారు మధ్యవర్తిత్వం నెరపడానికి సిద్ధపడ్డారు. కాని, అప్పట్లో ప్రభుత్వానిదే పై చేయి కావడంతో వై.ఎస్. స్పందించలేదు. ఈ రోజున కేంద్ర ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది. ఒక పక్క 76 మంది మరణం, రెండో పక్క ఆదివాసులను అడవుల నుంచి తరిమివేయడం మూలంగా పౌరసమాజం తీవ్ర స్పందన కానవస్తోంది. ఈ నేపథ్యంలో చర్చ జరగాలంటే మొదట ఇద్దరూ చర్చలకు సిద్ధం కావాలి. దీనికి ఇద్దరూ సుముఖంగానే ఉన్నట్లు కానవస్తోంది.

చర్చలకు ఎజండా ఒకటి ఉండాలి కదా. ఏమిటా ఎజండా? ఆదివాసులను తరిమివేయడమే ఈ యుద్ధం. కాని యుద్ధానికి కారణం కాబట్టి, వారు వారి గ్రామాలకు తిరిగి రావడం, ఏ భూములనైతే సేద్యం చేసుకుంటున్నారో, వారిని తిరిగి సేద్యం చేసుకోనివ్వడం జరిగితే, మావోయిస్టుల కాళ్ల కింద భూమి కరిగిపోతుంది. వారడిగేది అదే. ఇది జరగాల్సిన రెండో పని. ఇరుపక్షాల ప్రతినిధులు మాత్రం కూర్చొని చర్చ జరిగితే, ఎవరి వాదన వారు వినిపిస్తారు. అంగీకారం అసాధ్యమవుతుంది. లేచి ఎవరిదారిన వారు వెళ్లిపోతారు. అలా జరక్కూడదంటే మధ్యవర్తులెవరైనా ఉండాలి. ఇది మూడో విషయం. ఉభయ పక్షాలకు అంగీకారం ఉన్న మధ్యవర్తులై ఉండాలి.

వీటన్నిటికన్నా ముందు ఇద్దరి మధ్య 'నిర్యుద్ధ సంధి' జరగాలి. ఆదివాసులను ఊపిరి పీల్చుకోనివ్వాలి. రెండువైపుల నుంచి నరబలి నిలిచిపోవాలి. అయితే, వేలమంది ఆదివాసులను నిరాశ్రయులను చేసి, అటవీ భూముల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దఖలు పరిచిన చిదంబరం, కార్పొరేట్లను తరిమేసి ఆదివాసులకు అప్పచెబుతారా? ఇది మిలియన్ డాలర్ల ప్రశ్న ఏమీ కాదు. మీకు మీరే జవాబు చెప్పుకోగలరు.

(రచయిత సీనియర్ పాత్రికేయులు, వీక్షణం గౌరవ సంపాదకులు) వీ

ఆయన అంటున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో పెద్ద ఎత్తున పోలీసులను నియమించడం, అటువంటి నియామక కేంద్రాల సంఖ్యను పెంచడం, ఏ నేపథ్యంలో జరుగుతున్నదో ఆయన వివరించారు. ముఖాముఖిలో కొన్ని ప్రశ్నలకు ఆయన జవాబులు :

మావోయిస్ట్ కార్యకలాపాలు ఎక్కువ భాగం ఖనిజ సంపద ఉన్న ప్రాంతాలలో జరుగుతున్నాయి. ఆ ప్రాంతాలలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు గణనీయమైన పెట్టుబడులు పెట్టాయి. ఇటీవలి జరిగిన ఘటన తర్వాత పారిశ్రామిక వేత్తల విశ్వాసం పెంచడానికి ప్రభుత్వం ఏం చేస్తోంది?

ప్రాథమికంగా ఈ ప్రాంతాలలో శాంతి భద్రతల పరిస్థితిని మెరుగుపరచవలసి ఉంది. ఈ ప్రాంతాలే ఎక్కువ వెనుకబడిన ప్రాంతాలు కూడా. అందులో మరొక అభిప్రాయమేమీ లేదు. కాని, మావోయిస్టుల ఉనికి వల్ల ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రాంతాల నుంచి వైదొలిగాయి. మావోయిస్టులు అది అవకాశంగా తీసుకొన్నారు. బహుళజాతి కంపెనీల గురించి వాళ్లు ఫిర్యాదులు చేస్తున్నప్పుడు కూడా వాళ్ల నుంచి డబ్బులు తీసుకుంటూనే ఉన్నారు. వ్యాపారవేత్తలందరూ వాళ్లకు డబ్బులు ఇస్తూనే ఉన్నారు. మావోయిస్టులు మొబైల్ టవర్లను పేల్చివేస్తారు... ఎస్సార్ కంపెనీకి చెందిన లోహ ద్రవాన్ని తీసుకుపోయే పైపును వాళ్లు పేల్చేశారు. అది డబ్బులు వసూలు చేయడానికి పెద్ద అవకాశం ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్, బీహార్, ఒరిస్సా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో వ్యాపారవేత్తల నుంచి, పారిశ్రామిక వేత్తల నుంచి వాళ్లు సాలీనా రు. 1400 కోట్లు సంపాదిస్తున్నారని మా అంచనా. మావోయిస్టుల సిద్ధాంతం కొత్తదేమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా దానికి కాలం చెల్లిపోయింది. అది ముందుకు సాగడానికి అవకాశం లేని సిద్ధాంతం. అయితే, ప్రభుత్వం ముందర ఉన్న సమస్య ఏమంటే ముంబై అల్లర్ల తరువాత ఒక ఏడాదిగా మేం ప్రారంభించిన ప్రయత్నం మొట్టమొదట సురక్షితమైన వాతావరణాన్ని రూపొందించడం. భద్రత కల్పించడమే ప్రభుత్వపు ప్రాథమిక బాధ్యత. అందుకే మేం మరింత మంది కేంద్ర పారిశ్రామిక భద్రతా బలగాలను నియమించబోతున్నాం. పరిశ్రమలకు రక్షణ కల్పించబోతున్నాం. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

1998-2003 మధ్య భద్రతా బలగాల నియామకంలో మీరు విఫలమయ్యారు. అందువల్ల చాలా ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిని ఎప్పుడు నింపుతారు?

ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించి మాట్లాడుతారు. కాని భద్రత లేకుండా అభివృద్ధిని సాధించడం అసాధ్యం. ఆ ప్రాంతాలకు వైద్యులు వెళ్లలేరు. ఉపాధ్యాయులు వెళ్లలేరు. చివరికి పరిశ్రమలు కూడా వెళ్లలేవు. మనకివాళ కావలసిన పోలీసుల సంఖ్యలో దాదాపు మూడున్నర లక్షల మంది కొరత ఉంది. ఉదాహరణకు, బీహార్‌లోని కొన్ని ప్రాంతాలలో పోలీసులకు, జనాభాకు నిష్పత్తి లక్ష మంది ప్రజలకు 56 మంది పోలీసులున్నారు. ఐక్యరాజ్య సమితి సూచించిన సగటు కనీసం లక్ష మంది జనాభాకు 220 మంది పోలీసులు. భారత దేశ సగటు సంఖ్య లక్షకు 130. మనం ఐక్యరాజ్య సమితి చెప్పిన సగటుకు చేరుకోవలసి ఉంది. అలా చేరుకోవాలంటే నాకు మరొక ఐదు లక్షల మంది పోలీసులు కావాలి. అంటే రానున్న ఐదు సంవత్సరాలలో మనం ఎనిమిది లక్షల మంది పోలీసులను నియమించుకోవాలి. గత సంవత్సరం 80,000 మందిని నియమించాం. ఈ సంవత్సరం ఒక లక్షన్నర మందిని నియమిస్తున్నాం. ఈ ప్రయత్నం ఒక సంవత్సరం కిందనే మొదలుపెట్టాం. అప్పుడే ఈ 21 బెటాలియన్‌లను ప్రవేశపెట్టాం.

మావోయిస్టులతో వ్యవహరించడంలో ప్రభుత్వ వ్యూహం ఏమిటి? అది అంతకు ముందు ఉపయోగించిన వ్యూహం కన్న ఎలా భిన్నమైనది?

గత నవంబర్ తర్వాత మేం దాదాపు నాలుగు వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని మావోయిస్టుల చేతినుంచి కైవసం చేసుకున్నాం. ఆ ప్రాంతం చుట్టూ రక్షణ వలయం నిర్మించాం. అక్కడికి జిల్లా పాలనా యంత్రాంగం వెళ్లేలా చూశాం. వాళ్లు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశారు. రోడ్లు వేశారు. ఉపాధ్యాయులను పంపించారు. చౌకధరల దుకాణాలు ఏర్పరిచారు. మొబైల్ ఆరోగ్య శాలలను పంపించాం. మావోయిస్టుల నిరుత్సాహానికి కొంత కారణం ఏమంటే అంతవరకూ వాళ్ల అదుపులో ఉన్న భూభాగాన్ని మేం స్వాధీనం చేసుకున్నాం అనే. అయితే, మేం ఇంకా కష్టతరమైన ప్రాంతాలలోకి ప్రవేశించలేదు. ఆ పనిలో ఉన్నాం. ఇది చాలా మెల్లగా నడిచే ప్రక్రియ. జిల్లా యంత్రాంగం మా వెనుకనే నడిచే వీలు లేకపోతే మేం వేగంగా వెళ్లి ప్రయోజనం లేదు. ఆ ప్రాంతాలలో మౌలిక సౌకర్యాలు కల్పించే పని మూడు నుంచి ఎనిమిది సంవత్సరాలు పట్టే స్వల్పకాలిక, మధ్యంతర విధానం. ఈ సంవత్సరం మరొక పదివేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని స్వాధీనం చేసుకొంటాం. మేం స్వాధీనం చేసుకున్న ప్రాంతాలన్నిటిలో పోలీసు వ్యవస్థను సుస్థిరంగా ఉంచడం, సాధారణ పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం మా ప్రస్తుత కార్యక్రమంలో ఉన్నాయి. అదే వ్యూహంలో మార్పు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ అనేది ఏమీ లేదు. అది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేసిన పని. అయితే వాళ్లు వెళ్లి, దాడి చేసి వెనక్కి వచ్చేయాలనుకున్నారు. మా కార్యక్రమం మాత్రం మావోయిస్టుల చేతి నుంచి భూభాగాన్ని స్వాధీనం చేసుకొని, దాన్ని క్రమంగా అభివృద్ధి చేయడం. మావోయిస్టులను పంపించివేయడంలో ఆంధ్రప్రదేశ్ ఎందుకు విజయం సాధించింది. అదంతా ఆర్థిక అభివృద్ధి వల్లనే. అక్కడ ఎంత పారిశ్రామికీకరణ జరిగిందంటే, మావోయిస్టులలో చేరడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

సైన్యాన్ని ఉపయోగించవలసిన అవసరం ఉందంటారా?

మేం సైన్యం లేకుండానే ఈ పని చేయగలం. ప్రాథమికంగా అది సంకల్పానికి సంబంధించిన విషయం. ఈ ప్రాంతాల నుంచి ప్రభుత్వం వైదొలిగితే శాంతి దానంతట అదే ఏర్పడుతుందని కొందరు అంటున్నారు. కాని, అది నిజం కాదు. వేరు వేరు రాష్ట్రాల మధ్య సమన్వయ కార్యాచరణ మీద తనకు నమ్మకం లేదని, మావోయిస్ట్ సమస్యను రాజకీయంగా పరిష్కరించాలని తాము అనుకుంటున్నామని 2009 జనవరిలో పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు వాళ్లు తమ అభిప్రాయం ఎందుకు మార్చుకున్నారు? కేంద్ర పారా మిలిటరీ బలగాలు తమ దగ్గరికి రావాలని ఎందుకు కోరుతున్నారు? ఎందుకంటే, దీన్ని కేవలం చర్చల ద్వారా రాజకీయంగా పరిష్కరించడం సాధ్యం కాదు. ప్రభుత్వాలు చెడ్డవని, అధికార యంత్రాంగం శత్రువని మావోయిస్టులు అనుకుంటారు. ఇక వాళ్లతో మాట్లాడేదెట్లా?

దంతెవాడ ఘటన ఎంత పెద్ద వెనుకంజ అని మీరు అనుకుంటున్నారు?

ప్రాణ నష్టం ఎప్పుడైనా వెనుకంజే. కాని, ఇది ఒకానొక వెనుకంజ మాత్రమే. కొన్ని ఘోరమైన పొరపాట్లు జరిగాయి. అందువల్లనే దాదాపు 80 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఇటువంటి ఘటన మరొకసారి జరుగుతుందని నేననుకోను. వీ

పాలకులు సృష్టిస్తున్న వైరుధ్యంతో రేఖకు ఇరువైపులా బలవుతున్నది సామాన్య ప్రజలే అని **పి.యు.డి.ఆర్.** *కార్యదర్శులు మౌషుమి బసు, ఆశీష్ గుప్తా చేసిన ప్రకటన*

రెండు వైపులా ప్రజలే

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట ప్రభుత్వం సాగిస్తున్న ఉద్దేశపూర్వక విధానానికి దురదృష్టకరమైన ఫలితంగానే 2010 ఏప్రిల్ 6 తెల్లవారు జామున దంతెవాడలో 76 మంది జవాన్లు మరణం సంభవించిందని పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ భావిస్తోంది. ఒకవైపు దేశం అసాధారణమైన కరువుతో, పంటల వైఫల్యంతో, అధిక ధరలతో కడగండ్ల పాలవుతుండగా, 'వామపక్ష తీవ్రవాదుల' అనబడే వాళ్లమీద యుద్ధం చేయాలనే ప్రభుత్వ విధానం లోపలభూయిష్టమైనదని మేం భావిస్తున్నాం. దేశం లోపల మన స్వంత ప్రజానీకం మీద ఏ కారణం కోసమైనా సరే, యుద్ధం నడపగూడదని మేం భారత ప్రభుత్వాన్ని చాలా కాలంగా కోరుతూ ఉన్నాం. ఆ ఆలోచనను మానుకోవాలని కోరుతూ ఉన్నాం. ఖనిజాలు తవ్వే వ్యాపార గృహాలు, ఇతర పారిశ్రామిక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలతో చేసుకున్న ఒప్పందాలను ఆదివాసీ ప్రజానీకం వ్యతిరేకిస్తున్నందు వల్ల వస్తున్న సమస్యలు తత్ఫలితంగా జరుగుతున్న భూ ఆక్రమణ, అడవుల నిర్మూలన, అడవి ప్రజల విస్థాపన, నదీ జలాల ప్రైవేటీకరణ వంటి సమస్యలను శాంతియుత పద్ధతులలో పరిష్కరించవలసి ఉంది. ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా వాళ్లమీద రుద్దగూడదు. ఈ విభజన రేఖకు రెండువైపులా ఉన్నది, తూటాలకు బలిఅయిపోతున్నది మన ప్రజలే.

భారత ప్రభుత్వం యుద్ధం ఒక్కటే ఏకైక మార్గం అని అనుకుంటున్నది గనుక ఆ యుద్ధంలోని సైనికులు చనిపోయినప్పుడు ప్రభుత్వాన్ని తప్ప మరెవరిని తప్పు పట్టడానికి వీలులేదు. ఈ దాడి జరగడానికి ముందు ఆ భద్రతా బలగాలు మూడు రోజుల పాటు గాలింపు చర్యలు చేసి వెనక్కి తిరిగి వస్తున్నాయని మేం గుర్తు చేయదలిచాం. ఒక పౌరహక్కుల సంఘంగా మేం అటు భద్రతా బలగాల సైనికులు చనిపోయినప్పుడు కానీ, మావోయిస్ట్ గెరిల్లాలు చనిపోయినప్పుడు కానీ ఖండించలేం. ఆమాటకొస్తే ఎక్కడైనా ఏ సాయుధులైనా మరణించినప్పుడు మేం ఖండించలేం. ఒక సైనికేతర వైఖరిని తీసుకోవడానికి సాహసంగానీ, విజ్ఞతగానీ లేకుండా మనందరిని ఒక రక్తసిక్తమైన అనవసరపు యుద్ధం వైపు నెడుతున్న భారత ప్రభుత్వపు తప్పిదం పట్ల మా విచారం మాత్రం వ్యక్తం చేయగలం. వీ

రాజ్యం అమలు చేసే హింసను బట్టే ప్రజల పోరాట రూపాలు ఉంటాయని, ఛత్తీస్‌గడ్ ఉదాహరణతో అక్కడి పరిణామాలను విశ్లేషిస్తున్నారు ***సుమంతా బెనర్జీ***

రెండు పక్షాలూ ఒకటి కాదు

ఏ ప్రాణనష్టమైనా ఖండించదగినదే అనే కేవల మానవతావాద దృక్పథం నుంచి భద్రతా బలగాలను చంపివేయడాన్ని ఖండిస్తూ, మానవ హక్కుల, పౌరహక్కుల సంస్థలు ప్రకటనలు జారీచేయడాన్ని అర్థం చేసుకోవచ్చు. (ఉదాహరణకు, ఛత్తీస్‌గడ్‌లో ఏప్రిల్ 6న 75కు పైగా సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లను తుదముట్టించడం పై పి.యు.డి.ఆర్. ఇచ్చిన ప్రకటన). కాని, ఈ అంశాన్ని విశాల దృక్పథం నుంచి పరిశీలించే పౌర సమాజ బృందాలు గానీ, వ్యక్తులు గానీ మరింత నిశితమైన, స్పష్టమైన వైఖరి తీసుకోవలసి ఉంది. మావోయిస్టులు లేవనెత్తుతున్న మౌలిక అంశాలు సరైనవేనని వాళ్లు అనుకుంటే, మావోయిస్టుల ఎత్తుగడలను వాళ్లు అంగీకరించకపోయినప్పటికీ, వాళ్లు మన కళ్లెదుట ఉన్న చేదు వాస్తవాన్ని గుర్తించాలి. (దీన్నే మరో మాటలో చెప్పాలంటే ప్రస్తుత దోపిడీ వ్యవస్థ మీద మావోయిస్టుల మౌలిక విమర్శను అంగీకరిస్తూనే, తమ అదుపులో ఉన్న ప్రాంతాలలో సమానత్వ పాలన కొరకు ప్రత్యామ్నాయ నిర్మాణాలను రూపొందిస్తున్న మావోయిస్టుల ప్రయత్నాలను సానుభూతితో చూస్తూనే, అమాయక పౌరులను విచక్షణా రహితంగా చంపే ఎత్తుగడలను ఆమోదించకుండా ఉండవచ్చు).

ఆ చేదు వాస్తవం ఏమంటే, మన దేశంలో మొండిగా ముందుకు దూసుకుపోతున్న భారత ప్రభుత్వానికి, దాని ప్రత్యర్థులకు మధ్య ఘర్షణ చాలా వేగంగా ఒక అంతర్యుద్ధ స్థాయికి చేరుతోంది. ఒకవైపు ప్రభుత్వమేమో అత్యంత పీడనాయుతమైన నయా ఉదారవాద అభివృద్ధి నమూనాను అమలు చేస్తోంది. మరొకవైపు దాని ప్రత్యర్థులలో భాగమైన గ్రామీణ పేదలూ, ఆదివాసులూ ఆ అభివృద్ధి నమూనా వల్లనే విస్థాపితులవుతున్నారు. ఇటువంటి యుద్ధ పరిస్థితిలో ఉదారవాద బూర్జువా శాంతివాదులు ఇరుపక్షాలను ఖండించవచ్చు. దొందూ దొందే అని తమ చేతులు కడిగేసుకోవచ్చు. కాని, మనను మనం ఈ యుద్ధంలోనుంచి ఉపసంహరింపజేసుకోగలమా? మేమెవరి పక్షాన

ఉండబోమని నిరాకరించగలమా?

భారత ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద అభివృద్ధి నమూనాను, ఆ నమూనాను మన ప్రజల మీద రుద్దడానికి అది అమలు చేస్తున్న పీడనా విధానాలను మన ప్రజలను అది ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న పద్ధతిని మనం వ్యతిరేకిస్తున్నట్టయితే తప్పనిసరిగా వేరు వేరు రూపాలలో పెల్లుబుకుతున్న విభిన్న సామూహిక నిరసన ఉద్యమాల పట్ల మన వైఖరి ఏమిటో స్పష్టం చేసుకోవాలి. ఆ పోరాటాలలో ఒకవైపు నర్మదా బచావో ఉద్యమం నుంచి కళింగనగర్ ఉక్కు కర్మాగారపు వ్యతిరేక ఉద్యమం దాకా గాంధేయ అహింసాయుత రూపాలు ఉన్నాయి. మరోవైపు మావోయిస్టుల నాయకత్వాన అడవి వాసులు, ఆదివాసులు సాగిస్తున్న సాయుధ ప్రతిఘటనా ఉద్యమాలు ఉన్నాయి. ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు ఈ రెండు రకాల ఉద్యమాల మధ్య ఒక విచిత్రమైన భేదాన్ని తయారు చేసి పెట్టాయి. మొదటి రకం ఉద్యమాలేమో 'ప్రజాస్వామిక' నిరసన ఉద్యమాలట. రెండోరకం ఉద్యమాలేమో 'టెర్రరిజం' పేరుతో విమర్శించవలసినవట. మావోయిస్టు ఉద్యమం ప్రజాస్వామిక ఉద్యమం కానట్టు! నిరసనలనూ, ఆందోళనలనూ కేవలం అవి అహింసాయుత మైనంత మాత్రానే ప్రజాస్వామికమని అభివర్ణించడం సాధ్యమన్నట్టు. మరి ఒక ప్రాంతంలో వేలాది మంది ప్రజలు, ఆ ప్రాంత జనాభాలోని అత్యధిక సంఖ్యాకులు సాయుధ ప్రతిఘటన రూపాన్ని ఎంచుకున్నారనుకోండి. ఆ పని కూడా తమ అహింసాయుత పోరాట రూపాలన్నిటినీ రాజ్య యంత్రాంగం హింసాయుతంగా అణచివేసిన తర్వాతనే చేశారనుకోండి. దాన్ని ఏమందాం? ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్నది అదే. దండకారణ్యంలో ఆదివాసీ ప్రజానీకం ఆయుధాలు ధరించడానికి కారణాలు ఏమిటో ఇప్పటికే అనేక నివేదికల్లో బహిర్గతమైంది. కేవలం మానవ హక్కుల కార్యకర్తలు మాత్రమే కాదు, ప్రణాళికా సంఘానికి చెందిన నిపుణుల బృందం వంటి ముఖ్యమైన సంస్థ కూడా కొద్ది సంవత్సరాల కింద తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల మీద తన నివేదికలో ఈ విషయాలే చెప్పింది. ఏళ్లకు ఏళ్లు ఆదివాసీ ప్రజల మౌలిక అవసరాలు తీర్చే బాధ్యతను రాజ్యం విస్మరించింది. తమ ఆర్థిక కోర్కెలను వాళ్లు శాంతియుత ప్రజాస్వామిక మార్గాలలో వ్యక్తపరిచినప్పుడల్లా, అంటే, తునికాకుల సేకరణకు ఎక్కువ కూలీ కట్టివ్వమని, అటవీ ఉత్పత్తులను తమ అందుబాటులోకి తేవాలని వాళ్లు కోరినప్పుడల్లా పోలీసులు వాళ్లను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు.

ఇక్కడ నొక్కి చెప్పవలసిందేమంటే, ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతున్న విషయం ఏమంటే, వాళ్లు చెప్పే అహింసాయుత నిరసన ఉద్యమాలు కూడా ఉదారవాద బూర్జువా వర్గం 'ప్రజాస్వామిక ఉద్యమాలు' అని అమోదించేవి కూడా రాజ్యపు సైనిక బలగాల చేతిలో హింసను, దమనకాండను చవిచూస్తున్నాయి. నర్మదా బచావో ఉద్యమ ఉదాహరణను చూడండి. ఛత్తీస్‌గడ్‌లో పోలీసులు ధ్వంసం చేసిన గాంధేయవాది హిమాంశు ఆశ్రమ ఉదాహరణ చూడండి. ఈ అహింసాయుత ఉద్యమాల అనుచరులు తమ శాంతియుత రాజ్యాంగబద్ధ నిరసన పట్ల ప్రభుత్వం ప్రదర్శించిన వైఖరితో నిరాశపడి రేపు తమ ఇళ్లను, ఉపాధులను కాపాడుకోవడానికి ఆయుధాలు చేతపడితే వాళ్లను మనం 'టెర్రరిస్టులు' అని ఖండిద్దామా?

కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం భారత రాజ్యం మీదా, భారత ప్రజల మీదా నక్సలైట్లు యుద్ధం ప్రకటించారని అంటున్నాడు. నిజానికి జరిగింది దీనికి పూర్తిగా వ్యతిరేకం. భారత రాజ్యం భారత దేశపు పేదల మీద యుద్ధం ప్రకటించింది. కార్పొరేట్ రంగానికి మేలు చేకూర్చే అభివృద్ధి నమూనాను పేదల మీద రుద్ది తూర్పున ఒరిస్సా, జార్ఖండ్ నుంచి ఉత్తరాన రాజస్థాన్, హర్యానా దాకా విశాలమైన నిరుపేద ప్రజారాసుల మీద యుద్ధాన్ని రుద్ది, వాళ్లను వాళ్ల భూముల నుంచి వెళ్లగొడుతోంది. వాళ్లు ఇంక గత్యంతరం లేక నిరసన ప్రదర్శనలకు దిగుతున్నారు. ఆ నిరసనకారులను అణచివేయడానికి రాజ్యం హింసకు పూనుకుంటోంది. అది వేరువేరు రాష్ట్రాలలో సి.ఆర్.పి.ఎఫ్., సి.ఐ.ఎస్.ఎఫ్., స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఈస్టర్న్ ఫ్రంటీయర్ రైఫిల్స్ వగైరా అనేక పేర్లతో సుశిక్షితమైన సైనిక నిర్మాణాన్ని తయారు చేసి పెట్టింది. తెహల్కా వంటి పత్రికలలో స్వతంత్ర విలేకరులు రాస్తున్న వార్తల ప్రకారం ఈ పారా మిలిటరీ దళాలలో ఉన్నతాధికారులూ, కింది స్థాయి సిబ్బందీ కూడా క్రమబద్ధంగా అమాయక ప్రజలను బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎలా చంపుతున్నారో, ఎలా స్త్రీలను చెరస్తున్నారో, ఎలా గ్రామాలను తగులబెడుతున్నారో వార్తలు వస్తున్నాయి. ఈ అత్యాచారాలు కేవలం ఛత్తీస్‌గడ్‌లోని మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న గ్రామాలలో మాత్రమే జరగడం లేదు. మణిపూర్‌లోను, ఈశాన్య రాష్ట్రాలలోని ఇతర ప్రాంతాలలోను జరుగుతున్నాయి. ప్రత్యేకించి సి.ఆర్.పి.ఎఫ్. ను ఎక్కడ నియోగిస్తే అక్కడ ఇటువంటి అత్యాచారాలను జరిపిన అపఖ్యాతి మూటగట్టుకుంటోంది. ఛత్తీస్‌గడ్‌లో 75కు పైగా సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు చనిపోవడం మీద జాతీయ ప్రచార సాధనాలు కన్నీళ్లు కార్చవచ్చు. కానీ, ఈ జవాన్లే భారత రాజ్యానికి ముడిసరుకుగా, బలిపశువులుగా ఉపయోగపడి మృత్యువాత పడ్డారు. అది విషాదకరమైనదే కావచ్చు. ఈ మాట అంటున్నందుకు నన్ను క్షమించండి. కాని, వాళ్లు కోరుకున్న చావే చచ్చారు. యూదులను ఊచకోత కోసిన నాజీ సైనికులను, వాళ్లు యువకులే అయినా, అంకితభావంతో పనిచేసినా సోవియట్ ఎర్ర సైన్యం ప్రతీకారంగా చంపివేసింది. మన బూర్జువా ఉదారవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు ఈ నాజీ సైనికుల మృతి పట్ల కన్నీరు కార్చవలసిందేనా? దేనికైనా ఒక హద్దు ఉంటుంది. బూర్జువా ఉదారవాదం కూడా సహనానికి ఒక హద్దు పెడుతుంది.

సరే, ఛత్తీస్‌గడ్‌లో సి.ఆర్.పి.ఎఫ్. పై మావోయిస్టు దాడికి సంబంధించిన తాజా ఘటన దగ్గరికి మళ్లీ వస్తే... సాగుతున్న అంతర్యుద్ధంలో ఇది ఒక భాగం మాత్రమేనని మనం అంగీకరిస్తే, ఈ చావులు అనివార్యం. సరిగ్గా మావోయిస్టులను సి.ఆర్.పి.ఎఫ్. చంపినా అంతే. భారత రాజ్యం వ్యవస్థీకరించిన ఒక హింసా వ్యవస్థ ఇవాళ కొనసాగుతున్నది. ఆ వ్యవస్థలో చావులు అనివార్యం. అయితే, బూటకపు ఎన్‌కౌంటర్లు, ఆదివాసీ స్త్రీలపై అత్యాచారాలు, వారి గూడేలు తగులబెట్టడాలు వంటి సి.ఆర్.పి.ఎఫ్. హింస ఒకపక్కన, పీడకులైన భూస్వాముల మీద, వారికి మద్దతుగా వచ్చే పోలీసు, సి.ఆర్.పి.ఎఫ్. పారా మిలిటరీ బలగాల మీద దాడులు చేయడం వంటి మావోయిస్టు హింసకు మధ్య ఉండే తేడాను పౌర సమాజ బృందాలు గుర్తించవలసి ఉంది. ❖

ప్రజలపై ప్రభుత్వం చేపట్టిన యుద్ధమే తమ దాడికి తగిన పరిస్థితిని కల్పించిందని, ఆ యుద్ధాన్ని ఆపి వేసేలా ప్రజాస్వామిక వాదులందరూ ఒత్తిడి తీసుకురావాలని మావోయిస్టు పార్టీ చేసిన ప్రకటన

తాడిమెట్ల దాడి ఎందుకు జరిగింది?

ఏప్రిల్ 6న తెల్లవారుజామున ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జి) కు చెందిన దాదాపు మూడు వందల మంది దక్షిణ బస్తర్ డివిజన్‌లోని తాడిమెట్ల, ముకరం గ్రామాల మధ్య ఒక ఆంబుష్ చేసారు. ఇందులో సి.ఆర్.పి.ఎఫ్. కు చెందిన 76 మంది జవాన్లు చనిపోగా, మరో ఆరుగురు గాయపడ్డారు. చనిపోయిన సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లలో 15 మంది కోబ్రా కమాండోలున్నారు. దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ పోరాటంలో జప్తు చేసుకున్న ఆయుధాల్లో 21 ఎకె-47 రైఫిళ్లు, 38 ఇన్సాస్ రైఫిళ్లు, 6 ఎల్.ఎం.జి.లు, 7 ఎస్.ఎల్.ఆర్.లు, ఒక స్టెన్‌గన్, ఒక రెండించుల మోర్టార్ ఉన్నాయి. ఈ దాడిని విజయవంతం చేసే క్రమంలో ఎనిమిది మంది వీరయోధులు నేలరాలారు. రుక్మతి (సెక్షన్ కమాండర్, ముకరం గ్రామం, పశ్చిమ బస్తర్), వాగాల్ (సెక్షన్ కమాండర్, రేగడిగట్ట గ్రామం, దక్షిణ బస్తర్), విజ్జాల్ (సెక్షన్ డిప్యూటీ కమాండర్, పద్మ గ్రామం, పశ్చిమ బస్తర్), ఇంగాల్ (సెక్షన్ డిప్యూటీ కమాండర్, కర్రిగుండం గ్రామం, దక్షిణ బస్తర్), రాజు (సభ్యుడు, కొండపల్లి గ్రామం, దక్షిణ బస్తర్), మంగు (సభ్యుడు, రేంగం గ్రామం, దక్షిణ బస్తర్), రామాల్ (సభ్యుడు, ముర్రుపల్లి గ్రామం, దక్షిణ బస్తర్), రతన్ (సభ్యుడు, జాడ్క గ్రామం, ఇంద్రావతి ఏరియా) – ఈ ఎనిమిది మంది బస్తర్ ముద్దుబిడ్డలు ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా ధారపోశారు. మొక్కవోని ధైర్యం, అనుపమాన పరాక్రమం, త్యాగనిరతితో పోరాడిన ఈ వీరులు ఉన్నత ఆదర్శాన్ని నెలకొల్పారు. అమరులైన కామ్రేడ్స్ మృతదేహాలను మా కామ్రేడ్స్ మోసుకొచ్చి విప్లవ సాంప్రదాయాలతో వందలాది ప్రజల మధ్య ఘనంగా అంత్యక్రియలు జరిపారు. మా స్పెషల్ జోనల్ కమిటీ ఈ వీరయోధులకు, నిజమైన ప్రజాసేవకులకు వినమ్రంగా జోహార్లర్పిస్తోంది. వాళ్ల బాటలో నడవాలని దేశ యువతరానికి పిలుపునిస్తోంది. అమరులైన కామ్రేడ్స్ కుటుంబ సభ్యులకూ, మిత్రులకూ కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది.

గత కొద్ది మాసాలుగా జరుగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఆదివాసుల ఊచకోతలూ, గ్రామాలను కాలబెట్టడం, మహిళలపై సామూహిక అత్యాచారాలు వరుసగా సాగుతున్నాయి. ఈ క్రమంలో కిరాయి బలగాల, వాళ్ల ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతి కదలికపైనా మేం కన్నేసి ఉంచాం. వాటిని లోతుగా అధ్యయనం చేసాం కూడా. దీనిపై ఆధారపడి మా స్పెషల్ జోనల్ కమిటీ సరైన, ధీటైన కౌంటర్ ఎత్తుగడల్ని రూపొందించింది. ఇందులో భాగంగానే ఇప్పుడు మాకు మొదటి పెద్ద విజయం లభించింది. భారత విప్లవోద్యమ చరిత్రలోనే ప్రభుత్వ బలగాల్ని పెద్ద సంఖ్యలో సంహరించిన అతి పెద్ద దాడి ఇది.

మహా భూంకాల్‌కు వందేళ్లు పూర్తయిన సందర్భంగా విజయవంతమైన ఈ వీరోచిత దాడిని మా స్పెషల్ జోనల్ కమిటీ ఆ మహా సంగ్రామానికి సగౌరవ కొనసాగింపుగా భావిస్తోంది. ఈ విజయం సందర్భంగా సమస్త బస్తర్ వాసులకూ, ఆదివాసుల హితోభిలాషులకూ, ఆదివాసీ సంఘాలకూ మేం 'భూంకాల్ జోహార్' పలుకుతున్నాం.

యుపిఎ సర్కార్ రెండోసారి గద్దెనెక్కిన తర్వాత, ఇక్కడ ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి రమణ్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి ఈ మొత్తం అటవీ ప్రాంతాన్ని బహుళజాతి కంపెనీల, బడా పెట్టుబడిదార్ల జాగీర్లుగా మార్చే లక్ష్యంతో ఒక బీభత్సకరమైన దాడినీ, హంతక నిర్బంధ క్యాంపెయిన్‌నూ ప్రారంభించారు. 2005 నుండి కొనసాగిన ఫాసిస్టు సల్వాజుడుంలో భాగంగా వెయ్యికి పైగా ఆదివాసుల్ని హత్యచేసి, వందలాది ఆదివాసీ మహిళలపై సామూహిక అత్యాచారాలు జరిపి, 600కు పైగా గ్రామాలను కాల్చేసి, కోట్లాది రూపాయల విలువైన సంపదల్ని సర్వనాశనం చేసి, వేలాది ఆదివాసుల్ని నిలువనీడ లేకుండా చేసినప్పటికీ కూడా ప్రజలూ, ప్రజా సైన్యం సాగించిన వీరోచిత ప్రతిఘటన ఫలితంగా ప్రభుత్వాలు అవమానకరమైన ఓటమికి గురికాక తప్పలేదు. దేశంలోని ఎందరో ప్రగతిశీల మేధావులూ, వివిధ ప్రజాస్వామిక సంఘాలూ సల్వాజుడుంను సర్కారు – ప్రాయోజిత క్రూర దాడిగా అభివర్ణిస్తూ దాన్ని వెంటనే ఆపాలని ఎలుగెత్తి నినదించారు. ఆదివాసుల్లో చిచ్చు రేపి వాళ్లతోనే వాళ్లను కొట్లాటకు పురిగొల్పి, వందలాది ఆదివాసీ యువకుల్ని చేరదీసి ఎస్.పి.ఒ.ల పేరుతో ఒక గూండాల మూకను తయారు చేసి తమ ప్రజలపైనే ఉసిగొల్పిన సర్కారీ కుట్రను ఎల్లెడలా ఖండించారు. అన్ని వైపులా కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల కుటిల యత్నాలు బట్టబయలై అభాసుపాలయ్యాయి.

దీని తర్వాత కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం నెరపి 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో అపూర్వ స్థాయిలో భారీ దాడిని ప్రారంభించింది. అయితే ఈ ఆపరేషన్ లేనే లేదని కేంద్ర హోం మంత్రి చిదంబరం ప్రతిసారీ తిరస్కరిస్తూ వచ్చారు.

నిజానికి ఇది దేశంలోని నిరుపేద ప్రజలకు వ్యతిరేకంగా మొదలుపెట్టిన యుద్ధం. ఇది దండకారణ్య పోరాట ప్రాంతంలో ఆగస్ట్ 2009లో మొదలైంది. దీనికోసం గతం నుండి మోహరించి ఉన్న వేలాది పోలీసు, పారా మిలిటరీ బలగాలకు అదనంగా డజన్ల సంఖ్యలో అదనపు పారా మిలిటరీ బెటాలియన్లను దించారు. ఆంధ్ర 'గ్రేహౌండ్స్' ను అనుకరిస్తూ 'కోబ్రా' పేరుతో సిఆర్‌పిఎఫ్‌లో ఒక ఇలీట్ కమాండో ఫోర్స్‌ను తయారు చేసి ఈ యుద్ధంలో ముందు నిలబెట్టారు. దేశ సరిహద్దులపై ఉండాల్సిన బిఎస్ఎఫ్, ఐటిబిపి వంటి బలగాల్ని దండకారణ్యంలో తమ స్వంత దేశ ప్రజలకు వ్యతిరేకంగా మోహరించారు. మొత్తం దండకారణ్యన్నంతా ఖాకీ వనంగా మార్చారు. బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లోని పోరాట ప్రాంతాలది కూడా ఇదే పరిస్థితి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో దేశంలోని నిరుపేద ప్రజలకు వ్యతిరేకంగా సోనియా – మన్మోహన్ – చిదంబరం ముఠా మొదలుపెట్టిన ఈ యుద్ధానికి కేంద్ర హోం మంత్రి నాయకత్వం వహిస్తున్నారు. ఈయన ఒకప్పుడు ఎన్‌రాన్ అనే అపఖ్యాతి కలిగిన బహుళజాతి కంపెనీకి వకీలుగా, ఆర్థిక మంత్రి కావడానికి ముందు వేదాంత అనే మరో పేరు మోసిన కంపెనీలో డైరెక్టర్ల బోర్డులో సభ్యుడిగా పనిచేశారు. తన జీవిత కాలంలో సగభాగం ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ తదితర బ్యాంకుల్లో అధికారిగా సేవచేసిన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు నంబర్ వన్ దళారీ. ప్రధానికి ప్రీతిపాత్రుడూ, కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా నియామకమైన జి.కె. పిళ్లై లక్షలాది ప్రజల్ని నిలువనీడ లేకుండా చేయడానికైనా వెనుకాడకుండా దేశంలో 235 ఎస్.ఇ.జెడ్.లకు అనుమతిచ్చిన మొనగాడు. దేశంలో సామ్రాజ్యవాదులు నిర్దేశించే విధానాన్ని సాఫీగా అమలు చేయడంలో మావోయిస్ట్ ఉద్యమమే అతి పెద్ద అడ్డంకి అనే విషయం వీళ్లందరికీ చాలా బాగా తెలుసు. ఈ దుష్ట త్రయం నాయకత్వంలో, రమణ్‌సింగ్, ననకీరాం, విశ్వరంజన్ వంటివాళ్ల భాగస్వామ్యంతో ఈ 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' జరుగుతోంది. ఆగస్ట్ 2009 నుండి ఇప్పటిదాకా ఈ పాశవిక ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు, పారా మిలిటరీ బలగాలు, ఎస్.పి.ఒ.లు 110 మందికి పైగా ఆదివాసుల్ని ఊచకోత కోశారు. పదుల సంఖ్యలో మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. ఎందరివో ఇళ్లు బుగ్గి చేశారు. సామాన్లు దోచుకున్నారు.

ఒకవైపు ఆదివాసుల ఊచకోతల్ని వరుసగా కొనసాగిస్తూనే మరోవైపు చిదంబరం ముఠా విప్లవోద్యమ నాయకుల్ని హత్య చేయడంపై, పట్టేసి జైల్లో కుక్కేయడంపై దృష్టి కేంద్రీకరించింది. గత సంవత్సరం మే 23న మా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ పటేల్ సుధాకర్‌నూ, ఈ మధ్యనే మార్చ్ 12న మా పార్టీ మరో సీనియర్ నేత శాఖమూరి అప్పారావుతో పాటు సోలిపేట కొండల్‌రెడ్డిని పేరుమోసిన ఆంధ్ర ఎస్.ఐ.బి. హంతక ముఠా పట్టుకొని దారుణంగా హత్య చేసింది. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ కథలల్లింది. ముఖ్యమైన పార్టీ నాయకుల హత్యలకు చిదంబరం ముఠాదే ప్రత్యక్ష బాధ్యత.

కాబట్టి వీటన్నిటికీ వ్యతిరేకంగానే ఈ దాడి జరిగింది. బస్తర్ వాసుల అనివార్యమైన, సహజమైన ప్రతిస్పందన ఇది. మహా భూంకాల్‌కు వందేళ్లు పూర్తయిన సందర్భంలో ఈ చారిత్రక దాడి జరగడం కేవలం యాదృచ్ఛికం కాదు. దానికి కొనసాగింపులో భాగమే ఈ దాడి. వందేళ్ల క్రితం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తిరుగుబాటు శంఖాన్ని పూరించిన బస్తర్‌వాసులు ఇప్పుడు దేశంలోని అపార సహజ సంపదలన్నిటినీ సామ్రాజ్యవాదులకు కట్టబెట్టాలని చూస్తున్న దోపిడీదార్ల ఆశల్ని అడియాసలుగా మార్చడానికి కంకణబద్ధులయ్యారు.

ఈ సంఘటన జరగ్గానే తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ చిదంబరం దీన్ని మా 'బర్బరత్వానికి' నిదర్శనమని వ్యాఖ్యానించాడు. అధికారంలోని పెద్దలతో పాటు బిజెపి తదితర దోపిడీవర్గ పార్టీలు తమ వర్గ స్వభావానికి అనుగుణంగానే బిగ్గరగా గగ్గోలు పెడుతున్నాయి. మరి వీళ్లు మేం ఈ కింద పేర్కొంటున్న సంఘటనల వల్ల ఏం వివరణ ఇవ్వగలరు? ఇవి 'బర్బరత్వం' శ్రేణిలోకి వస్తాయా రావా చెప్పగలరా వీళ్లు?

- జనవరి 8, 2009న సింగారంలో జరిగిన సామూహిక ఊచకోతలో 17 మంది ఆదివాసుల మృతి. వీళ్లలో ఐదుగురు మహిళలు. చంపడానికి ముందు వీళ్లపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. అందరినీ శరీర అవయవాల్ని ముక్కలు ముక్కలుగా చేసి చంపేసారు.
- జూన్ 20, 2009న కోకవాడ వద్ద ఆరుగురు నిరపరాధులైన ఆదివాసుల్ని హత్య చేశారు. వీళ్లు వారపు సంత నుండి తిరిగి వస్తుండగా పట్టుకొని అక్కడికక్కడే చంపేశారు.
- ఆగస్ట్ 10, 2009న బీజాపూర్ జిల్లాలోని వెచ్చపాడు గ్రామం వద్ద ఆరుగురి హత్య. వీళ్లలో ఒక మహిళ మాత్రమే మా పార్టీ కార్యకర్త. మిగతా వాళ్లంతా సాధారణ ప్రజలు.
- సెప్టెంబర్ 10, 2009న సింగనమడుగు, దాని చుట్టుపక్కల గ్రామాల్లో మొత్తం 12 మంది ప్రజల హత్య. ఇందులో ముగ్గురైతే 60–70 ఏళ్ల వయసున్న వృద్ధులు.
- అక్టోబర్ 1, 2009న గోంపాడు గ్రామంలో 12 మంది హత్య. వీరిలో 10 ఏళ్ల వయసున్న ఒకమ్మాయి ఉంది. ఈ సంఘటనలో ఏడాదిన్నర వయస్సున్న పసిబాలుడి రెండు చేతివేళ్లను కూడా నరికేశారు.
- నవంబర్ 10, 2009న టెట్టెమడుగు దాని పరిసర గ్రామాల నుండి ఏడుగురిని హత్య చేశారు.
- డిసెంబర్ 11, 2009న గుమియాపాల్ గ్రామంలో ఏడుగురిని చంపేశారు.
- జనవరి 23, 2010న కుట్రెం దగ్గర నలుగురు యువకుల్ని చంపారు.
- ఫిబ్రవరి 3, 2010న తాకిలోడ్ గ్రామంపై దాడి చేసి ఏడుగురు ఆదివాసీ యువకుల్ని దారుణంగా చంపేశారు.
- ఫిబ్రవరి 7, 2010న నారాయణపూర్ దగ్గర్లోని ఓంగ్‌నార్ గ్రామంలో ఇద్దరు యువకులతో పాటు ఐదుగురిని హత్య చేశారు.
- ఫిబ్రవరి 10, 2010న మాడ్ డివిజన్‌లోని దుంనార్ అనే గ్రామంలో వ్యవసాయశాఖకు చెందిన విప్లవ కార్యకర్త కామ్రేడ్ కుమిలిని ఎస్.పి.ఒ.లు పట్టుకొని సామూహిక అత్యాచారం జరిపి దారుణంగా తల నరికి చంపారు.

- మార్చ్ 19న ఆంధ్ర గ్రేహౌండ్స్ తడ్‌పాల్ అనే గ్రామంపై దాడి చేసి కామ్రేడ్స్ పుల్లయ్య, లక్ష్మి దంపతులను పట్టుకొని కాల్చి చంపారు. తర్వాత ఎప్పటిలాగే ఎన్‌కౌంటర్ కథ అల్లారు.
- ఏప్రిల్ 3, 2010న జరిగిన ఒక తాజా సంఘటనలో నారాయణపూర్ జిల్లాలోని చినారీ (గోండీ భాషలో 'ఇన్నర్') అనే గ్రామంలో సి.ఆర్.పి.ఎఫ్., జిల్లా పోలీసు బలగాలు 300కు పైగా సంఖ్యతో దాడి చేశారు. సోన్‌ధర్ సలాం అనే ఆదివాసీది, నేంగి యాదవ్ అనే మరో రైతుది రెండు ఇళ్లను కాల్చేశారు. దాని పక్కనే ఉన్న ఫరస్‌గాం అనే గ్రామంపై కూడా ఇదే మూక దాడి చేసి చైత్‌రాం సలాం అనే ఆదివాసీ ఇంటిని కాల్చేశారు. ఈ మూడిళ్లలో మొత్తం సామానంతా కాలి బూడిదైంది. చినారీ గ్రామంలో సంతాయి సలాం అనే పదిహేనేళ్ల అమ్మాయిని పట్టుకొని స్పృహ కోల్పోయే దాకా కర్రలతో బాదారు.
- ఏప్రిల్ 5, 2010న కొండగాం తహసీల్‌లోని చేమా గ్రామం నుండి గంగ కొర్రాం (30) అనే ఆదివాసీ యువకుణ్ని మర్దాపాల్ పోలీసులు పట్టుకెళ్లి తర్వాత స్టేషన్‌లోనే కొట్టి చంపేసి శవాన్ని గ్రామంలో వదిలేశారు.
- ఏప్రిల్ 5నే తోంగ్‌పాల్, దాని చుట్టుపక్కల గ్రామాల్లో కోబ్రా బలగాలు, ఇతర బలగాలు బీభత్సం సృష్టిస్తూ ఎంతో మందిని కొట్టాయి. చాలా మందిని అరెస్ట్ చేసి తీసుకెళ్లాయి.

పైన పేర్కొన్న హత్యలకూ, హింసా దౌర్జన్యాలకూ పాల్పడ్డది పోలీసులూ, పారా మిలిటరీ వాళ్లూ, ఎస్.పి.ఒ.లేననేది తేటతెల్లం. వీటి నిజానిజాలపై ఎవరికైనా ఏ మాత్రం అనుమానం ఉన్నా మా ప్రాంతాల్లోకి వచ్చి స్వయంగా పరిశీలించవచ్చు. తాడిమెట్ల అడవిలో ఏప్రిల్ 6న ఉదయం జరిగింది ఏమైనప్పటికీ వెనుక వందల, వేల బస్తర్ ఆదివాసుల బాధ ఉంది. కన్నీళ్లున్నాయి, అవమానం ఉంది. దోపిడీ ఉంది. దమనకాండ ఉంది. మాటిమాటికీ నక్సలైట్లు 'హింసను వదిలెయ్యాల'ని వల్లె వేస్తున్న రెండు నాల్కల వాళ్లకూ, దగుల్బాజీలకూ ఇది అర్థం కావడం అసాధ్యం.

ఈ సంఘటన దరిమిలా ఏప్రిల్ 7న జగ్దల్‌పూర్‌కు వచ్చిన కేంద్ర హోంమంత్రి చిదంబరం 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' అనేది లేనే లేదని మరోసారి వక్కాణించారు. పైగా తాడిమెట్లలో సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లు దాడికి వెళ్లలేదనీ, కేవలం ఆ ప్రాంతంతో పరిచయం కోసం వెళ్లారని కూడా అన్నారు. సైన్యం సహాయాన్ని తీసుకునే అవకాశాన్ని నిరాకరిస్తూ అవసరమైతే వాయుసైన్యాన్ని ఉపయోగించడం గురించి మళ్లీ ఆలోచిస్తామని అన్నారు. చిదంబరం గారూ! దేశ ప్రజలందరూ మూర్ఖులని నమ్మే స్వేచ్ఛ మీకుంది! కానీ మీరు మీరు మెచ్చే కంపెనీయైన 'వేదాంత'తో పాటు, మరెన్నో దళారీ పెట్టుబడిదారీ, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు కాపాడడం కోసమే, మరీ ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల దిశానిర్దేశనంతోనే ఈ గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను మొదలుపెట్టారనే విషయం ప్రజలందరికీ బాగా తెలిసిపోయింది. ఇక సైన్యం 'సహాయం' గురించి చెప్పాల్సి వస్తే, వాస్తవానికి సైన్యం పరోక్ష జోక్యం నాలుగేళ్ల ముందే ప్రారంభమైంది. సైనికాధికారులు స్వయంగా ఇక్కడి పోలీసు బలగాలకూ, పారా మిలిటరీ బలగాలకూ జంగిల్ వార్‌ఫేర్ శిక్షణ ఇస్తున్నారు. చిదంబరం వెయ్యి అబద్ధాలు చెప్పినా సోనియా – మన్మోహన్ – చిదంబరం ముఠానే దేశ ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధాన్ని మొదలుపెట్టిందనే వాస్తవం తేటతెల్లం. ఈ యుద్ధం నుండి ప్రజలకు తమను తాము కాపాడుకునే హక్కు తప్పక ఉంటుంది.

దేశంలోని సమస్త ప్రజాస్వామ్య మేధావులకూ, రచయితలకూ, జర్నలిస్టులకూ, వివిధ వృత్తుల వాళ్లకూ, కార్మికులకూ, కర్షకులకూ మేం సవినయంగా మనవి చేస్తున్నాం – బడా, విదేశీ పెట్టుబడిదార్ల లాభాల కోసం దేశ ప్రజలకు వ్యతిరేకంగా సాగిస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపెయ్యండనీ, ప్రజలనూ విప్లవోద్యమ నేతలనూ బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపడాన్ని ఆపెయ్యండనీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ వాళ్లను కఠినంగా శిక్షించాలనీ, ఆదివాసుల ఇండ్లను కాల్చడాన్నీ సంపద విధ్వంసాన్నీ ఆపెయ్యండనీ ప్రభుత్వాలను డిమాండ్ చేయండి. ఈ సందర్భంగా మేం ఈ సంఘటనలో చనిపోయిన పోలీసు ఉద్యోగుల కుటుంబాల పట్ల సానుభూతి ప్రకటిస్తూ, ఏ పరిస్థితుల్లో మేం ఈ చర్యకు పాల్పడవల్సి వచ్చిందో అర్థం చేసుకోవల్సిందిగా వాళ్లను కోరుతున్నాం. పోలీసు, పారా మిలిటరీ బలగాల జవాన్లకూ, కింది స్థాయి అధికార్లకూ మా విజ్ఞప్తి – ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేయకండి... పాశవికంగా వ్యవహరించకండి.

(వీక్షణంకు ఈమెయిల్ ద్వారా అందిన ఈ ప్రకటనను, దాని ప్రాధాన్యత దృష్ట్యా ప్రచురిస్తున్నాం.) వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - జూన్ 2010 : అరవై సంవత్సరాల రాజ్యాంగం**
- **ఫోకస్ - జూలై 2010 : పర్యావరణ సంక్షోభం**
- **ప్రజా పోరాటాల విజయదుర్గం - రాయదుర్గం - నక్కా హేమా వెంకట్రావ్**
- **అమెరికా స్తబ్ద దశాబ్దం 1999-2009 - ఇ.ఎస్. బ్రహ్మచారి**
- **సామాజిక న్యాయం - తోట సత్యనారాయణ, తిరునగరి మనోహరస్వామి**

నిర్బంధ విద్య అమలు విషయంలో అనేకచట్టాలు చేసినా, లక్ష్యాలు నిర్దేశించుకున్నా, అమలులో పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల చట్టాలన్నీ నీరుగారిపోయాయని అంటున్నారు **డా. ఎం. గంగాధర్**

విద్యా హక్కు చట్టం పూర్వాపరాలు

ఏప్రిల్ 1, 2010 నుండి విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం అమల్లోకి రావడానికి కొద్ది రోజుల ముందు నుండి అమల్లోకి వచ్చిన రోజు వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యా శాఖలు జాతీయ స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు సమావేశాలను పెట్టించి, ర్యాలీలను తీయించి, ఏదో మార్పుకు నాందీ పలుకుతున్నట్లు కొంత అలజడిని సృష్టించడానికి ప్రయత్నించాయి.

ఉచిత, నిర్బంధ విద్య పట్ల బాల బాలికలకున్న హక్కు, 2009, అనే పేరుతో ఉన్న ఈ విద్యా హక్కు చట్టం ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల వరకు వయసున్న బాల బాలికలకు విద్యను ప్రాథమిక హక్కుగా చేసినట్లుగా చెప్పింది. అంటే 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుకోవడాన్ని ప్రాథమిక హక్కుగా చేసింది. దేశంలోని పేదరికం, వెనుకబాటుతనం, నిరక్షరాస్యతలను దృష్టిలో పెట్టుకొని చూస్తే పేద కుటుంబాల నుండి వచ్చే బాల బాలికలకు ఎంతో ప్రయోజనకారిగా కనిపించే ఈ చట్టం, 10వ తరగతి చదివినా, ఇంటర్మీడియట్ చదివినా సరియైన ఉద్యోగమేదీ దొరకని వ్యవస్థలో ఎవరికి మేలు చేస్తుందనే ప్రశ్నను మన ముందుంచుతుంది.

1951లో దేశంలో 18.33 శాతం మంది ప్రజలు అక్షరాస్యులుగా ఉన్నారు. 1961 జనాభా లెక్కల నాటికి వారు 28.3 శాతానికి చేరుకున్నారు. ఈ రెండు అంకెలను చెప్పుకోవడానికి కారణముంది. 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని 45వ ఆర్టికల్‌లో దేశంలోని 14 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్బంధోచిత విద్యను ప్రభుత్వాలు అందించాలని, ఈ లక్ష్యాన్ని పదేళ్లలోపు, అంటే 1960 నాటికి చేరుకోవాలని చెప్పబడింది. కాని ఈ పదేళ్లలో పది శాతం అక్షరాస్యతను మాత్రమే ప్రభుత్వాలు పెంచగలిగాయని ఈ అంకెలు తెలుపుతున్నాయి. ఈ గడవును పదే పదే పెంచుతూ వచ్చారు. అరవై ఏళ్లు గడిచినా లక్ష్యం దరిదాపుల్లోకి మన బాలిబాలికలు చేరుకునే పరిస్థితి లేదు. 2001లో దేశ అక్షరాస్యతా శాతం 64.84. 2011 జనాభా లెక్కల్లో ఇది మరో పది శాతం పెరగవచ్చు.

దేశంలో బడికి వెళ్లే వయస్సులోనున్న బాల బాలికల ఎన్‌రోల్‌మెంట్‌ను వంద శాతం దరిదాపుల్లోకి తెచ్చామని ప్రభుత్వాలు చెప్పుకుంటున్నాయి. కానీ ప్రభుత్వాల లెక్కల ప్రకారమే ఒకటవ తరగతిలో చేరిన బాలబాలికలు ఐదవ తరగతికి వచ్చేసరికి 25.67 శాతం మంది బడి మానేస్తున్నారు. ఏడవ తరగతికి వచ్చేసరికి 48.80 శాతం మంది బడి మానేస్తున్నారు. అంటే సుమారు సగం మంది బాలబాలికలు ఎలిమెంటరీ విద్యను కూడా పూర్తి చేయలేకపోతున్నారు. బడి మానివేసిన ఈ బాలబాలికలు ఒకటో తరగతో, రెండో తరగతో చదివి ఉంటారు కనుక వారు అక్షరాస్యులుగానే లెక్కించబడతారు. మనం సాధించిన అక్షరాస్యతలోని గుణం ఈ పాటిది.

ఆంధ్రప్రదేశ్‌లో 2001 జనాభా లెక్కల ప్రకారం 60.47 శాతం అక్షరాస్యత ఉంది. అది దేశ సగటు అక్షరాస్యత కంటే తక్కువ. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యత విషయంలో 28వ స్థానంలో ఉంది. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో, పురుషుల్లో కంటే మహిళల్లో, ఒ.సి., బి.సి. వర్గాల్లో కంటే ఎస్.సి., ఎస్.టి. వర్గాల్లో అక్షరాస్యత తక్కువగా ఉంటుంది.

అనేక చారిత్రక దశలను అధిగమించి, ఎలిమెంటరీ విద్య 2009 నాటికి రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కుగా మారింది. బ్రిటిష్ వలస ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత విద్యా కమిషన్ (హంటర్ కమిషన్)కు మహాత్మా జ్యోతిరావు పులె 1882లో ఒక మెమోరాండంను సమర్పిస్తూ దేశంలోని కులీన వర్గాల విద్యా ప్రయోజనాలను ఈడేర్చడం కొరకే ప్రభుత్వ విద్యారంగం పాటు పడుతున్నదని విమర్శించి దళిత, బలహీన వర్గాల విద్యావసరాల మీద దృష్టిని సారింపజేసే ప్రయత్నం చేశారు. ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 1911లో గోపాల్‌కృష్ణ గోఖలే ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. కాని అసెంబ్లీలో ఉన్న సభ్యులు దేశంలోని పరిస్థితులు ఈ బిల్లుకు అనుకూలంగా లేవని బిల్లును తిరస్కరించారు. ఈ సభ్యులందరు కులీన సంపన్న వర్గాలకు చెందినవారే. బాలబాలికలందరు బడికి పోతే మా వ్యవసాయం భూముల్లో ఎవరు పని చేస్తారని, ఈ బిల్లును వ్యతిరేకిస్తూ బీహార్‌లోని దర్భాంగా మహారాజు 11 వేల మంది భూస్వాములు, సంస్థానాధీశుల సంతకాలను సేకరించి, ప్రభుత్వానికి ఒక మెమోరాండాన్ని సమర్పించారు. దేశంలో ప్రాథమిక విద్యా వ్యాప్తికి పాలక, సంపన్న వర్గాల ప్రయోజనాలు ఎంతగా అడ్డు తగిలాయో ఈ ఉదంతం తెలియజేస్తోంది. ఈ పాలక సంపన్న వర్గాలే ఈ వైఖరినే వేర్వేరు రూపాల్లో ఇప్పటివరకూ కొనసాగిస్తూ వస్తున్నారని విద్యారంగ చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది.

భారత చట్టం, 1935, ప్రకారం జరిగిన ఎన్నికల్లో దేశంలో 9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. 1937లో వార్ధాలో జరిగిన నేషనల్ ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్‌లో హాజరైన 9 రాష్ట్రాల విద్యామంత్రులను నయీ తాలిమ్ (బేసిక్ ఎడ్యుకేషన్) ను అమలు చేయాలని గాంధీ కోరాడు. నయీ తాలిమ్‌ను అమలు చేయడానికి

అవసరమైన నిధులు తమ వద్దలేవని ఆ విద్యామంత్రులు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ (పాలకవర్గాలు) నైజం కొత్తదేమీ కాదు. పుట్టుకతోనే దానికా నైజం అబ్బి, అది కొనసాగుతూ వచ్చింది.

14 ఏళ్ల వయస్సు నిండేవరకు దేశంలోని బాలబాలికలకందరికి నిర్బంధోచిత విద్యను అందించాలనే ఆర్టికల్ 45కు అంబేద్కర్ పట్టుదలే కారణం. రాజ్యాంగ సభలో 1948-49లలో ఈ అంశం మీద చర్చ జరిగినపుడు చాలామంది సభ్యులు ఈ నిర్బంధోచిత విద్యను 11 ఏళ్ల వరకే పరిమితం చేయాలని చూశారు. ఆదేశిక సూత్రాల్లో మిగిలిన వాటికి లేని కాలపరిమితిని ఆర్టికల్ 45కు విధించడానికి కూడ అంబేద్కరే కారణం.

దేశంలోని బాలబాలికల విద్యాభ్యాసం గురించి అంబేద్కర్ పట్టుదల కారణంగా భారత రాజ్యాంగంలో పదేళ్ల కాలపరిమితి కలిగిన ఆర్టికల్ 45 చేరింది. కాని భారత ప్రభుత్వాలకు ఆ ఆర్టికల్ మీద పట్టింపు లేకుండా పోయింది. 1980లలో ఆర్థిక సరళీకరణ విధానాలు వచ్చిన తరువాతనే మార్కెట్ అవసరాల కొరకు నిరక్షరాస్యతను తగ్గించాలని, అక్షరాస్యతను పెంచాలని ప్రభుత్వాలు అనుకున్నాయి. అప్పటి నుండి ఆపరేషన్ బ్లాక్ బోర్డ్ మొదలుకొని అనేక అక్షరాస్యతా పథకాలు అమలవుతూ వచ్చాయి.

అయితే 1993లో ఉన్ని కృష్ణన్ కేసులో సుప్రీం కోర్టు తీర్పునిస్తూ జీవించే హక్కులో విద్యా హక్కు ఇమిడి ఉందని, విద్య లేకుండా జీవించే హక్కుకు అర్థం లేదని, అందువలన దేశంలోని బాలబాలికలకు 14 ఏళ్ల వయస్సు వచ్చేవరకు విద్యను ఒక ప్రాథమిక హక్కుగా భావించాలని, 14 సంవత్సరాల వయస్సు తరువాత కూడా విద్య ఒక హక్కుగానే ఉంటుందని, అయితే అది ప్రభుత్వం వద్దనున్న నిధుల లభ్యతను బట్టి పరిమితం చేయబడుతుందని చెప్పింది. విద్యారంగంలో పేద ప్రజల హక్కుల కొరకు పోరాటం చేస్తున్నవారికి ఈ సుప్రీంకోర్టు తీర్పు ఒక ఆయుధంగా పనికివచ్చింది. ఈ ఆయుధాన్ని ప్రభుత్వాల మీద ప్రయోగించి విద్యా హక్కు కొరకు వారు పోరాటం చేశారు. ఈ ఒత్తిళ్లకు లొంగిన అప్పటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1997లో రాజ్యసభలో 83వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. కాని ఆ బిల్లు బిల్లుగానే ఉండిపోయింది. విద్యారంగానికి తగినన్ని నిధులను కేటాయించడానికి ఇష్టపడని కేంద్ర ప్రభుత్వ వైఖరే అందుకు కారణం. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వమే సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తే ఎన్ని నిధులు కావాలో అంచనా వేయడానికి తపస్ మజుందార్ కమిటీని నియమించింది. 1997 జూన్‌లో నియమితమైన ఆ కమిటీ 1999 జనవరిలో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. రానున్న పదేళ్ల కాలంలో 1,37,000 కోట్ల రూపాయలు ఖర్చు పెడితే సుప్రీం కోర్టు తీర్పును ఆచరణాత్మకం చేయవచ్చునని ఆ కమిటీ చెప్పింది. అంటే సంవత్సరానికి సగటున 13,700 కోట్ల రూపాయలు. ఇది ఆనాటి జిడిపిలో 0.86 శాతం మాత్రమే. కాని దేశంలోని బాలబాలికల భవిష్యత్తు కొరకు ఈ మాత్రం ఖర్చు చేయడానికి కూడా ఆ ప్రభుత్వం ముందుకు రాలేదు.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం విద్యారంగం మీద పెడుతున్న ఖర్చు 6 శాతంకు చేరుకోవడానికి ఒక హాస్యాస్పదమైన మార్గాన్ని ఎంచుకుంది. ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ప్రభుత్వాలు తమ సామాజిక బాధ్యతల నుండి తప్పుకోవడానికి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ సూత్రాన్ని వల్లె వేస్తున్నాయి. ఈ సూత్రానికి అనుగుణంగా విద్యారంగం మీద ప్రైవేట్ పాఠశాలల్లో జరిగే ఖర్చుతో కలుపుకొని, విద్యారంగం మీద జిడిపిలో 6 శాతం నిధులను ఖర్చు చేయాలనే లక్ష్యాన్ని చేరుకుంటామని ఎన్‌డిఎ ప్రభుత్వం 2001లో అన్నది.

విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులను ఖర్చు చేయాలనే దానికి ఒక చరిత్ర ఉంది. దేశంలోని పాఠశాల విద్యారంగాన్ని అధ్యయనం చేసి తగిన సిఫారసులు చేయడం కొరకు భారత ప్రభుత్వం 1964లో డా. డి.ఎస్. కొఠారీ అధ్యక్షతన ఒక విద్యా కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్‌కి సభ్యులు రెండేళ్లపాటు దేశ విదేశాల్లోని పాఠశాల విద్యారంగాన్ని అధ్యయనం చేసి 1966లో ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించారు. ఇది చాల ప్రామాణికమైన నివేదికగా పేరు పొందింది. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం జిడిపిలో 6 శాతం నిధులను ఖర్చు చేయాలని ఆ నివేదికలో కొఠారీ సిఫారసు చేశారు. కాని అప్పటినుండి ఈ నాలుగు దశాబ్దాలకుపైగా గడిచిన కాలంలో ఏనాడూ 3-4 శాతానికి మించి విద్యారంగానికి నిధులను కేటాయించలేదు. 2004లో యుపిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2 శాతం విద్యా సెస్సును విధిస్తూ వచ్చింది. అయినా విద్యారంగానికి నిధుల కేటాయింపు మాత్రం పెరగలేదు.

ఎన్‌డిఎ ప్రభుత్వం హయాంలోనే 2002 డిసెంబర్‌లో 86వ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించింది. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల విభాగంలో 21ఎ అనే కొత్త అధికరణం 86వ రాజ్యాంగ సవరణ ద్వారా చోటు చేసుకున్నది. 14 సంవత్సరాల వరకు బాలబాలికలందరికి నిర్బంధోచిత విద్యను అందించాలని ఉన్న 45 అధికరణను కుదిస్తూ 6-14 సంవత్సరాల మధ్యనున్న బాలబాలికలకు మాత్రమే విద్యను ప్రాథమిక హక్కుగా 21ఎ అధికరణ చెప్పింది. బాలబాలికల ఎదుగుదలలో అత్యంత కీలకమైన 0-5 సంవత్సరాల మధ్యనున్న బాల్యాన్ని దేశ ప్రజలందరికి ప్రాతినిధ్యం వహించే భారత పార్లమెంట్ గాలికి ఒదిలేసింది. అప్పటివరకు నైతికంగానైనా తన మీద ఉన్న బాధ్యత నుండి ప్రభుత్వాలు ఈ రాజ్యాంగ సవరణ ద్వారా నిస్సిగ్గుగా తప్పుకున్నాయి. 14 సంవత్సరాల పైన ఉండే బాలబాలికల విద్య విషయంలో సుప్రీం కోర్టు తీర్పు కల్పించిన వెసులుబాటు వలన ప్రభుత్వాలు పూర్తిగా జారుకున్నాయి. పారిపోతున్న దొంగను పట్టుకున్నట్లుగా సుప్రీంకోర్టు తీర్పు భారత ప్రభుత్వాన్ని నిలదీస్తే తప్ప ఆ ప్రభుత్వం అతి కష్టంమీద 6-14 సంవత్సరాల మధ్య బాలబాలికలను విద్య ప్రాథమిక హక్కుగా అంగీకరించలేదు. అందుకే రాజ్యాంగ చట్టం వచ్చిన పదేళ్లకు గాని ఆ రాజ్యాంగ చట్టాన్ని అమలు చేయడానికి ఉద్దేశించిన విద్యా హక్కు చట్టం రాలేదు.

విద్యా హక్కు చట్టం, 2009 : ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యకు బాలల హక్కు చట్టం, 2009 (35/2009) అనే పేరుతో పార్లమెంట్ ఈ చట్టాన్ని చేసింది. ఈ చట్టం 26 ఆగస్ట్ 2009 నాడు భారత రాష్ట్రపతి ఆమోదాన్ని పొంది, 27 ఆగస్ట్ 2009 నాడు కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో ప్రచురించబడింది. 6-14 సంవత్సరాల మధ్యనున్న బాలబాలికలకు విద్యను ప్రాథమిక హక్కుగా పేర్కొన్న ఈ చట్టం 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యను ఎలిమెంటరీ విద్యగా

నిర్వచించి, ఆ ఎలిమెంటరీ విద్యను ఉచితంగానూ, నిర్బంధంగానూ ఇవ్వడానికి ఉద్దేశించింది. ప్రభుత్వం ఇచ్చే ఈ తరహా విద్యకు సంపన్న వర్గాల పిల్లలు, చివరకు మధ్యతరగతి వర్గాల పిల్లలు కూడా, ఎదురు చూడడం లేదు. కాబట్టి ఈ విద్య ప్రధానంగా పేదవర్గాలకు చెందిన పిల్లలకు, కొంతమేరకు దిగువ మధ్యతరగతి పిల్లలకు ఉద్దేశింపబడింది.

భారతదేశపు భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకోవాలని 1960లలో కలలు గన్న కొఠారీ కమిషన్ సంపన్న వర్గాల, పేదల పిల్లలు ఒకేచోట చదవగల కామన్‌స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని చెప్పింది. కొఠారీ కమిషన్ కాలం నాటికి, ఆ తరువాత మరికొంత కాలం వరకు, పరిమితమైన అర్థంలోనైనా, ఏదో ఒక రూపంలో ఉన్న 'కామన్ స్కూల్' ధ్వంసమైపోయింది. ప్రభుత్వ పాఠశాలకు పోటీగా ప్రైవేట్ పాఠశాల వచ్చింది. ఇప్పుడు ఆ ప్రైవేట్ పాఠశాల ప్రభుత్వ పాఠశాలను మింగే స్థాయికి ఎదిగింది. ప్రభుత్వ రంగంలోనే ఉన్న పాఠశాలలు బహుళ రూపాలను పొంది విద్యారంగంలో ఒక అంతరాల దొంతరను సృష్టించింది. విద్యారంగం పాఠశాలల పరంగా, విద్యార్థుల పరంగా, వసతుల పరంగా, మీడియం పరంగా విభజింపబడింది. ఏ పాఠశాల గదిలో సామాజిక సామరస్యాన్ని నిర్మించాలని కొఠారీ కమిషన్ కలగన్నదో ఆ పాఠశాల గదినే సామాజిక వైమనస్య బీజాలను నాటడానికి మన ప్రభుత్వాలు వేదికగా మార్చివేశాయి. ఈ విద్యా హక్కు చట్టం ఈ అంతరాల దొంతరను ఏ మాత్రం కదిలించకుండా, పేద విద్యార్థులకు పేద విద్య మీదనే హక్కును కల్పించింది.

ఎస్.సి., ఎస్.టి.లను, సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిని, అల్పాదాయవర్గాల వారిని విద్యా హక్కు చట్టం ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇలాంటి వారి కోసమే ఈ విద్యా హక్కు చట్టం అన్నట్లుగా ఈ ప్రస్తావన ఉంటుంది. శతాబ్దాలుగా వెనుకబడిన ఈ వర్గాలకు ఎలాంటి విద్యను అందించాలని ప్రభుత్వం అనుకుంటున్నదో, ఈ చట్టానికి ఉన్న షెడ్యూల్‌ను చూస్తే అర్థమవుతుంది. తగినంత మంది ఉపాధ్యాయులను ఇవ్వడంలో, మెరుగైన వసతులను కల్పించడంలో ప్రభుత్వాలు సాధారణంగా కనబరిచే పిసినారితనం ఇక్కడ కూడ కనబడుతోంది. మెరుగైన విద్యా బోధనను అందించడానికి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది తప్పనిసరి అవసరం. కాని తరగతులతో నిమిత్తం లేకుండా 30 మందికి ఒక ఉపాధ్యాయుడనే ప్రమాణాన్ని పెట్టడం వలన ఇప్పుడున్న బహుళ తరగతి బోధన విద్యా హక్కు చట్టం వచ్చిన తరువాత కూడా కొనసాగుతుందని అర్థం. అలాగే తరగతికి ఒక గది అని కూడా ఉపాధ్యాయునికి ఒక గది అనడం వలన కూడా మెరుగైన వసతి లేకుండా పోయింది. అనేక కారణాల వలన ఇప్పటికే తక్కువ స్థాయి ప్రమాణాలతో ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా బోధన ఇక ముందు కూడా అలాగే కొనసాగుతుందని అర్థం.

ఈ చట్టంలో ప్రభుత్వ పాఠశాల, స్థానిక సంస్థల పాఠశాల, ఎయిడెడ్ పాఠశాల, ప్రత్యేక తరహా పాఠశాలలతో పాటు అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలలకు కూడా చోటు ఉంది. అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాల వసూలు చేసే ఫీజు మీద నియంత్రణ ఏదీ లేదు. కాకపోతే ఆ ఫీజును ప్రకటించకుండా వసూలు చేయకూడదు. అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాల తన సీట్లలో 25 శాతం సీట్లను పేద కుటుంబాల పిల్లలకు ఇవ్వాలి. ఈ పిల్లల స్కూలు ఫీజులు ప్రభుత్వమే కడుతుంది. ఇది ఇంతకు ముందు చెప్పబడిన పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌కు ఒక రూపం. ప్రభుత్వ నిధులను ప్రైవేట్ యాజమాన్యాలకు తరలించి, ప్రభుత్వ పాఠశాలలను నిరుత్సాపరిచే చర్య ఇది.

పాఠశాలల వ్యవహారాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పాత్రను చట్టంలో పెంచారు. ఈ కమిటీ పాఠశాలను పర్యవేక్షిస్తుంది. విద్యార్థుల మీద, ఉపాధ్యాయుల మీద కొంతమేరకు అజమాయిషీని కలిగి ఉంటుంది. పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తుంది.

0–5 సంవత్సరాల మధ్యనున్న బాలబాలికలకు విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించని ఈ చట్టంలో పూర్వ ప్రాథమిక విద్యను మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని చెప్పింది. జాతీయ పాఠ్య ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తుందనీ, దాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు తమ విద్యా ప్రణాళికలను రూపొందించుకోవాలనీ, ఎలిమెంటరీ విద్యను సాధ్యమైనంత వరకు మాతృ భాషలోనే చెప్పాలనీ, బడిలో చేరనివారు, బడిలో చేరి మధ్యలో మానివేసినవారు ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలనీ, విద్యా హక్కు చట్టం అమలును పర్యవేక్షించడానికి జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ సలహా సంఘాలను ఏర్పాటు చేయాలనీ, ఈ చట్టాన్ని అమలు చేయడానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలనీ ఈ చట్టం చెప్పింది. దేశ విద్యారంగ చరిత్ర తెలియని వారికి, బాలబాలికల విద్య పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక దశాబ్దాలుగా చూపుతూ వచ్చిన నిర్లిప్త వైఖరి తెలియని వారికి ఈ చట్టం ఒక అద్భుతంగానే కనబడుతుంది. కాని ఇలాంటి అద్భుతాలను జీవచ్ఛవాలుగా మార్చివేయగల నైపుణ్యం మన ప్రభుత్వాలకు పుష్కలంగా ఉంది.

అనేక పార్శ్వాలుగా ఉన్న సామాజిక జీవితంలో విద్యారంగం కీలకమైంది. సంపదను ఉత్పత్తి చేసే నైపుణ్యాన్ని మనుషులకు ఇచ్చేది విద్యయే. మానవ సంబంధాలను అర్థవంతమైన రీతిలో కొనసాగించడంలో విద్య బాగా ఉపయోగపడుతుంది. దేశీయమైన ప్రకృతి సంపదను, మానవ వనరులను దేశీయమైన అభివృద్ధి కొరకు ఉపయోగించుకునే క్రమంలో విద్య మనుషులను అందుకు తగిన విధంగా తయారు చేయాలి. విద్య మీద స్వదేశీ, విదేశీ గుత్త సంస్థల ఆధిపత్యం వారి ప్రయోజనాలను కాపాడడానికే పనికి వస్తుంది. అందుకే విద్యారంగం మీద ఆధిపత్యం కొరకు పురాణ కాలం నుండి పాలకవర్గాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. మెకాలే విద్యా విధానం గురించి మనకు తెలిసిందే. విద్యారంగం లాభసాటియైన వ్యాపార రంగంగా మారిన ఈ కాలంలో, వివిధ కార్పొరేట్ సంస్థలు విద్యారంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్న ఈ కాలంలో, విద్యారంగంలోకి నేరుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తూ బహుళజాతి సంస్థలకు ఊడిగం చేయడానికి మన ప్రభుత్వాలు ఉబలాటపడుతున్న ఈ కాలంలో పేద ప్రజలకు నిజంగా ఉపయోగపడగల విద్యారంగం గురించి మనం ఆలోచించాలి. సామాజిక అంతరాలకు తావులేని, పేదలు, సంపన్నులు ఒకేరకమైన అవకాశాలతో, వసతులతో చదువుకోగలిగే కామన్ స్కూల్ విద్యా విధానం, విద్యా హక్కును పేద ప్రజల అనుభవంలోకి, జీవితంలోకి తీసికొనివస్తుంది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా, జపాన్ దేశాలలోని పెట్టుబడిదారీ వ్యవస్థలు తమ దేశస్తులకు తరతమ భేదాలతో కూడిన కామన్ స్కూల్ విధానాన్ని ఇస్తూ, భారతదేశం వంటి దేశాల్లో విద్యారంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడంలోని దుర్మార్గాన్ని మన దళారీ పాలకవర్గ ప్రభుత్వాలు ఆమోదిస్తున్నాయి. పాఠశాల విద్యను

పట్టణాలకు వలసలు పెరగడంతో పెరిగిన జనాభాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఉద్దేశించిన జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. పథకాన్ని వివరిస్తున్నారు **ఎస్. సరళ వందనం**

జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ నవీకరణ పథకం

ప్రజల పెరుగుతున్న అవసరాల కోసం, మెరుగైన జీవితం కోసం, జీవనోపాధి కోసం గ్రామాల నుండి పట్టణాలకు, ఒక పట్టణం నుండి ఇంకో పట్టణానికి, నగరాలకు వలసలు రావడం అనేది ఒక అవసరంగా మారింది. వర్షాధారపు పంటలు పండే ప్రాంతాలలో ఉండేవారు, బతకడానికి కూడ తక్కువ ఆదాయం వచ్చే ప్రాంతాలలో నివసించేవారు, ప్రాంతీయ అసమానతల వలన కూడా ఎక్కువగా వలసలు వెళ్లే అవకాశాలుంటాయి. ఈ వలస వెళ్లడం అనేది కుటుంబాలలోను, వ్యక్తులుగాను; తాత్కాలికంగాను, సీజనల్‌గాను, శాశ్వతంగా కూడా జరుగుతోంది.

పై కారణాలే కాక ఇంకో కోణంలో పరిశీలిస్తే కూడా ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామాలలో ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోయి, పట్టణీకరణ ఫలితంగా సమాచార వ్యవస్థ బాగా అభివృద్ధి చెందడం, రవాణా సౌకర్యాలు మెరుగుపడడం వలన కూడా పట్టణాలకు పేద ప్రజలు వలస వస్తున్నారు.

ఇలా వచ్చిన పేద ప్రజలకు పట్టణాలలో సేవారంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉండడం, అతి తక్కువ పెట్టుబడితో మెరుగైన జీవితం జీవించే అవకాశాలుండడం, ముఖ్యంగా గ్రామాలలో ఉండే కుల సంస్కృతిని అధిగమించి అవకాశాలు గుర్తింపు లభించడం వలన కూడా గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసరావడం అనేది తమ కుటుంబాలు మెరుగైన జీవితం జీవించడానికి ఒక అనివార్యమైన జీవన విధానం అనుకుంటున్నారు.

దేశం మొత్తంలో ఈ వలసలు అనేవి సర్వసాధారణం అయినాయి. కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా బీహార్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌ల నుండి ధనవంతమైన వేరే రాష్ట్రాలలోని పట్టణాలకు, నగరాలకు పేద ప్రజలు ఎక్కువగా వలసలు వెళ్తుంటారు. కాని మన రాష్ట్రంలోని వారు మాత్రం ఎక్కువగా మన రాష్ట్రంలోని పట్టణాలకు, నగరాలకు వలసలు వెళ్లడానికే మొగ్గుచూపుతుంటారు.

ఇలా పట్టణాలకు, నగరాలకు వలసలు వచ్చేవారు కూలీలుగా, చిన్న ఉద్యోగులుగా, వాచ్‌మెన్‌లుగా, సెక్యూరిటీగార్డులుగా, చిన్న చిన్న నైపుణ్యం ఉన్న ఉద్యోగాలలోను, ఇంటి పనిమనుషులుగాను, వీధి వ్యాపారులుగాను, నిర్మాణరంగ కార్మికులుగాను, డ్రైవర్‌లుగాను ఎక్కువగా జీవనోపాధి పొందుతున్నారు.

ఇలా పట్టణాలకు వలసవచ్చి జీవనోపాధి వెతుక్కునేవారికి, స్థిరపడదామనుకునేవారికి ఉండడానికి సరైన ఇల్లు, తాగడానికి పరిశుభ్రమైన నీరు, కరెంట్, విసర్జనశాలల సదుపాయం, పనిచేసే చోటకు సరైన రవాణా సౌకర్యాలు, పిల్లలకు విద్య వారు భరించగలిగే ఖర్చులో లభించకపోవడం వలన వీరు ఎక్కువగా మురికివాడలలో నివసిస్తూ ఉన్నారు.

జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్.ఎస్.ఎస్.ఒ.) జూలై 2002 నుండి డిసెంబర్ 2002 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా మురికివాడలలో నివసించేవారి పరిస్థితిపై జరిపిన సర్వే ప్రకారం అప్పటికి పట్టణాలలో ఉన్న సుమారు 52,000 మురికివాడలలో దాదాపు 82 లక్షల కుటుంబాలు ఏ కనీస సదుపాయాలు లేకుండా నివసిస్తున్నట్లుగా అంచనా వేసింది. మురికివాడలలో నివసించే పేద ప్రజలు పట్టణాలలో నివసించే మొత్తం కుటుంబాలతో పోల్చితే 14 శాతం మంది ఉన్నారు. ఈ సంఖ్య మహారాష్ట్రలో అధికంగా 32 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 16 శాతం,

---

కూడా గ్యాట్స్ ఒప్పందంలో చేర్చడం ద్వారా మన విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ విపణిలో పెట్టింది. పాఠశాల విద్యను గ్యాట్స్ ఒప్పందం నుండి తొలగించాలి. విద్యారంగం మీద పెట్టే పెట్టుబడి అంతిమ పరిశీలనలో ఉత్పాదక వ్యయమే అవుతుంది. కాబట్టి విద్యారంగానికి జిడిపిలో కనీసం 6 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో 30 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలి. పూర్వ ప్రాథమిక విద్యను, +2 స్థాయి వరకు విద్యను బాలబాలికలందరికి ఉచితంగా అందించాలి. అన్ని పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించాలి. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌ను దాని అన్ని రూపాల్లో నిరోధించాలి. మాతృభాషలో విద్యా బోధన ఉండాలి. ఆ విధంగా చదువుకున్న వారికి ఉద్యోగాల విషయంలో ప్రాధాన్యం ఉండాలి. తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత విస్తరించి, పేద విద్యార్థులకు మంచి పోషకాహారాన్ని అందించాలి. పేదరిక నిర్మూలన కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలి. కామన్ స్కూల్ కొరకు, విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయింపు కొరకు, ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా బలోపేతం చేయడం కొరకు, విద్యా వ్యాపారాన్ని అరికట్టడం కొరకు ఒక విద్యారంగ ఉద్యమ ఆవశ్యకతను ఆలోచనాపరులు గుర్తించవలసి ఉంది.

(రచయిత ప్రధాన కార్యదర్శి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) వీ

మూడో స్థానంలో ఉన్న మన రాష్ట్రంలో 15 శాతం ప్రజలు మురికివాడలలో నివసిస్తున్నారు.

పై కారణాల వలన, ఇంకా ఈ నిష్పత్తి భవిష్యత్తులో రోజు రోజుకూ పెరుగుతూండడం వలన పట్టణ పేద ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు సమకూర్చడం అనేది ప్రభుత్వానికి ఒక నిరంతర ప్రక్రియగా మారింది. ఇందులో భాగంగానే చిన్న, మధ్యంతర పట్టణాల సమగ్రాభివృద్ధి పథకం ద్వారా 1980 నుంచి 2006-07 వరకు గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వచ్చేవారికి కావలసిన ఉద్యోగావకాశాలు కల్పించడం, మార్కెట్ల సౌకర్యం, సర్వీసులు కల్పించింది.

1992 నుంచి ఎచ్.యు.డి.సి.ఒ. నుంచి రుణం ద్వారానూ కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ, లబ్ధిదారుని వాటా ద్వారా రు. 239.25 కోట్ల ఖర్చులో ఐదు లక్షల పట్టణ ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం ఐ.ఎల్.సి. పథకం ద్వారా కల్పించింది. ఇంకా మిగిలిన 2,21,901 మంది అర్హులలో ఇప్పటికి 59,111 మందికి మాత్రమే నిర్మించాల్సి ఉంది.

మెగాసిటీల సమగ్ర అభివృద్ధి పథకం ద్వారా 1993-94 నుండి హైదరాబాద్‌లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది.

ఎ.పి. అర్బన్ సర్వీసెస్ ప్రాజెక్ట్ (ఎ.పి.యు.ఎస్.పి.) పథకం ద్వారా డి.ఎఫ్.ఐ.డి. నిధుల ద్వారా రాష్ట్రంలో 32 పట్టణాలలో ఆటంకాలు లేని నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కులు, ఆటస్థలాల అభివృద్ధి, నాలుగు రోడ్ల కూడళ్లు, సర్కిళ్ల అభివృద్ధి, పట్టణ పేద ప్రజల పేదరికం తగ్గించడం లాంటి పథకాలను అమలు చేసింది. ఈ పథకాల అమలు వలన పట్టణ పేద ప్రజల పూర్తి అవసరాలు తీర్చలేకపోవడం వలన, భవిష్యత్ అవసరాలు పెరగడం వలన ఇంకా అభివృద్ధి జరగాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది.

అభివృద్ధి ఫలాలు అందరినీ కలుపుకుపోయే విధంగా ఉండాలని, పట్టణాలు, నగరాలు సమతుల్య ప్రగతి తద్వారా ఆర్థిక సమగ్రతను సాధించడానికి, నగరాల, పట్టణాల భవిష్యత్తు అవసరాలు తీరడానికి కూడా అనుగుణంగా ఉండే ప్రణాళికలు అమలుపరిచే విధంగా ఉండే అవసరాన్ని భారత ప్రభుత్వం గుర్తించి, ఈ లక్ష్యాలను సాధించడానికి 2005 నుండి 2012 మధ్య అమలయ్యే విధంగా 'జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ నవీకరణ పథకం' పేరుతో పట్టణాల, నగరాల సమగ్రాభివృద్ధి సాధించాలని నిర్ణయం తీసుకుంది.

ఈ జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం.) పథకంలో మూడు రకాలైన విధానాలు అవలంబిస్తారు :

1. పట్టణాల, నగరాల ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు అవసరాలను తీర్చే విధంగా (కనీసం 25 సంవత్సరాలు) ప్రాజెక్టులు చేపట్టడం.

2. సంస్కరణల ద్వారా పట్టణ పరిపాలన, ప్రణాళికలు పారదర్శకంగానూ, ప్రజలకు జవాబుదారీగాను ఉండి ప్రజల భాగస్వామ్యంతోనే నడవడం, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో (పిపిపి) ప్రాజెక్టులను ప్రోత్సహించడం ప్రజలు సకాలంలో పన్నులు కట్టే విధంగా చూడడం, ఇంకా 23 రకాల సంస్కరణలను ఏడు సంవత్సరాలలో అమలు చేయడం.

3. పట్టణాలు, నగరాలు తమ అవసరాలను తామే తీర్చుకొనే విధంగా ఆర్థిక స్వావలంబన సాధించడం.

పై మూడు రకాలైన విధానాలను అమలుపర్చడానికి దేశంలో 63 నగరాలను మిషన్ సిటీలుగాను, ఇతర 636 చిన్న, మధ్యతరగతి పట్టణాలను నాన్ మిషన్ సిటీలుగా ఎంపిక చేశారు. ఈ పథకాన్ని భారత ప్రభుత్వ పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా, పట్టణ గృహ నిర్మాణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేయాలని నిర్ణయించారు.

ఈ జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. లో ఏ పథకంలోనైనా 40 శాతం నిధులు పట్టణ పేద ప్రజల అవసరాలు తీర్చడానికి, ముఖ్యంగా గృహ నిర్మాణాలకు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి కేటాయించాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమం అమలు చేయడానికి మన రాష్ట్రంలో నగరాలైన హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడలను మిషన్ సిటీలుగా ఎంపిక చేశారు. 2009 నుండి తిరుపతిని కూడా మిషన్ సిటీగా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నాన్ మిషన్ సిటీలుగా 77 పట్టణాలను ఎంపిక చేశారు.

నగరాభివృద్ధికి సంబంధించి ఎంపిక చేయబడిన నగరాలలో రెండు ఉప పథకాల ద్వారా పట్టణాల సమగ్రాభివృద్ధి సాధించాలని నిర్ణయించారు. అవి :

1. పట్టణ పేద ప్రజల కనీస అవసరాల కల్పన (బేసిక్ సర్వీసెస్ టు ది అర్బన్ పూర్ - బి.ఎస్.యు.పి.)

2. పట్టణ మౌలిక వసతుల కల్పన, పరిపాలన. (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ గవర్నెన్స్ - యు.ఐ. అండ్ జి.)

పట్టణాభివృద్ధికి సంబంధించి ఎంపిక చేయబడిన వాటిలో కూడా రెండు పథకాల ద్వారా పేద ప్రజల అవసరాలు, పట్టణ సమగ్రాభివృద్ధిని సాధించవచ్చని నిర్ణయించారు. అవి -

1. ఐ.ఎచ్.ఎస్.డి.పి. (ఇంటిగ్రేటేడ్ హౌసింగ్ అండ్ స్లమ్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రాం) సమగ్ర గృహనిర్మాణ, మురికివాడల అభివృద్ధి కార్యక్రమం.

2. యు.ఐ.డి.ఎస్.ఎస్.ఎం.టి. (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ స్కీం ఇన్ స్మాల్ అండ్ మార్జినల్ టౌన్స్)

భారత ప్రభుత్వం ఈ పథకం అమలులో పట్టణ పేద ప్రజలకు తప్పనిసరిగా తీర్చాల్సిన అవసరాలు ఏడు ఉన్నట్లుగా గుర్తించింది. అవి వరుసగా

1. పట్టణ పేద ప్రజల అవసరాలకు భూమిని సేకరించడం. వారికి భూమిపై హక్కు కల్పించడం.

2. అర్హులైన పట్టణ పేద ప్రజలందరికీ గృహ నిర్మాణం చేపట్టడం. వాటికి మౌలిక వసతులు కల్పించడం.

3. మురికివాడలలో నివసించే వారందరికీ మంచినీటి సరఫరా, కొత్త కుళాయిలను రెండు వందల రూపాయలకే మంజూరు చేయడం, విద్యుచ్ఛక్తి సదుపాయం కల్పించడం.

4. మురుగునీరు కాలువలు. ఘనవ్యర్థం నిర్వహణ, అందరికీ మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించడం.

5. పట్టణ పేద ప్రజల పిల్లలకు విద్యనందించడం కోసం వారు నివసించే చోటే అంగన్‌వాడీ బడులు, ప్రాథమిక పాఠశాలలు నిర్మించడం, ఉన్నత విద్యకు అనుసంధానించడం.

6) అందరికీ వైద్య సదుపాయాలు అందజేయడం.

7) అర్హులైన పట్టణ పేద వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు, నేత కార్మికులకు పెన్షన్లు అందజేయడం, జనశ్రీ బీమా యోజన పథకాన్ని వర్తింపజేయడం, అందరి ఉమ్మడి అవసరాలకు కమ్యూనిటీ హాళ్లు, వారు నివసించే చోట మార్కెట్లు, సంతలు ఏర్పాటు చేయడం.

పైన పేర్కొన్న ఏడు రకాలైన అవసరాలు తీర్చడానికి ఇంతకు ముందే చెప్పినట్లుగా 40 శాతం నిధులు ఖర్చుపెట్టాలి.

ఇవికాకుండా పట్టణాలలో, నగరాలలో మంచినీటి పథకాలను పునరుద్ధరించడం, కొత్త వాటిని చేపట్టడం, మురుగునీటి పారుదల వ్యవస్థలను బాగు చేయడం, మరమ్మతులు చేపట్టడం, అవసరమైన చోట్ల కొత్తవి చేపట్టడం; వరదనీటి కాలువ పనులు, మరమ్మత్తులు; రవాణా సౌకర్యాల కల్పన; పురాతన కట్టడాలు సంరక్షించడం వంటి కార్యక్రమాలు యు.ఐ. అండ్ జి., యు.ఐ.డి.ఎస్.ఎస్.ఎం.టి.ల ద్వారా చేపట్టాలని నిర్ణయించారు.

భారతదేశ ఆర్థికశాఖ మంత్రి ప్రణబ్ ముఖర్జీ 2010-11 బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశపెడుతూ, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. పథకం అమలు గురించి కింద తెలిపిన విధంగా ప్రస్తావించారు.

'పట్టణ మౌలిక వసతుల పరిపాలన కార్యక్రమం (యు.ఐ. అండ్ జి.) ద్వారా దేశంలోని 63 మిషన్ సిటీలకు రు. 53,038 కోట్ల రూపాయల నిధుల అంచనాలతో 515 ప్రాజెక్టులకు ఆమోదించడం జరిగిందనీ, 2005 నుండి డిసెంబర్ 2009 వరకు రు. 10,261.7 కోట్ల నిధులను ఈ పథకానికి విడుదల చేయడం జరిగిందనీ' అన్నారు.

ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడ కూడా పట్టణ పేద ప్రజల అవసరాలు, వారికి మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన రాలేదు.

ఈ నేపథ్యంలో మన రాష్ట్రానికి సంబంధించి పేర్కొన్న 4 ఉప పథకాల అమలు గురించి తెలుసుకుందాం.

ముందుగా మిషన్ సిటీలకు సంబంధించిన బి.ఎస్.యు.పి. ఉప పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గుడిసెలలో నివసించే పేదవారిని, కబ్జా ఇళ్లలో నివసించేవారిని, అభ్యంతరకరమైన ఆక్రమణలలో నివసించేవారిని, అద్దె ఇళ్లలో నివసించే పేదవారిని అర్హులుగా నిర్ణయించారు. వీటిలో నివసించే పేద ప్రజల నుండి గృహ నిర్మాణాన్ని కోరుతూ వచ్చిన 6,17,248 అర్జీలను విచారణ జరిపిన తరువాత అందులో 5,30,845 మంది అర్హులుగా మిగిలారు. వీరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణానికి గాను ఇప్పటికి 1,34,694 లబ్ధిదారులకు రు. 3011.97 కోట్ల అంచనాలతో ఉత్తర్వులు లభించాయి. ఇందులో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. నిధుల వాటా రు. 1620.83 కోట్లు.

ముందుగా ఒక్కొక్క మిషన్ సిటీలో గృహాలు ఎన్ని పూర్తయినాయి, ఎంత నిధులు ఖర్చు పెట్టారు అనేది కింద పట్టికలో చూడండి.

బి.ఎస్.యు.పి.

	మంజూరైన గృహాలు	నిర్మాణంలో ఉన్న గృహాలు	పూర్తైన గృహాలు	విడదలైన మొత్తం (రు.కోట్లలో)
గ్రేటర్ హైదరాబాద్	65,534	26,302	8432	381.27
గ్రేటర్ విశాఖ	37,000	18,646	2176	239.55
విజయవాడ	28,160	18,160	8192	217.93
మొత్తం	1,34,694	63,108	18,800	838.75

జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. నిధులు 2009-10 కి రు. 1497.42 కోట్లు పొందడానికి అర్హత ఉండగా ఇప్పటికి రాష్ట్రం ఈ పథకాన్ని అమలుపరిచే రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజన్సీ ద్వారా రు. 736.93 కోట్లు మాత్రమే రాబట్టుకోగలిగింది. ఈ నిధులలో కూడా కేంద్ర వాటా నిధులు ఫిబ్రవరి మాసాంతరానికి రు. 599.11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

గృహనిర్మాణం చేపట్టడం అనేది ఈ పథకం అమలు పూర్తయ్యే 2012 లోపు అసాధ్యంగా కనపడుతోంది. ఈ ఐదు సంవత్సరాలలో ఇంకా 50,000 మందైనా కొత్తగా లబ్ధి పొందడానికి అర్హులై ఉంటారు. టెండర్ల ప్రక్రియలు ఆలస్యం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ఆలస్యానికి కారణంగా ప్రభుత్వం పేర్కొని కూడ, పట్టణ పేద ప్రజలకు వారి జీవనోపాధి లభించే చోట్ల కాకుండా చాలా దూరంగా గృహ నిర్మాణాలను చేపట్టడం, అందువలన లబ్ధిదారులకు ఆసక్తి లేకపోవడం ఆలస్యం కావడానికి ఒక ముఖ్యమైన కారణమే.

యు.ఐ. అండ్ జి. ప్రాజెక్టుల అమలు తీరును పరిశీలిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో రు. 843.91 కోట్ల నిధులతో 2008-09 కి 6 ప్రాజెక్టులు పూర్తయినాయి. అవి ఏమిటంటే పట్టణ పేదలకు ఉపయోగపడని 1) సాహెబ్‌నగర్ నుంచి ప్రశాసన్‌నగర్‌కు నీటి సరఫరా కోసం పైపులైన్ వేయడం; 2) కృష్ణా నీటిని సికిందరాబాద్‌కు మళ్లించడం; 3) కృష్ణా మంచినీటి పథకం ఫేజ్ - 2; రవాణా సౌకర్యాల కల్పనకు ఉద్దేశించిన నిధుల కింద 4) గ్రీన్‌లాండ్స్ ఫ్లై ఓవర్; 5) రాజీవ్‌గాంధీ సర్కిల్ ఫ్లై ఓవర్; 6) చంద్రాయణగుట్ట ఫ్లైఓవర్‌లు నిర్మించడం పూర్తయినాయి.

గ్రేటర్ హైదరాబాద్ నగరానికి మంజూరయిన మిగిలిన 16 ప్రాజెక్టులలో పట్టణ పేద ప్రజలకు ఉపయోగపడే పాత నగరంలోని మురుగు నీటి పారుదల వ్యవస్థ పనులు, విద్యుచ్ఛక్తి సరఫరా మెరుగు చేయడం, కూకట్‌పల్లి, బేగంపేట నాలా భూగర్భ మురికినీటి పారుదల వ్యవస్థను బాగు చేయడం వంటి సామాన్య ప్రజలకు అవసరమైనవి చాలా నిదానంగా జరుగుతున్నాయి. ఇవేకాక మూసినది ప్రక్షాళన, శేరిలింగంపల్లి మురుగునీటి మాస్టర్ ప్లాన్ పనులు కూడా చాలా నిదానంగా జరుగుతున్నాయి.

ఇవి కాకుండా రవాణా సౌకర్యాలు కల్పించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఏపిఎస్ఆర్‌టిసి) 1000

బస్సులను తమ సంస్థకు అవసరం అని కోరగా, మొదటిదశలో 125 బస్సులను రాష్ట్రంలోని హైదరాబాద్, విజయవాడ నగరాలకు విడుదల చేయడం జరిగింది.

2009 నుండి అదనంగా మిషన్ సిటీ జాబితాలో చేర్చబడిన తిరుపతి పట్టణానికి రు. 76.82 కోట్లు అంచనాతో రెండు ప్రాజెక్టులకు నిధులు మంజూరు కాగా రు. 25.98 కోట్ల పనులు మాత్రమే ఫిబ్రవరి మాసాంతానికి పూర్తయినాయి.

2009-10 మార్చ్ నాటికి 4 మిషన్ సిటీలకు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలన (యు.ఐ. అండ్ జి.) ద్వారా మంజూరయిన ప్రాజెక్టులు, వాటికి మంజూరయిన నిధులు ఇప్పటివరకు పూర్తయిన పనులకు ఖర్చు చేసిన నిధులను కింది పట్టిక ద్వారా తెలుసుకుందాం.

నగరం	మంజూరైన ప్రాజెక్టులు	మంజూరైన నిధులు (రు. కోట్లలో)	నిర్మాణంలో ఉన్నవి	పూర్తైనవి	విడుదలైన నిధులు (రు. కోట్లలో)
గ్రేటర్ హైదరాబాద్	22	2798.71	16	6	664.71
గ్రేటర్ విశాఖ	11	1544.65	7	2	424.83
విజయవాడ	8	855.85	4	2	210.01
తిరుపతి	2	76.82	2	-	25.98
మొత్తం	**43**	**5276.03**	**29**	**8**	**1325.53**

మన రాష్ట్రంలో మిషన్ సిటీలు కాకుండా ఇంతకు ముందు చెప్పినట్లుగానే మరో రెండు పథకాల ద్వారా పట్టణ పేద ప్రజలకు గృహ నిర్మాణాలు చెపట్టడంతో పాటు, మురికివాడల అభివృద్ధి, పట్టణాల సమగ్రాభివృద్ధి చేపట్టాలని నిర్ణయించారు.

1. సమగ్ర గృహ నిర్మాణ, మురికివాడల అభివృద్ధి కార్యక్రమం (ఐ.ఎచ్.ఎస్.డి.పి.)

మన రాష్ట్రంలోని 77 చిన్న, మధ్యతరగతి పట్టణాలలో మొత్తం 47,896 గృహాలు లబ్ధిపొందే విధంగా గృహ నిర్మాణం, మురికివాడల అభివృద్ధికి రు. 1139.09 కోట్ల నిధులు జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. ద్వారా మంజూరు చేశారు. ఈ పథకానికి 80 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు, 20 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంఘాలు సంయుక్తంగా భరించాలి. ఒక్కొక్క గృహ నిర్మాణానికి రు.1,10,000 విలువగా 2009-10 కి అంచనా వేశారు.

చిన్న, మధ్యతరగతి పట్టణాలలో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. ద్వారా అమలు చేసే రెండో పథకం యు.ఐ.డి.ఎస్.ఎస్.ఎం.టి. ఈ పథకం ద్వారా మన రాష్ట్రానికి 101 ప్రాజెక్టులు (పనులు) మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడానికి, వరద నీటి కాలువలను పునర్ వ్యవస్థీకరించడానికి, మంచినీటి సరఫరాకు, రవాణా సౌకర్యాలు కల్పించడానికి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఘనవ్యర్థాల స్థిరీకరణ) ప్రాజెక్టులు చేపట్టడానికి చిన్న, మధ్యతరగతి పట్టణాలకు రు.3107.25 కోట్ల నిధులకు ఉత్తర్వులు మంజూరు చేశారు. ఇప్పటికి రు. 51.03.76 కోట్లు మాత్రమే వినియోగించడం జరిగింది. ముఖ్యంగా సాలిడ్ స్టేట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు, భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థలు నిర్మించడం, మంచినీటి సరఫరా పథకాల పనులు ఇంకా 30 శాతం మాత్రమే పూర్తయినాయి.

ఈ జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. పథకం అమలును మన రాష్ట్రంలో పరిశీలిస్తే మొత్తం బి.ఎస్.యు.పి., యు.ఐ. అండ్ జి., ఐ.ఎచ్.ఎస్.డి.పి., యు.ఐ.డి.ఎస్.ఎస్.ఎం.టి. కార్యక్రమాలకు మిషన్ సిటీలు, నాన్ మిషన్ సిటీలకు కలిపి రు. 12,534.29 కోట్ల నిధులతో ప్రాజెక్టులు అమలు చేయమని ఉత్తర్వులు ఇచ్చినా కూడా, 2010 ఫిబ్రవరి మాసాంతానికి కేవలం రు. 4021.13 కోట్ల నిధుల పనులు మాత్రమే పూర్తయినాయి.

ఇందులోను ముఖ్యంగా పట్టణ పేద ప్రజల అవసరాలు తీర్చే బి.ఎస్.యు.పి., ఐ.ఎచ్.ఎస్.డి.పి. పథకాలకు రు. 4151.06 కోట్ల నిధులు ఖర్చు చేయడానికి ప్రాజెక్టులు మంజూరయినా ఫిబ్రవరి మాసాంతానికి కేవలం రు. 1292.86 కోట్ల నిధులతో పనులు పూర్తి చేశారు. అంటే ఈ నాలుగున్నరేళ్లలో మొత్తం మంజూరయిన రు. 12,534.29 కోట్ల నిధులకు గాను పట్టణ పేద ప్రజలకు వెచ్చించింది రు. 1292.86 కోట్లు మాత్రమే. 40 శాతం నిధులు పట్టణ పేద ప్రజలకు కేటాయించాల్సి ఉండగా కేవలం పది శాతం పనులకు మాత్రమే నిధులు ఇంకో రెండు సంవత్సరాలలో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. పథకం ముగుస్తుందనగా ఖర్చు చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేడర్‌కు చెందిన పి.కె. మొహంతి, ఐ.ఎ.ఎస్. లాంటి పరిపాలనా దక్షత కలిగిన అధికారి మిషన్ డైరెక్టర్ ఈ పథకానికి ఉన్నారు. మహారాష్ట్ర తరువాత మన రాష్ట్రానికి పట్టణ పేద ప్రజల నిష్పత్తికి తగినట్లుగా ప్రాజెక్టులకు కేంద్ర నిధుల విడుదలకు మంజూరు ఉత్తర్వులు జారీ చేసినా క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు, పట్టణ పరిపాలనా సంస్థల పనితీరులో లోపాలు సమగ్ర పట్టణాభివృద్ధి సాధించాలనే లక్ష్యాలకి భంగం వాటిల్లే విధంగా ఈ పథకం అమలు జరుగుతూ ఉంది. కనీసం మిగిలిన రెండు ఆర్థిక సంవత్సరాలలోనైనా పట్టణ పేద ప్రజలకు కావలసిన 5,30,845 గృహాలు నిర్మించడం, మురికివాడలలో నివసించే పట్టణ పేద ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. లక్ష్యాలను సాధించాలని ఆశిద్దాం.

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ అధికారి) వీ

పురపాలక, పోలీసు, ప్రభుత్వ వైఫల్యాలతోనూ, తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చే లక్ష్యంతోనూ హైదరాబాద్‌లో ఇటీవలి అల్లర్లు చెలరేగాయని అంటున్నారు **యాటెల్లి రామచంద్రం**

హైదరాబాద్ అల్లర్ల వెనుక అసలు ఉద్దేశాలు

హైదరాబాద్‌లో ఇటీవల వరుసగా మిలాద్ ఉన్ నబీ, హనుమాన్ జయంతుల సందర్భంగా కట్టిన జెండాల కారణంగా అల్లర్లు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. అల్లర్ల కారణంగా హైదరాబాద్ మళ్లీ ఒకసారి ఉలిక్కి పడింది. విశ్వాసాలకు సంబంధించిన పండుగల సందర్భంగా జెండాలు, బ్యానర్లు కట్టడం ఇటీవల అనవాయితీగా వస్తోంది. అల్లర్లకు ప్రధాన కారణంగా చెబుతున్న జెండాల వివాదం మామూలు విషయం. ఇటువంటి గొడవలు వచ్చినపుడు ఇరువర్గాలకు సంబంధించిన పెద్దలు సామరస్యంగా పరిష్కరించుకుంటే సమసిపోతాయి. ప్రజల రోజు వారి సమస్యలను, వారి ఆకాంక్షలను తీర్చలేని రాజకీయ పక్షాలు తమ మనుగడ ప్రశ్నార్థకం అవుతున్నప్పుడు ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతున్నాయని ప్రజలు గుర్తిస్తున్నారు.

హైదరాబాద్ నగర చరిత్రను తిరగేస్తే 1978లో రమీజాబి కేసు మతకలహాలకు ఆజ్యం పోసింది. అప్పటి నుండి అడపా దడపా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. 1984లో గణేశ్ నిమజ్జనం రోజున జరిగిన అల్లర్లను అదుపుచేయడానికి జంటనగరాలు, శివారు ప్రాంతాల్లోని 50 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కర్ఫ్యూ విధించారు. పది రోజులపాటు కర్ఫ్యూ కొనసాగి ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. 1990 డిసెంబర్‌లో ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి ఉన్నప్పుడు రౌడీషీటర్ సర్దార్‌ను ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపడంతో మతకలహాలు రగలగా, దానికి రాజకీయ నాయకులు, తమ ప్రయోజనాలకోసం ఆజ్యం పోశారు. అప్పుడు జరిగిన అల్లర్లలో 150 మంది మృతి చెందగా 500 మంది వరకు గాయపడ్డారు. ఆనాడు జరిగిన అల్లర్లు ప్రధానంగా అధికార మార్పిడికోసం జరిగినవని ప్రజల్లో బలమైన అభిప్రాయం ఉంది. 1992 డిసెంబర్ 6న బాబ్రి మసీద్ కూల్చివేసినపుడు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. 2007లో మక్కా మసీదు, గోకుల్ చాట్, లుంబినీ పార్క్‌లలో బాంబుల పేలుళ్లు జరిగి అనేక మంది మరణానికి కారణమాయ్యాయి. ప్రజలు ఎంతో సంయమనంతో వ్యవహరించారు.

మార్చ్ 27 రాత్రి హుస్సేని ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలోని మూసాబౌలిలో శ్రీరామనవమి ఊరేగింపు సందర్భంగా జెండాలు కట్టడానికి మిలాద్ ఉన్ నబీకి కట్టిన జెండాలు తొలగిస్తుంటే వివాదం మొదలైంది. అధికార యంత్రాంగం ఆ అల్లర్లను సకాలంలో నివారించకపోవడం వల్ల మిగతా ప్రాంతాలకు విస్తరించాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన దాడులు, ప్రతి దాడులతో నగరంలోని ప్రజలు తీవ్ర అభద్రతకులోనయ్యారు. అల్లర్ల కారణంగా 25 పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ, నగరమంతటా 144 సెక్షన్ విధించారు. 144 సెక్షన్ ఉండగానే హనుమాన్ జయంతి ఊరేగింపుకు అనుమతి ఇవ్వడం పరిస్థితిని మరింత దిగజార్చింది. అల్లర్ల కారణంగా ముగ్గురు చనిపోయారు. వంద మందికి పైగా గాయపడ్డారు. మూడు వందల తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. దాడుల్లో ప్రజల విశ్వాసాలకు సంబంధించిన ఆలయాలు, మసీదులు కూల్చివేశారు. 12 రోజుల కర్ఫ్యూ కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజూ ఎదో పనిచేసుకుంటేనే దినం గడవడం కష్టంగా ఉండే జీవితాలకు పని లేకుండా తిండి గడవడం కష్టమే. దానికి తోడు కర్ఫ్యూ. కర్ఫ్యూ సడలింపు సమయాల్లో అమ్మే వస్తువుల ధరలు సామాన్యులకు వినడానికే భయం వేసేంతగా పెరిగి వాళ్ల పరిస్థితిని అతలా కుతలం చేశాయి. అక్కడి ప్రజలు రోజువారిగా పనిచేసి సంపాదించుకునే వారే ఎక్కువ మంది. కర్ఫ్యూ కారణంగా పని లేక వారి జీవితాలు మరింత దుర్భరంగా మారాయి.

దాడులు జరిగిన తీరును గమనిస్తే హిందువులకు సంబంధించి ప్రధానంగా ఒక గోశాల, రెండు ఆలయాలపై దాడులు జరిగాయి. ముస్లింలకు సంబంధించి 36 మసీదులు, 4 దర్గాలు, 3 నిషాన్‌లపై దాడులు జరిగాయి. ఈ ఘర్షణల వెనుక పకడ్బందీ కుట్ర ఉందని స్వయంగా నగర పోలీస్ కమిషనర్ ఎ.కె. ఖాన్ అన్నారు. ఇందులో బల్దియా, పోలీసుల నిఘా వైఫల్యం స్పష్టంగా ఉంది. కర్ఫ్యూ ఉన్నా ముషిరాబాద్‌లో హనుమాన్ జయంతి ర్యాలీకి అనుమతించడం అల్లర్లు మరింత పెరగడానికి దోహదం చేసింది. అల్లర్ల సందర్భంలో హిందూ ప్రజలను ముస్లింలు, ముస్లింలను హిందువులు రక్షించుకున్నారు. అలియాబాద్‌లో సయ్యద్ షా – కరిముల్లా షా – ఖాదిర్ మసిద్‌లో నమాజ్ చేసుకుంటుండగా దాడులు చేశారు. మసీదు తలుపులు తగులబెట్టారు. ఆ సమయంలో ఆ మసీదులో ఉన్న స్త్రీ, చిన్నపిల్లాడితో సహా కలిసి హిందువుల ఇంట్లోకి వెళ్ళి వాళ్ల సహకారంతో దాక్కున్నారు. గోశాల మీద దాడి జరగక ముందే గేట్లు మూసుకోమని హెచ్చరించి ఒక ముస్లిం యువకుడు గోశాలను రక్షించే ప్రయత్నం చేశాడు. ప్రజల మధ్య ఉన్న ఈ సామరస్యాన్ని బట్టి చూస్తే అవకాశవాద రాజకీయ నాయకులు, వారి సంకుచిత లక్ష్యాలు అర్థమవుతాయి.

హైదరాబాద్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కనీస సౌకర్యాలు ఆస్పత్రులు, పాఠశాలలు, ఉపాధి, కళాశాలలు, డ్రైనేజి, వీధి దీపాలు, మంచి నీరు, ఇల్లులాంటి వసతులు అసలు ఏమేరకు ఉన్నాయి? ప్రజల మధ్య విశ్వాసాలను ఎగదోయడంలో తీసుకుంటున్న చొరవ, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం చూపడం లేదనేది మనకు బాలకార్మికులు బాణసంచా పేలి మంటల్లో మాడి చనిపోవడం, భోలక్‌పూర్‌లో మంచినీళ్లు కాలుష్యమయమై 14 మంది చనిపోవడం వంటి ఘటనల ద్వారా అర్థమవుతాయి. ప్రజల్లో ఉన్న విశ్వాసాలతో ఇరువైపుల ఉన్న రాజకీయ నాయకుల ప్రయోజనాలే నెరవేరుతున్నాయి తప్ప, ప్రజల మౌలిక సమస్యలు తీరడంలేదు. మన ప్రజా ప్రతినిధులు వందల ఎకరాల భూములను ఆక్రమించి ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్, అస్పత్రులు పెట్టి ప్రజలను రాబందుల్లా పీక్కుతింటున్నారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాలు, కనీస వేతనాలు, పెన్షన్ సౌకర్యాలు వంటివి ఏవీ ఇప్పటికీ అమలు కావడం లేదనీ, హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యమనీ అంటున్నారు దేవిప్రసాద్

'మేడే' స్ఫూర్తితో ఉద్యోగ, కార్మిక పోరాటాలు

అమెరికాలోని చికాగో నగరంలో పని గంటల తగ్గింపు కోసం ఉద్యమం నుండి 'మేడే' ఆవిర్భవించింది. 1886 మే 1న ఈ చారిత్రక ఘటన జరగడం ప్రపంచవ్యాప్తంగా సంచనలం సృష్టించింది. కార్మిక వర్గాన్ని, శ్రామికులను పోరాటాలవైపు, ఉద్యమాల వైపు నడిపింది. ఈ ఘటన ఆవిష్కృతమై 124 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. శతాబ్దానికి పైగా గడిచిన ఈకాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు జరిగాయి. నిరంకుశ రాజ్యాలు పతనమయ్యాయి. భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక ప్రాంతాలలో, వివిధ రూపాలలో సాయుధ రైతాంగ పోరాటాలు చోటు చేసుకున్నాయి. కొన్ని విజయాలు సాధించినా ఇంకా సాధించాల్సిన కర్తవ్యం మిగిలే ఉంది. నిరంకుశ పాలకుల అణచివేతకు అనేకమంది రైతులు, శ్రామికులు, తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు.

మేడే సాక్షిగా అవతరించిన అరుణపతాకం ప్రపంచ శ్రామికులను సమైక్యపరిచింది. మేడే స్ఫూర్తితో ఉద్యోగులు, కార్మికులు అనేక హక్కులను సాధించుకొన్నారు. కాని గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో అమలవుతున్న నూతన సరళీకృత ఆర్థిక విధానం, ప్రపంచీకరణ వలన ఉద్యోగులు, కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులు అనేకం హరించబడినాయి. వీటి సాధనకు ప్రతిఘటన ఉద్యమాలు కొనసాగినా కొంతమేరకే హక్కులను తిరిగి సాధించుకోగలిగాం.

ఒక పరాయి దేశాన్ని ఆక్రమించుకోవాలన్నా, లేదా లోబరుచు కోవాలన్నా రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి యుద్ధం ప్రకటించి ఆ దేశ ప్రజలను, సంపదనూ ఆక్రమించుకోవడం. రెండు, ద్రవ్య (ఆర్థిక) సహాయం పేరుతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ సాధించి ఆ దేశాన్ని లోబరుచుకోవడం. ఇప్పుడు మన దేశంపై యుద్ధం జరగడం లేదు. ద్రవ్య సహాయం పేరుతో అమెరికా సామ్రాజ్యవాదం మన దేశాన్ని లోబరుచుకోవడం, మన ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించడం మొదలయ్యింది. 1990 నుండి ప్రారంభమైన ప్రైవేటీకరణ ఫలితంగా, ప్రభుత్వరంగాలలో పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతూ ఉద్యోగ అవకాశాలు 30 శాతం నుండి 2 శాతానికి పడిపోయాయి. ప్రైవేటీకరణ ఫలితంగా విదేశీ బహుళజాతుల ప్రవేశంతో మూతపడిన స్వదేశీ పరిశ్రమల సంఖ్య 3 లక్షలు దాటి కోటిన్నరకు పైగా ఉపాధి కోల్పోయారు. ప్రైవేటీకరణ ఫలితంగా సంపన్నులు మరింత సంపన్నులు కావడం, పేదలు మరింత పేదలుగా మారడం ఈ సంస్కరణల ఫలితం.

నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టినప్పటి నుండి (పి.వి. నుండి మన్మోహన్ వరకు) ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంబించాయి.

పోరాడి సాధించుకొన్న ఎనిమిది గంటల పని విధానం రద్దు చేసి 12 గంటల పని విధానం ప్రైవేశపెట్టె ప్రయత్నాలు మొదలయ్యాయి. గతంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షన్ సౌకర్యం లేకుండా చేయాలనే చట్టం తీసుకురావడానికి ప్రయత్నించింది. కాని కార్మికుల, ఉద్యోగుల నిరసనల వల్ల, అధికారం కోల్పోవడం వల్ల చట్టరూపం చేయలేకపోయింది. కాని ఎన్.డి.ఎ. విధానాలను వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన యు.పి.ఎ. ప్రభుత్వం ఎన్.డి.ఎ. ప్రభుత్వం తలపెట్టిన ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పూనుకొని, జనవరి 2004 నుండి

ఒకాయన ఏకంగా నిజాం సర్ఫేకాస్ భూములను కబ్జాచేసి దానికి సెజ్ పేర ఆమోదం పొందాడు. కంపెనీ పెడుతానని పొందిన భూమిలో ఆకాశాన్నంటే భవనాలు నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇది ప్రజా ప్రతినిధులమని చెప్పుకు తిరుగుతున్న వాళ్లు చేస్తున్న పని. ఇక్కడే పుట్టి, నిలువ నీడలేక ఇరుకు గదుల్లో నివసిస్తూ, రోడ్ల మీద జీవితాలను వెళ్లదీస్తున్న సామాన్య ప్రజలకు గూడు ఏర్పరచుకునే హక్కు మాత్రం లేదు.

నాలుగు నెలలకు పై బడి రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో ఊరు, వాడ, పట్టణ ప్రజలంతా ఏకమై 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం' కావాలన్న డిమాండ్‌తో జీవన్మరణ పోరాటం ఒక వైపు సాగిస్తున్నారు. ప్రజలు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీని కేంద్రంగా చేసుకుంటే, పాలకులు పాతబస్తీని కేంద్రం చేసుకున్నారనేది చరిత్రను తిరగేస్తే తెలుస్తున్న సత్యం. గత నాలుగు నెలలుగా ప్రజలు, విద్యార్థి, మేధావులు కలిసి సాగుతున్న తెలంగాణ ఉద్యమంలో ఎక్కడా దోపిడీలు, దొంగతనాలు, కత్తిపోట్లు జరగలేదు. అదే ప్రజల విశ్వాసాలను అడ్డం పెట్టుకొని మతోన్మాదాన్ని రెచ్చగొట్టి సృష్టించిన బీభత్సం కారణంగా ముగ్గురు చనిపోయారు. మూడు పశువులు చనిపోయాయి. దహనాలు, వ్యాపార దుకాణాల విధ్వంసాలు రాజ్యమేలాయి. రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య తలెత్తిన సమస్యపై పరిష్కారం కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ జనాభిప్రాయం తెలుసుకుంటుంటే ఈ దాడులు చేస్తున్నారంటే వారి ఉద్దేశ్యాలు చెప్పకనే చెబుతున్నాయి. తెలంగాణ ఉద్యమాన్ని దారి మళ్లించేందుకు ఉద్యమ వ్యతిరేక శక్తులు ఇదొక మార్గంగా ఎన్నుకున్నాయని అర్థం అవుతోంది. తమ మనుగడ కోసం ప్రజలు ప్రకృతితో సంఘర్షించారు, ఇప్పుడు తమ న్యాయమైన సమస్యల కోసం ప్రభుత్వాలను అడుగుతుంటే, పాలకవర్గాలు ఉన్మాద లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి.

(రచయిత వీక్షణం సహాయ సంపాదకుడు) వీ

రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఉపాధిని ఇస్తున్న బీడీ కార్మికుల సమస్యలని వివరిస్తూ, పరిష్కారాలను సూచిస్తున్నారు **వనమాల కృష్ణ**

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు

ఆంధ్రప్రదేశ్ బీడీ పరిశ్రమలో సుమారు ఏడు లక్షల అరవై వేల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఏడు లక్షల ఇరవై వేల మంది తెలంగాణ జిల్లాల్లోనే ఉన్నారు. ఇందులో ఉత్తర తెలంగాణ జిల్లాలైన నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలలో ఆరు లక్షల మంది బీడీ కార్మికులు ప్రధానంగా కేంద్రీకరించబడి ఉన్నారు.

తెలంగాణలో వ్యవసాయం తర్వాత అతి ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది బీడీ పరిశ్రమే. ఈ పరిశ్రమలో పని చేస్తున్న బీడీ కార్మికులలో నూటికి 95 మందికి పైగా స్త్రీలు. వీరిలో అత్యధికులు వెనుకబడిన తరగతులకు, బలహీనవర్గాలకు, దళిత, మైనారిటీలకు చెందిన వారున్నారు. వీరిలో 90 శాతంకు పైగా నిరక్షరాస్యులే.

బీడీ కార్మికుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను, అనైక్యతను ఆసరా చేసుకొని బీడీ పరిశ్రమల యాజమాన్యాలు అనేక రకాలుగా దోపిడీ చేస్తున్నాయి. దోపిడీలో భాగంగా కనీస వేతనాలను చెల్లించకుండా తక్కువ వేతనం ఇవ్వడం, తాత్కాలిక పని, టెంపరరీ పని, ఓవర్‌టైం పని, రకరకాల పేర్లతో వర్ధీ బీడీ చేయించి, తక్కువ వేతనం చెల్లిస్తూ దోపిడీ చేయడం, వెయ్యి బీడీలకు సరిపడేటంత మంచి తునికాకు ఇవ్వకుండా, నాసిరకమైన తునికాకు ఇచ్చి ఎక్కువ దోపిడీ చేసే విధానాన్ని యాజమాన్యాలు అనుసరిస్తున్నాయి.

రిజిస్ట్రర్డ్ బీడీ ఫ్యాక్టరీలు కొన్ని బీడీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించే దాంట్లో కొంత కోత విధిస్తున్నాయి. వారానికి ఐదు రోజులు

చట్టం (పి.ఎఫ్.ఆర్.డి.ఎ.) చేయకుండానే ఉద్యోగులకు అప్పటికే ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకొన్న పెన్షన్ సౌకర్యం తీసివేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 1 సెప్టెంబర్ 2004 నుండి నియామకమైన ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానం అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఉద్యోగి సర్వీస్ కాలంలో వేతనం నుండి పది శాతం కంట్రిబ్యూషన్ రికవరీ చేసి, వచ్చిన సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టి, వచ్చిన ఆదాయంతో పెన్షన్ తీసుకొనే దుష్ట సంస్కృతి అమలులోకి వచ్చింది. పెన్షన్ బిల్లు చట్టరూపం కాకుండా ప్రయత్నం చేస్తామని చెప్పిన వామపక్షాలు చట్టం చేయకుండానే పెన్షన్ విధానం అమలులోకి తెచ్చిన యు.పి.ఎ. ప్రభుత్వ కాలంలో నిలువరించ లేకపోయింది. ఉద్యోగులు, కార్మికులు సమ్మెలు చేసినా విజయం సాధించలేదు. దీనిపై ఉద్యోగ, కార్మిక సంఘాలు మూసపోసిన పోరాటాలకు (వృత్తిపరమైన) స్వస్తి పలికి నూతన పోరాట రూపాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. సమ్మె హక్కు కూడా కోల్పోయాం.

ఇప్పటికే అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపుతో సమ్మె హక్కు లేదని, ప్రభుత్వం, కోర్టులు తీర్పు ఇచ్చినా, రాష్ట్రంలో అనేక సార్లు సమ్మెలు చేసి జవాబు చెప్పారు. పాలకులంతా ఒక్కటై శ్రామికులను, కార్మికులను అణచివేతకు గురిచేస్తుంటే, అణచివేతకు గురవుతున్న వారందరూ ఒక్కటిగా ఉండి విశాల ప్రాతిపదికన ఐక్య ఉద్యమ నిర్మాణాలు చోటు చేసుకోకపోవడం విషాదం.

స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్లు దాటినా రాష్ట్రంలో అనేకమంది ఉద్యోగులు కనీస వేతనానికి కూడా నోచుకోవడం లేదు. పార్ట్‌టైం స్వీపర్స్, కంటెంజెంట్ ఉద్యోగులెందరో ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం తీసుకోవడం లేదు. ఎవరైనా కనీస వేతనం ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు తీసుకొని శిక్షించే ప్రభుత్వమే చట్టాలను అమలు చేయకపోవడం దారుణం.

మరోవైపు అన్ని ప్రభుత్వ శాఖలలో అవుట్ సోర్సింగ్ విధానం అమలులోకి వచ్చి, కంట్రాక్టర్ల ద్వారా ఉద్యోగులను సరఫరా చేయాలని టెండర్లు పిలవడం ప్రారంభమైంది. ఇటీవల ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న 128 ఐ.టి.ఐ.లలో పని చేయడానికి 781 మంది అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫిసర్స్ (ఎ.టి.ఒ.)లను, 263 నాల్గవ తరగతి ఉద్యోగులను సరఫరా చేయమని (17 ఏప్రిల్ 2010, ఆంధ్రజ్యోతిలో) నోటిఫికేషన్ ఇచ్చింది. దీని వలన పేద విద్యార్థుల కోసం ఏర్పడ్డ ఐ.టి.ఐ.లలో విద్యా ప్రమాణాలు పడిపోవడమే కాకుండా, నియామకాలు రాష్ట్రమంతటా ఒకే జోన్‌గా భావించి నోటిఫికేషన్ ఇవ్వడం, తెలంగాణ ఉద్యమం నడుస్తున్న తరుణంలో తెలంగాణ ప్రాంత యువకులను రెచ్చగొట్టడం, కోట్లాది రూపాయలు కమిషన్ల రూపంలో దండుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను చేధించాలి. మనుషులను వస్తువులుగా మార్చిన సంస్కృతి నుండి బయటపడాలి.

ఉద్యోగులు, కార్మికులు ఆర్థికపరమైన ప్రయోజనాల కోసం జరుగుతున్న ఉద్యమంలో గణనీయంగా పాల్గొంటున్నా, సామాజిక సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాలలో భాగస్వామ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రాంత ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూనే, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కూడా పోరాడాల్సిన అవసరం ఉంది.

(రచయిత ప్రధాన కార్యదర్శి, టి.ఎన్.జి.ఒ. సెంట్రల్ యూనియన్) వీ

ప్రావిడెంట్ ఫండ్ కోతతో పని ఇస్తే, కనీసం ఒకరోజు నాన్ పి.ఎఫ్.తో పని చేయించుకుంటున్నాయి. బ్రాంచ్‌కు ఇద్దరు నుండి ఐదుగురితో నాన్ పి.ఎఫ్. కార్మికులుగా లేదా ఓవర్ టైం కార్మికులుగా నామకరణ చేసి వర్ధీ కింద అంటే కనీస వేతనం కంటే తక్కువ కూలీ ఇస్తూ తాత్కాలిక పని పేరుతో గ్రాట్యుయిటీ చట్టం అమలు చేయకుండా, బోనస్ చట్టం, బీడీ, చుట్ట కార్మికుల పని పరిస్థితుల చట్టం అమలు చేయకుండా, ఒక్క మాటలో చెప్పాలంటే ఏ చట్టం అమలు చేయకుండా దోపిడీ యథేచ్ఛగా బీడీ యాజమాన్యాలు కొనసాగిస్తున్నాయి. ఇంకా కొన్ని బీడీ ఫ్యాక్టరీలు నెల మొత్తంలో చేసిన బీడీలలో 20 నుండి 30 శాతం నాన్ పి.ఎఫ్. కింద అంటే వర్ధీ బీడీ కింద లెక్కగట్టి తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. చట్ట విరుద్ధంగా ఉత్పత్తి చేయించే వర్ధీ బీడీకి వెయ్యి ఒక్కంటికి 60 రూపాయల వేతనం మించడం లేదు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి బీడీల వెనకాల దోపిడీ చేస్తున్నది రు. 25.75 పైసలు కాగా, పట్టణ ప్రాంతాల్లో రు. 26.33 పైసలు. ఈ విధంగా బీడీ కార్మికుల శ్రమను, కష్టార్జితాన్ని యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయి.

బీడీ, చుట్ట కార్మికుల (పని పరిస్థితుల) చట్టం ప్రకారం బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు సరిపడేటంత మంచి తునికాకు ఇవ్వాలి. మంచి తునికాకు ఇవ్వకుండా, నాసికరమైన పగులుడు, ముక్కుడు, దొడ్డుది, చిన్నది, రేజ, నల్లది, సొప్పకట్ట లాంటి తునికాకు ఇచ్చి మంచి బీడీలు చేసుకొని తీసుకరమ్మని బీడీ సేట్లు డిమాండ్ చేస్తున్నారు. నల్లటి ఆకువేసి తెల్లటి బీడీ కావాలంటున్నారు. బీడీ యాజమాన్యాలు చేసే ఒత్తిడి ప్రకారం బీడీలు చేసి తీసుకెళ్లాలంటే వెయ్యి బీడీలకు తుట్టి పడిన ఆకు మార్కెట్ ఖరీదు చేయడానికి పది నుండి పదిహేను రూపాయల వరకు ఖర్చవుతుంది. ఈ లెక్కన ప్రతి బీడీ వర్కర్ నెల ఒక్కంటికి 150 నుండి 200 రూపాయల తునికాకు ఖరీదు చేసి, తక్కువ పడిన ఆకు (తుట్టి) నింపడానికే సరిపోతుంది. ఒకవేళ తుట్టి నింపకుండా, వెయ్యి బీడీలకు యాజమాన్యం ఇచ్చిన ఆకు ఎంత అయితే అంతే బీడీలు చేయడానికి పూనుకుంటే కార్మికులకు పని తగ్గుతుంది. ఫలితంగా కూలీ (వేతనం) తగ్గుతుంది. యాజమాన్యం మొదటిరోజే వెయ్యి బీడీలకు ఇచ్చిన ఆకులో 800 బీడీలు అయితే, రెండవ రోజు ఇచ్చిన ఆకులో 600 బీడీలు, మూడవ రోజు 500 బీడీలకు దాటవు. ఆకు ఇచ్చిన కాడికి బీడీలు చేస్తే పని తగ్గుతుంది. వేతనం తగ్గుతుంది. చివరకు యాజమాన్యం వెయ్యి బీడీలకు ఇచ్చిన ఆకు ప్రకారం కార్మికులు బీడీలు చేసి ఇస్తేనే తిరిగి పని ఇస్తారు. అప్పటివరకు యాజమాన్యాలు పని ఇవ్వరు. కనుక వెయ్యి బీడీలు చేయడానికి ఇచ్చిన ఆకులో ఎంత తక్కువ పడితే అంత మార్కెట్‌లో కూలీ డబ్బుల నుండి కార్మికులు ఖరీదు చేసి భర్తీ చేస్తున్నారు. తుట్టిపోయిన తునికాకు భర్తీ చేయడం ద్వారా బీడీలు ఎక్కువ చేయడం వల్ల ఎక్కువ కూలీ డబ్బులు వస్తాయి. కొంత తునికాకు ఖరీదు చేయడానికి డబ్బులు పోయినా, వెయ్యి బీడీల పని చేసినట్లుగా కార్మికులు భావిస్తారు. తునికాకు తుట్టి నింపడానికి కూలీ డబ్బులు నష్టపోయినప్పటికీ వెయ్యి బీడీల పనికి కూలీ డబ్బులు వస్తాయనే ఉద్దేశంతో కార్మికులు మానసికంగా నష్టానికి (దోపిడీ కావడానికి) సిద్ధమవుతున్నారు.

దేశంలోగాని, ప్రపంచంలోగాని ఏ పరిశ్రమను తీసుకున్నా ముడిసరుకు తక్కువ పడితే కార్మికులు తమ వేతనాల నుండి ఖరీదు చేసి భర్తీ చేసే పద్ధతి లేదు. చివరకు వ్యవసాయంలో నాటు వేసే కూలీ, రైతు ఎంత నారు ఇస్తే అంతే నాటు వేస్తుంది. నారు తక్కువ పడితే రైతు తెచ్చి ఇస్తేనే నాటు వేస్తుంది. లేకపోతే ఒడ్డు మీద కూర్చుంటుంది. సాయంత్రం కాగానే కూలీ డబ్బులు ఇవ్వమని అడుగుతుంది కాని నారు తక్కువ పడితే ఖరీదు చేసి నాటు వేయరు. కాని బీడీ పరిశ్రమలో యాజమాన్యం ఇచ్చే తునికాకు, దారం, పొగాకు, ఏది తక్కువ పడినా కార్మికులే వేతనం నుండి మార్కెట్‌లో ఖరీదు చేసి భర్తీ చేసే విధంగా యాజమాన్యాలు దోపిడీ కొనసాగిస్తున్నాయి. రాష్ట్రంలో లక్షలాది మంది బీడీ కార్మికులను భయభ్రాంతులకు గురి చేసి దౌర్జన్యంగా అక్రమంగా, చట్ట విరుద్ధంగా బీడీ యాజమాన్యాలు దోపిడీ చేస్తుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ముడుచుకొని గుడ్లప్పగించి చూస్తున్నాయి. ఇంతటి దారుణమైన దోపిడీని అంతం చేయడానికి ప్రభుత్వాలు పూనుకోకపోవడం అత్యంత విచారకరం.

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ చుట్టే కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా పనికి కొరతలేదు. (మెజారిటీ బీడీ ఫ్యాక్టరీలలో) గ్రామీణ ఉపాధి హామీ పథకం రావడం వల్ల బీడీ కార్మికులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. చేతి నిండ పని లేని కార్మికులు, సగం పని దొరుకుతున్న కార్మికులు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డ్ సంపాదించుకున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు కనీసం వంద రూపాయల కూలీ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మెజారిటీ బీడీ కార్మికులు ఉపాధి హామీ పథకం పనులకు ప్రాధన్యతనిస్తున్నారు. అంతేకాదు గతంలో పని కావాలని, ఉత్పత్తి పెంచాలని బీడీ కార్మికులలో డిమాండ్ ఉండేది. కాని ప్రస్తుతం ఎంత పని కావాలంటే అంత పని ఇస్తామని అన్నా బీడీ కార్మికులు దొరికే పరిస్థితి లేదు. కొన్ని బీడీ ఫ్యాక్టరీలలో ఇప్పటికే చేతినిండ పనిలేదు. నెలకు 26 రోజుల పని దినాలు ఇవ్వడం లేదు. పైగా ఉత్పత్తి కావడం లేదని బుకాయిస్తున్నారు. తక్కువ పని ఇచ్చి తక్కువ పనిదినాలు ఇచ్చి కొత్త బ్రాంచ్‌లను పోటీపడి తెరుస్తున్నారు. అంటే బీడీ కార్మికులను దోపిడీ చేసుకొనడానికే తక్కువ పని, తక్కువపని దినాల పద్ధతులు బీడీ యాజమాన్యాలు అనుసరిస్తున్నాయి.

బీడీ యాజమాన్యాలు రకరకాల దోపిడీ పద్ధతులు అనుసరించడం వల్ల కూలీ గిట్టుబాటు కాదనే ఉద్దేశంతోనే బీడీ కార్మికులు పని చేయడానికి కొంత అయిష్టత కూడా వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు కాని పని చేసే కంటే ఖాళీగా ఉండడం మేలు అనే అభిప్రాయం కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. బీడీ కార్మికులకు ఇచ్చే తునికాకు, దారం, పొగాకు, వేతనాలలో దోపిడీ మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి బీడీలు చుడితే 1 ఏప్రిల్ 2010 నుండి కనీస వేతనంతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను కలుపుకొని రు. 85.75 పైసలుగా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి బీడీలకు అన్నింటినీ కలుపుకొని కనీస వేతనం రు. 86.33 పైసలుగా చెల్లించాలి. కాని అన్ని రకాల దోపిడీ వల్ల వెయ్యి బీడీలకు 40 నుండి 50 రూపాయల కంటే ఎక్కువ కూలీ గిట్టుబాటు కావడం లేదు. అందుకే ప్రస్తుతం చేతినిండ పని కల్పిస్తామన్నా బీడీ కార్మికులెవ్వరు ముందుకు రావడం లేదు. బీడీ పరిశ్రమలో యాజమాన్యాలు అనుకున్నంత లేదా మార్కెట్ డిమాండ్ ప్రకారం ఉత్పత్తి చేయించ లేకపోతున్నారు. గత రెండు సంవత్సరాల కంటే ముందు కార్మిక సంఘాలు ఉత్పత్తి పెంచాలని యాజమాన్యాల్ని డిమాండ్ చేస్తూ, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం బీడీ కార్మిక సంఘాలు కార్మికులతో పని చేయించాలని యాజమాన్యాలు పదే పదే చెబుతున్నాయి. ఫలానా సెంటర్‌లోని బ్రాంచ్‌లో బీడీల ఉత్పత్తి కావడం లేదు. దృష్టి పెట్టండని

యాజమాన్యాలు, కమిషన్ ఏజెంట్లు అంటున్న పరిస్థితి ప్రస్తుతం బీడీ పరిశ్రమలో ఉంది.

కేంద్ర ప్రభుత్వం పొగ పీల్చడానికి వ్యతిరేకంగా పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం తెచ్చింది. ఈ చట్టం ఉనికిలోనికి రాగానే బీడీ కట్టలపైన పుర్రె – రెండు ఎముకల శవం బొమ్మను ముద్రించాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా బీడీ కట్టలపై ముద్రించాలనేది విస్తృతంగా ప్రచారం జరిగింది. కార్మికులు దేశవ్యాప్తంగా పోరాడిన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వును వెనక్కు తీసుకుంది. ఆ తర్వాత ఊపిరితిత్తుల బొమ్మను ముద్రించాలని ఉత్తర్వును జారీచేసింది. అది అమలు జరుగుతోంది. ఏదైతేనేమి విస్తృత ప్రచారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్లనే బీడీ పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడ్డది. బీడీలకు ఎంత డిమాండ్ ఉందో అంత ఉత్పత్తి కావడం లేదనేది జగమెరిగిన సత్యం. అయినప్పటికీ బీడీ యాజమాన్యాలు తమ దోపిడీ పద్ధతులను మార్చుకోవడం లేదు. బ్రాంచ్‌ను ఇద్దరి నుండి ఐదుగురితో ఓవర్‌టైం పని కింద, టెంపరరీ పని, నాన్ పి.ఎఫ్., రకరకాల పేర్లతో వర్థీ బీడీ ఉత్పత్తి చేయిస్తూ, దోపిడీ యథేచ్ఛగా యాజమాన్యాలు కొనసాగిస్తున్నాయి. ఈ అక్రమ దోపిడీని అంతం చేయడానికి కార్మికులు, కార్మిక సంఘాలు పూనుకోవాలి. అదే విధంగా బీడీ కార్మికులు కనీస వేతనాలు పొందే విధంగా, ముడిసరుకు తుట్టి పడకుండా చర్యలు తీసుకోవాలి. బీడీ, చుట్ట కార్మికుల పని పరిస్థితుల చట్టంలో సవరణలు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించాల్సిన అవసరం లేదు. బడ్జెట్‌పై భారం పడదు. రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ముడిసరుకు తక్కువ పడకుండా సవరణలు చేయవచ్చు. ఉభయులు రాష్ట్ర ప్రభుత్వం తన రాష్ట్ర పరిధిలో చట్ట సవరణ చేయవచ్చు. కేంద్రం దేశమంతటికీ సంబంధించి చట్ట సవరణ చేయడానికి అధికారం ఉంది. అట్టి అధికారాన్ని కార్మికుల శ్రేయస్సు కోసం ఉపయోగించడం లేదు. రాష్ట్ర పరిధిలో చట్ట సవరణ చేసి రాష్ట్రంలో గల సుమారు ఎనిమిది లక్షల మంది బీడీ కార్మికుల మన్ననలను రాష్ట్ర ప్రభుత్వం పొందవచ్చు. ఈ రకమైన దోపిడీ లేకుండా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ 1989 నుండి బీడీ కార్మికులు పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదు.

అంతేగాకుండా మన రాష్ట్రంలో బీడీ యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా బీడీ కార్మికులు అనేక పోరాటాలు సాగించారు. అట్లాగే దేశవ్యాప్తంగా వేతనాలలో దోపిడీ, తునికాకులో దోపిడీ ఇతర దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగా 1995లో పార్లమెంట్‌లో 'బీడీ కార్మికులు దోపిడీకి గురవుతున్న సమస్యపై' చర్చ సాగింది. చివరకు దోపిడీకి గురవుతున్న బీడీ కార్మికుల విషయంలో తేల్చడానికి పార్లమెంట్ సబ్ కమిటీని వేసింది. దేశవ్యాప్తంగా సబ్ కమిటీ పర్యటించి, పరిశీలించి, అధ్యయనం చేసిన అనంతరం బీడీ కార్మికులు ముడిసరుకు తదితరాలలో ప్రతి దినం ఏడు రూపాయల చొప్పున దోపిడీకి గురవుతున్నారని నివేదికనిచ్చింది. పార్లమెంట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం అట్టి దోపిడీని అంతం చేయడానికి గత 15 సంవత్సరాల కాలంలో చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరం. కార్మికులను ముడిసరుకులో తదితర విధాల దోపిడీ చేస్తున్న యాజమాన్యాలను అదుపు చేయడానికి ఎందుకు చర్య తీసుకోలేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ సబ్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత నేటి వరకు కూడా చర్యలు తీసుకోకపోవడం అంటే కార్మికులను దోపిడీ చేస్తే చెయ్యని మాకేమని ఊరుకోవడమేనా? బీడీ యాజమాన్యాలను రక్షించడానికేనా? వారి దోపిడీ యథేచ్ఛగా కొనసాగింపుకేనా? కాకులను కొట్టి గద్దలకు వేసే విధంగా కార్మికులను వారిని దోపిడీ చేసే పెట్టుబడిదారులకు మద్దతు చేయడమేనా కేంద్ర ప్రభుత్వ విధానం? ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ ఇచ్చిన నివేదికలకు విలువలేదా! అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. దశాబ్దన్నర కాలం గడిచిపోయినా కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతూ దోపిడీకి వ్యతిరేకంగా నిరంతరం సంఘటితంగా సమైక్యంగా పోరాటం ద్వారా మాత్రమే దోపిడీని అంతం చేసుకోగలుగుతామని బీడీ కార్మికులందరు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు.

దేశంలో అతి తక్కువ వేతనాలు పొందుతున్న బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, అదే విధంగా 1995 నవంబర్ 16 తర్వాత ప్రావిడెంట్ ఫండ్ నూతన పెన్షన్ పథకంలో సభ్యులుగా చేరిన కార్మికులు 10, 13 సంవత్సరాల పాటు పెన్షన్ ఫండ్‌కు ప్రతి నెల చెల్లింపులు చేసిన తర్వాత కూడా బీడీ కార్మికులకు 20 నుండి 150 రూపాయల వరకు మాత్రమే పెన్షన్ లభిస్తోంది. ఈ కొత్త పెన్షన్ పథకం ప్రకారం ఇరవై సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన కార్మికులకు 200 రూపాయలకు మించదు. బీడీ కార్మికులకు కూలీ రేటు అతి తక్కువగా ఉన్నందువల్ల యజమానులు కార్మికులకు చేతినిండా పని ఇవ్వనందువల్ల, నెలకు 26 రోజులు కార్ఖానాలు నడపనందువల్ల అతి తక్కువ నెలసరి వేతనాన్ని కార్మికులు పొందుతున్నారు. ఫలితంగా బీడీ కార్మికులు అతి తక్కువ పెన్షన్ పొందుతున్నారు. ఉదాహరణకు 500 రూపాయలు నెలసరి బట్వాడా (వేతనం) ను పొందుతూ పది సంవత్సరాల సర్వీసు కలిగిన కార్మికురాలు వయస్సు యాభై సంవత్సరాలు నిండిన తర్వాత నెలకు 71 రూపాయల పెన్షన్‌ను మాత్రమే పొందుతోంది. 700 రూపాయల బట్వాడాను పొందుతూ 10 సంవత్సరాల సర్వీసు కలిగి వయస్సు యాభై సంవత్సరాలు నిండిన కార్మికురాలు 100 రూపాయల పెన్షన్ మాత్రమే పొందుతుంది. ఇది బీడీ కార్మికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ప్రావిడెంట్ ఫండ్ కంట్రీబ్యూషన్‌ను తగ్గించుకోవడానికి, యజమానులు రికార్డులలో కార్మికుల వేతనాన్ని తక్కువగా చూపిస్తున్నారు. ఇతర రంగాల కార్మికులకు సర్వీస్ పెరిగే కొద్ది వేతనం పెరుగుతుంది. బీడీ కార్మికులకు సర్వీస్ పెరిగే కొద్దీ వారి బీడీలు చేసే సామర్థ్యం తగ్గి నెలసరి వేతనం తగ్గిపోతుంది. బీడీ కార్మికులు పని మానివేసిన చివరి 12 నెలల సగటు వేతనాన్ని బట్టి పెన్షన్ ఎంత అనేది నిర్ణయిస్తారు. కనుక బీడీ కార్మికులకు లభించే పెన్షన్ తగ్గుతుంది. 1995 నవంబర్ 16 తర్వాత పెన్షన్ లెక్క కట్టే విధానం బీడీ కార్మికులకు చాలా నష్టదాయకంగా ఉంది. ఈ స్కీంలో కనీస పెన్షన్ గ్యారంటీ విధానం లేకపోవడం వల్ల బీడీ కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. 1995కు ముందు ఫ్యామిలీ పెన్షన్ పథకంలో సభ్యులుగా ఉన్న కార్మికులకు లభించే కనీస పెన్షన్ సౌకర్యాన్ని 1995 నవంబర్ 16 తర్వాత నూతన పెన్షన్ పథకంలో సభ్యులుగా చేరిన వారికి లేకపోవడం, మరింత తగ్గించి వేయడం అత్యంత దారుణమైన విషయం.

1995 కంటే ముందు నుండే ప్రావిడెంట్ ఫండ్‌లో సభ్యులుగా ఉన్న కార్మికులు కనీస పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఉంటే మరొక పక్క కేంద్ర ప్రభుత్వం 2008 సెప్టెంబర్‌లో తగ్గింపు పెన్షన్‌లో 3 శాతం ఉన్న దానిని 4 శాతానికి పెంచింది. రిటన్ ఆఫ్ క్యాపిటల్‌ను, పెన్షన్‌ను

అమ్ముకునే హక్కును రద్దు చేసింది. ఇది సరైన చర్య కాదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

మన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో గల లక్షలాది మంది ఎలాంటి పెన్షన్ కంట్రీబ్యూషన్ చెల్లించని వృద్ధులకు, వితంతువలకు, చేనేత కార్మికులకు ప్రతి నెల రెండు వందల రూపాయల పెన్షన్ చెల్లిస్తుంది. అదే విధంగా వికలాంగులకు ప్రతి నెల ఐదు వందల రూపాయల పెన్షన్ చెల్లిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ద్వాక్రా మహిళలకు 'అభయ హస్తం' పేరుతో పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం మహిళలు నెలకు రు. 30 ప్రభుత్వానికి చెల్లిస్తే, ప్రభుత్వం కూడా మరొక రు. 30 రూపాయలు జమ చేస్తుంది. ఈ మహిళలకు 60 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత నెలకు రు. 500 తక్కువ కాకుండా రు. 2200 వరకు పెన్షన్ చెల్లిస్తానని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అమలుకు పూనుకున్నది. కాని బీడీ కార్మికులు తమ వేతనం నుండి ప్రతి నెల 8.33 శాతం పెన్షన్ కంట్రీబ్యూషన్ చెల్లిస్తున్నా ప్రతి నెల రు. 20 నుండి రు. 150 లలోపు నామమాత్రంగా పెన్షన్ చెల్లించడం అత్యంత అన్యాయమైంది. కనుక పది సంవత్సరాల సర్వీసు కలిగిన బీడీ కార్మికులకు వెయ్యి రూపాయలు కనీస పెన్షన్ చెల్లించే విధంగా 1995 పెన్షన్ పథకాన్ని సవరించాలని బీడీ కార్మికులు ఆందోళన చేస్తూ డిమాండ్ చేస్తున్నారు. ఇలా చెల్లించడానికి అవసరమయ్యే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయం నుండి సమకూర్చాలి. ఆర్థికంగా అత్యంత వెనుకబడి ఉన్న బీడీ కార్మికులకు సహాయం చేయడం ప్రభుత్వాల సామాజిక బాధ్యత.

దేశంలో అసంఘటిత రంగంలో కోట్లాది మంది కార్మికులున్నారు. ఈ కార్మికుల పని గంటలు చికాగో కార్మికుల పని గంటలను మరిపించేవిగా ఉన్నాయి. ఈ కార్మికుల పని పద్ధతులు దారుణంగా ఉన్నాయి. వీరి వేతనాలు స్వల్పంగా ఉన్నాయి. దోపిడీ విపరీతంగా ఉంది. ఇందులో భాగంగానే మనదేశంలో గల 60 లక్షల మంది బీడీలు చుట్టే కార్మికులు, 50 లక్షల మంది తునికాకు తెంపే కార్మికులు, 40 లక్షల మంది పొగాకు పండించే రైతులు, రైతు కూలీలు ఉన్నారు. మొత్తం ఒక బీడీ పరిశ్రమలోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా కోటిన్నర మంది కార్మికులున్నారు. ఈ కార్మికుల వేతనాలు అతి తక్కువగా ఉన్నాయి.

మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ బీడీ కార్మికులు యజమానుల అమానుష దోపిడీకి గురవుతున్నారు. వారి వేతనాలు దేశంలో గల ఇతర పరిశ్రమల కన్న తక్కువగా ఉన్నాయి. నేషనల్ ఫ్లోర్ లెవల్ మినిమమ్ వేజెస్ దినం ఒక్కంటికి 88 రూపాయలు ఉండాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించింది. నిజామాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా కలెక్టర్లు అన్ స్కిల్డ్ కార్మికులకు నిర్ణయించిన దినసరి వేతనం 160 రూపాయలు కాగా, భవన నిర్మాణంలో మట్టి కార్మికులుగా పనిచేస్తున్న వారికి దినసరి కూలీ 150 రూపాయల నుండి 200 రూపాయల వరకు ఉంది. ఈ రకమైన దినసరి వేతనం రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతోంది. కానీ, బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు కనీస వేతనం, కరువు భత్యం కలిపి 75 రూపాయలకు మించడంలేదు. పైగా ముడిసరుకులో దోపిడీ, వేతనంలో దోపిడీ విపరీతంగా కొనసాగుతోంది.

మన రాష్ట్రంలో బీడీ పరిశ్రమ ప్రధానంగా తెలంగాణ జిల్లాల్లో కేంద్రీకరించబడి ఉంది. తెలంగాణ జిల్లాల్లో లోకల్‌గా బీడీ తయారు చేయించి, ఆ జిల్లాలలోనే అమ్ముకునే బీడీ ఫ్యాక్టరీలు మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేసి పోరాడి వారి శక్తి మేరకు పెంచుకుంటున్నారు. ఈ వ్యాసం రాసే నాటికి మహబూబ్‌నగర్ జిల్లాల్లో వెయ్యి బీడీలకు వేతనం 83 రూపాయలుగా సాధించుకున్నారు. జంటనగరాల్లో బీడీ కార్మికులు వేతనాలు పెంచాలని అడిగినందుకే బీడీ కార్ఖానాలను యాజమాన్యాలే మూసుకున్నాయి. బెదిరించి కార్మికులను లొంగదీసుకోవడానికి యాజమాన్యాలు పడరాని తిప్పలు పడుతున్నాయి. అయినప్పటికీ కార్మికులు సంఘటితంగా నిలబడ్డారు. ప్రతిరోజూ కోట్లాది బీడీలను ఉత్పత్తి చేసే బీడీ పరిశ్రమ నిజామాబాద్ కేంద్రంగా కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్ జిల్లాల్లో కేంద్రీకరించబడి ఉంది. ఈ బీడీ పరిశ్రమలో బీడీలు చుట్టే కార్మికుల వేతన సవరణ 2006లో జరిగింది. అదే విధంగా బీడీ ప్యాకర్లు, నెలసరి జీతాల ఉద్యోగుల వెతనాల ఒప్పందం రెండు సంవత్సరాల క్రితం జరిగి దాని గడువు ముగిసింది. గత నాలుగు సంవత్సరాల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ప్రభుత్వం మూడుసార్లు పెంచింది. చమురు ధరలు పెరగడం వల్ల వాటి ప్రభావంతో సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ ధరల పెరుగుదలను తట్టుకోలేక బీడీ కార్మికులు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులకు గురై సతమతమవుతున్నారు. దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. రెక్కాడితేగాని డొక్క నిండని బడుగు, బలహీనవర్గాలకు చెందిన బీడీ కార్మిక కుటుంబాలు తక్కువ రేటుకు దొరికే దినుసుల కోసం ఎగబడుతున్నారు. నాసిరకమైన దొడ్డుబియ్యం, జొన్నలు, నూకలు తెచ్చుకొని కాలం గడుపుతున్నారు. చాలిచాలని కూలీలతో, నెలసరి జీతాలతో కుటుంబ భారాన్ని మోయడం తలకు మించిన భారమయింది. కనుక కూలీరేట్లు, జీతాలు పెంచుకోవడం తప్ప మరొక మార్గం లేదు. వేతనాలతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని యాజమాన్యానికి నోటిసు ఇచ్చి మూడు నెలలు గడిచినా స్పందన లేదు. అందుకే సంఘటితంగా సమైక్య పోరాటానికి కార్మిక సంఘాలు శ్రీకారం చుట్టాయి. అన్ని క్యాటగిరీలకు చెందిన కార్మికులను సంఘటితపర్చడానికి ఐక్య కార్యాచరణ కమిటీ నాయకత్వం జిల్లా సదస్సులు జరిపింది. అయినా బీడీ యాజమాన్యాల ఉలుకుపలుకు లేదు. యాజమాన్యాల నిర్లక్ష్యానికి, మొండివైఖరికి కార్మికులు పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి పూనుకోబోతున్నారు. అప్పటికీ యాజమాన్యాలు స్పందించకపోతే, చర్చలకు పూనుకోకపోతే, బీడీ పరిశ్రమలో ఉత్పత్తి స్తంభింపచేసే చర్యకు, ఆందోళనకు పూనుకోవచ్చు. అంతిమంగా సమ్మె పోరాటం తప్పక పోవచ్చని నాయకత్వం భావిస్తోంది. ఏది ఏమైనా బీడీ యాజమాన్యాల స్పందనను బట్టి కార్మికుల ప్రతిస్పందన ఉంటుంది.

బీడీ కార్మికుల కూలీ రేట్లు, నెలసరి జీతాల సమస్య మాత్రమే కాదు, కూలీరేటు ఎంత పెరిగినా మరోపక్క తునికాకు దోపిడీతో పెరిగిన వేతనం చేతికి అందకుండా పోతుంది. కనుక వెయ్యి బీడీలకు సరిపడేటంత మంచి తునికాకు ఇవ్వాలనేది కూడా డిమాండ్లలో ఒకటి. అదే విధంగా మహిళా బీడీ కార్మికులకు మెటర్నిటీ బెనిఫిట్ కింద ప్రసూతికి ముందు 6 వారాలు, ప్రసూతి తర్వాత 6 వారాలు మొత్తం 12 వారాల సెలవుతో కూడిన వేతనం ఇవ్వాలనే డిమాండ్ కూడా ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఈ డిమాండ్ల సాధనకు బీడీ కార్మికులు పట్టుదలతో ధృఢమైన వైఖరితో పోరాడి సాధించుకుంటారని ఆశిద్దాం.

(రచయిత రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ బీడీ వర్కర్స్ యూనియన్) వీ

వివిధ రూపాల్లో బీడీ కార్మికులను దోచుకుంటున్న వైనాన్నీ, వారి దుర్భరమైన జీవన స్థితిగతులనూ వివరిస్తున్నారు

ఎన్. అరుణ

బీడీల్లో పొగచూరుతున్న బతుకులు

మన రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్లగొండ, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలో బీడీ పరిశ్రమ ఉంది. బీడీ పరిశ్రమ ప్రధానంగా తెలంగాణ జిల్లాల్లో, అందులోనూ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కేంద్రీకరించబడి ఉంది. రాష్ట్రంలోని ఏడు లక్షల మంది బీడీ కార్మికులలో ఆరు లక్షల మంది తెలంగాణ జిల్లాలలోనే కేంద్రీకరించబడి ఉన్నారు. బీడీ పరిశ్రమ హైదరాబాద్ నగరంలోనూ ఉంది. జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలోనూ ఉంది. మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించి ఉంది.

బీడీ పరిశ్రమలో 90 శాతానికి పైగా కార్మికులు మహిళలు. బీడీలు చుట్టే పనిని ప్రధానంగా మహిళలు చేస్తుండగా, బీడీలను ప్యాకింగ్ చేయడం, బట్టీ పెట్టడం, కార్మికులకు ముడి సరుకును పంపిణీ చేయడం, తయారు చేసిన బీడీలను లెక్క పెట్టుకోవడం, రికార్డులు రాయించడం మొదలైన పనులు పురుషులు చేస్తారు. బీడీ పరిశ్రమలో పని చేసే స్త్రీలు కానీ, పురుషులు కానీ ప్రధానంగా చేతి వృత్తుల కుటుంబాలకు, వ్యవసాయ కార్మిక, పేద రైతు కుటుంబాలకు చెందినవారు, కొందరు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కూడా ఉంటారు. సాంఘికంగా దళిత, వెనుకబడిన కులాలకు బలహీన వర్గాలకు, ముస్లింలకు చెందిన మహిళలు అత్యధికంగా ఉంటారు. బీడీ కార్మికులలో అత్యధికులు నిరక్షరాస్యులు.

బీడీలు తయారు చేయడానికి ఉపయోగించే తునికాకు తెలంగాణ జిల్లాలలోనే అత్యధికంగా పండుతుంది. తునికాకు తెంపడం మీద లక్షలాది గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు ఆధారపడతారు. బీడీలను షాపులలో పెట్టుకొని అమ్మడం ద్వారా మరిన్ని లక్షల మంది మన రాష్ట్రంలో జీవనాన్ని పొందుతున్నారు. బీడీ పరిశ్రమ మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి జీవించే వారు 10-12 లక్షలకు పైబడే ఉంటారు. దేశంలో 60 లక్షల మంది బీడీ కార్మికులుండగా, తునికాకు తెంపే కార్మికులు, బీడీలకు ఉపయోగించే పొగాకును పండించే రైతులు ఇతరత్రా బీడీ పరిశ్రమ మీద ఆధారపడే కార్మికులు - అందరూ కలిసి 60 లక్షల మంది ఉంటారు.

దేశంలో వ్యవసాయం, చేనేత తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం బీడీ పరిశ్రమ. మన రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణి బొగ్గు గనులలో, ఎపిఎస్ఆర్‌టిసిలో లక్షకు పైబడే కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంఘటిత రంగ పరిశ్రమలన్నింటిలోనూ కలిపి 2003 మార్చ్ నాటికి 22.08 లక్షల మంది మాత్రమే పని చేస్తున్నారు. (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక సర్వే 2004-05). దీనిని బట్టి రాష్ట్రంలో బీడీ పరిశ్రమ ఎంత పెద్ద సంఖ్యలో, అదీ ముఖ్యంగా మహిళలకు ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి కల్పిస్తుందో స్పష్టమవుతోంది.

దేశంలో బీడీ కార్మికుల పని పరిస్థితులు, జీవన పరిస్థితులు, వేతనాలు ఘోరంగా, దయనీయంగా ఉన్నాయని ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలనేకం నిర్వహించిన అధ్యయనాలలో 'ప్రతి బీడీ కార్మికురాలి వేతనం నుండి యాజమాన్యాలు రోజుకు 7 రూపాయలను అక్రమంగా కోసుకుంటున్నాయ'ని పేర్కొన్నాయి. ఏదైనా ఒక రాష్ట్ర ప్రభుత్వ బీడీ కార్మికులకు కనీస వేతనాలను పెంచినప్పుడు కానీ, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయడానికి పూనుకున్నప్పుడు కానీ యాజమాన్యాలు తమ ఫ్యాక్టరీలను ఆ రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి (వేతనాలు తక్కువగా ఉన్న, చట్టాలు సరిగా అమలు కాని రాష్ట్రాలకు) తరలిస్తున్నాయని కూడా ఈ అధ్యయనం పేర్కొంది. బీడీ కార్మికులు సాగించిన అనేక పోరాటాల ఫలితంగా భారత ప్రభుత్వం 1960 బీడీ, చుట్ట కార్మికుల (పని పరిస్థితుల) చట్టాన్ని రూపొందించింది. యజమానులు కోర్టుకు పోయి ఈ చట్టం అమలును 1976 వరకు అడ్డుకున్నారు. ఆ తర్వాత కూడా సుదీర్ఘ సమ్మె పోరాటాలు చేసి, అనేక నిర్బంధాలను ఎదుర్కొన్న తర్వాతే మన రాష్ట్రంలోని బీడీ కార్మికులు అరకొరగానైనా ఈ చట్టాన్ని అమలు జరిపించుకోగలుగుతున్నారు. 50 మంది కన్నా ఎక్కువ మంది మహిళా కార్మికులు పనిచేసే బీడీ కార్ఖానా బ్రాంచీలలో పిల్లల పెంపక కేంద్రాలు పెట్టాలని, మహిళా కార్మికులు గర్భిణితో ఉన్నప్పుడు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలని, కార్ఖానాలలో స్త్రీ, పురుష కార్మికులకు వేరు వేరుగా పాయిఖానాలు, మూత్రశాలలు, చేతులు, ముఖం కడుక్కునే ఏర్పాట్లు, తగినంత మంచినీటి సదుపాయం, విశాలమైన గదులు ఏర్పాటు చేయాలని ఈ చట్ట నిబంధనలు నిర్దేశించాయి. ఈ చట్ట నిబంధనలను ఉల్లంఘించడానికి ప్రతి బ్రాంచీలో 49 మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నట్లు యాజమాన్యాలు రికార్డులలో చూపించసాగారు. పైగా కార్ఖానాలలో పనిని పూర్తిగా రద్దు చేసి, కార్మికులు తమ తమ ఇండ్లలో కూర్చుని పని చేసే పద్ధతిని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం బీడీ పరిశ్రమలో 90 నుండి 95 శాతం మంది కార్మికులు ఇళ్లలో పనిచేసే హోంవర్కర్‌గా మార్చబడ్డారు. ఆ విధంగా చట్ట నిబంధనలలోని అత్యధిక భాగం బలహీనం చేయబడ్డాయి.

దేశంలో నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు ప్రవేశపెట్టబడిన తర్వాత దేశ, విదేశీ సిగరెట్ కంపెనీలు పి.వి. నర్సింహారావు ప్రభుత్వంపై ఒత్తిడి చేసి 60 మిల్లి మీటర్ల కన్నా తక్కువ పొడవున్న చిన్న సిగరెట్లపై

(వీటినే మినీ సిగరెట్లు అంటారు) సగానికి సగం పన్ను మినహాయింపు పొందారు. ఆ విధంగా బీడీ మార్కెట్‌నంతటినీ ఆక్రమించడానికి ప్రయత్నించారు. దేశంలోని బీడీ కార్మికులు చేసిన సమరశీల పోరాటం ఫలితంగా ఆ తర్వాతి ప్రభుత్వాలు ఈ పన్ను మినహాయింపును బాగా తగ్గించుకోవలసి వచ్చింది. బీడీ యాజమాన్యాలు ప్రభుత్వ సడలింపు విధానాలను ఆసరాగా తీసుకొని కార్మికుల వేతనాల మీద, వారి హక్కుల మీద దాడి చేయడం ప్రారంభించారు. ఒక రూపంలో కార్మికులు పొందుతున్న ప్రయోజనాన్ని మరో రూపంలో హరించడానికి పూనుకున్నారు. ఇవాళ రాష్ట్రంలోని బీడీ కార్మికులు ఈ కింది ముఖ్యమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఆకు సమస్య : బీడీ పరిశ్రమలో తునికాకు బీడీలు చుట్టడానికి ఉపయోగించే ఒక ముడి సరుకు. ప్రకృతిలో లభించే ఈ ఆకులో అనేక రకాలుంటాయి. మంచివీ, చెడ్డవీ, దొడ్డువీ, సన్నవీ, ముక్కుడు, పలుగుడు రకం ఆకులు ఉంటాయి. ఒకరకం ఆకైతే 700 గ్రాములకు వెయ్యి బీడీలు తయారవుతాయి. మరో రకం ఆకు నుండి 800 గ్రాములకు వెయ్యి బీడీలు, ఇంకో రకం ఆకు నుండి ఒక కిలోగ్రాముకు వెయ్యి బీడీలు తయారవుతాయి. ఈ వైవిధ్యాన్ని ఉపయోగించుకొని యజమానులు 750 బీడీలకు సరిపోయే ఆకును ఇచ్చి వెయ్యి బీడీలు చేసుకురమ్మని కార్మికులను డిమాండ్ చేస్తారు. కార్మికులు తరుగుపడిన ఆకును తమ వేతనంతో మార్కెట్టులో కొనవలసి వస్తుంది. ఈ విషయంలో నిత్యం, ప్రతి ఫ్యాక్టరీలో యజమానులకు, కార్మికులకు వివాదాలు నడుస్తుంటాయి. ఈ రూపేణా ప్రతి కార్మికురాలు సగటున నెలకు 50 నుండి 100 రూపాయల వరకు నష్టపోతోంది. సంవత్సరానికి 600 నుండి 1200 రూపాయల వరకు నష్టపోతోంది. మన రాష్ట్రంలో బీడీ కార్మికులు సంవత్సరానికి 40 కోట్ల నుండి 80 కోట్ల రూపాయలను ఈ దోపిడీ కారణంగా నష్టపోతున్నారు. ప్రతి బ్రాంచీలో రోజు ఆకు నమూనా కత్తిరింపు జరిపి, తేలిన యావరేజి ప్రకారం ఆకు సరఫరా చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

వేతన సమస్య : బీడీ కార్మికులకు మన రాష్ట్రంలో నిర్ణయించిన కనీస వేతనాలు అతి తక్కువగా ఉన్నాయి. 'దేశంలో ఏ రాష్ట్రంలోనూ 66 రూపాయల కన్న తక్కువగా దినసరి కనీస వేతనాన్ని నిర్ణయించకూడదని ఘనమైన ప్రకటనలు చేస్తుంది. కానీ అదే పార్టీ ప్రభుత్వాలు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న చోట్ల కూడా ఆదేశాన్ని అమలు జరపరు. అన్ని పార్టీల ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకు వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని వాపోతారు. కాని తాము కనీస వేతనాలు నిర్ణయించేటప్పుడు, సవరించేటప్పుడు, ఈ విషయాన్ని మరిచిపోతారు. ప్రస్తుతం వెయ్యి బీడీలకు చట్టం ప్రకారం బేసిక్+వీడిఎ తదితర సదుపాయాలు కలిపి 86-33 పైసలు ఇస్తున్నారు. ఇదీ నిజామాబాద్ తదితర చోట్లలో మాత్రమే అమలవుతోంది. కానీ హైదరాబాద్, రంగారెడ్డి, జనగాం, ఆలేరు తదితర ప్రాంతాలలో ఇంకా 60 రూపాయలు ఇస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయి యాజమాన్యాలు.

కార్మిక చట్టాల సవరణ : బీడీ కార్మికులకు ఉద్దేశించిన బీడీ, చుట్ట కార్మికుల చట్టంలో అనేక లొసుగులు ఉన్నాయి. వీటి కారణంగా బీడీ కార్మికులకు సత్వర న్యాయం లభించడం లేదు. చట్ట నిబంధనలను ఉల్లంఘించే యజమానులకు, హాస్యాస్పదమైన కంటి తుడుపు శిక్షలు మాత్రమే నిర్దేశించబడ్డాయి. లేబర్ అధికారులు, ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి కేసులు వేసి, నేరాన్ని నిరూపించినా రు. 250ల గరిష్ఠ జరిమానా, కొన్ని సందర్భాల్లో రోజుకు రు. 20 జరిమానా నిర్దేశించబడ్డాయి. చట్టాలను ఉల్లంఘించడాన్ని నిరుత్సాహపరిచే విధంగా కఠినమైన శిక్షలు ఉండాలని, నేరాలను ప్రోత్సహించేవిగా ఉండకూడదని రెండవ లేబర్ కమిషన్ పేర్కొంది. ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకుతో, పని చేసే బీడీ కార్మికులకు ప్రస్తుతం సిక్ లీవులు కానీ, క్యాజువల్ లీవులు కానీ లేవు. ఆర్జిత లీవులు కూడా తక్కువగా ఉన్నాయి. కనుక, వీటిని పెంచవలసిన అవసరం ఉంది. ప్రసూతి సెలవు అమలుకు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. రోజూ తునికాకు నమూనా కత్తిరింపు జరిపి తగినంత ఆకు ఇచ్చే విధంగా చట్టంలో సవరణ చేయవలసిన అవసరం ఉంది.

ఎన్.డి.ఎ. ప్రభుత్వం నియమించిన రెండవ జాతీయ లేబర్ కమిషన్ ఈ విధంగా పేర్కొంది – 'మన దేశంలో 90 శాతానికి పైగా పేదలు అసంఘటిత రంగంలో ఉన్నారని చెప్పవచ్చు. వీరు ఉద్యోగులుగా, అర్ధ ఉద్యోగులుగా, నిరుద్యోగులుగా ఉన్నారు. వారు పేదలుగా ఉండడం, నామమాత్రపు ఉపాధి కలిగి ఉండడం మాత్రమే కాక, హక్కుల నుండి వంచించబడుతున్నారు. వివక్షతకు గురవుతున్నారు. వీరిలో చాలామంది షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు చెందిన వారు. వీరికోసం మన రాజ్యాంగం ప్రత్యేక పరిగణనను, రక్షణను నిర్దేశించింది. వీరి ఆదాయాలు అతి స్వల్పం. కనుక వీరు సాంఘిక భద్రతను 'కొన'లేరు. ఆహారాన్ని, బట్టలను కూడా కొనలేరు. మనం చేసిన చట్టాలు, వాటిని అమలు జరుపుతున్న తీరు రాజ్యాంగం చెప్పినట్లుగా ఈ కార్మికులకు ఎలాంటి రక్షణను గానీ, సంక్షేమాన్ని గానీ ఒనగూర్చడం లేదు.' ప్రస్తుతం బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మన ప్రభుత్వాలు, పాలకులు ప్రధానంగా చేయవలసింది నిధుల కేటాయింపులు మాత్రమే కాదు. చట్టాలలో తగిన మార్పులు చేసి, వాటిని దృఢ సంకల్పంతో అమలు జరిపితే కార్మికులకు మేలు జరుగుతుంది.

హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో ఇరవై సంవత్సరాల క్రితం నలభై వేల మంది బీడీ కార్మికులు పనిచేసేవారు. కానీ అతి తక్కువ కూలీ ఇవ్వడం వల్ల బతుకులు గడవక రకరకాల పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. నిజామాబాద్ లాగా కార్ఖానాల్లో గాకుండా ఇంట్లో పని చేస్తూ ఉంటారు. ఈ అన్ని కారణాల వల్ల ఈనాడు పదివేల లోపు మాత్రమే మిగిలారు. ప్రస్తుతం ఈ రెండు జిల్లాల్లో బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు దిన కూలీ కేవలం 60 రూపాయలు మాత్రమే. ఇది కూడా నవయుగ బీడీ కార్మిక సంఘం పోరాడిన ఫలితంగా ఆమేరకైనా పెంచుకోగలిగారు. స్థానిక బీడీ యజమానులు 'మేం ఉత్పత్తి చేసే బీడీలు తక్కువ రేటుకు అమ్ముకుంటాం కాబట్టి పెంచలేం' అంటున్నారు. అయినా యూనియన్ నాయకత్వంలో మహిళలు పోరాడి సాధించుకున్నారు. ఈ సంవత్సరం కూడా వేతనాలు పెంచుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. జంటనగరాల్లో ప్రావిడెంట్ ఫండ్ నామమాత్రంగా అమలవుతోంది. గుర్తింపు కార్డులు ఈనాటికి జంటనగరాల్లోని ఏ కార్ఖానా యాజమాన్యం కూడా ఇవ్వలేదు. ఇ.ఎస్.ఐ. కూడా వర్తింప చేయడం లేదు.

ఈనాడు అసంఘటిత రంగంలో కార్మికుల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. మరోవైపు సంఘటిత రంగం సంక్షోభంలో కూరుకొని కుంచించుకుపోయేటట్టు ప్రభుత్వాల విధానాలు ఉన్నాయి. ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాల్సి ఉంది.

(రచయిత నవయుగ బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు) వీ

కనీస భద్రత, సౌకర్యాలు లేకుండా అధికారుల అవినీతి, పాలకుల నిర్లక్ష్యంతో అనేక రకాలుగా అవస్థలు పడుతున్న భవన నిర్మాణ కార్మికుల పరిస్థితిని వివరిస్తున్నారు **జి. అనురాధ**

భవన నిర్మాణ కార్మికుల స్థితిగతులు

ప్రపంచీకరణలో భాగంగా రాష్ట్రంలో వ్యవసాయరంగం సంక్షోభంలోకి వెళ్లిన తర్వాత, ఉన్న ఊరిలో తిండి కరువై, అప్పులు పెరిగిపోయి నగరాలకు, మహానగరాలకు పొట్ట చేతబట్టుకొని వలసలు వచ్చి హైదరాబాద్ లాంటి మహానగరాలలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9 గంటల సమయంలో రోడ్ల పక్కనే కూలీలు అడ్డాలపై దర్శనమిస్తారు. వీళ్లే భవన నిర్మాణ కార్మికులు. లక్షలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తుంటారు. వీళ్ల బతుకుల్లోకి ఒక్కసారి తొంగిచూస్తే పటిష్ఠమైన బహుళ అంతస్తుల అందమైన నిలయాలు నిర్మిస్తారు. అయినప్పటికీ వాళ్లు నివాసముండేది పూరి గుడిసెల్లో మాత్రమే. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఎక్కడ కొత్త నిర్మాణాలు పెరుగుతున్నా అక్కడ గుడారాలు వేసుకొని ఈ కార్మికులు దర్శనమిస్తారు. వీరు నివాసం ఉండే ప్రాంతాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కనీస సదుపాయాలు లేక దీనావస్థలో ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా పది లక్షల నుండి పదకొండు లక్షల వరకు భవన నిర్మాణ కార్మికులు ఉండవచ్చని అంచనా. ఏడు లక్షల మంది రిజిస్టార్ చేయించుకున్న కార్మికులే ఉన్నారు. రాష్ట్రంలో నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు అమలులో భాగంగా సంఘటిత రంగ కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గి అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య పెరుగుతోంది.

తాజ్‌మహల్ అందాలను చూసి మురిసిపోతుంటాం. దాన్ని కట్టించిన షాజహాన్‌ను కీర్తిస్తుంటాం. అహా! ఓహో! అని పొగడ్తలతో ముంచెత్తుతుంటాం. కానీ దాని అందాల వెనక, రాజుగారి పొగడ్తల అట్టడుగు పొరల్లో దాగి ఉన్న, కూలీ చిందించిన రక్తం గురించి ఒక్క నిమిషం గూడా ఆలోచించదు సభ్య సమాజం. 'మేం మనుషులమే. మాకూ కొన్ని హక్కులూ, చట్టాలూ ఉన్నాయి. వాటిని అమలు చేయండి మహాప్రభో' అంటూ ప్రాణాలు వదులుతున్నా పట్టించుకోవు ప్రభుత్వాలు. అధికారులు స్పందించరు. అందుకే మహాకవి శ్రీశ్రీ 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అని నిలదీశారు. వాళ్ల గురించి పట్టించుకోవాలని ఎప్పుడో చెప్పినా, నేటికీ వలస కూలీలు నిత్యం ఏదో ఒకచోట శవాలవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మొన్నటి నారాయణగూడ ఘటన స్పష్టం చేస్తోంది.

1996లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం, ఆంధ్రప్రదేశ్ నిబంధన ప్రకారం 1998లో చట్టం వస్తే ఈ రాష్ట్రంలో అమలు చేయడానికి పాలకులకు పదమూడు సంవత్సరాల కాలం పట్టింది. ఇది రాష్ట్రంలో 2009 నుండి ప్రారంభించారు. 2007లో భవన నిర్మాణ కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డు ఏర్పడింది. సంక్షేమ బోర్డు ఏర్పడే నాటికి రెండు వందల కోట్ల రూపాయలు బోర్డులో నిల్వ ఉన్నాయి. ఈ డబ్బులు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి వినియోగించాలని ప్రభుత్వం ఆలోచించినప్పుడు, ట్రేడ్ యూనియన్స్, ప్రజా సంఘాలు అడ్డుకోవడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుతం బోర్డు దగ్గర మూడు వందల కోట్ల రూపాయలు నిల్వ ఉన్నాయి. ఈ చట్టం ప్రకారం నమోదు కాబడిన ప్రతి సభ్యుడు లబ్ధిదారుడిగా ఉంటారు. 50 రూపాయలు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో చెల్లించి నమోదు చేయించుకొని ప్రతి సంవత్సరం 12 రూపాయలు చెల్లించాలి.

దీని ప్రకారం –

1. ప్రమాదం వల్ల చనిపోయిన, లేదా శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి 2 లక్షల రూపాయలు.
2. ప్రమాదం వల్ల 50 శాతం అంగవైకల్యం కలిగినవారికి ఒక లక్ష రూపాయలు.
3. మహిళలకు ఇద్దరు పిల్లలు కనే వరకు ప్రసూతి సహాయర్థం ఐదు వేలు.
4. సాధారణ మరణం పొందిన వారికి రు. 30,000.
5. నమోదు కాబడిన ప్రతి సభ్యుడికి రాజీవ్ ఆరోగ్య శ్రీ వర్తింపు.
6. జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ ద్వారా కార్మికులకు శిక్షణ.
7. ప్రభుత్వ స్కాలర్‌షిప్స్ రాని కార్మికుల పిల్లలకు ఇవ్వాలి. బోర్డు ద్వారా స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా ఏడు లక్షల మంది కార్మికులు రిజిస్టార్ చేయించుకుంటే ఒక లక్షా యాభై వేల మందికి మాత్రమే కార్డులు ఇచ్చి మిగితావి 10 నెలలు గడుస్తున్నా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఈ రంగంలో పనిచేసే కార్మికులకు నిత్యం ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అసంఘటిత రంగ కార్మికులకు ఉన్నటువంటి చట్టాలే చాలా నామమాత్రపు చట్టాలు. అందులో ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు అవి అసలు అమలుకావు. అనేక చోట్ల ప్రమాదాలు జరిగినపుడు సంక్షేమ బోర్డ్ నుండి చట్టబద్ధంగా రావలసినటువంటి బెనిఫిట్స్‌ని ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా రూపంలో ఇవ్వడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిలువెత్తు నిదర్శనం. ఇది పాలకులకు వలస కూలీల పట్ల ఉన్న కపట ప్రేమ. ఉదాహరణకు, ఈ మధ్య జరిగిన నారాయణగూడ ఘటన. బాధితులకు ఒక రూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. సంక్షేమ బోర్డు డబ్బులను ఎక్స్‌గ్రేషియా రూపంలో కార్మిక

సింగరేణి బొగ్గు గనులలో ప్రమాదకరమైన శారీరక శ్రమ తెలంగాణ మట్టిమనుషులు చేస్తూ ఉంటే, కంపెనీ లాభాలను పై స్థాయి కొలువుల్లోని ప్రాంతేతరులు అనుభవిస్తున్నారని అంటున్నారు **ఎం. మయూర్**

సింగరేణి కింది స్థాయి కార్మికుల వ్యథలు

కంపెనీ లెక్కల ప్రకారం 1973-2010 వరకు బొగ్గు బావి ప్రమాదంలో చనిపోయిన కార్మికులు 980 మంది. తీవ్ర గాయాల పాలైన వారు 14,680 మంది. సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న ప్రతి బొగ్గు పెల్లకు కార్మికుల చమట రక్తం అంటి వస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రమాదాల గురించి, సేఫ్టీ గురించి అధికారులు ఎన్ని మాటలు చెప్పినా ఆచరణకు వచ్చేసరికి గుండుసున్నే అవుతుంది. ప్రమాదరహిత బొగ్గు గనులు, సేఫ్టీ ఫస్ట్ అనే ఎన్ని నినాదాలు ఇచ్చినా ఆచరణలో చిత్తశుద్ధి లేకుండా పోతోంది. కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా! బొగ్గు గనుల్లో చిందే నెత్తురు తమది కానప్పుడు ఉత్పత్తి మీదున్న శ్రద్ధ కార్మికుల ప్రాణాల మీద లేనప్పుడు ఎన్ని నీతి కబుర్లు చెప్పినా దండుగే. ఈ ప్రమాదాల పరంపరలో చనిపోయేది ఈ ప్రాంత వాసులైన కార్మికులే అని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బొగ్గు గనుల్లో రెక్కలు ముక్కలు చేసుకునేది, బండకింద బతుకులు బతికేది తెలంగాణ పల్లెలు. బతకలేక పొట్టచేతపట్టుకొని వచ్చిన ఈ ప్రాంత వాసులని గుర్తించాలి.

బొగ్గు బావి ప్రమాదాలపై అధ్యయనం చేసిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారుల అధ్యయనాల ప్రకారం బొగ్గు బావి ప్రమాదాలలో నూటికి తొంభై శాతం మానవ తప్పిదం వల్లనే జరుగుతున్నాయని తెలుస్తోంది. బొగ్గు బావి ప్రమాదాల నివారణ గురించి కోల్‌మైన్స్ రెగ్యూలేషన్స్ 1926 చట్టం అమలులో ఉన్నాయి. 1957లో ఆ చట్టానికి మరిన్ని సవరణలు చేసి మరింత సమగ్రత చేకూర్చారు. ఈ చట్టాలన్నీ గనుల నిర్వహణలో నిపుణులైన వారు సూచించిన అంశాల

మంత్రి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. అందుకే ఐ.ఎఫ్.టి.యు. లాంటి అనేక విప్లవ ట్రేడ్ యూనియన్స్ అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన చట్టాలు తేవాలని చాలా కాలంగా ఉద్యమాలు చేస్తున్నాయి.

కొత్త భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించాలంటే ఏ రకమైన మార్గదర్శక నిబంధనలు ఉండాలో ప్రభుత్వం నిర్ణయించింది. అందులో-

1. 1988లో రూపొందించిన ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్ (ఎఫ్.ఎస్.ఐ.) ప్రకారం ఆయా నిర్దిష్ట స్థల విస్తీర్ణం, వైశాల్యాన్ని బట్టి ఎంత ఎత్తు ఉండాలో ఎన్ని అంతస్థులుండాలో పేర్కొనబడింది.
2. 1998లో రూపొందించిన బి.ఆర్.ఎస్. (భవనాల క్రమబద్ధీకరణ పథకం) జి.ఒ. నెం. 419 ప్రకారం అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలోనూ క్రమబద్ధీకరించరాదు.
3. అట్టి అనధికార నిర్మాణాలకు అపరాధ రుసుం విధించే పథకం 2007లో ఆమోదించడం జరిగింది.
4. 1998 జూలై 31న రెండు చట్టాలు వచ్చాయి. జి.ఒ. నెం. 422, 423. వీటి ప్రకారం నగరాల్లో నిర్మించే అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు దగ్గర దగ్గరగా కాకుండా నిర్ణీత దూరం పాటించాలి. ఏదైనా ప్రమాదం జరిగినపుడు అగ్నిమాపక సహాయక చర్యలు చేపట్టడానికే కాకుండా కావాల్సిన గాలి, వెలుతురు ఉండడానికి అవసరం.

ఇవి కొన్ని చట్టాలు మాత్రమే. కాని పైన పేర్కొన్న చట్టాలు, నిబంధనలు ఏనాడు అమలు చేసిన పాపాన పోలేదు. అనుమతి ఇవ్వడం దగ్గర నుండి అనేక విషయాలలో అధికార గణం అమితమైన అవినీతికి పాల్పడడం వల్ల చట్టాలు కాగితాలపైనే ఉంటూ క్రమంగా భవనాల యజమానుల దగ్గర లంచాలు మేసి చుట్టాలైన వైనం చూస్తూనే ఉన్నాం.

కార్మికవర్గం దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు, సదుపాయాలు ప్రపంచీకరణ పుణ్యమా అంటూ ఒక్కొక్కటి హరించుకుపోతున్నాయి. ఇవాళ ఐదుగురు కలిసి యూనియన్ పెట్టుకోవాలంటే ప్రభుత్వాలు కోర్టుల ద్వారా ఎంతటి అణచివేతను ఎదుర్కొంటున్నాయో కార్మిక వర్గానికి అనుభవమే. సంఘటితంగా ఉన్న కార్మికులే ఇలాంటి అణచివేతను ఎదుర్కొంటున్నారంటే అసంఘటితంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, సామాన్య ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్ని త్యాగాలు చేయాలో, ఎన్ని పోరాటాలు చేయాలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న పోరాటాలు, ఆత్మ బలిదానాలు తెలియజేస్తున్నాయి. ఏది ఏమైనా తమ మనుగడ కోసం అమరులైన అమరుల సాక్షిగా, భవిష్యత్ తరాల సంక్షేమం కోసం అసంఘటిత రంగ కార్మికులు సమగ్రమైన చట్టాల కోసం ఉద్యమాలు, పోరాటాలు ఐక్యంగా చేయాల్సి ఉంది. కార్మికవర్గ అజేయశక్తి ముందు పేకమేడలాంటి ప్రపంచీకరణ పెట్టుబడిదారులు ఓడిపోక తప్పదని, ఈ గురుతరమైన బాధ్యత కమ్యూనిస్టుపైన ఎక్కువగా ఉందని నమ్ముతున్నాను.

(రచయిత ఐ.ఎఫ్.టి.యు. నాయకురాలు) వీ

ప్రాతిపదికనే ఏర్పాటైనవి. కాని ఆచరణలో మాత్రం చట్టం సూచించిన సేఫ్టీ రూల్స్ పాటించేదుంటే ఒక బొగ్గు పెల్ల బయటకు రాదని సింగరేణి అధికారులు బహిరంగంగానే అంటున్నారు. ప్రతి సంవత్సరం 30-40 మందిని బలి ఇవ్వకుండా ఈ రాష్ట్ర బొగ్గు అవసరాలు తీరడం లేదు.

2003లో రామగుండంలోని 7 ఎల్ఇపి మైన్‌లో జూన్ 16న జలప్రమాదం జరిగి 17 మంది కార్మికులు చనిపోయారు. అది జరిగిన తరువాత సరిగ్గా నాలుగు నెలలకు అక్టోబర్ 16 అర్ధరాత్రి జిడికె 8ఎ గనిలో ప్రమాదం జరిగి మరో పది మంది కార్మికులు చనిపోయారు. ఈ ప్రమాదాలపై కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఫలితంగా హైకోర్టు న్యాయమూర్తి భిరాల్ నఖ్వీ ఆధ్వర్యంలో కోర్టు ఆఫ్ ఎంక్వైరీ వేయాల్సి వచ్చింది. ఈ ఎంక్వైరీ దాదాపు 18 నెలలు సాగింది. 2004 డిసెంబర్‌లో కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ పూర్తయి ప్రభుత్వానికి నివేదిక అందించారు. కాని ఇంతవర దాక ప్రభుత్వం నివేదిక బయట పెట్టలేదు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులను శిక్షించలేదు. హైకోర్టు న్యాయమూర్తి విచారించిన కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీలకే అతిగతి లేకుండా పోతే ఇక బొగ్గు బావుల రక్షణ గురించి ప్రభుత్వం కాని, మేనేజ్‌మెంట్ కాని మాట్లాడే నైతిక అర్హత ఏముంటుంది. సేఫ్టీ గురించి పదే పదే వల్లించే సొల్లు కబుర్లకు విలువ ఏముంటుంది. అధికారులు, ఇసుక నింపే కాంట్రాక్టర్లతో కుమ్మక్కు పాల్పడిన అవినీతి పాప ఫలితంగా 7 ఎల్.ఇ.పి.లో 17 మంది ప్రమాదం పొంచి ఉందని కార్మికులు మూడు రోజులుగా మొత్తుకుంటుంటే పట్టించుకోని మేనేజ్‌మెంట్ కార్మికులను అదిరించి బెదిరించి పనులు చేయడం వల్ల 8ఎ ప్రమాదం జరిగింది. ఇవి కాకుండా చిన్న పెద్ద ప్రమాదాలు జరిగి నిత్యం సింగరేణిలో ఎక్కడో ఒకచోట కార్మికుల రక్తం చిందని రోజు ఉండడం లేదు. ప్రమాదాలలో ఒకరిద్దరు చనిపోతే నష్టపరిహారం చెల్లింపులోనూ వివక్షతే.

సంస్కరణల నేపథ్యంలో ఉత్పత్తి యావలో పడిపోయి కనిపించని కుట్రలతో కార్మికులను శారీరకంగా, మానసికంగా వేధించి పని భారం పెంచి శాసిస్తున్న అమానుష చర్యల వల్ల ఒత్తిడికి గురై కార్మికులు ఆత్మహత్య చేసుకుని చనిపోవడం ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిపోయింది. ఇవి కాకుండా నవ్వుతూ, తుల్లుతూ పనికి వచ్చి బావిలో కుప్పకూలి చనిపోవడం (ఇవి కంపెనీ దృష్టిలో సహజ మరణాలు) కూడా ఆందోళన కలిగించే రీతిలో పెరిగిపోయాయి. ఉత్పత్తి పెంపు కార్మికుల తగ్గింపు, ప్రైవేటీకరణ ఔట్‌సోర్సింగ్, రిట్రెంచ్‌మెంట్లు, వి.ఆర్.ఎస్.లు, పని ఒత్తిడి, అధికారుల జులుం పెరిగిపోయి, బొగ్గు బాయి కార్మికులను ప్రమాదాలకు, అంతర్గత చావులకు, ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. తెలంగాణ రక్తాన్ని బలిగొంటున్నాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

సింగరేణి బొగ్గు గనుల్లో శారీరక శ్రమ చేసేది ఈ ప్రాంత వాసులైన కార్మికులు. వీరిపై పెత్తనం చేసేది మాత్రం మరో ప్రాంత అధికారులు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత తెలంగాణ ప్రజలకు వర్తింపజేసే ముల్కీ రూల్స్‌కు తూట్లు పొడుస్తూ పాలకులు ఒక చట్టం తీసుకువచ్చారని కార్మికుల ఆరోపణ. దాని ప్రకారం స్వయం ప్రతిపత్తిగల సంస్థలలో, కంపెనీలలో, కార్పొరేషన్‌లలో ముల్కీ రూల్స్ వర్తింపనదే ఆ చట్ట సవరణ ఉద్దేశం. దీని ప్రకారం సింగరేణి వంటి సంస్థలో ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి ఉద్యోగాలలో చేరే వీలు కలిగింది. దానికి తోడు సింగరేణి సంస్థలో మొదట ఉత్తరాది వాళ్లు ఉన్నత స్థాయి అధికారులుగా కొనసాగినప్పటికీ తనదంతర కాలంలో ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లు సింగరేణిలో ఉన్నత స్థాయి అధికారులుగా చెలామణీ కావడం మొదలైందని కార్మికులంటున్నారు.

ఇట్లా ఉన్నత స్థాయిలో మేనేజ్‌మెంట్‌లో క్రియాశీలక పాత్ర పోషించే జనరల్ మేనేజర్లు డైరెక్టర్ స్థాయి అధికారులు ఆంధ్ర ప్రాంత అధికారులదే పెత్తనంగా మారిపోయిందంటున్నారు. ఆ తర్వాత ఎవరన్నా తెలంగాణ ప్రాంతపు వాళ్లు అధికారులుగా ఉన్నా (వీరి సంఖ్య ఎప్పుడూ 20 శాతంకు మించలేదు) అంత ప్రాధాన్యం కాని పోస్టులకు పరిమితం చేసి ముఖ్యమైన పోస్టులన్నీ ఆంధ్ర ప్రాంత అధికారుల చేతిల్లో ఉండిపోయాయంటున్నారు. దీనికితోడు సింగరేణిలో 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానికి, 49 శాతం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ సింగరేణి అడ్మినిస్ట్రేటివ్ కంట్రోల్ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడం జరుగుతోంది.

పారిశ్రామిక రంగానికి ప్రధానమైన ముడిసరుకు అందించే సింగరేణి పరిశ్రమలో ఆంధ్రప్రాంత పాలకులు ఎప్పుడు తమ కనుసన్నల్లో మెదిలే వారిని కంపెనీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, డైరెక్టర్స్‌గా సీనియెట్టిని పట్టించుకోకుండా నియమించడం ఆనవాయితీగా జరుగుతోంది. ఎందుకంటే తెలంగాణ బొగ్గు సంపద దోచుకుపోయే క్రమంలో పాలకులకు అనుగుణంగా మెదిలే అధికారుల అండదండలు ఎంతో అవసరమని గుర్తించడం వల్లనే ప్రణాళిక బద్ధంగా కుట్రపూరితంగా వ్యవహరించడం జరిగిందని తెలంగాణ వాదం. ఫలితంగా సింగరేణి బొగ్గు సంపదను తెలంగాణకు చెందకుండా తరలించుకుపోవడం సులువైంది.

పాలకుల దయాదాక్షిణ్యాల వల్ల అధికారంలో కొనసాగే ఆంధ్ర ప్రాంత అధికారులు తమ ప్రభువులకు తెలంగాణ సంపద దోచిపెడుతూనే పనిలో పనిగా తమ జేబులు నింపుకోవడం, కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడడం ఆనవాయితీగా మారింది. గతంలో రాంరెడ్డి కమిషన్ సి.ఎం.డి.గా పనిచేసి బి.ఎన్. రామన్ లారీల కొనుగోలు కుంభకోణం, జి.పి. రావు విదేశీ యంత్రాల కొనుగోలు కుంభకోణం, సంతానం, శాస్త్రీలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై, దాదాపు 600 కోట్ల రూపాయల కుంభకోణంపై జూన్ 1997లో శాసనసభా కమిటీ విచారణ జరిపింది.

విదేశీ లాంగ్‌వాల్ టెక్నాలజీ వల్ల జరిగిన నష్టం గురించి డైరెక్టర్ బెంజిమెన్ నాయకత్వంలో ఇంటర్నల్ విచారణ జరిపి ఇక్కడి భౌగోళిక పరిస్థితులకు అనుకూలించని విదేశీ టెక్నాలజీ వల్ల రు. 408 కోట్ల నష్టం సంభవించిందని తేల్చి చెప్పింది. ఇవి కాకుండా 142 అవినీతి అధికారుల మీద విచారణ జరిపిన సిబిఐ వారి అవినీతి ఆరోపణలను నిర్ధారించింది. 2001-03లో డైరెక్టర్ ఫా గా ఒక వెలుగు వెలిగిన అయ్యంగారిపై 40 కోట్ల పవర్ ట్రైమర్ల కుంభకోణం ఆరోపణలు వచ్చాయి. అయితే విచారణలో ఏమి వెలుగు చూడలేదు సరికదా ఒసిపి - 2 కుంభకోణంకు ప్రధాన బాధ్యుడిగా భావించిన డైరెక్టర్ పదవికాలం ముగిసిన తర్వాత కూడా అదనపు డైరెక్టర్‌గా రెండు సంవత్సరాలు పదవీ కాలం పొడిగించింది. డైరెక్టర్ ఫా పై వచ్చిన ఆరోపణల ఫలితంగా అతన్ని వెనక్కి పంపించింది తప్ప చట్ట ప్రకారం శిక్షించలేదు. ఫలితంగా అవినీతి అధికారులకు ఎదురు లేకుండాపోయింది.

స్క్రాప్ స్కాంలు వంటివి యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున తెలంగాణ బొగ్గు సంపద కొల్లగొట్టుకుపోయే క్రమంలో తమకు విశ్వాసపాత్రంగా వ్యవహరించే అధికారుల అవినీతిపై ఆంధ్ర పాలకులు

భమిడిపాటి రామగోపాలం (భరాగో)



ప్రముఖ హాస్య రచయిత భరాగో (78) ఏప్రిల్ 7న విశాఖలోని ఆయన స్వగృహంలో మరణించారు. రెండేళ్లుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్నారు. భరాగో విజయనగరం జిల్లా పుష్పగిరిలో 1932 ఫిబ్రవరి 6న జన్మించారు. తెలుగులో ఎం.ఎ. చేసి, విజయనగరంలోని సెన్సస్ సార్టింగ్ అండ్ టాబ్యులేషన్ ఆఫీస్‌లో చెక్కర్‌గా ఉద్యోగంలో చేరారు. మధ్యలో జూలై 1967 నుంచి మే 1969 వరకు సెలవు పెట్టి ఆంధ్రజ్యోతి వీక్లీలో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. తర్వాతి కాలంలో విశాఖ పోర్టు ట్రస్ట్ సర్వే విభాగంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి 1990లో పదవీ విరమణ చేశారు. 'వంటొచ్చిన మొగాడు' తొలి కథా సంపుటి. 'ఆ రామగోపాలం' పేరుతో తన ఆత్మకథను రాసుకున్నారు. 'ఇట్లు మీ విధేయుడు' అనే రచనకు 1991లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ లభించింది. మొత్తం 160 కథలు, 3 నవలలు, వెయ్యికి పైగా సాహిత్య, సాహిత్యేతర వ్యాసాలు రచించారు. ఆంధ్రప్రదేశ్ సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం ప్రత్యేక సంచిక (1976), విశాఖ సాహితీ ఉత్సవ సంచిక (1977), విశాఖ సాహితీ దశాబ్ది సంచిక (1982), పాలగుమ్మి పద్మరాజు సప్తతి పూర్తి సంచిక (1984), చాసోసప్తతి పూర్తి సంచిక (1985), కొత్తపల్లి వీరభద్రరావు సంచిక (1992), ద్వారం వెంకటస్వామి నాయుడు శతజయంతి సంచిక (1993), రావిశాస్త్రి స్మారక నివాళి (1994), అడివి బాపిరాజు శతవార్షిక ప్రత్యేక కళాసాహిత్య సంచిక (1995), రావు బాలసరస్వతీ దేవి అభినందన సంచిక (1999), ఇలా అనేక సావనీర్లు తీసుకురావడంలో, అనేక ప్రఖ్యాత రచయితల రచనలను పుస్తకాలుగా తేవడంలో విశేషంగా కృషి చేశారు. త్రివర్ణ పతాకం, కఠిన శిక్ష, థాంక్స్ టు రాఘవరావు, పనికి రాని కథ, నీకు కథలే ఇష్టం, పడమటి గాలి, వెన్నెల నీడ, మనోధర్మం వంటి కథలు విమర్శకుల ప్రశంసలు పొందాయి. తెలుగు సినిమా పాటలలోని సంగీత, సాహిత్య పార్శ్వాలను తాకుతూ 2001లో 'నూట పదహార్లు', 2005లో 'మరో నూట పదహార్లు' అనే రెండు సాధికారిక రచనలు చేశారు. అనేక విశిష్ట అవార్డులను ఆయన అందుకున్నారు. వీ

చూసి చూడనట్టుగా వ్యవహరించడం దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఉందని కార్మికులు బహిరంగంగా పేర్కొంటున్నారు.

ఆధిపత్య సంస్కృతీ సంప్రదాయాలు, అణచివేతకు గురయ్యే వర్గాల సంస్కృతీ సంప్రదాయాలను చిన్న చూపు చూస్తుంది. అణచి వేస్తుంది. ఆధిపత్య వర్గాల సంస్కృతి ఉన్నతమైందని, అణచివేత వర్గాల సంస్కృతి హీనమైందనే భావాన్ని తమ అధికార బలంతో సంస్కృతిక ఆధిపత్యం కొనసాగిస్తోంది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో పని ప్రారంభించడానికి ముందు మైసమ్మను కొలిచే విధంగానే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు, బొగ్గు గనులలో ప్రతి పని ప్రారంభానికి ముందు బావి మైసమ్మలను ఏర్పాటు చేసుకొని తమ సంప్రదాయం ప్రకారం పూజించేవారు. ఆ విధంగా తెలంగాణ ప్రజల సంస్కృతిలో భాగమైన మైసమ్మ తెలంగాణ శ్రమశక్తితో ఉత్పత్తి కొనసాగే సింగరేణిలో భాగమైంది. కొత్తగా గనులు ఆరంభించినా, గనుల్లో కొత్త యంత్రాలు ప్రవేశపెట్టినా కార్మికులు మైసమ్మ పూజలతో ఆరంభించడం ఆనవాయితీ, సంప్రదాయం. కాని ఇటీవల యాజమాన్యంలో క్రియాశీలక ఆధిపత్యం చెలాయించే అధికారులు కార్మికుల బతుకులనే కాదు, కార్మికులు కొలిచి, ఆరాధించే మైసమ్మ దేవతలను కూడా మింగేశారు.

మైసమ్మ గుడుల స్థానంలో కార్మికుల విరాళాలతో దుర్గాదేవి మందిరాలను నిర్మించి సంప్రదాయిక మైసమ్మకు అతిగతి లేకుండా చేశారని, పూజా విధానంలోనూ మార్పులు వచ్చాయని, సంప్రదాయ మైసమ్మ పూజలు మటుమాయం అయ్యాయని, అయ్యవార్లు వచ్చారని, అంగరంగ వైభరంగా దేవి నవరాత్రి ఉత్సవాలు వచ్చాయని తెలంగాణ వాదులు అంటున్నారు. హరికథలు, సీతపారాయణాలు, కూచిపూడి, భరతనాట్యం కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేక పూజలు వచ్చాయి. అంతవరదాకా మైసమ్మ గుడుల మొఖమైనా చూడని అధికారులు భార్యా, పిల్లలతో వచ్చి యజ్ఞయాగాదులు, సామూహిక వ్రతాలు నిర్వహించడం మొదలైందంటున్నారు. ప్రాంతేతర అధికారుల అండదండలతో స్వర్ణాభరణ శోభితమైన దుర్గాదేవి ముందు తెలంగాణ తల్లి మైసమ్మ కనుమరుగైంది. ఈ సాంస్కృతిక దురాక్రమణ, పరాయికరణ ఇంతటితో ఆగిపోలేదు. సత్యసాయి మందిరాలు, వెంకటేశ్వర ఆలయాలు ప్రతి కార్మిక ప్రాంతాలలో వెలిశాయి. జన్మ దినోత్సవాలు, కళ్యాణోత్సవాలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను మరుగునపరిచాయి.

పని స్థలాల్లో కార్మికులు కలిసి మంచి చెడులు కలబోసుకోకుండా గనుల మీద యోగ మందిరాలు, ధ్యాన మందిరాలు వెలిశాయి. అన్ని సమస్యలకు యోగ, ధ్యానమే పరిష్కార మార్గంగా ప్రచారం సాగించారు. కంపెనీ స్వంత ఖర్చులతో నీళ్లస్వాములు, కళ్లస్వాములు, యోగ స్వాములను రప్పించి కార్మికుల సకల సమస్యలకు పరిష్కారం ఇదేనంటూ ప్రచారం సాగించారు. మరోవైపు తమతోపాటు నవ్వుతూ, తుల్లుతూ బాయిపనికి వచ్చి బొగ్గు గని ప్రమాదంలో నెత్తురు ముద్దయి చనిపోతే అందుకు సానుభూతిగా పనులు బందుపెట్టే మానవీయ సంస్కృతిని మంటగలిపే విధంగా, కార్మికుడు చనిపోతే మిగితా కార్మికులు సచ్చిన శవాన్ని తొలగించి, యథావిధిగా పనులు నిర్వహిస్తే నగదు పారితోషికం ఆశచూపి మానవత్వాన్ని సమాధి చేశారు. ఒకవైపున సంస్కరణల రూపేణా విపరీతమైన పనిభారం మోపి, ఊ అంటే ఆ అంటే చార్జిషీట్లు పేర, సస్పెండ్ల పేర వేధింపులకు గురిచేస్తూ, ఒక కలం పోటుతో హక్కులను హరించివేస్తూ, కార్మికుల మెడకు కనిపించని ఉరితాళ్లు వేసి, అటు పనిలోనూ, ఇటు కార్మికుని సామాజిక జీవితాన్ని అతలాకుతలం చేసి వ్యవస్థీకృత దుర్మార్గాన్ని అమలు చేస్తూ, బొగ్గు బావులను మృత్యుకుహారాలు చేస్తూనే, మరోవైపు సాంస్కృతిక ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. బొగ్గు గనుల పేర, అధికోత్పత్తి పేర ఈ ప్రాంతంలో ఊళ్లకు ఊళ్లను మాయం చేసినట్టే ఈ ప్రాంత ప్రజల సాంస్కృతిక జీవితాన్ని విధ్వంసం చేస్తున్నారని తెలంగాణ వాదులు ఆరోపిస్తున్నారు. వీ

పోర్టులలో ప్రైవేటీకరణ చేపట్టి, కార్మికులను తగ్గించి, ఉన్న కార్మికులపై పనిభారం పెంచి, లాభాలే ధ్యేయంగా విశాఖపట్నం పోర్టులో సాగుతున్న కార్మిక దోపిడీని వివరిస్తున్నారు **పి.వి. రమణ**

కార్మికులు దోపిడీదారులెలా అయ్యారు?

ఫ్యాక్టరీలో కార్మికుడు (చార్లీ చాప్లిన్) పనిచేసి, అలసిపోయి విశ్రాంతి కోసం రెస్ట్ రూంకి వెళ్లి సిగరెట్ కాల్చుకుంటుంటే, ఫ్యాక్టరీ ప్రెసిడెంట్, ఆ రూంలోనే ఏర్పాటు చేసి ఉన్న స్క్రీన్ ద్వారా కార్మికుణ్ణి 'ఏయ్ ఏం చేస్తున్నావు? వెంటనే పనిలోకి వెళ్లు' అని గదమాయిస్తే, కార్మికుడు అక్కడ నుండి పనిలోకి పరిగెడతాడు. ఇది 1936లో చార్లీ చాప్లిన్ తీసిన మోడర్న్ టైమ్స్ చిత్రం లోనిది.

కార్మికులు చేసిన పనికంటే అన్యాయంగా పదిరెట్లు అధికంగా ఇన్సెంటివ్ తీసుకుంటున్నారని, కేవలం రెండు మూడు గంటల పార్ట్ టైం పని చేస్తూ పూర్తి టైం జీతం తీసుకుంటూ, మాతృసంస్థను దోపిడీ చేయడం న్యాయమేనా? - 2010లో విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ యజమాన్యం వేసిన కరపత్రాల సారాంశం.

మన దేశంలో 12 మేజర్ పోర్టులున్నాయి. అంతర్జాతీయ వ్యాపార సరుకుల మొత్తం రవాణాలో 90 శాతం ఈ ప్రధాన రేవుల ద్వారానే జరుగుతాయి. 1933లో ప్రారంభమైన సంవత్సరమే విశాఖపట్నం పోర్టు ఒక లక్షా, 30 వేల టన్నుల సరుకు రవాణా చేసి నేటికి 65 మిలియన్ టన్నులు రవాణా చేసే స్థాయికి ఎదిగింది.

కార్మికుల తగ్గింపు, వారిపై పని ఒత్తిడి గత కాలం నుండే జరుగుతున్నా, 1990ల నుండే ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా అవి మరింత పెరిగాయి. మొత్తం 12 పోర్టులలో 1988లో రెండు లక్షల మంది కార్మికులు ఉండగా, 2002 నాటికి 90 వేలకి, 2010 నాటికి 60 వేలకి తగ్గిపోయారు.

విశాఖ పోర్టు వివరాలు

సంవత్సరం	కార్మికులు	ఉత్పాదకత (మి.ట)
1985-86	11,646	15.90
1991-92	11,121	21.50
1999-2000	7800	39.51
2009-2010	6500	65.00

గత ఇరవై సంవత్సరాలలో ఉత్పాదకత మూడు రెట్లు పెరిగితే, కార్మికుల సంఖ్య సగానికి పడిపోయింది. నలభై సంవత్సరాల నుండి వాడుతున్న యంత్రాల సామర్థ్యం పూర్తిగా పడిపోయింది. 10 మంది పనిచేసే చోట కేవలం ముగ్గురు, నలుగురితో పనులు చేయిస్తున్నారు. ఈ క్రమం కార్మికులపై విపరీతమైన పని భారం పెంచింది. అయినా 2001 నుండి 2007 వరకు వరుసగా మేజర్ పోర్టులన్నింటిలోనూ ప్రథమ స్థానం సంపాదించిన ఘనత విశాఖ పోర్టు కార్మికులదే.

పోర్టులో ఉత్పాదకత పెంచడానికి యాజమాన్యమే ఆపరేషన్ సెక్షన్‌లైన ఓర్ హాండ్లింగ్, మెరైన్ / ఫ్లోటింగ్ క్రాఫ్ట్స్, ట్రాఫిక్ రైల్వే విభాగాలలో ఇన్సెంటివ్ స్కీంలను ప్రారంభించింది. ఈ మధ్యనే జరిగిన వేజ్ ఒప్పందం తర్వాత ఈ ఇన్సెంటివ్ స్కీంలను రివైజ్ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పెరిగిన, పెరగబోతున్న పని భారం కారణంగా, ఇన్సెంటివ్‌లో ఎంతో కొంత మెరుగుదలను కార్మికులు ఆశిస్తున్న తరుణంలో మేనేజ్‌మెంట్ కరపత్రాలు రిలీజ్ చేసింది. అందులో వారిచ్చిన లెక్కల ప్రకారమే 2006-07లో నికర లాభం రు. 121.88 కోట్లు, 2007-08లో రు. 111.43 కోట్లు, 2008-09లో రు. 93.43 కోట్లు, 2009-10లో ఫిబ్రవరి నాటికి రు. 47.93 కోట్లు వచ్చాయి. గత సంవత్సరంలో ఇంతకన్నా ఎక్కువే కోట్లాది రూపాయల లాభాలుగా వచ్చాయి. మరి ఈ లాభాలన్నీ ఎవరి కష్టం వలన వచ్చినట్లు? ఎక్కడికి వెళ్లినట్లు?

భవిష్యత్తులో నష్టం రాబోతోందని, దానికి కారణం వేజ్ ఎగ్రిమెంట్ వలన పెరిగిన జీతాలు, కార్మికుల ఇన్సెంటివ్‌లు, పెన్షనర్లకు పెన్షన్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడమేనట. అందుకోసం ఇప్పటికే కార్మికులు అన్యాయంగా తీసుకుంటున్న ఇన్సెంటివ్‌లను తగ్గించుకోవాలి. 'అభివృద్ధి దిశవైపు చిన్న మార్పు జరగాలన్నా కొద్దిమందికి ఎంతో కొంత అసౌకర్యం, అసంతృప్తి కలగకుండా మార్పు సాధ్యం కాదు' అంటున్నారు. అభివృద్ధి ఫలాలు దానికి కారకులైన కార్మికులకు చెందనపుడు ఎవరి కోసం ఈ అభివృద్ధి?

నష్టాలకు కారణం కార్మికుల మీద నెట్టేస్తున్న యాజమాన్యం, తన దుబారా గురించి మాట్లాడితే సరైన జవాబు ఇవ్వదు. 40 కోట్ల రూపాయల ఖర్చు చేసి 'పేపర్ లెస్' ఆఫీసుల్ని ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికి కంప్యూటర్స్‌ని ఏర్పాటు చేశారు. అవి సరిగ్గా పని చేయక ఉద్యోగులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఒకవైపు సమాచారం కోసం మేనేజ్‌మెంట్ ఒత్తిడి, మరోవైపు సరిగ్గా పని చేయని కంప్యూటర్ల కారణంగా ఇటు కంప్యూటర్ల మీద పని చేస్తూ, మరోవైపు మాన్యువల్‌గా కూడా రికార్డులు రాసుకోవలసి వస్తోంది. ఈ ఉద్యోగుల్లో అధిక శాతం 8 గంటల పని ఎప్పుడో మర్చిపోయారు. ఆఫీసులో దాదాపు 10, 12 గంటలు కూడా పని చేస్తున్నారు. వీరిలో ఎవరికీ ఓవర్ టైం అలవెన్స్ ఇవ్వడం లేదు. ఇన్సెంటివ్‌లు తగ్గించడానికి అవసరమైన ఎత్తుగడల కోసం ఒకర్ని కన్సల్టెంట్‌గా నెలకు యాభై వేల రూపాయల జీతం మీద తీసుకువచ్చారు. సెక్యూరిటీ కోసం

సంవత్సరానికి 22 కోట్లు ఖర్చు పెడుతున్నారు. అనేక చోట్ల జరుగుతున్న అవినీతితో పాటు, పోర్టు రైల్వేలో ప్రైవేట్ కంపెనీలు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల డెమరేజిలో జరుగుతున్న అవినీతిని పట్టించుకోనే నాథుడు లేడు.

విపరీతమైన కాలుష్యంతో, దుమ్ము, ధూళిలో కార్మికులు పని చేస్తూ అనారోగ్యం పాలవుతుంటే, అధికార్ల ఆఫీసు రూములన్నీ ఎయిర్ కండిషన్డ్ చెయ్యబడ్డాయి. అధికార్లంతా లగ్జరీ కార్లు వాడుతున్నారు. ఇంతకీ ఇన్సెంటివ్ కోసం ఖర్చు చేసేది 8 కోట్ల రూపాయలు. మొత్తం ఆదాయం రు. 612 కోట్లు. వచ్చిన నికర లాభం రు. 47.93 కోట్లు. అంటే దానిలో ఇది కేవలం 1.7 శాతం మాత్రమే. అంతేకాకుండా ఈ 1.7 శాతం పేమెంట్ వల్లనే మొత్తం ఆదాయం రు. 612 కోట్లు వచ్చిందన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. మరి సంస్థకు నిరంతరం తమ కష్టంతో లాభాలనార్జించి పెడుతున్న కార్మికులు పని దొంగలుగా, దోపిడీదారులుగా ఎప్పుడు మారినట్లు? ఇది దొంగే 'దొంగ, దొంగ' అని అరిచినట్లు లేదా?

ఒకప్పుడు వేలాది మంది కార్మికులతో, చుట్టూ యంత్రాల రొదతో సెక్షన్‌లన్నీ ఎంతో సందడిగా ఉండేవి. ఉదాహరణకు మొబైల్ క్రేన్స్ సెక్షన్‌లో 1990ల్లో 250 మంది కార్మికులు; 3, 5, 10 టన్నుల బరువు ఎత్తే క్రేన్లు 12; 3, 10 టన్నుల సరుకు ఎత్తే ఫోర్క్ లిఫ్ట్స్ 50; భారీ లోడర్లు 2; ఒక ఫ్లోక్లైన్‌తో పనిచేస్తూ, ఆ షెడ్లలో కార్మికుల అరుపులు కేకలతో సమిష్టి కృషి, శ్రమైక జీవన సౌందర్యమంటే ఏమిటో ఎదురుగా కళ్లకు కనబడేది. ఈనాడు ఆ సెక్షన్ చావుకు ఎదురు చూస్తున్న మనిషిలా బావురుమంటుంది. ఆ యంత్రాలు లేవు. కేవలం 4 క్రేన్స్, 6 ఫోర్క్ లిఫ్టర్స్, 90 మంది కార్మికులతో నడుస్తూ ఉంది.

మరి ట్రేడ్ అవసరాలన్ని ఎవరు తీరుస్తున్నట్టు? గతంలో వస్తువుల ఎగుమతి, దిగుమతులన్నీ ఈ సెక్షన్ మెషినరీతోనే జరిగేవి. కాని నేడు ప్రైవేట్ కంపెనీలు, ఆ పనులన్నీ తమ స్వంత మెషినరీతో చేసుకొనే అవకాశం ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ కల్పించడంతో పూర్వం కేవలం 10 మాత్రమే ఉన్న స్టీవ్ డోరింగ్, షిప్పింగ్ కంపెనీలు నేడు దాదాపు 150 వరకు పెరిగి వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నాయి. మొబైల్ క్రేన్స్ సెక్షన్ కార్మికుల శ్రమ ఫలితంగా వచ్చే ఆదాయం మొత్తం పోర్టు కార్మికులకు, సంస్థకు, ప్రభుత్వానికి అందుతుండేది. కాని అదే ఆదాయం ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేసి, నష్టాలకు కార్మికులను జవాబుదారీ చేయడం ఎంత అన్యాయమో ఎవరికైనా అర్థమవుతుంది.

పోర్టులో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే పద్ధతి మొదటి నుంచీ అమలులో ఉంది. వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం ద్వారా వచ్చే ఐదు నుండి పది లక్షలను వదులుకొని, పిల్లల ఉద్యోగాల కోసం, పనిచేయగల సామర్థ్యం ఉండి కూడా 10, 15 సంవత్సరాల సర్వీస్ వదులుకొని 1500 మంది కార్మికులు మెడికల్ అన్‌ఫిట్ అయ్యారు. వారి పిల్లలందరినీ మస్టర్ లిస్ట్‌లోకి తీసుకువచ్చారు. 1990 తర్వాత ఉద్యోగాలు ఇవ్వలేమని చెప్పేశారు. నిజానికి ఆ రోజుల్లోనే ఉద్యోగాలు రావని ముందుగా చెప్పి ఉంటే, వారందరూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని ఉండేవారు. తద్వారా కుటుంబ రక్షణకు కొంత సొమ్ము మిగిలేది. లేదా పూర్తి సర్వీస్ చేసుకొని ఎక్కువ పెన్షన్ పొందగలిగేవారు. 1993 నుండే అటు పిల్లలకు ఉద్యోగాలు రాక, ఇటు అతి తక్కువ పెన్షన్‌లతో అనేక మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం, దిగులుతో చనిపోవడం జరిగింది. మస్టర్ లిస్ట్ అభ్యర్థులు కూడా నలుగురు ఆత్మహత్యలు చేసుకొన్నారు. అనేక ఆందోళనల ఫలితంగా దాదాపు 800 మందికి ఫుల్ కళాసీలుగా ఫిక్స్‌డ్ జీతం మీద తీసుకొన్నారు. మిగతా వారు నేటికి కూడా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు.

ఫుల్ కళాసీలుగా తీసుకొన్నవారితో రెగ్యులర్ కార్మికులు చేసే అన్ని పనులు చేయిస్తూ వారికి కేవలం రు. 2750, రు. 5500, రు. 7100 ఫిక్స్‌డ్ జీతం ఇస్తున్నారు. వీరితో అతి ప్రమాదకరమైన రైల్వే ఆపరేషన్ పనులు చేయిస్తున్నారు. వారికి ఏమైనా జరిగితే పోర్టు కార్మికుడికి వచ్చే నష్టపరిహారం అందదు. వీరికి బోనస్ లేదు. సెలవులు లేవు. అవసరముండి సెలవు పెడితే రెండు రోజుల జీతం కట్. కంటిన్యూగా పని చేస్తే వారికి రెగ్యులర్ చేయాల్సి వస్తుందని, చట్ట విరుద్ధంగా 90 రోజులకొకసారి సర్వీస్ బ్రేక్ ఇస్తూ, వారే ఇచ్చిన బ్రేక్ రోజుకు రెండు రోజుల జీతం కట్ చేస్తున్నారు. వీరిలో 14 సంవత్సరాల నుండి రెగ్యులర్ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు చాలా మంది ఉన్నారు.

ప్రపంచబ్యాంక్ ఆదేశాలను తలదాలుస్తూ, కేంద్ర ప్రభుత్వం లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేట్‌పరం చేయడం మనం చూస్తున్నాం. ఎటువంటి వ్యతిరేకత ఉండదనుకొన్న సంస్థల్ని నేరుగా ప్రైవేట్‌పరం చేస్తూ, ఏమాత్రం వ్యతిరేకత వస్తుందనుకొన్న సంస్థల్ని అంతర్గతంగా బలహీనం చేస్తున్నారు. అటువంటి కుట్రలో భాగమే నేడు పోర్టుల విషయంలో కూడా జరుగుతోంది. ప్లాను ప్రకారం ప్రతి మేజర్ పోర్టు దగ్గరలో, అనేక రాయితీలిచ్చి ప్రైవేట్ పోర్టులను ఏర్పాటు చేయడం, పోటీ పేరుతో సతమతమవుతున్న ప్రభుత్వ సంస్థను ఢిల్లీ నుండి రకరకాల ఆదేశాలతో, ఆర్థిక వ్యవహారాలతో, ఉద్యోగ నియామకాల విషయంలో స్వతంత్రంగా వ్యవహరించకుండా చేసి, అనేక చిక్కులు కల్పించి సంస్థ తనంత తాను నడపలేక పోతున్నదన్న నిర్ధారణకు వచ్చేటట్టు చేసి, చివరకు ప్రైవేట్‌పరం చేయడమే జరుగుతోంది.

దీనికి మంచి ఉదాహరణ బాల్కో సంస్థ ఉదంతం. భారత అల్యూమినియం కంపెనీ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఎస్. వరదన్ 'ఈరోజు బాల్కో ఉత్పాదకత అంత ఉన్నతంగా ఉండడానికి, లాభాలు సంపాదించడానికి కారణం ఆ సంస్థలో పనిచేసిన కార్మికులు, ఇంజనీర్లు, ఇతరులు చేసిన నిరంతర శ్రమే. ఒక విధంగా దేశంలో పబ్లిక్ రంగ సంస్థల్ని ఎంత గొప్పగా నడపవచ్చో నిరూపించిన సంస్థ అది. కాని ప్రభుత్వం అటువంటి కంపెనీలో 51 శాతం ప్రైవేట్‌పరం చేయడం చాలా అన్యాయమైన విషయం. దేశంలో ఆర్థిక సమస్యలుండవచ్చు. కాని లాభాలతో నడుస్తున్న సంస్థల్ని ప్రైవేట్ వారికి పళ్లెంలో పెట్టి సమర్పించడం ఎంతవరకు సబబు? ఇదంతా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు అనుకూలంగా చేస్తున్న పని. దీనిని ఎవరైనా విమర్శిస్తే వారిని భవిష్యత్ చూడలేని సంప్రదాయ వాదులుగా, మార్పును అడ్డుకొంటున్న వారిగా ముద్రలు వేస్తున్నారు. కనీసం అవసరమైన జాగ్రత్తలు తీసుకొని దేశం నాశనం కాకుండా చూడవలసిన బాధ్యత మనకులేదా' అంటూ హిందూ దినపత్రికలో పాలకుల విధానాలను బట్టబయలు చేశారు.

పోర్టు కార్మిక నాయకుడు అబ్దుల్ రహమాన్ (సుబ్బారాయుడు) హంతకులెవరు?

తమను నమ్మిన కార్మికుల జీవితాలను బలిపెట్టి, స్వార్థమే పరమార్థంగా, ఆస్తులు పెంచుకుంటూ, ట్రేడ్ యూనియన్‌ను, ట్రేడ్‌గా మార్చుకొని, చాలా మందిలా సుఖంగా బతకకుండా అతనెందుకు పెట్రోలు పోసుకొని మరీ కాలిపోయాడు?

అతను ఎక్కడ్నుంచి వచ్చాడో, రక్త సంబంధీకులున్నారో లేదో కూడా తెలియదు. తెలిసిందల్లా సందిగ్ధ సమాచారమే.

పేద కుటుంబం నుండి వచ్చిన అతని ఊరు పేటపాలెం. పేరు సుబ్బారాయుడు. కోమటి కులం. సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ కోసం గుంటూరు వచ్చాడు. 1962లో విద్యార్థుల సమస్యలపై ఆందోళన చేస్తున్న క్రమంలో అక్కడ పనిచేస్తున్న ముస్లిం స్త్రీ, సోదరభావంతో అభిమానించి అతనికి ఆర్థిక సహకారం అందించింది. కర్నూలులో పి.యు.సి. చదివాడు. నంద్యాల పాలిటెక్నిక్‌లో డిప్లొమా చదవడానికి కూడా ఆమె సహకారమే కారణం. అందుకే కృతజ్ఞతా భావంతో తన పేరు అబ్దుల్ రహమాన్‌గా మార్చుకొన్నాడు. ఆమెకు తెలిసిన వారి సిఫారసు కారణంగా ఆనాటి విశాఖ పోర్టు ఛైర్మన్ సాంబమూర్తి అతనికి ఓర్ హాండ్లింగ్ కాంప్లెక్స్‌లో ఉద్యోగమిచ్చారు.

బైలడిల్లా, కిరండల్, కిరుబురుల్లో గల ఇనుప ఖనిజాన్ని జపానుకు ఎగుమతి చేయడానికి విశాఖ పోర్టులో ఓర్ హాండ్లింగ్ ప్లాంట్ 1965లో ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న పాలిటెక్నిక్, ఐ.టి.ఐ., ఇంజనీరింగ్ యువకుల్ని రిక్రూట్ చేసుకొన్నారు. వీరిలో చాలామందిపై ఆనాటి నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రభావం అధికంగా ఉండేది. అప్పటి ప్లాంట్ పరిస్థితులు భయంకరంగా ఉండేవి. బానిసల్లా పని చేయించారు. వీటిపై నిరంతరం పోరాటాలు జరిగేవి. ఆ క్రమంలోనే యూనియన్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తూనే, మరోవైపు, 'తెలుగు యువజన సమితీ'ని స్థాపించి ప్రజల సమస్యలపై అధికార్లను నిలదీసి సమస్యలు పరిష్కరించేవాడు.

ఆ రోజుల్లో ఏ సమస్య వచ్చినా కార్మికులంతా ఏకమై పోర్టు ఛైర్మన్‌నే ప్లాంటుకు రప్పించిన సందర్భాలు అనేకం. రోడ్డు మీదే ఛైర్మన్‌ను చుట్టుముట్టి, అక్కడికక్కడే ఆదేశాలిచ్చేటట్టు చేసేవారు. ఉద్యోగమిచ్చిన సాంబమూర్తి రహమాన్‌ను పిలిపించి యూనియన్ కార్యకలాపాలు వదిలేయమని అడిగితే వీలు కాదని చెప్పేవాడు. అప్పుడు ఒక ఆఫీసురు పదవిని అప్పటకిప్పుడు కొత్తగా కల్పించి ఆశ చూపించినా లొంగలేదు. ట్రేడ్ యూనియన్ ఉద్యమం కోసం చివరి వరకు బ్రహ్మచారిగానే ఉండిపోయాడు.

కార్మికుల పోరాట చైతన్యాన్ని తట్టుకోలేని యాజమాన్యం రహమాన్‌తో పాటు మరో నలుగురు కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించింది. దాదాపు ఐదు సంవత్సరాల తీవ్ర ప్రయత్నాలు చేసి చివరకు ఐ.ఎన్.టి.యు.సి. నాయకుల సహకారంతో తిరిగి ఉద్యోగంలోకి చేరాడు. ఆనాటి నుండి ఐ.ఎన్.టి.యు.సి.లోనే ఉంటూ రెండు సార్లు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికోబడ్డాడు.

ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల నిర్వహణలో కొనసాగించాల్సిన కొన్ని ఉన్నత ప్రమాణాలను, విలువలను ఏర్పరిచాడు.

అందులో కొన్ని – గొప్ప క్రమశిక్షణతో ఉండేవాడు. అందర్నీ అలాగే ఉండేటట్లు చేసేవాడు. గొప్ప ఆర్థిక క్రమశిక్షణ. యూనియన్‌కి చెందిన ప్రతి పైసాకు లెక్కలు చెప్పాల్సిందే. కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం కలిగించి, వారి సెక్షన్‌లలో సమస్యల పరిష్కారానికి, ఐక్య పోరాటాలకు వారే చొరవ తీసుకొనేటట్లు చేయడం. ఐ.ఎన్.టి.యు.సి. రాష్ట్ర కార్యదర్శి అయినా ఏనాడు కూడా ఒక్క రాజకీయ నాయకుడు కూడా యూనియన్ మెట్లెక్కలేదు. ప్రతి నెలా జనరల్ బాడీ సమావేశాలు, నిరంతరం సెక్షన్ సమావేశాలు. ప్రతి సమస్య మీదా ఎప్పటికప్పుడు కరపత్రాలు. కార్మికుల కుటుంబాల కలయికతో ప్రతి సంవత్సరం పిక్నిక్‌లు (యూనియన్ సబ్సిడీతో). సస్పెండ్ అయిన కార్మికులకు సహ కార్మికుల చందాలతో నష్టం వచ్చే జీతం చెల్లింపు. మేనేజ్‌మెంట్ అవకతవకలపై, అవినీతిపై నిర్దిష్టమైన సమాచారంతో హైకోర్టులో కేసులు, సుప్రీం కోర్టులో పి.ఐ.ఎల్. కార్మిక సమస్యలపై 1971లో 12 రోజులు, 1974లో 14 రోజులు, 1984లో 16 రోజులు ఆమరణ నిరాహార దీక్షలు. వేజ్ రివిజన్ కోసం దేశవ్యాపిత పోర్టుల సమ్మె జరుగుతోంది. ఢిల్లీలో ఐ.ఎన్.టి.యు.సి. ఫెడరేషన్ ప్రభుత్వానికి అనుకూలంగా సమ్మె విరమణ నిర్ణయం తీసుకొంది. సమ్మెలో ఉన్న రహమాన్‌కి ఢిల్లీ నుండి విరమించమని ఫాక్స్ పంపారు. అయినా సమ్మె విరమించకపోవడంతో, స్వయంగా ఆనాటి ఛైర్మన్ పి.వి.ఆర్.కె. ప్రసాద్ రహమాన్‌కి ఫోన్ చేసి ఫాక్స్ అందలేదా అని అడిగి ఉద్యోగుల్ని వెంటనే డ్యూటీలోకి పంపమని అడిగితే, తనకి ఫాక్స్ అందలేదని చెప్పి, సమ్మె కొనసాగించి కార్మికుల ఐక్యతకే కట్టుబడ్డాడు. ఐ.ఎన్.టి.యు.సి. రాష్ట్ర నాయకుడైనా, ఎలక్షన్స్ వచ్చినప్పుడు కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించండి అని ఒక్కనాడైనా ప్రకటనలివ్వలేదు. స్వంత ఆస్తి అనేది మిగల్చుకోకుండా, ప్రారంభ దినాల్లో తిండి పెట్టిన వారికి తన ఇంటిని ఇచ్చేసాడు.

కార్మికోద్యమమే ఊపిరిగా బతికిన 31 సంవత్సరాల రహమాన్ 1998 డిసెంబర్‌లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. తిరిగి 1999 ఫిబ్రవరిలో పెట్రోల్ వంటి మీద వేసుకొని కాల్చుకొని చనిపోయాడు. అతని శవయాత్రలో అన్ని యూనియన్‌లకు చెందిన వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. వారిలో రక్త సంబంధీకులు ఎవరూ లేరు.

కొందరు అతన్ని పిరికివాడన్నారు. బతకాలి గాని చచ్చిపోయి ఏం సాధించాడు అన్నారు. మరికొందరు, మెరుగైన జీవన సౌకర్యాలతో కార్మికుల్లో పెరుగుతున్న స్వార్థం చూసి తీవ్రమైన నిరాశతో ఈ పని చేశాడన్నారు. కొంతమంది ఇది చాలా ధైర్యంతో చేసిన పని అన్నారు.

అతను లోపాలు లేని మనిషి కాదు. ఎన్ని లోపాలున్నా, అంత హింసను భరిస్తూ ఎందుకు చనిపోయాడు? తన చావుతో సమాజానికి ఏం చెప్పాలనుకొన్నాడు? అతని చావుకు మనుషులను మనుషులుగా మిగలకుండా చేస్తున్న నేటి రాజకీయ వ్యవస్థతో పాటు అతను బతకడానికి అవసరమైన భరోసా ఇవ్వలేని మనం కూడా కారణం కాదా? ఆలోచించండి.

గత ఇరవై సంవత్సరాలుగా ప్రభుత్వాలు అవలంబిస్తున్న దుర్మార్గ విధానాల ఫలితంగా పోర్టులో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల ఆత్మహత్యలు, అనారోగ్యత, దిగులుతో చావులు, మస్టర్ లిస్ట్ అభ్యర్థుల ఆత్మహత్యలు, చావులు అనేకం జరిగాయి. చివరకు అధికార్లను కూడా బలితీసుకొన్నారనటానికి 'అలోక్ ఛౌదరి' అనే బెంగాలీ అధికారి చావే నిదర్శనం. మూడు డిపార్ట్‌మెంట్‌ల బాధ్యత అతని మీద పెట్టి ఉక్కిరి బిక్కిరి చేయడంతో గుండెపోటుతో చనిపోయాడు. ఇవి మామూలు చావులు, ఆత్మహత్యలుగా పైకి కనిపిస్తున్నా, ఇవి నిజంగా హత్యలే. ఇలా ఎంత మంది ఇంకా బలి అయిపోయారో లెక్కలు తీయాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది.

ప్రారంభం నుండీ పోర్టు కార్మికులకు పోరాట చరిత్ర ఉంది. తమ హక్కులు సాధించుకోవడానికి ఐక్యంగా పోరాటాలు చేసి విజయం సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 1958లో తొమ్మిది రోజులు చేసిన మొదటి రేవు కార్మికుల సమ్మెతో మొదలైన తర్వాత వేజ్ రివిజన్ కోసం జరిగిన దేశవ్యాపిత సమ్మెలన్నింటిలోనూ పాల్గొన్నారు.

శాస్త్రీయమైన పద్ధతిలో మెరైన్ / ఫ్లోటింగ్ క్రాఫ్ట్స్ సెక్షన్‌ల కార్మికుల ఇన్సెంటివ్ కోసం, 21 డిసెంబర్ 2001 నుంచి 14 రోజుల సమ్మె జరిగింది. ప్రారంభంలో అన్ని యూనియన్లు పాల్గొన్నాయి. 6వ రోజు రెండు యూనియన్లు సమ్మె విరమించి, తమ కార్మికుల్ని డ్యూటీల్లోకి వెళ్లమని చెప్పినా, వినకుండా 90 శాతం మంది సమ్మెలో కొనసాగడం కార్మిక చైతన్యానికి నిదర్శనం. అలాగే అసలు ఇన్సెంటివ్ రాని మస్టర్లు, ఇంజనీర్లు, మెకానిక్కులు కూడా ఈ పోరాటంలో పాల్గొనడం, సోదర కార్మికులకు సహకరించే అపూర్వ చైతన్యానికి నిదర్శనం. మేనేజ్‌మెంట్ ఒత్తిడి వలను అరెస్టు కాబడిన కార్మికుణ్ని పోలిస్ స్టేషన్ నుండి వదిలే వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9.30 గంటల వరకు బైఠాయించి అతన్ని విడిపించుకొన్న చరిత్ర ఉంది.

ప్రైవేట్ లాంచీలు ప్రవేశపెట్టాలని ప్రయత్నించినపుడు, మెరైన్ / ఫ్లోటింగ్ సెక్షన్ కార్మికులు, పోర్టు రైల్వేను భారత రైల్వేలో విలీనం చేయడానికి ప్రయత్నించినపుడు, ట్రాఫిక్ రైల్వే కార్మికులు పైనుంచి ప్రొబేషనరీ ఇంజనీర్లను తీసుకురావడానికి ప్రయత్నించినపుడు ఓర్ హాండ్లింగ్ కార్మికులు మేనేజ్‌మెంట్ ఎత్తుగడల్ని బ్రహ్మాండంగా తిప్పికొట్టారు. ఓర్ హాండ్లింగ్ సెక్షన్‌లో ఐక్య పోరాటాలకు ముందుగా నిలిచి అనేక సందర్భాలలో మేనేజ్‌మెంట్‌ను లొంగదీసిన కారణంగానే కార్మిక నాయకుడు ఎన్. సూర్యనారాయణరావును ఉద్యోగం నుండి తొలగించారు.

కొత్తగా వచ్చిన డిప్యూటీ ఛైర్మన్ రహస్యంగా పనిస్థలాల్లో కార్మికులున్నారో లేదోనని ఫొటోలు తీయడం, పనిస్థలంలో లేరని కార్మికుల్ని సస్పెండ్ చేయడం, కార్మికులు పని దొంగలని కరపత్రం వేయడంతో ఓర్ హాండ్లింగ్ కార్మికులు ఐక్యంగా పనులు నిలిపివేసి ఆయనతో బహిరంగంగా క్షమాపణ చెప్పించారు.

కార్గో హాండ్లింగ్ (డాక్ లేబర్ బోర్డ్) కార్మికులు ఓడల నుండి సరుకుల్ని లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో చేస్తుంటారు. ట్రిబ్యునల్ జడ్జిమెంట్ ప్రకారం ప్రతి పనిలోనూ దాదాపు 75 శాతం మనుషుల్ని తగ్గించేసారు. ఉదాహరణకు 20 మంది పని చేసే చోట కేవలం నలుగురు, ఐదుగురితో పనిచెయ్యాలని ఆదేశించారు. దీనిని వ్యతిరేకిస్తూ నాలుగు వేలమంది కార్మికులతో 67 రోజుల సమ్మె జరిగింది. దీనికి రెండు యూనియన్లు నాయకత్వం వహించాయి. అందులో ఒక యూనియన్‌కి ఆ మధ్యనే లోకల్ ఎం.ఎల్.ఎ.ని అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారు. చివరకి సమ్మె విఫలమయింది. 80 మందిని సస్పెండ్ చేశారు. 320 మంది టెంపరరీ కార్మికుల్ని విధుల్లోకి తీసుకోలేదు. ఈ వైఫల్యంపై యూనియన్లు ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకొన్నారు. రాజకీయ నాయకులు ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం వల్ల జరిగే పరిణామాలు ఇలాగే ఉంటాయని కార్మికులు భావిస్తున్నారు. ఇదే సమస్యపై కొచ్చిన్, న్యూ మంగుళూర్, టుటికొరన్ పోర్టుల్లో కార్మికులు ఉద్యమించి విజయం సాధించారు. విశాఖ పోర్టులో ఎచ్.ఎం.ఎస్., ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి., సి.ఐ.టి.యు., ఐ.సి.ఎల్.కు అనుబంధ యూనియన్లు పని చేస్తున్నాయి.

ఒకవైపు ప్రభుత్వ విధానాలు, మేనేజ్‌మెంట్ నిరంకుశ చర్యలు కార్మికులపై దాడి చేస్తున్నాయి. మరోవైపు పని పరిస్థితులు దుర్భరంగా మారిపోతున్నాయి. దొంగల్ని, హంతకుల్ని గుర్తించడానికి ఉపయోగించే బయోమెట్రిక్ సిస్టం ద్వారా కార్మికులపై నిఘా పెట్టి వారిని భయ భ్రాంతులు చేయబోతున్నారు. వి.ఆర్.ఎస్. మీద 2000 ల నుండి 3000 మంది కార్మికులని బయటకు పంపే నిర్ణయం అమలు చేయబోతున్నారు.

పనిభారం విపరీతంగా పెరిగిపోయింది. చాపకింద నీరులా రెగ్యులర్ పనులన్నీ కాంట్రాక్టులకిచ్చేస్తున్నారు. చెప్పినట్టు చేయకపోతే సంస్థ ప్రైవేట్‌పరం అయిపోతుందని బెదిరిస్తున్నారు. పక్కనే ఉన్న గంగవరం పోర్టుతో పోటీ పడాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇన్సెంటివ్‌లను పూర్తిగా ఎత్తేయాలని నిర్ణయం తీసుకొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్ని కాపాడుకోవడంతో పాటు ఈ సమస్యలన్నింటిని ఎదుర్కోవడానికి కార్మికుల్ని సమైక్యం చేయాల్సిన అవసరం ఎంతో ఉండగా యూనియన్ల మధ్య ఉన్న అనైక్యత పెద్ద అవరోధంగా ఉంది. ఎప్పుడూ ఆర్థిక సమస్యలపై నిలబెట్టడమేగాని, ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ విధానాలపై కార్మికుల్ని చైతన్యపరచడమనేది దాదాపు అందరూ మరిచిపోయారు.

ఈ సందర్భంలో విశాఖ పోర్టులో పన్నెండు అణాల జీతంతో ఫిట్టర్‌గా ప్రవేశించి ఎ.ఐ.టి.యు.సి. యూనియన్ స్థాపకుల్లో ఒకరైన మోటూరు వీరాస్వామి 1985లో రాసిన 'విశాఖపట్నం పోర్టు అండ్ డాక్ యాభై ఏళ్ల కార్మికోద్యమ చరిత్ర'లో చివరగా ఏమన్నారో గుర్తు చేసుకొందాం. 'శ్రీ ఆర్. శ్రీనివాస్ ఛైర్మన్ అయినప్పటినుండి పోరాటాల అవసరం లేకుండానే కాకాలు పట్టే మార్గాల ద్వారా హక్కులు తెచ్చే పద్ధతి అమలులోకి వచ్చింది. అంటే ఛైర్మన్ గారికి దగ్గరగా ఉండే యూనియన్ ద్వారా వెళితే తమ పనులు త్వరగా అవుతాయనే నమ్మకాన్ని కార్మికుల్లో కలిగించడం జరిగింది. అందుకే పోరాటాలకు బదులు కాకాలు ప్రారంభమయ్యాయి... ప్రజలందరికీ సుఖవంతమైన జీవితాన్ని ఇవ్వగలిగింది సోషలిజమొక్కటేనని నమ్ముతున్నాం. ఆ మార్గంలోనే ప్రయాణం ప్రారంభించాం. అయితే ఇప్పుడు ఎక్కడున్నామో ఆత్మ పరిశోధన చేసుకోవలసి ఉంటుంది. కారణమేమంటే సోషలిస్ట్ సమాజ స్థాపనకు కార్మికవర్గ ఐక్యత ముఖ్యాంశమే కాక నాయకత్వానికి వర్గ పోరాటం యెడల అచంచల విశ్వాసం ఉండడమే కాక ఆచరణలో ప్రతినిత్యమూ అనుసరించాల్సి ఉంటుంది. పోర్టు డాక్ కార్మికులు అనేక యూనియన్లలో చీలిపోయి ఉన్నారు. ఎప్పటికైనా ఈ కార్మికులందరూ ఐక్యం కాకుండా పోర్టు అధికారుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ప్రైవేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా జయప్రదమైన పోరాటాలు నిర్వహించడం అసాధ్యం.'

ఇరవై ఐదు సంవత్సరాల క్రితం వీరాస్వామి చేసిన హెచ్చరికల్ని విశాఖపోర్టు కార్మికులు, కార్మిక సంఘాలు గ్రహించి ఆ దిశగా ముందుకు అడుగెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత విశాఖ పోర్ట్ ట్రస్ట్ కార్మిక నాయకులు) వీ

***సీమాంధ్ర దళితులు, ఆదివాసులు, బి.సి.లు, మైనారిటీ ప్రజలంతా తెలంగాణ ఉద్యమ సందర్భంలోనైనా తమ న్యాయమైన హక్కుల కోసం సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అంటున్నారు* పులుగుజ్జు సురేష్**

తెలంగాణ ఉద్యమం - ఆలోచించాల్సిన అంశాలు

ప్రత్యేక తెలంగాణపై రాష్ట్రమంతటా జోరుగా చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రజలు ఎక్కడున్నా వారందరి దృష్టి ప్రత్యేక తెలంగాణపైనే ఉంది. కేంద్రం నిర్ణయం కోసం ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. 29 నవంబర్ 2009న తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు సిద్ధిపేటలో ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి పూనుకున్నప్పటి నుండి తెలంగాణ నినాదం మళ్లీ జీవం పోసుకున్నది. నాటి నుండి నేటి వరకు తెలంగాణ తప్ప మరొక అంశం మీడియాకు కనబడడం లేదు. తెలంగాణపై వచ్చే ప్రతి కదలికనూ పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తాజా వార్తలను అందించే ప్రయత్నంలో ప్రజల విషయాలు అనేకం పక్కకు పోయిన విషయాన్ని ఎవరైనా అంగీకరించక తప్పదు.

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి మరణానంతరం రాష్ట్ర రాజకీయాలు ఒక మలుపు తిరిగాయి. కాంగ్రెస్ పార్టీలో ప్రతిష్టంభన ఏర్పడింది. వై.ఎస్. మరణం నెల తిరక్కుండానే రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. అమెరికాలో ఏర్పడిన ఆర్థిక మాంద్యంతో లక్షలాది మంది సాఫ్ట్‌వేర్ నిపుణులను రోడ్డు మీదకు నెట్టాయి. పెరిగిన నిత్యావసర ధరలు పేద, మధ్యతరగతి ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. తాజా పరిస్థితులతో పాటు నిరుద్యోగం, అవినీతి, నిర్వాసితులు, ప్రపంచీకరణ విష ప్రభావం, మహిళా వివక్షత, బాలికలపై దాడులు ఇటువంటి అనేక సమస్యలు రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్నాయి.

అయితే మన రాజకీయ నాయకులకు తెలంగాణ ఒక ప్రధాన ఎజెండా అయ్యింది. తెలంగాణ అంశంపై సీమాంధ్ర, తెలంగాణ రాజకీయ నాయకులకు ఎందుకింత చొరవ అవసరమైంది. ఇటువంటి అంశాలను లోతుగానూ, సూక్ష్మంగానూ పరిశీలిస్తే గానీ అంతరార్థాలు బోధపడవు.

ప్రత్యేక తెలంగాణపై చేస్తున్న ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉవ్వెత్తున చెలరేగుతున్న తెలంగాణ ప్రజల మనోభావాలను కేంద్రం అర్థం చేసుకున్నట్టుగా 9 డిసెంబర్ 2009న అధికారికంగా కేంద్ర ప్రభుత్వం తరపున కేంద్ర హోంశాఖ మంత్రి పి. చిదంబరం ఒక ప్రకటన చేశారు. ఇక తెలంగాణ ప్రక్రియ ప్రారంభమయ్యింది అని అర్థరాత్రి చేసిన ఈ ప్రకటనను స్వాగతించిన తెలంగాణ వాదులంతా కె.సి.ఆర్.తో సహా అందరూ ఆమరణ నిరాహార దీక్షలను విరమించుకొన్నారు. సమైక్య వాదుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఊహించని రీతిలో ఎదురయ్యింది. మంత్రులు మినహాయించి, మెజారిటీ శాసనసభ్యులు, కొందరు పార్లమెంట్ సభ్యులు తమ అభ్యర్థిత్వాలకు రాజీనామా చేశారు. రాష్ట్రాన్ని విభజిస్తే ఊరుకునేది లేదని ఆందోళన చేపట్టారు. ఇటువంటి తాజా పరిణామం ఎదురవుతుందని కలలో కూడా ఊహించని కేంద్రం ఇబ్బందిలో పడింది. తెలంగాణ, సమైక్యాంధ్ర నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితుల్లో పెద్ద రాజకీయ సంక్షోభం ఏర్పడవచ్చునని రాజకీయ విశ్లేషకులు భావించారు. అటువంటివి ఏమీ లేకుండానే ఒక శాంతియుత వాతావరణం నెలకొనే పరిస్థితులు ఏర్పడాలని ఆశిద్దాం.

జాతి విద్వేషాలు, ప్రాంతీయ విభేదాలు రేకెత్తినప్పుడు లాభపడే వర్గాలు, నష్టపోయే వర్గాలు, తటస్థంగా ఎటువంటి ప్రయోజనమూ లేని వర్గాలు ఉంటాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం గత 53 ఏళ్లుగా ఉద్యమం సాగుతోంది. 1969లో 360 మంది, 1972లో 275 మంది అమాయకులు బలయ్యారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటంలో 215 మంది తెలంగాణ వాదులు, 10 మంది సమైక్య వాదులు ప్రాణాలు విడిచారు. లాఠీదెబ్బలు తిని ఆస్పత్రులలో ఉన్నవారు కొందరయితే, ఉద్యమబాటలో పోలీసు కేసులతో కోర్టుల చుట్టూ తిరగలేక తిరుగుతున్నది మరెందరో ఉన్నారు. విద్యార్థుల రక్తం చిందని పోరాటం లేదు. వారు రాయని చరిత్ర లేదు. వీర మరణాలలో విద్యార్థులే అత్యధికంగా ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ అనగానే సమైక్యవాదం ఎందుకు ముందుకు వస్తోంది?

1947లో దేశ విభజన సమయంలో తెలంగాణ (హైదరాబాద్ రాష్ట్రం) వేరుగా ఉంది. అనేక సంప్రదింపుల తరువాత గానీ భారత్‌లో హైదరాబాద్ రాష్ట్రం విలీనం కాలేదు అన్న సంగతి ఒకసారి గుర్తు చేసుకోవాలి. సమైక్యవాదం, సమైక్యవాదంలో దాగిన అర్థం హైదరాబాద్‌ను గురించేనని ఎవరికైనా తెలుస్తుంది. హైదరాబాద్ గురించి మాట్లాడలేక సమైక్యవాదం నినాదం వెలుగులోకి వచ్చినట్టుంది. హైదరాబాద్ రాజధాని. హైదరాబాద్ ఒక మహానగరం. దాదాపు నలభై శాతం హైదరాబాద్ ప్రజలు రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల వారు ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం చాలామంది పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు హైదరాబాద్‌లో ఉండే పరిశ్రమలలో భాగస్వాములుగా ఉన్నారు. బంజారా హిల్స్, జూబిలిహిల్స్, కూకట్‌పల్లి, వనస్థలీపురం, ఎల్.బి.నగర్, ఉప్పల్ వంటి ప్రధాన ప్రాంతాలు ఆంధ్రా ప్రజలతో నిండి ఉన్నాయి.

హైదరాబాద్ నగరమంటే 30 శాతం ముస్లింలు, 40 శాతం రాయలసీమ-కోస్తాంధ్ర, 10 శాతం ఇతర ప్రాంతాల వారు కాగా కేవలం 20 శాతం మాత్రమే తెలంగాణ ప్రజలు ఉన్నారు. ఈ విశ్లేషణ ప్రకారమే ఇటీవల జరిగిన గ్రేటర్ ఎన్నికలకు టిఆర్ఎస్ పార్టీ దూరంగా ఉండడానికి ప్రధాన కారణం. తెలంగాణ విడిపోతే హైదరాబాద్ తెలంగాణ రాజధాని కావచ్చు. కాబట్టి తెలంగాణలో మన్నలేమని, హైదరాబాద్‌లోని ఆంధ్రుల ఆస్తులకు ముఖ్యంగా హాస్పిటల్స్, విద్యా సంస్థలు, పరిశ్రమలు, వారి అందమైన బంగళాలు మొదలైన వాటి గురించి ప్రత్యక్షంగా మాట్లాడలేక సమైక్యవాదం వినిపిస్తున్నారనే చర్చ కూడా లేకపోలేదు. రాజకీయ పార్టీల జె.ఎ.సి. కన్వీనర్ కోదండరాం మాట్లాడుతూ హైదరాబాద్‌లో నివసించే ఆంధ్ర, ఇతర ప్రాంతాల ప్రజలకు తమ నుండి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. అయినా కూడా ఈ వేర్పాటువాదం మంటలు చల్లారలేదు. ఒకవేళ రాష్ట్రం విడిపోతే హైదరాబాద్‌లో ఉండే హైదరాబాదేతర ప్రజలకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యతను తెలంగాణ వారు భుజాన వేసుకోవాలి. ఏ విధమైన ఆటంకం కలిగించకుండా ఉంటే హైదరాబాద్ ప్రజల మద్దతు పొందే అవకాశం ఉంటుంది.

సీమాంధ్ర ప్రజలకు మరొక అనుమానం కూడా ఉంది. నీటి సమస్య ఉత్పన్నం కావచ్చునని. జలవివాదాల పరిష్కారానికి కేంద్ర జలసంఘం ఉంది. ఇరు ప్రాంతాల ప్రజా ప్రతినిధులతో చర్చలు జరుగుతాయి. ఆ ప్రకారమే తగిన ఒప్పందాలు, నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 40 లక్షల ఎకరాలకు సాగునీరు వివిధ ప్రాజెక్టుల ద్వారా అందుతోంది. ఇందులో దళితులు, ఆదివాసులు, మైనారిటీలకు కేవలం 28 వేల ఎకరాలు మాత్రమే ఉన్నాయి. సమైక్యంగా ఉన్నప్పుడు దళితులకు, ఆదివాసులకు, మైనారిటీలకు ఒరిగిందేమీ లేదని స్పష్టమయ్యింది. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రకారం చిన్న రాష్ట్రాలే ప్రగతి కాముకులు. అందుకనే భారతదేశం 100 రాష్ట్రాలుగా ఉంటే బాగుంటుందని భావించారు. పరిపాలన ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడు, అట్టడుగు వర్గాల ప్రజలు చైతన్య వంతులవుతారు.

నిన్నటి దాకా ఆంధ్రప్రదేశ్‌ను కమ్మ, రెడ్డి, భారతదేశాన్ని బ్రాహ్మణులు మాత్రమే పాలించారు. ఇప్పుడు తెలంగాణ వెలమ, రెడ్లు అధికారం పంచుకోవడానికి చూస్తున్నారు. తెలంగాణ వేరు పడితే తెలంగాణలోని దళిత, ఆదివాసీ, మైనారిటీలకు ఏం చేస్తారు. జనాభా ప్రకారం వనరుల పంపిణీ జరుగుతుందన్న హామీని ఇవ్వాలి. ఇటు సీమాంధ్రలో కూడా కమ్మ, రెడ్ల పాలనే సాగుతోంది. విద్యాలయాలు, వ్యవసాయ భూములు, ఉద్యోగాలు, భూములు, ప్రతి ఒక్క దానిలో వీరి ఆధిపత్యమే కొనసాగుతోంది. అన్నదమ్ముల్లా కలిసి ఉందామని చెప్పే సమైక్యవాదులు మీతో కలిసి ఉన్న దళిత, ఆదివాసీ, మైనారిటీలకు మీరు ఒరగబెట్టిందేమిటో ఒకసారి మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోండి? నిన్నటి దాకా దళితులను ఊచకోత కోసారు, నేడు ఆదివాసీ స్త్రీలపై అత్యాచారాలు చేస్తున్నారు. ముస్లింలని ఉగ్రవాదులుగా చిత్రీకరించారు.

వనరులపైన మీ ఆధిపత్యం నిలబెట్టుకొనేందుకు అనుకూల విధానాలు రూపొందించుకొన్నారు. ఆర్థిక స్తోమత మెరుగైన వారందరినీ నగర జీవితానికి అలవాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మిగిలిన పేదలకు మేలు రకం విద్య, వైద్యం అందకపోవడానికి కారణం ఎవరు? మీరు, మీ విధానాలే కదా? ప్రాంతంపైన ఇంతటి ప్రేమచూపే మీరు ఒక్కసారి ఆలోచించండి- అక్కడ మిగిలింది వట్టిపోయిన బక్క జీవులు, నిరాశ, నిస్పృహలతో నిండిన పేద, బడుగు బలహీన వర్గాలే. ఏదైనా సమస్య వస్తే పరిష్కారానికి హైదరాబాద్ ప్రయాణించాలి. పరాయిదెన్నడు మనది కాదు. కాబట్టి ప్రజల్ని మభ్యపెట్టడం, స్వప్రయోజనాలకు బాటలు వేసుకోవడం మాని వాస్తవాలను చర్చించుకోగలిగితే ప్రజలకు మేలు కలుగుతుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడానికి అనేక విధాలుగా అనుకూల వాతావరణం కనబడుతోంది. కాబట్టి సీమాంధ్రలోని ప్రజలు ప్రలోభాలకు లోనుకాకుండా శాస్త్రీయంగా ఆలోచించడం మంచిది. దేశ విభజన 1947లో జరిపేటప్పుడు బ్రిటిష్ వారితో జరిగిన చర్చల్లో భారత్ నుండి ముగ్గురు ప్రతినిధులు హాజరయ్యారు. మహాత్మాగాంధీ, డా.బి.ఆర్. అంబేద్కర్, మహమ్మద్ అలీ జిన్నా. దేశ పౌరులందరి తరఫున గాంధీ, దళితులు, ఆదివాసుల తరఫున అంబేద్కర్, ముస్లింల ప్రతినిధిగా అలీ జిన్నా. ఈ చర్చలో అంబేద్కర్ వాదన వలన దళిత, ఆదివాసులకు రిజర్వేషన్‌లు, సబ్సిడీలు, రాయితీలు వచ్చాయి. అలీ జిన్నా వల్ల ప్రత్యేక పాకిస్తాన్ ముస్లిం దేశంగా ఏర్పడింది. కానీ భారత్‌లోని ముస్లింలకు ఏ ప్రయోజనమూ జరగలేదు. అదే విధంగా బి.సి.ల ప్రతినిధి లేకపోవడం వల్ల బి.సి.లు అగ్రవర్ణాల చేతుల్లో మోసపోతూనే ఉన్నారు. ఇది చారిత్రక సత్యం. కాబట్టి బడుగు బలహీన వర్గాల వారందరూ మేల్కొనాలి. రాజధాని గురించి చర్చించాలి. శాస్త్రీయమైన బలమైన వాదన వినిపించాలి. భూమి, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల గురించి చర్చించాలి. ఇప్పుడు నిచ్చెన మెట్ల సమాజంలో మనం ఉన్నం కాబట్టి, వర్గ ప్రయోజనాలు కాపాడుకుంటూనే విశాల దృక్పథంతో ప్రతి అంశాన్ని పరిశీలించి నిర్ణయాధికారంలో భాగస్వాములు కావలసిన సమయం వచ్చింది. సీమాంధ్ర ప్రజలను అగ్రవర్ణాల వారు మరోసారి మోసం చేసే ప్రమాదం ఎంతో దూరంలో లేదు. కావున సీమాంధ్ర దళితులు, ఆదివాసులు, బి.సి.లు, మైనారిటీలు సమష్టిగా ఏకమై, ఉమ్మడి ఎజెండాను రూపొందించుకొని ఉద్యమిస్తే విజయం మీ వెంటే ఉంటుంది.

(రచయిత చేనేత రంగ విశ్లేషకులు) వీ

బాగా వెనుకబడిన తెలంగాణ ప్రాంత లంబాడీల జీవన స్థితిగతులు, ఉపాధి అవకాశాలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే అభివృద్ధి చెందుతాయని అంటున్నారు **పోరిక ఉదయసింగ్ నాయక్**

ప్రజాస్వామిక తెలంగాణ - లంబాడీలు

ఆంధ్రప్రదేశ్‌లో లంబాడి తెగకు ఒక ప్రత్యేకత ఉంది. అనాదిగా ముఖ్యంగా పశుపోషణ వ్యవసాయం, వస్తుమార్పిడి వృత్తులుగా ఉంటూ, సంచార జీవితం గడిపిన చరిత్ర లంబాడి తెగకు ఉంది. లంబాడీలు నాగరికతకు దూరంగా నెట్టివేయబడి, అడవులనందు జీవనం కొనసాగించారు. ఒకానొక దశలో బ్రిటిష్ వాళ్లు ఈ తెగకు సంబంధించిన వాళ్లను దొంగలుగా చిత్రీకరించి, బయట సమాజం నుంచి దూరం చేయడానికి కుట్ర పన్ని చట్టం కూడా తయారు చేశారు. ఈ తెగకు సంబంధించిన వాళ్లు ఎప్పుడు కూడా ఆస్తులు సంపాదించుకోవాలనే ఆలోచన చేయలేదు. సమాజంలో అందరూ సుఖంగా బతకాలనే మానవ విలువ కలిగి ఉన్నారు. ప్రేమాభిమానాలు, మానవీయ విలువలు ఎక్కువగా ఈ తెగకు సంబంధించిన వాళ్లలో మనం గమనిస్తూ ఉంటాం. ఉదాహరణకు తెలంగాణ ప్రాంతంలో ఇప్పటికీ అంగళ్లలో ఆత్మీయులు కలిస్తే కౌగలించుకొని పెద్దగా ఏడ్వడం చూస్తూ ఉంటాం.

1990 తర్వాత కాదేదీ 'ప్రపంచీకరణకు అనర్హం' అంటూ అన్ని రంగాలలో ఎలాగైతే విస్తరించిందో ఇది లంబాడి ప్రజల జీవితాలలో చొరబడి మానవీయ విలువల స్థానంలో అమానవీయమైన మార్కెట్ విలువలు, వస్తు సంస్కృతి విలువలు ప్రవేశించాయి. ప్రధాన పోషణ అయిన పశువులను కబేళాలకు అమ్ముకోవడం, ఉపాధి లేకపోవడంతో ఒళ్లు అమ్ముకొని స్వంత ఊర్లను వదిలి దూరంగా వలస వెళ్లిపోవడం జరుగుతోంది. స్త్రీలు సహజంగా ఎరుపు రంగు కలిగి ఉండి, అందంగా ఉండడం వల్ల దళారులు వీరికి ఎన్నో మాయ మాటలు చెప్పి వ్యభిచార గృహాలకు, రెడ్‌లైట్ ఏరియాలకు అమ్మడం మనం వివిధ పత్రికలలో పతాక శీర్షికలలో చూస్తూ ఉంటాం. ఇంతే కాకుండా తెలంగాణ ప్రాంత జిల్లాలు నల్గొండ, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాలలో లంబాడీలు తమకు పుట్టిన ఆడబిడ్డలను సైతం అమ్ముకుంటున్నారు. ఇలా దాదాపు ఐదు వేలమంది అమ్మాయిలను అమ్మి ఉంటారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. వీరి అమాయకత్వంను ఆసరా చేసుకొని నల్గొండ, రంగారెడ్డిలోని అధికార పార్టీ నాయకులు, ఉద్యోగవర్గాలకు చెందిన కుటుంబాల స్త్రీలు వీరి దగ్గరకు వెళ్లి మాయ మాటలు చెప్పి దత్తత పేరుతో పసిపిల్లలను తీసుకొని మధ్య దళారీలకు, విదేశీ కంపెనీలకు అమ్ముకొంటున్నారు.

తెలంగాణ ప్రాంతంలో ప్రత్యేక ఆర్థిక మండలాలు పేర (సెజ్) హైదరాబాద్ శివారు (రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్) లంబాడీలకు ఉన్న అరకొర భూములను, వీరి అమాయకత్వాన్ని ఆసరు చేసుకొని మార్కెట్ రేటు చెల్లించక నగరంలో లాడ్జింగ్‌లకు తీసుకెళ్లి మత్తు పానీయాలు తాగించి భూమి విక్రయ కాగితాలపై సంతకాలు పెట్టించుకొని భూములను కబ్జా చేసుకొంటున్నారు. ఆకుల రాజయ్య అనే ఉపాధ్యాయుడు ఎలా ప్రలోభాలు పెట్టి భూములను స్వాధీనం చేసుకున్నాడో మనం పత్రికల ద్వారా తెలుసుకొన్నాం. ఇది బయటకు వచ్చిన విషయం మాత్రమే. ఇంకా సభ్య సమాజానికి తెలియకుండా అధికార, అనధికార యంత్రాంగం దీంట్లో భాగస్వామ్యం కలిగి ఉంది. ఈ విషయంలో తెలంగాణవాదులు, ఆత్మీయులు పోరాటం చేసి దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి ముందు ఆంధ్ర ప్రాంతంలో స్థావరాలు ఏర్పర్చుకోవడం, వారి వ్యాపారాభివృద్ధి కొరకు ఆ ప్రాంత ప్రజలకు ఆంగ్ల విద్యను నేర్పించారు. అందులో భాగంగానే సహజంగానే సుగాలీలు (ఆంధ్ర ప్రాంత లంబాడీలు) కూడా విద్యాభివృద్ధిలో ముందుండి కీలకమైన పోస్టులను (ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఎఫ్.ఎస్., గ్రూప్ 1, 2) రిజర్వేషన్‌ల ద్వారా ఆక్రమించుకొన్నారు. రాష్ట్ర (ముఖ్యంగా గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందినవారు) వ్యాప్తంగా కీలక శాఖలలో, కీలకమైన పోస్టులలో వీరే తిష్టవేసి ఉన్నారు.

1990 తర్వాత వచ్చిన నూతన ఆర్థిక విధానాల వల్ల లంబాడీ గిరిజనుల జీవనం మరింత దుర్లభమై ఉపాధి లేక సారా తయారీపై ఆధారపడుతున్నారు. దీని వల్ల లాభం సంగతేమో గానీ, సల సల మండే నిప్పు దగ్గర కూర్చోవడం వల్ల శ్వాసకోశ వ్యాధులు సంభవించి ఉన్న ఆస్తి పాస్తులు అమ్మి ఆరోగ్యం కాపాడుకోవడానికి ఖర్చు పెట్టి, జీవితాంతం అప్పుల ఊబిలో కూరుకొని పోతున్నారు. సారాను మధ్య దళారీలకు విక్రయించే క్రమంలో దళారులు మోసపూరిత కుట్రను అర్థం చేసుకోకుండా బలవంతంగా శారీరక సంబంధాలు పెట్టుకొని ఎయిడ్స్ వంటి మహమ్మారి వ్యాధులకు గురవుతున్నారు. నదీ పరీవాహక ప్రాంతాలలో ఎలాగైతే ఆంధ్రా వాళ్లు తిష్టవేసి దోపిడీ చేస్తున్నారో, రైలు పరీవాహక ప్రాంతాలలో రైలు పట్టాల పక్కన నివసిస్తున్న తండాల యువతులు ఉపాధి లేక రైళ్లలో పల్లీలు అమ్ముతూ జీవనం కొనసాగిస్తుంటే పెట్టుబడిదారీ బ్రోకర్ల మాటలను నమ్మి, ముంబై, ఢిల్లీ, కలకత్తా లాంటి మహానగరాలలో రెడలైట్ ఏరియాలకు అమ్ముడు పోతున్నారు.

తెలంగాణ ప్రాంతంలో ప్రతి తండా వాసులు 2 నుండి 3 కిలోమీటర్లు నడిచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. ఇలా మంచినీళ్లు తీసుకొచ్చే క్రమంలో సమయం లేక పాఠశాలలకు వెళ్లలేక మధ్యలోనే డ్రాపవుట్స్ అవుతున్నారు. తల్లిదండ్రులతో పాటు సీజనల్ పంటలు (ముఖ్యంగా పత్తి, మిర్చి) చేతికి వచ్చే సమయంలో పాఠశాలలకు వెళ్లే పిల్లలు వలసలు పోయి వలస కూలీలుగా మారుతున్నారు. పట్టణాలలో ప్రజా ప్రతినిధులు, అధికారుల ఇండ్లలో పనిమనుషులుగా లంబాడీ

పైలా వాసుదేవరావు

శ్రీకాకుళం విప్లవోద్యమం నిర్మాత, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైలా వాసుదేవరావు (78) ఏప్రిల్ 11న మృతి చెందారు. ఆయన అప్పటికి కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో అనారోగ్యంపాలై చికిత్స పొందుతున్నారు. పైలా వాసుదేవరావు 1932 అక్టోబర్‌లో ఆనాటి విశాఖ జిల్లా (నేటి శ్రీకాకుళం జిల్లా) ఉద్దానం ప్రాంతానికి చెందిన రిట్టపాడు గ్రామంలో జన్మించారు. పలాసలో ఎస్.ఎల్.సి. చదివి ఫెయిలయ్యారు. 1940లో పలాసలో రైతుసంఘం మహాసభలు జరిగే నాటికి రిట్టపాడు గ్రామ యువకులు కొందరు రైతాంగ పోరాటాలకు ఆకర్షితుల య్యారు. విద్యార్థి జీవితంలోనే వాసుదేవరావుపై కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం పడింది. ఆ గ్రామంలో డి.బి.కె. చౌదరి కార్యదర్శిగా 1953లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ గ్రామశాఖ సభ్యునిగా పైలా వాసుదేవరావు రాజకీయ రంగప్రవేశం చేశారు. తర్వాత రెవెన్యూ శాఖలో 1955లో సర్వేయర్‌గా చేరి 1957 వరకు పనిచేశారు. పార్టీ నిర్ణయం ప్రకారం ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి టెక్కలి ప్రాంతంలోని గ్రామాలలో సంఘ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. పార్టీ పిలుపు ప్రకారం 1959లో టీచర్ ఉద్యోగంలో చేరారు. ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన అనేకమంది విద్యార్థి యువకులు ఆ తర్వాతి కాలంలో విప్లవకారులుగా, ఉద్యమకారులుగా రూపొందారు. 1962లో ఉపాధ్యాయ ఉద్యోగానికి కూడా రాజీనామా చేసి వృత్తి విప్లవకారునిగా విప్లవానికి తన జీవితాన్ని అంకితం చేశారు. 1968లో శ్రీకాకుళంలో గిరిజన రైతాంగ సాయుధ పోరాటం బద్దలవడంతో ఆనాటి పార్టీ నిర్ణయం ప్రకారం పైలా అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు. 1968 నుంచి నేటి వరకు నలభై రెండేండ్ల సుదీర్ఘ విప్లవ రాజకీయ జీవితం సాగించిన చరిత్ర ఆయనకుంది. 1975లో ఎస్.ఎన్. సింగ్ నాయకత్వంలోని సి.పి.ఐ. (ఎం.ఎల్) – ఎ.పి.లో చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని పార్టీ విలీనం కావడంతో శ్రీకాకుళ విప్లవోద్యమం కూడా రాష్ట్ర కమిటీలో అంతర్భాగమైంది. ఆనాటి నుంచి ప్రజా యుద్ధ పంథాలో శ్రీకాకుళం విప్లవోద్యమ పునర్‌నిర్మాణ కృషిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన సి.పి.ఐ. (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శిగానూ, కేంద్ర కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు.



పిల్లలే అధికంగా ఉంటారు. బాల కార్మిక చట్టం ఇంకా కాగితాలకే పరిమితమై తండాలకు చేరుకోలేదు. అందువలన గిరిజనులు అక్షరాస్యత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు బాలురలో 15–20 శాతం, బాలికలలో 10–15 శాతానికి మించలేదు. ఇది భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశ అక్షరాస్యత శాతం కంటే తక్కువ.

ఈ వివక్షను ఆదిలోనే గమనించిన తెలంగాణ ప్రాంత గిరిజన వీరయోధులు రాంజీగోండు, కొమురం భీం, సమ్మక్క, సారక్క, జంపన్న చేసిన పోరాటం లాగానే జనగామ ప్రాంతంలో రాను నాయక్, ములుగు ప్రాంతంలో మూడ్ భారతీయార్, భుక్తియార్, జంగి, భంగి పోరాటం, నిజామాబాద్‌లో అమర్‌సింగ్ రాథోడ్, మీటు భుక్యా, వీర వనిత పూలమ్మ, జనగామ ప్రాంతంలో పాలకుర్తి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని మొండ్రాయి లంబాడీలు నైజాం, రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు వీరోచితమైనవి. ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్న లంబాడీ గిరిజన స్త్రీలు జనవరి 5, 2010న ఆదిలాబాద్ జిల్లా ఖానాపురం మండలం అంకెన గ్రామానికి చెందిన దానావత్ శ్వేత (16) ఇచ్చోడ జూనియర్ కాలేజీలో చదువుతున్న గిరిజన యువతి రోజంతా టి.వి. వార్తలు వింటూ కేంద్ర హోంమంత్రి చిదంబరం నోటి ద్వారా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు అనుకూల ప్రకటన వస్తుందని ఆశించి, తన బాబాయ్ దుకాణంలో చాక్లెట్లు తీసుకొని ఊర్లో వారందరికి పంచుతానని చెప్పిన అమాయక శ్వేత చిదబంర రహస్యం విని తెల్లవారుజామున తట్టుకోలేక పురుగుల మందు తాగి తనువు చాలించి పేద తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చి పోయింది.

ఉద్యమం తీవ్రరూపం దాల్చిన క్రమంలో తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటగా వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలానికి చెందిన లంబాడి యువకుడు భూక్యా ప్రవీణ్ నాయక్ (బి.ఎస్.సి, బి.ఇడి.) తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలని సూసైడ్ నోట్‌ను జేబులో ఉంచుకొని ఉరివేసుకొని చనిపోయాడు. పక్క మండలం మహబూబాబాద్‌కు చెందిన బానోత్ బాలాజీ నాయక్ (ఎం.బి.ఎ.) డిసెంబర్ 23న చిదంబరం ప్రకటన విని తట్టుకోలేక సూసైడ్ నోట్ జేబులో పెట్టుకొని రైలు కింద పడి ఆత్మాహుతి చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లాకు చెందిన యాదన్న లాగే వరంగల్ జిల్లాలో మారుమూల తండా నుండి పదవ తరగతిలో 520 మార్కులతో ఉత్తీర్ణుడై బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విజయవాడ చైతన్య కళాశాలలో బి.పి.సి. మొదటి సంవత్సరం చదువుతున్న అనాథ గిరిజన యువకుడు. హలావత్ రాజేందర్ తెలంగాణ కోరుతూ సూసైడ్ నోట్ జేబులో పెట్టుకొని పురుగుల మందు తాగి ఆత్మాహుతి చేసుకున్నాడు. రాజేందర్ తల్లిదండ్రులు అప్పుల బాధ తట్టుకోలేక పది సంవత్సరాల కింద తల్లి, రెండు సంవత్సరాల కింద తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఇతని తోబుట్టువు చిన్నప్పుడు ఊరికి దూరంగా ఉన్న పాఠశాలకు పోయి వస్తూ మార్గ మధ్యంలో వాగుదాటుతూ చనిపోయింది. వరంగల్ ఎం.జి.ఎం. మార్చురీలో రాజేందర్ మృతదేహాన్ని చూసి కన్నీరు కార్చడానికి బంధువులే లేని స్థితి ఉంది. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఇప్పటికి ప్రత్యేక రాష్ట్రం కొరకు చనిపోయిన సుమారు 400 మంది ఆత్మహత్యలలో గిరిజనులు 60 మందిదాకా అసువులు బాసారు. తెలంగాణ ప్రాంతంలో లంబాడీ జనాభా 80 లక్షలు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే జనాభా దామాషా ప్రకారం 14 శాతం రిజర్వేషన్ పొందుతారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం నియామకం చేసిన మొదటి ఎస్.ఆర్.సి. జస్టిస్ ఫజల్ అలీ కమిషన్‌కు తెలంగాణ ప్రాంత గిరిజన ప్రజానీకం మేం ఎంత మాత్రం సమైక్యాంధ్రలో కలిసి ఉండమని చెప్పింది. ఇకనైనా ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని వెంటనే పునరుద్ధరించాలి. తెలంగాణ ప్రాంత ప్రజల న్యాయమైన రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌ను శ్రీకృష్ణ కమిటీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని కమిటీని డిమాండ్ చేస్తున్నాం. ఇది తెగదెంపుల సందర్భం – తెగిస్తేనే తెలంగాణ వస్తది.

(రచయిత ఉపాధ్యాయులు)

సమైక్య రాష్ట్రంలో అన్ని రకాలుగా వివక్షకూ, నిర్లక్ష్యానికీ గురయి, అభివృద్ధికి నోచుకోని రాయలసీమ ప్రజల తరపున పాలకులను నిలదీస్తున్నారు **డా. కృష్ణమూర్తి, డా. మాధవస్వామి**

రాయలసీమ వెనుకబాటు - కొన్ని ప్రశ్నలు

- రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణకై రూపొందిన శ్రీబాగ్ ఒడంబడికను తుంగలో తొక్కింది సమైక్య రాష్ట్రంలో కాదా?
- 1956 నుంచి సమైక్య రాష్ట్రంలో రాయలసీమకు జరిగిన ఒక్కటంటే ఒక్క లాభమేదైనా చెప్పగలరా?
- ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందే సీమను సస్యశ్యామలం చేసేందుకు రూపొందించిన కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టును అడ్డుకున్నదెవరు? దాని స్థానంలో సీమకు చుక్కనీరు కూడా అందించని నాగార్జునసాగర్‌ను రూపొందించిందెవరు?
- కళ్లెదుటే కృష్ణా జలాలు తరలిపోతున్నా శ్రీశైలం ప్రాజెక్టును హైడల్ ప్రాజెక్టుగా కుదించి కృష్ణా జలాలను సాగర్‌కు తరలించే కుట్రకు ఎవరు కారణం? రాయలసీమ అభివృద్ధికి వ్యతిరేకులైన కోస్తా పాలక వర్గాలు కాదా? వారితో చేతులు కలిపిన మీరు రాయలసీమ ప్రతినిధులేనా?
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంచే ఆమోదింపబడి, సెనేట్ సమ్మతి పొంది కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయపు కేంద్రం అనంతపురం నుండి విశాఖకు తరలడానికి కారణం ఎవరు? వీర సమైక్యవాదులైన కోస్తా పాలకులు కారా? ఈ విషయం తెలియనంత అమాయకులా మీరు?
- తెలుగు గంగ పేరుతో 'డీప్ కట్' కాలువ చుట్టూ ఉన్న గ్రామాలకు తాగునీరును దొరకకుండా చేసి, అప్పటికే సస్యశ్యామలంగా ఉన్న నెల్లూరు జిల్లాకు మరింత సాగు నీరందించింది సమైక్యాంధ్రలో కాదా?
- రాయలసీమకు తాగునీటి అవసరాలకై కృష్ణా జలాలను వినియోగించడానికి ఉన్న ఏకైక మార్గం పోతిరెడ్డిపాడును తీవ్రంగా వ్యతిరేకించే కోస్తాంధ్ర నాయకత్వంతో మీ లాలూచి ఏమిటి?
- శ్రీబాగ్ ఒడంబడికను ఉల్లంఘించి 1981లో అఖిల పక్ష కమిటీ కృష్ణా జలాలను మూడు ప్రాంతాలకు పంపిణీ చేసింది. అది రాయలసీమ ప్రయోజనాలకు వ్యతిరేకం కాదా? ఇది జరిగింది సమైక్యాంధ్రలో కాదా?
- రాష్ట్రంలో లభ్యమవుతున్న 2,746 టిఎంసి నదీ జలాల్లో జనాభా ప్రాతిపదికన 549 టిఎంసిలు, పంటభూముల విస్తీర్ణం ఆధారంగా 723 టిఎంసిలు రాయలసీమకు అందాల్సి ఉండగా 122.6 టిఎంసిలు మాత్రమే మనకు దక్కడం సమైక్యాంధ్రలో జరిగిన ఘోర అన్యాయం కాదా?
- ప్రత్యేక తెలంగాణ ఏర్పడి హైదరాబాద్ వేరైపోతే రాయలసీమ విద్యా ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని ఇక్కడ విద్యార్థులను భయపెడుతున్నారు మీరు. మీ పెట్టుబడులను రాయలసీమ నగరాల అభివృద్ధికి, పారిశ్రామిక అభివృద్ధికి ఖర్చు చేసి రాయలసీమలో ఉపాధి అవకాశాలను ఎందుకు పెంచలేదు? మీ పెట్టుబడులన్నీ హైదరాబాద్‌లోనే ఎందుకు పెట్టారు? మీరు హైదరాబాద్ గురించి చేస్తున్న 'ఆందోళన' అంతా మీ పెట్టుబడుల గురించే అంటే తప్పంటారా?
- అసలు 'సీమాంధ్ర' అనడంలోనే రాయలసీమ ప్రజలు తెలుగువాళ్లు కాదు అనే ధ్వని మీకు వినిపించడం లేదా? వనరుల పంపిణీలో గుర్తుకు రాని రాయలసీమ నేడు కోస్తా పెట్టుబడి ప్రయోజనాల సంరక్షణకు అవసరమైందా?
- సమైక్యాంధ్రలో గత 54 సంవత్సరాలుగా రాయలసీమలో ఎన్ని కొత్త రైల్వే లైన్లు వేశారు? ఎన్ని కొత్త ఫ్యాక్టరీలు నిర్మించారు. రాయలసీమ విశ్వవిద్యాలయానికి మంజూరైన నిధులెన్నో చెప్పగలరా?
- రాష్ట్రంలో అత్యధిక ఖనిజ సంపదగల రాయలసీమలో ఇన్నేళ్లుగా ఎన్ని కర్మాగారాలు నెలకొల్పారో చెప్పగలరా?
- ఓబుళాపురం గనుల నుండి విదేశాలకు తరలిపోతున్న ఖనిజం విలువ ఎంత? అందులో రాయలసీమకు వచ్చే వాటా ఎంత? కరువు కాటకాల నిలయమైన అనంతపురం జిల్లాకు సమైక్యాంధ్రలో వొరిగిన మేలు ఏమిటో చెప్పగలరా?
- తెలంగాణ వస్తే గ్రేటర్ రాయలసీమ కావాలని ఒకమారు, రాయల్ తెలంగాణ కావాలని మరోమారు, లక్షల కోట్ల ప్యాకేజీ కావాలని ఇంకోమారు మీరు చేస్తున్న డిమాండ్ వెనుక కేవలం ప్రత్యేక తెలంగాణకు అడ్డుపడే దురుద్దేశం తప్ప రాయలసీమ ప్రయోజనాలేమైనా ఉన్నాయా?
- ప్రత్యేక తెలంగాణ ఇస్తే అనంతపురం జిల్లాను కర్ణాటక రాష్ట్రంలో కలపాలని కోరే మాజీ మంత్రి గారికి తెలుగు ప్రజల పట్ల సమైక్యత పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎంతో చెప్పగలరా?
- రాయలసీమ వాసులు, మూర్ఖులు, హింసావాదులు, మొరటు మనుషులు, అనాగరికులని తమ సినిమాలు, ప్రసార మాధ్యమాల ద్వారా నిత్యం అవహేళన చేసే కోస్తా పాలకులతో చేతులు కలపడం రాయలసీమ ఆత్మగౌరవానికి భంగమని అనిపించలేదా?

తెలంగాణ జిల్లాలతో పోల్చినప్పుడు రాయలసీమ జిల్లాలు బాగా వెనకబడి ఉన్నాయనీ, తెలంగాణ స్థాయికి చేరుకోవాలన్నా రాయలసీమకు ఇంకో ఐదు దశాబ్దాలు పడుదుందనీ అంటున్నారు **అంగడి రంగారెడ్డి**

రాయలసీమకు తెలంగాణ తేజం ఎప్పుడు?

గున్నార్ మిర్దాల్ నోబెల్ గ్రహీత (1974) నిరంతర వృద్ధి కారణాల సిద్ధాంతంలో మార్కెట్ శక్తుల వలన అభివృద్ధి అనేది అసమానతలను సృష్టిస్తుంది అని అంటారు. మార్కెట్ శక్తులు ప్రభుత్వ ప్రవేశం వలన మారుతాయి.

ఆంధ్రప్రదేశ్ అవతరణ నుండి కావచ్చు, పూర్వపు మద్రాసు రెసిడెన్సీలో కావచ్చు మూడు విభిన్న ప్రాంతాల అభివృద్ధి అసమతౌల్యంలోనే కొనసాగుతోంది.

ఆంధ్రప్రదేశ్ 275 వేల చదరపు కిలోమీటర్ల భూవిస్తీర్ణంలో, రాయలసీమకు 25 శాతం, తెలంగాణకు 42 శాతం, కోస్తాకు 33 శాతం ఉంది. జనాభా రీత్యా 2001 లెక్కల ప్రకారం 7.6 కోట్లలో, రాయలసీమలో 1.35 కోట్లు, తెలంగాణలో 3.1 కోట్లు, కోస్తా ఆంధ్రలో 3.2 కోట్లు ఉంది. అక్షరాస్యతలో 2001 జనాభా లెక్కల ప్రకారం రాయలసీమలో 53 శాతం, తెలంగాణలో 52 శాతం, కోస్తాలో 56 శాతం ఉంది. వ్యవసాయ రంగంలో ముఖ్యమైన ఉద్యోగస్తులు 2001 నాటికి రాయలసీమలో 40 శాతం, తెలంగాణలో 38 శాతం, కోస్తాలో 37 శాతం ఉన్నారు. శ్రమలేని కార్మికులు 2001 నాటికి రాయలసీమలో 52 శాతం, తెలంగాణలో 55 శాతం, కోస్తాలో 55 శాతం ఉన్నారు. నీటి సాగు వ్యవసాయానికి జీవం. కోస్తా జిల్లాలో సాగునీరు వ్యవసాయ భూమిలో 60 శాతం, తెలంగాణలో 50 శాతం, రాయలసీమలో 25 శాతం అందుతోంది. జలయజ్ఞం పథకంతో సాగునీరు ముఖచిత్రం తెలంగాణలో వేగంగా మారుతోంది.

ప్రకృతి వనరుల లభ్యతను బట్టి ఆ ప్రాంత అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ప్రకృతి వనరులు కూడా మూడు ప్రాంతాలకు విభిన్నంగానే ఉన్నాయి. భూగర్భ జలాలు, రాయలసీమలో హరించుకుని పోయేంత వరకు నీరు అధికంగా ఉన్నదని భావించారు. కోస్తా ఆంధ్రకు తరచు తుపానులు, వరద బీభత్సం కూడా హాని చేసింది. నదీ జలాలను అభిలషణీయంగా వాడుకునే ప్రక్రియ ఇంకా రాలేదని చెప్పవచ్చు. 60 శాతం నీరు వృథా పోతూ ఉన్నా వాటిని వాడుకునే ప్రక్రియ డా. రాజశేఖరరెడ్డి జలయజ్ఞం ద్వారా మొదలు పెట్టారని చెప్పవచ్చు. 60 శాతం భూమి కూడా బంజరుగా ఉంది. దీనిని సాగు భూమిగా మార్చవచ్చు. పెద్ద ఎత్తున ఆర్థిక విప్లవం తేవడం, ప్రకృతి వనరులను వాడేటప్పుడు కొన్ని వర్గాలకు బాధ, భయం, ఆందోళన ఏర్పడడం సహజం. ఆ భయమే ఇప్పుడు రాజకీయాలలో కనబడుతోంది.

తలసరి ఆదాయం తీసుకొంటే 2004-05 రాయలసీమ జిల్లాలకు రు. 17,000, ఉత్తర తెలంగాణలో రు. 17,000, దక్షిణ తెలంగాణలో రు. 21,000లుగా అంచనా వేయడమైంది. ఆంధ్రప్రదేశ్‌లో జనసాంద్రత ఒక చదరపు కిలోమీటర్‌కు 1991కి 242 జనాభా నుండి 2001 నాటికి 277కి జనసాంద్రత పెరిగింది. రాయలసీమ జిల్లాలలో

- రాయలసీమ ప్రజాప్రతినిధులుగా ఈ ప్రాంత రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?
- సీమకు మంజూరైన గాలేరు నగరి ప్రాజెక్టు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం స్టేజి - 1, స్టేజి - 2, గండికోట నుండి చిత్రావతి ఎత్తిపోతల పథకం వంటి నిర్మాణాలకు వేల కోట్లు అవసరంకాగా చిల్లర పైసలు విదిలిస్తుంటే మీరు నిద్రపోతున్నారా?
- రాయలసీమ చెరువుల వ్యవసాయానికి ప్రసిద్ధి గాదా? మరి సీమలో చెరువుల కింది వ్యవసాయం 1972-73లో 49.7 శాతం ఉండగా 1999-2000లకు 9.4 శాతానికి పడిపోవడం నిజం కాదా? రాయలసీమ వ్యవసాయానికి జరిగిన ఈ అన్యాయం గురించి మీకు అసలు స్పృహ ఉన్నదా?
- రాయలసీమ ప్రయోజనాలకై పోరాడుతారని కోటి ఆశలతో మిమ్మల్ని ఎం.ఎల్.ఎ.లు, ఎం.పి.లను చేసిన సీమ ప్రజలను పూర్తిగా విస్మరించి ఈ ప్రాంతాన్ని అడుగడుగునా వంచించిన కోస్తా పాలకులతో చేతులు కలిపిన మిమ్మల్ని రాయలసీమ ప్రజలు ఎందుకు క్షమించాలి?
- రాయలసీమ ప్రయోజనాలను మరచి సమైక్య నినాదాన్ని మీరు మోసుకు తిరగడం వల్ల రాష్ట్రంలో ప్రాంతీయ వెనుకబాటుతనంపై ఇంత పెద్ద ఎత్తున చర్చ, ఉద్యమం జరుగుతున్న ఈ సందర్భంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ఊసే లేకపోవడానికి, ఢిల్లీ చర్చల్లో రాయలసీమకు ప్రాతినిధ్యం లేకపోవడానికి కారణం మీరు కాదా? రాయలసీమ ప్రయోజనాలకు మరోసారి ద్రోహం చేసే సమైక్య నినాదాన్ని నెత్తికెత్తుకొని తిరగడం వల్ల కాదా? ఇది రాయలసీమకు జరుగుతున్న మరో చారిత్రక ద్రోహం కాదా?
- గత 56 సంవత్సరాల సమైక్యాంధ్ర అనుభవం దృష్ట్యా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పడకుండా రాయలసీమ ఆత్మగౌరవ పరిరక్షింపబడదని, రాయలసీమ వనరులు ఈ ప్రాంతానికి దక్కవని మీకు తెలియదా?

(రచయితలు రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్లు) వీ

ఒక కిలోమీటర్‌కు జనాభా 201 , దక్షిణ తెలంగాణలో 297, ఉత్తర తెలంగాణలో 243 ఉన్నారు. తక్కువ సాంద్రత రాయలసీమలో ఉండడానికి కారణం కరవు కాటకాలే.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం మీద ఆధారపడింది. భూమి వినియోగం పై కొందరు, అధిక సంఖ్యలో పేదవారు ప్రకృతి వనరుల మీద ఆధారపడి ఉన్నారు. ప్రకృతి వనరుల క్షీణతలో పేదవారు జీవన విధానం దుర్భరమైంది. భూములు నిస్సారం కావడం, వర్షాలు సకాలంలో పడకపోవడంతో పంటల ఉత్పాదకత తగ్గడం, కరువులు తరచురావడంతో వ్యవసాయం అనుత్పాదకంగా నష్ట భయాలకు గురవుతోంది. 1971-72 నాటికి 70 శాతం గ్రామీణులు పేదరికంలో ఉన్నారు. అప్పట్లో పేదరికం ఉన్న జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాయలసీమలోని అన్ని జిల్లాలో పేదరికం 60 శాతం పైబడి ఉంది. 1970 నాటికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు తప్ప అన్ని జిల్లాల్లో పేదరికం బలంగా ఉంది. 1983 నాటికి రాష్ట్రంలో 52 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. తెలంగాణలో 52 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలు తప్ప అన్ని జిల్లాలు పేదరికంలో ఉన్నాయి. రాయలసీమ జిల్లాలలో కడప తప్ప మిగతా జిల్లాలు పేదరికంలో ఉన్నాయి. 1987-88 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పేదరికంలో 41 శాతం ప్రజలు ఉన్నట్లు సర్వేలు తెలిపాయి. అధికంగా 90 శాతం ప్రజలు పేదరికంలో ఉన్న జిల్లా మహబూబ్‌నగర్. 1993-94 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం 12.25 శాతం ఉన్నట్లు సర్వేలు తెలియజేస్తున్నాయి. కడప, రాయలసీమలో, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు పేదరికాన్ని వేగంగా తగ్గించడమైంది. అనంతపురం, కర్నూలు జిల్లాలు, తెలంగాణలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో పేదరికాన్ని వేగంగా తగ్గించలేక పోయాయి. 2004-05 నాటికి రాష్ట్రంలో పేదరికం 11 శాతానికి తగ్గింది. అధిక పేదరికంలో ఆదిలాబాద్, నిజామాబాద్; రాయలసీమలో కర్నూలు, చిత్తూరు, అనంతపూర్ జిల్లాలలు ఉన్నాయి. ఏది ఏమైనా రాయలసీమ జిల్లాలలో పేదరికం తగ్గలేదు.

వ్యవసాయరంగంలో ఉత్తర తెలంగాణ ఉన్నత ప్రమాణాలతో, దక్షిణ తెలంగాణ కన్న పనిచేస్తుంది. రాయలసీమ పనిచేయడంలో చాలా తక్కువ స్థాయిలో ఉంది. రాయలసీమ జిల్లాలో సాగునీరు భూమి తక్కువ. అల్ప వర్షంతో ఎరువుల వాడకం కూడా తక్కువే. యాభై సంవత్సరాల తరువాత పరిశీలిస్తే, వ్యవసాయాభివృద్ధిలో తెలంగాణ, కోస్తా ఆంధ్ర, రాయలసీమ మొదటి, రెండు, మూడు స్థానాలలో ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాలలో రాయలసీమే వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడింది.

వ్యవసాయ కూలీల వృద్ధి 1981 నుండి 2001 నాటికి కోస్తా జిల్లాలో 48 శాతం నుండి 38 శాతానికి పడిపోగా, తెలంగాణ జిల్లాలలో 35 నుండి 43 శాతానికి, రాయలసీమ జిల్లాలలో 18 నుండి 19 శాతానికి పెరిగింది. సారవంతమైన భూమి, సాగుభూమి, కోస్తా జిల్లాలో అధికంగా ఉన్నందున అధిక ఆహారోత్పత్తి జరుగుతోంది. రాయలసీమ జిల్లాలు కరువు కాటకాలకు గురి అవుతున్నందున, సాగు భూమి తక్కువ కావడం వల్ల ఆహార దిగుబడి అల్పంగా ఉంది.

తెలంగాణ జిల్లాల్లో కొన్ని వెనుకబడినందున కూడా సాగుభూమి అధికంగా ఉండడం వల్ల రాయలసీమ కన్న అధిక ధాన్యాన్ని పండించడమవుతోంది. దీని దృష్ట్యా కోస్తా ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండి, తెలంగాణ జిల్లాలు తర్వాత స్థానంలో, చివరిలో రాయలసీమ ఉన్నాయి.

ఈ మధ్య వచ్చిన మార్పులలో బియ్యాన్ని ఉత్పత్తి చేయడంలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. జొన్న కోస్తాలో తగ్గింది. తెలంగాణలో జొన్న దిగుబడి పెరిగింది, ఉత్పత్తి తగ్గింది.

పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణలో అగ్రగామిలో ఉన్నవి - హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాలు. రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో పారిశ్రామికంగా ఉండేది రంగారెడ్డి జిల్లా. కోస్తా పారిశ్రామికంగా ప్రథమ స్థానంలో, తెలంగాణ ద్వితీయ, రాయలసీమ తృతీయ స్థానాలలో ఉన్నాయి. పారిశ్రామికంగా పరిశీలిస్తే పాండే కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో 14 జిల్లాలు వెనుకబడినవిగా చెప్పింది. గుంటూరు, విశాఖ పట్టణాలు, తూర్పు గోదావరి, తర్వాత స్థానాలలో ఉన్నాయి. కడప జిల్లా పారిశ్రామికీకరణలో అతి స్వల్పమని తెలుస్తోంది. రాయలసీమ నాలుగు జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడిన జిల్లాలుగానే గుర్తించారు. రాష్ట్ర మూల ధన సాంద్రత పెరుగుతోంది. శ్రమసాంద్రత తగ్గుతోంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జిల్లాలలో, వెనుకబడిన జిల్లాలలో శ్రమ సాంద్రత పెరుగుతోంది. మూలధన సాంద్రత తగ్గుతోంది. 2003 నాటికి 1.42 లక్షల చిన్న తరహా పరిశ్రమలు రాష్ట్రంలో రిజిస్టర్ కావడమైంది. వీటిలో 47 శాతం తెలంగాణలోనూ, 42 శాతం కోస్తాలోనూ, 11 శాతం రాయలసీమలో ఉన్నాయి.

2004-05 నాటి ఆంధ్రప్రదేశ్‌లో అసంఘటిత రంగంలో 94 శాతం ఉద్యోగస్తులు, సంఘటిత రంగంలో (ప్రభుత్వంలో) 6 శాతం పనిచేస్తున్నారు. మానవాభివృద్ధిలో తెలంగాణలో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, రాయలసీమలో అనంతపురం చివరి దశలో ఉన్నాయి.

సేవల రంగంలో కూడా హైదరాబాద్, రంగారెడ్డి మొదటి స్థానంలో ఉన్నాయి. కోస్తా ఆంధ్రలో ఐదు జిల్లాలు ఉన్నాయి. ఆంధ్రా ప్రాంతంలో కృష్ణా జిల్లా మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలో మహబూబ్‌నగర్ చివరిస్థానంలో ఉంది.

2001 నాటికి నిరక్ష్యరాస్యతలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర తెలంగాణ జిల్లాలు (నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్) 46 శాతం మాత్రమే. దక్షిణ తెలంగాణ జిల్లాలలో (రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం) అక్షరాస్యత 53 శాతం. రాయలసీమ జిల్లాలలో అక్షరాస్యత 52 శాతం. మహిళల అక్షరాస్యత అన్ని జిల్లాలలో సగటున 2001 నాటికి 44 శాతం మాత్రమే.

విద్యా, వైద్య సౌకర్యాలలో కోస్తా జిల్లాలే అగ్రగామిగా ఉన్నాయి - కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు, విశాఖ. తెలంగాణలో రంగారెడ్డి, రాయలసీమలో చిత్తూరు తప్ప మిగతా మూడు జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. హైదరాబాద్ అన్నింట్లో అన్ని జిల్లాల కంటే మొదటిస్థానంలో ఉంది. చివరన మహబూబ్‌నగర్ ఉంది. నాలుగు రాయలసీమ జిల్లాలు వెనుకబడిన జిల్లాలే. విద్యా సంస్థలలో పాఠశాల విద్యను తీసుకొంటే తెలంగాణ, కోస్తా ఆంధ్ర సమానంగా ప్రయాణం చేస్తున్నాయి. రాయలసీమలో విద్యా సంస్థలలో ఉన్న నాణ్యత లోపించింది. విద్యారంగంలో ప్రైవేట్ రంగమే దూసుకుని పోతోందని చెప్పవచ్చు. బాలికల విద్య రాయలసీమ జిల్లాల్లో అతి తక్కువగా ఉంది.

సాహిత్య దిగ్గజాలు జ్ఞానపీఠ్ గ్రహీత సి. నారాయణరెడ్డి, పి.వి. నరసింహారావు (మాజీ ప్రధానమంత్రి), దివాకర్ల వెంకటావధాని, కాళోజీ, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి ప్రముఖులు ఈ గడ్డ ముద్దు బిడ్డలే.

పర్యావరణ క్షీణత రాయలసీమ, తెలంగాణ జిల్లాలలో అధికంగా కనబడుతోంది. కోస్తా జిల్లాలకన్నా, రోగనివారణ మందులు, రసాయనిక ఎరువులు రాయలసీమలో ధనిక రైతులు అధికంగా వాడడం వలన భూమి ఉపరి పొర అధికంగా అనారోగ్యానికి గురయ్యింది. భూమి నుండి దిగుబడి తగ్గింది. మురికివాడలు కర్నూలు జిల్లాలో అధికంగా ఉన్నాయి. అలాగే తెలంగాణలో రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి.

పట్టణీకరణ, జనాభా, జీవన ప్రమాణం పెరగడం వల్ల రాయలసీమలో అడవులు, నీటి కొరత అధికంగా ఏర్పడుతోంది. పర్యావరణం క్షీణించే కొద్దీ మానవాభివృద్ధి కూడా క్షీణిస్తుంది. కాలుష్యమైన గాలి, అనారోగ్య మురికి ప్రాంతాలు ఉండడం వల్ల అనేక అంటు వ్యాధులు, అంటువ్యాధులు కాని జబ్బులు చికెన్ గున్యా మొదలుకొని గుండెపోటు వరకు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి.

తెలంగాణ వారికి హైదరాబాద్ 1956 నవంబర్ 1న రాజధాని కావడం వల్ల భారీ మార్పులు, ప్రయోజనాలు తెలంగాణ ప్రజల జీవన విధానంలో వచ్చాయి. నిరంకుశ నిజాం పాలకుల పరిపాలన అంతమైంది. భూస్వామ్య విధానం క్షీణత, భూమికి విపరీతమైన ధరలు వచ్చాయి. తొండలు గుడ్లు పెట్టే స్థలం, కొండరాళ్లు కూడా కోట్లు పలుకుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు పెరిగాయి. ప్రభుత్వ సచివాలయం, అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, అసెంబ్లీ, హైకోర్టు, విశ్వవిద్యాలయాలు, పోలీసు, మిలిటరీ, విమానాశ్రయాల విభాగాలు వచ్చాయి. అవస్థాపన సౌకర్యాలు – విద్యుచ్ఛక్తి, నీరు, రహదారులు, రవాణా పారిశ్రామిక సంఘాలు, హాస్పిటల్స్, హోటల్స్, విస్తృతమయ్యాయి. రాజధానికి దగ్గరగా పారిశ్రామిక వాడలు వెలిశాయి. జన సాంద్రత పెరగడంతో ఆహార వస్తువుల ధరలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల, ప్రాంతాల వారు వలసలు వచ్చి వ్యాపారులు, విభిన్న వృత్తుల వారీగా స్థిరపడ్డారు. మహానగర జాబితాలోకి పోయి కేంద్రం నుండి నిధులు అధికంగా రావడం, జీవన ప్రమాణం పెరిగి సామాన్యుడు నగర శివార్లలో నివసిస్తున్నాడు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, సమాచార, ఔషధ, వైద్య, విద్యా పర్యాటక పరిశోధక సంస్థలపై పెట్టుబడులు మహానగరంలో వచ్చాయి. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక స్థాయిలో పెనుమార్పులు తెలంగాణ ప్రజలు కలలో కూడా అనుకోలేదు.

తెలంగాణ రాజకీయ నాయకులు స్థానికులు కావడం వల్ల విభిన్న సమస్యలు వచ్చినా 'ముల్కీ' చట్టంను కొరడాలా ఇతరులపై ఇప్పటికీ వాడుతున్నారు. సాగునీరు, విద్యుచ్ఛక్తి, ఉపాధులు కావచ్చు లభించకపోతే తెలంగాణకు అన్యాయం జరిగిందని శాసనసభలో, సంస్థల ముందు గందరగోళం చేసి సాధించుకుంటారు. దూర ప్రాంత నాయకులు కూడా స్థానికుల సమస్యలు మొదట తీర్చమని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ పద్ధతిలో తెలంగాణ నాయకులు వారి ప్రాథమిక కోరికలు ఎప్పుడో తీర్చుకున్నారు. ఈరోజు నగరశివార్లలో వ్యవసాయపు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, ఉద్యోగ కాలనీలు, వ్యాపారసంస్థలు విశ్వవిద్యాలయాలలో పదవులు, స్థలాల కబ్జాలు, హింసావాదులు, అహింసా వాదులు తెలంగాణ వారే. ఉద్యమాలతో చిరుప్రాంతీయ పార్టీలు పెట్టి, ఉండే ప్రభుత్వాన్ని భయపెట్టి వారికి కావలసిన మంత్రి పదవులు, ఛైర్మన్ పదవులు, టెండర్లు, పాలనామండలి సభ్యుల పదవులు చేజిక్కించుకుంటున్నారు.

పౌరహక్కులు, మానవ హక్కులు దైనందిన జీవితంలో అందరికీ ఒకటే. నక్సలిజం ఒక రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యే. పేదరిక నిర్మూలన జరిగితే ఉగ్రవాదం పోతుంది. చట్టం ముందు అందరూ సమానమే అనేది ముఖ్యమంత్రి నుండి కిందికి రావాలి. సామాజిక న్యాయమనేది అన్ని వర్గాల మధ్య రావాలి. మహిళా సాధికారత అనేది వేగంగా వచ్చేటట్లు చూడాలి. బాలకార్మిక వ్యవస్థ, వరకట్నాలు, కుల నిర్మూలన, ఆర్థిక అసమానత, లంచగొండితనం లాంటి సామాజిక రుగ్మతలను తొలగించాలి. చట్టాలు చేయడమేకాక వాటిని ఆదర్శంగా ఆచరించాలి, ముఠాతత్వం రాయలసీమలో, నక్సలిజం తెలంగాణలో ఉండేవి. ప్రస్తుతం ఆర్థిక పురోగతి చెందడం వల్ల ఈ రెండూ తగ్గుముఖం పట్టాయి. ఏది ఏమైనా మనిషిని మనిషిగా గౌరవించడం అందరం నేర్చుకోవాలి.

పేదిరకం, నిరుద్యోగం, వ్యవసాయం, సాగునీరు, పారిశ్రామికంగా, సేవల రంగపు సూచికలు చూస్తే తెలంగాణ జిల్లాల కన్నా రాయలసీమ జిల్లాలు అట్టడుగున ఉన్నాయి. హైదరాబాద్ రాజధాని కావడం వల్ల తెలంగాణకు బహుముఖ ప్రయోజనాలు వచ్చాయి. అయినా కొందరు తృప్తిపడడం లేదు. అసంతృప్తి వల్ల చిన్న రాష్ట్రాల భావన తరచుగా తెరపైకి రావడం జరుగుతోంది. వాస్తవికంగా చిన్న రాష్ట్రం వలన బడుగుజాతి వర్గాల అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అవసరం పడితే మూడు ప్రాంతాలు అన్నదమ్ముల్లా విడిపోయి పోటీగా వృద్ధి చెందడం సంతోషదాయకం. మహబూబ్‌నగర్‌ను మినహాయిస్తే, ప్రముఖ తెలంగాణ జిల్లాల స్థాయికి రాయలసీమ రావాలంటే సుమారుగా యాభై సంవత్సరాలు పట్టవచ్చు.

(రచయిత రిటైర్డ్ ప్రొఫెసర్, అర్థశాస్త్ర విభాగం, శ్రీ వెంకటేశ్వర విద్యాలయం) వీ

ప్రాచీన కాలం నుంచి మన దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టమైనదనీ, అందువల్లే ఆర్థిక మాంద్యం ప్రభావం మనపై అంతగా లేదనీ, కౌటిల్యుడి అర్థశాస్త్రం మన పాలకులకు ఆదర్శమనీ అంటున్నారు **డా. వి. త్రివేణి**

సంక్షోభాన్ని అధిగమించే ఆర్థిక విధానం

భారతీయ ఆర్థిక విధానం ప్రాచీన కాలం నుంచీ పటిష్టమైన వ్యూహం, పద్ధతులూ అవలంబిస్తూ వస్తోంది. వేదకాలం నుంచీ ఆర్యులు కానీ, అనార్యులు (ద్రావిడ) కానీ, రాజవంశీయులు కానీ, పరదేశీ పాలకులు కానీ, ప్రజాస్వామ్య విధానంలో కానీ అనుసరిస్తున్న ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలకంటే భిన్నమైంది. అందుకే విభిన్నమైన భారతీయ ఆర్థిక విధానంపై ప్రపంచ ఆర్థిక మాంద్య ప్రభావం చాలా తక్కువ స్థాయిలో ఉందనేది నా అభిప్రాయం. ప్రపంచ దేశాలను వాటి ఆర్థికాభివృద్ధి, స్థితిగతులను బట్టి మూడు భాగాలుగా విభజించవచ్చు. 1) అభివృద్ధి చెందిన దేశాలు; 2) అభివృద్ధి చెందుతున్న దేశాలు; 3) అభివృద్ధి చెందని దేశాలు.

భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం కాబట్టి, చాలా ప్రధానమైన రంగాలలో సైతం ప్రాచీన పద్ధతులను అవలంబిస్తోంది. తక్కువ శాతం గల కీలకమైన రంగాలలో తప్ప మరే ఇతర రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం లేదు. కాబట్టి ప్రపంచ ఆర్థిక మాంద్యం పూర్తిగా భారతీయ ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయలేకపోయింది. ఈ ప్రభావానికి పూర్తిగా అస్తవ్యస్తం అయ్యే దేశాలు మాత్రం అభివృద్ధి చెందిన దేశాలు. (అమెరికా, బ్రిటన్, రష్యా, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా మొదలైనవి). భారతదేశం పాక్షికంగానే ఈ ప్రభావానికి గురయింది.

రుగ్వేదకాలంలో సింధూ పరీవాహక ప్రాంతంలో ఆర్యులు నివసించే ప్రదేశం ఆర్యావర్తనం. వీరు మొదటగా జాతి భేదం లేకుండా ఒకే సమూహంగా నివసించినా, కాలక్రమంగా వృత్తులను బట్టి విభజన ఏర్పడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు ఆవిర్భవించాయి. ఆర్థిక సౌలభ్యం కోసం, ఆర్థిక సంపాదన కోసం బ్రాహ్మణుడు క్షత్రియుడు గాను, క్షత్రియుడు బ్రాహ్మణుడు గాను మారేవారు. వృత్తి మార్పులో గల నియమాలు నాటి కాలంలో కనిపించవు. వేదయుగాంతంలో శూద్ర వర్ణం కూడా నాలుగో వృత్తిగా ఆర్య కుటుంబంలో చేరింది.

వ్యవసాయం ప్రధాన వృత్తి. ఆర్యులు పొలం దున్ని సేద్యం చేయడంలో చాలా ఆసక్తిని కనబరిచేవారు. నాటి కర్షకులను ధాన్యకృత్తులని వ్యవహార నామంతో పేర్కొనేవారు. వేదకాలంలో ఆర్యులు కొనడం, అమ్మడం, నావల మీద దేశ విదేశాలకు పోయి సరుకులు తేవడం, వస్తువులను విదేశాలకు కొనిపోవడం మొదలైన వాణిజ్యపు పనులు విస్తారంగా చేసేవారు.

మొట్టమొదటగా తత్త్వ దర్శనానికి నాంది పలికింది భారతీయ సంస్కృతి. వైదిక యుగం నుంచే తత్త్వశోధన ఆరంభమైంది. సుసంపన్నమైన ఇంద్రియాతీత జ్ఞానసంపద చేత జరామరణ చక్రాన్ని అధిగమించవచ్చునేది తాత్త్వికుల అభిప్రాయం.

పైన పేర్కొన్న యజ్ఞయాగాది కర్మలు గానీ, మంత్ర తంత్రాలుగానీ, తత్త్వదర్శనం గానీ ఆర్థిక అవసరాలతో సంబంధం లేకుండా, ఆర్య వర్తనేతర ప్రాంత ఆర్థిక స్థితిగతులకు వైరుధ్యంగా ఉన్నాయి. అలా అని విజ్ఞానంలో తక్కువ లేదు. ఆర్యులు వాడని లోహం లేదు. చూడని చెట్టు లేదు. మెట్టని మట్టి లేదు. ముట్టని ముత్యం లేదు. మునగని నది లేదు. వేడని వేల్పు లేదు. ప్రపంచజ్ఞానానికి పుట్టినిల్లుగా ఆర్యావర్తనం వెల్లివిరిసింది.

వేదకాలం తర్వాత క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందిన కౌటిల్యుడనే నామాంతరం గల చాణక్యుడు 'అర్థశాస్త్రం' రచించారు. ఆనాటి భారతదేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సమగ్రమైన విషయాల్ని విశ్లేషిస్తుంది చాణుక్యుని అర్థశాస్త్రం. పటిష్టమైన దేశాన్ని నిర్మించుకోవడానికి ప్రభువులు, ప్రజలు తప్పనిసరిగా ఆచరించవలసిన నియమ నిబంధన కర్తవ్యాలను ఈ గ్రంథం నిర్వచిస్తుంది.

ప్రభువులు ఎల్లప్పుడూ యుద్ధ సన్నద్ధాలలో మునిగి తేలుతున్నా గానీ, వివిధ వృత్తుల వారు, వర్తకులు ఏర్పరుచుకొన్న శ్రేణులు భారత ఆర్థిక వ్యవస్థను నూతన పురోభివృద్ధి వైపు నడిపించాయి. ధనికవర్గం, నాగరిక జీవనం స్పష్టమైన రూపురేఖల్ని దిద్దుకొన్నాయి. పటిష్టమైన కేంద్ర వ్యవస్థలో సామాజిక రంగ అభివృద్ధికి, ఆర్థిక రంగ అభివృద్ధికి నూతన ధోరణులు ఏర్పడ్డాయి.

పూర్వకాలంలో అర్థమనగా భూమి, ద్రవ్యం, భావం అని వ్యవహరించేవారు. వీటన్నింటితో సంబంధం కలది రాజనీతి శాస్త్రం. రాజ్యపాలనా ధర్మమే గాక న్యాయ, వాణిజ్య, సైన్య, విద్యా, వైద్య, సాంస్కృతికాది ధర్మములు ఈ శాస్త్రంలో అంతర్భాగాలు.

కౌటిల్యుడి అర్థశాస్త్రంలోని 15 ప్రకరణాలలో పై అంశాలపై ఆర్థిక విధానం పునర్నిర్మింపబడింది. 1. రాజకుమారుల పోషణ – విద్యాభ్యాసం – మంత్రి – అస్థాన సభ్యులు – గూఢాచార్యులు; 2. రాజ్య పాలన సౌలభ్యం; 3. శాసన ప్రకరణం; 4. దుష్ట శిక్షణ – వ్యాపారమున మోసం, ద్రోహం అరికట్టుట; 5. పన్ను వసూళ్లు – కర్షకులు – ఉద్యోగులు – రాజసేవకులు – జీతభత్యాలు; 6. సప్తాంగము

– వారి కర్తవ్యం; 7. శాంతి యుద్ధం – విజయయాత్రలు – సంధులు – విగ్రహ రాజకార్యము; 8. తప్పుడు మాటలు – అపాయములు; 9.10. తంత్ర యుద్ధం; 11. భేధోపాయములు – శత్రుసైన్యం; 12. గూఢాచారుల, భటుల సహాయం – శత్రుసంహారం; 13. రాజుల గుణగణాలు – పరాక్రమాతిశయం; 14. మంత్ర తంత్ర ప్రయోగాది ఔషధాలు – విరోధాలు; 15. గ్రంథ ప్రయోజనం.

ఈ అర్థశాస్త్రం రాజలోకంనకు ప్రమాణం. భారత, రామాయణ, భాగవతాది గ్రంథాలలో కౌటిల్యుడి అర్థశాస్త్ర సూత్రాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కౌటిల్యుడి ఆశయం, లక్ష్యం ధర్మరాజ్య పాలన, రాజ్యంలో సర్వాధికారిణి ధర్మదేవత. ధర్మదేవతకు పాలకులు పాలితులు విధేయులై ఉండడం కర్తవ్యం. ధర్మస్థాపన కోసం సమాజంలో ప్రజలకు సుఖ శాంతులు కలిగించడం కోసం ప్రభువులు నియమబద్ధమైన జీవనాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. చాణుక్యుని రాజ్యపాలన విధానం ఆర్థికాభివృద్ధికి ఆదర్శప్రాయం.

ఆధునిక సమాజానికి, ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థకి కౌటిల్యుని అర్థశాస్త్రంలో నిర్దేశించిన సూత్రాలు అత్యవసరంగా భావింపవచ్చు. నియంతృత్వమైనా, రాచరికమైనా, ప్రజాస్వామ్యమైనా ప్రజల శ్రేయస్సు కోసమే పాలక వ్యవస్థ అవతరించబడాలి. అనాదిగా భారతదేశంలో మౌలిక, రాజకీయ, ఆర్థిక, నైతిక విలువలకు, క్రమశిక్షణకు పాలకవర్గం కట్టుబడి ఉంటుంది. అన్ని కాలాల్లో ఒకే విధంగా రాజధర్మం – రాజకర్తవ్యం కొనసాగింపబడింది.

సంస్కృత భాషలో రచించిన కౌటిల్యుడి అర్థశాస్త్రం శ్యామశాస్త్రి గారి ఆంగ్లానువాదం చేత విశ్వవ్యాప్తి పొందింది. ప్రపంచ దేశాలకంటే పూర్తి భిన్నమైన మన సంస్కృతి ప్రపంచ పండితులచే ప్రశంసలు పొందింది. ఆంగ్లం నుంచి ఫ్రెంచ్, జర్మనీ భాషల్లోకి పరివర్తన చెందింది. పాశ్చాత్య విశ్వవిద్యాలయాలు పాఠ్య గ్రంథంగా ఉపయోగించుకున్నారు. భారత కేంద్ర ప్రభుత్వం ఆర్థిక విధానాల రూపకల్పనలో కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని అనుసరిస్తోంది.

మధ్య యుగంలో విదేశీయుల పాలన ఆరంభమైంది. బలోపేతమైన మొగలాయి సామ్రాజ్యం దాదాపు భారతదేశమంతా విస్తరించింది. ఆర్థిక విధాన వ్యవస్థీకరణలో అక్బర్ అనుసరించిన రెవెన్యూ విధానం ప్రాధాన్యత సంతరించుకొంది. అక్బర్ ఆర్థికమంత్రి రాజా తోడర్‌మల్ ఈ విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ విధానం ద్వారా ప్రజలపై కొంత పన్నుల భారం పడినా ఆర్థిక స్థితిగతులు సమూలంగా మెరుగుపడ్డాయి. జిజియా పన్ను, తీర్థయాత్ర నిషేధపు పన్ను వంటివి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా అక్బర్ తర్వాతి మొగల్ సామ్రాజ్యాధిపతులు ఈ విధానంతో ఆర్థిక వృద్ధి కోసం ప్రయత్నించారు. వీటికి తోడు భూస్వామ్య వ్యవస్థ కూడా పూర్తిగా ఆర్థికాంశాలపైనే ఆధారపడి ఉంటుంది.

బ్రిటిష్ ఆర్థిక విధానంలో వైస్రాయ్‌ల కాలం నుంచి మన దేశాన్ని వదిలి వెళ్లేంతవరకు ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు లోటులేకుండా చేశారు. అంతకు పూర్వం 'సిపాయిల తిరుగుబాటు' చేత గుణపాఠం నేర్చుకొన్న బ్రిటిష్‌వారు ఆర్థికశాఖను బలోపేతం చేయడానికి పూనుకున్నారు. మొదటి వైస్రాయ్ లార్డ్ కానింగ్ ఆర్థిక స్థితిని మెరుగుపరచడం కోసం పొదుపు పాటించడం, సిబ్బందిని తగ్గించడం, శిస్తును పెంచడం, సైన్యాన్ని తగ్గించడం, పత్తిపై ఎక్సైజ్ పన్ను, ఉప్పు పన్ను రేటు పెంచడం వల్ల రాజ్యంలో ఏర్పడ్డ ఆర్థిక సమస్యలను అధిగమించారు. లార్డ్ లారెన్స్ కాలంలో రైలు మార్గాలు, పంటకాలువల తవ్వకం వంటి పనులు చాలా పెద్దఎత్తున దేశమంతటా జరిగాయి. పునరుత్పాదన పనుల కోసం ధనసేకరణ సూత్రం ప్రవేశపెట్టి దేశప్రగతికి పాటు పడ్డారు. లార్డ్ రిప్పన్ హిందూ దేశీయుల మనోభావాలను తెలుసుకొని దేశీయ స్వపరిపాలన విధానాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా స్థానిక స్వపరిపాలనా సంస్థలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఒప్పందాలలో స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం, గ్రామస్థాయి నుంచి ఆర్థిక కార్యకలాపాల్లో మార్పులు సంభవించడం గమనించవచ్చు. లార్డ్ రిప్పన్ స్వేచ్ఛా వాణిజ్య పద్ధతిని అమలులోకి తెచ్చి ఉప్పుపై పన్ను తగ్గించగలిగారు. ఇదేగాక తరువాతి వైస్రాయిలు సైనిక విధాన సంస్కరణలు, పరిపాలనా యంత్రాంగ సంస్కరణలు వంటివి ఆర్థిక వికేంద్రీకరణకు సహాయకారిగా నిలిచాయి.

దేశంలోని అన్ని సంస్థానాలలోకెల్లా వైశాల్యపరంగా, జన సంఖ్యపరంగా, ఆదాయం పరంగా హైదరాబాద్ సంస్థానం పెద్దది. ఇది నైజాం పరిపాలనలో ఉండేది. తెలంగాణ భూమి శిలామయం. ఇక్కడే అపారమైన ఖనిజ సంపద ఉంది. సింగరేణి, కొత్తగూడెంలో బొగ్గు, ఆదిలాబాద్, అంతర్వేదిలో ఇనుము, ఖమ్మంలో అభ్రకం, పాల్వంచలో కెంపురాయి లభ్యమయ్యేది. వీటి నుంచి వచ్చే ఆదాయంతో నిజాం ఖజానా భర్తీ అయ్యేది. కుటీర పరిశ్రమ ప్రాంతాలుగా వరంగల్ తివాచీలకు, కరీంనగర్ నుండి వెండి బంగారు తీగ పనికి, ఆలంపురం జంపఖానాలకు, పెంబర్తి ఇత్తడి పాత్రలకు, సిద్ధిపేట పట్టుబట్టలకు ప్రసిద్ధి గాంచాయి. వీటి ద్వారానే గాక అరణ్యాల ద్వారా, జలాశయాల ద్వారా నిజాంకు ఆర్థిక వనరుల ఫలసాయం దక్కేది.

భూస్వామ్య వ్యవస్థలో జమిందారీ, జాగిర్దారీ విధానం ఉండేది. ఈ వ్యవస్థ నాలుగు అంచెలుగా విభజింపబడి, 1. నిజాం కుటుంబం, 2. భూస్వామ్య కుటుంబం, 3. సేరీదార్లు, 4. రైతులు అనే విధానం అనుసరించబడింది. రైతులు చెల్లించే ప్రభుత్వ భూమి శిస్తు కూడా అంచెలంచెలుగా వడ్డీ రూపేణా చేరుతుంది. సేరీదార్ల స్థాయిలో గల ప్రభుత్వ గుమాస్తాలు పన్ను వసూళ్లలో కఠినంగా ప్రవర్తించేవారు. కార్మికుల, ఉద్యోగస్తుల స్థితిగతులను ఆర్థిక వ్యవహారంతో ముడివేయవచ్చు. బట్టల మిల్లుల ద్వారా, బొగ్గు గనుల ద్వారా, కాగితం మిల్లుల ద్వారా, రైల్వేల ద్వారా ఆర్థిక వనరులు అధికంగా సమకూరేవి. కంబళ్ల నేత, బట్టల అద్దకం వంటి వృత్తులను ముస్లింలు చాలా మంది అవలంబించేవారు. నాటికాలంలో నీటివనరులు అనేకం. వరి, జొన్న, సజ్జ, వేరుశనగ పంటలు ప్రధానమైనవి. భూమి శిస్తు రూపంలో వచ్చే ఆదాయం కానీ, ఆహార ధాన్యాలు కాని నిజాం రాజ్యానికి ఆర్థిక వెసులుబాటు కలిగించాయి.

భారత స్వాతంత్ర్యానంతరం అంతకు పూర్వం కంటే ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు సంభవించాయి. ఆర్థికాభివృద్ధి నిర్ణయించే

క్రమంలో పంచవర్ష ప్రణాళికల ఆవశ్యకత అధికం. ఆది నుంచి భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం కాబట్టి పంచవర్ష ప్రణాళికల్లో వ్యవసాయానికి మొదటి స్థానాన్ని ఇవ్వడం, తర్వాత కుటీర పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం గమనించవచ్చు. వ్యవసాయ రంగంలో దోపిడీని, సాంఘిక అన్యాయాన్ని, అణచివేతను అరికట్టడం జరిగింది. భూసంస్కరణలు అమలు చేసి, భూకమతాలకు గరిష్ట పరిమితిని విధించడం జరిగింది. దాని ఫలితంగా మన దేశంలో చిన్న కమతాలు ఆవిర్భవించాయి. రైతులు అవలంబించే వ్యవసాయం పోడు వ్యవసాయం, బిందు సేద్యం. సామాన్య రైతులు వ్యవసాయ విధానంలో ప్రాచీన తరహా పద్ధతులనే ఉపయోగిస్తున్నారు. దిగుమతి చేసుకున్న ఎరువులపై గాక కంపోస్ట్ ఎరువులను వాడుతున్నందున ఎక్కువగా సాంకేతిక రంగంతో గాని, పాశ్చాత్య పద్ధతులతో గాని సంబంధం లేకుండా భారతీయ వ్యవసాయరంగం విభిన్నంగా ఉంది.

కౌలు సంస్కరణలు ప్రవేశపెట్టి, కౌలుదారుల హక్కులు, బాధ్యతలు పరిరక్షించడం జరిగింది. వ్యవసాయ పరపతి సంస్థలు స్థాపించడం, మార్కెటింగ్ సదుపాయాలు, గిడ్డంగుల సౌకర్యం, రైతులకు గిట్టుబాటు ధరలు వంటి అనేక చర్యలు అవలంబింపబడ్డాయి. బిందు సేద్యం ద్వారా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను వినియోగించుకోవడం, వాణిజ్య పంటల విస్తరణ వంటివి నిర్వహించేవారు. చాలావరకు దేశీయ పద్ధతుల్లో, భారతదేశ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఉత్పత్తి వంటి అంశాలు ఆర్థికరంగ అభివృద్ధికి దోహదకారిగా నిలుస్తున్నాయి.

పారిశ్రామిక రంగంలో ఆర్థిక వనరుల వికేంద్రీకరణ, ఏకసామ్యాల నిరోధానికి చర్యలు తీసుకొనబడ్డాయి. స్వాతంత్ర్యానంతరం కార్మికుల ఉత్పాదక శక్తి క్రమంగా వృద్ధి చెందింది. శ్రమ విభజన, ప్రత్యేకంగా, నవ కల్పనలు, ఉత్పత్తులు ఎక్కువగా పెరిగాయి. పారిశ్రామిక ఉత్పత్తులలో స్వయం సమృద్ధిని సాధించాయి. కుటీర పరిశ్రమలకు పంచవర్ష ప్రణాళికలలో ప్రాధాన్యం ఇవ్వడం చేత, చేతివృత్తుల నైపుణ్యం బలోపేతం గావింపబడింది. భారతదేశంలో వేదకాలం నుంచి వస్త్రోత్పత్తిలో మంచి నేర్పును ప్రదర్శించేవారు. అలంకారయుతమైన వస్తువులు చేతివృత్తుల, కులవృత్తుల ఆధీనంలో తయారవుతాయి. వ్యవసాయం తర్వాత మన భారతీయ ఆర్థిక వ్యవస్థ కులవృత్తులపైనే ఆధారపడి ఉందని గ్రహించవచ్చు. వస్తు మార్పిడి పద్ధతిలో కులవృత్తుల ప్రాధాన్యత అధికంగా ఉండేది. ప్రతి కులవృత్తిలోనూ నైపుణ్యవంతమైన వస్తువులు తయారవడమే గాక, వృత్తికారుల్లో ఆత్మవిశ్వాసం, జీవన విద్య బయలుపడుతుంది.

జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా 1950-51లో 50.20 శాతం ఉండగా 2000-01 నాటికి పరిశ్రమల, సేవారంగం వాటా 48.45 శాతంగా ఉంది. దీంతో ఒక నిర్దిష్ట ఆర్థిక ప్రణాళికతో దేశానికి సరిపడే ఆహార ధాన్యాన్ని, వస్తువుల్ని జనాభా ప్రాతిపదికన ఉత్పత్తి చేసి ఒకేసారి ఇవ్వడానికి భారతీయ ఆర్థిక విధానం సన్నద్ధం అయ్యింది.

బ్యాంక్ రుణాలలో సైతం భారతదేశానికి, ఇతర దేశాలకు మధ్య చాలా అంతరం ఉంది. చాలా భారతీయ బ్యాంకుల్లో మైక్రో ఫైనాన్స్ (సూక్ష్మ ఆర్థికత) ను అవలంబిస్తున్నారు. అంటే ఉత్పత్తులపై రుణాలు ఇవ్వడం. కులవృత్తులకు రుణ సదుపాయాలు అందించడం. ఆర్థికంగా అట్టడుగు బలహీనవర్గాని సమీకరించి అతి చిన్నమొత్తంతో ఉపాధి సౌకర్యం కల్పించి ఆర్థికాభివృద్ధిని సాధించడం జరుగుతోంది. ఇది ఒక సామాజిక ఆర్థిక విప్లవం అని చెప్పవచ్చు. తద్వారా గ్రామస్థాయి నుంచి ఆర్థిక సంస్కరణలు బయలుదేరాయి. విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి కల్పన, వృత్తి నైపుణ్యాలు మొదలగు పథకాలు అందుబాటులో ఉన్నాయి. జవహర్ రోజ్‌గార్ యోజన, డ్వాక్రా పథకాలు, గృహనిర్మాణ పథకాలు ప్రవేశపెట్టి సమాజం నుంచి ఆర్థిక రాబడికి అనుగుణంగా విధానాలను రూపకల్పన చేయడం జరుగుతోంది.

భారతీయ ఆర్థిక విధానం చాణక్యుని అర్థశాస్త్రం. ప్రపంచ ఆర్థిక సంక్షోభం భారతీయ రైతులపై గానీ, కుటీర పరిశ్రమలపై గానీ, వివిధ సేవారంగాలపై గానీ అత్యధిక ప్రభావాన్ని చూపలేకపోయింది. కొద్ది శాతం మాత్రమే సాంకేతికరంగంపై ఆధారపడిన ప్రజల జీవన స్థితిగతులపై సంక్షోభం కనిపిస్తుండవచ్చు. పాశ్చాత్య సంస్కృతికి లోబడిన పరిశ్రమలు, సాంకేతిక విజ్ఞాన పరికరాలతో కూడిన సంస్థలు పాక్షికంగా ఆర్థిక మార్పుకు గురికావలసి వచ్చింది. వస్తు వాణిజ్య వర్తకాలలో ద్రవ్య మారకం ద్వారా కూడా ఈ సంక్షోభం ఆసన్నమవుతోంది. కాని 'రూపాయి' మారక ద్రవ్యానికి ఈ దుస్థితి నెలకొనలేదు. 'డాలర్ ప్రపంచంపై భారంగా కదులుతున్న రోడ్డు రోలరు' అన్న కవి భావన ఈ సందర్భంలో గుర్తుకొస్తుంది.

2001లో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కొనసాగుతున్నా భారత, చైనా దేశాలు మాత్రం దాని ప్రభావం తమపై పడకుండా తట్టుకుని నిలదొక్కుకున్నాయని ఐక్యరాజ్య సమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ (అంక్టాడ్) తన నివేదికలో పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆసియా దేశాలలో దిగువ స్థాయిలో ఇతర ఆసియా దేశాలు అంతర్గత డిమాండ్ కారణంగా పెరుగుదల రేటు సాధించేందుకు చాలా ప్రయత్నాలు చేశాయి. చాలా కష్టాలు ఎదుర్కొన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు కనీసం 3 శాతం వృద్ధిరేటును సాధించలేక పోయాయని నివేదిక వివరించింది. పెరుగుదల రేటు మరీ మందకొడిగా సాగి, అభివృద్ధి చెందిన దేశాలలోని మూడు కీలక ప్రాంతాలలో పెరుగుదల రేటు పడిపోయింది. 1990 నాటి ఆర్థిక మాంద్యం కంటే దుర్భర పరిస్థితులు నెలకొని ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలోని మార్కెట్‌లకు కూడా ఆర్థిక మాంద్యం దెబ్బ తప్పలేదు. భారత, చైనా దేశాలు మాత్రం అతిపెద్ద, బలమైన ఆర్థిక వ్యవస్థలు కలిగి ఉండడంతో ప్రపంచ మార్కెట్‌లో తిరోగమన ఒత్తిడులను తట్టుకొని నిలువగలిగాయని నివేదిక తెలిపింది.

విభిన్నమైన సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవనశైలి, ఆర్థిక విధానాలు భారతదేశాన్ని ప్రపంచదేశాల నుంచి వేరుపరుస్తున్నాయి. భారతదేశంలో అవలంబిస్తున్న సరళీకృత ఆర్థిక వ్యవస్థ చేత ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

(రచయిత తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్‌లో అధ్యాపకులు)

మానవ సమాజ చరిత్రకు మనిషి శ్రమే పునాది అనీ, ఆ తర్వాత కాలంలో శ్రమ చేయని ఒక వర్గం ఆవిర్భవించిందనీ, ఆ వర్గం ఆధిపత్యమే మనపై ఇప్పటికీ కొనసాగుతోందనీ అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ప్రాచీన యుగాల్లో శ్రమ విభజన

మానవసమాజం శ్రమమీదనే పూర్తిగా ఆధారపడుతుంది. శరీర శ్రమ లేకుండా మనుషులకు ఎన్నడూ జరగలేదు. గుహల్లో జీవించిన దశల్లోనైనా, గ్రామాలూ, పట్టణాల్లో కాలం గడిపినప్పుడైనా ప్రజలు ప్రతిదానికీ ఒళ్లువంచి కష్టపడుతూనే ఉన్నారు. శ్రమ లేకుండా వినియోగానికి వస్తువులూ, సంపదలూ ఏనాడూ సృష్టి కాలేదు. అయితే సమాజంలో అందరూ ఒకే రకంగా పనిచెయ్యరు. ఎక్కువ మంది చెమటోడ్చినా కొందరు "బుద్ధిబలాన్ని" మాత్రమే ఉపయోగిస్తారు.

ఈ రోజుల్లో "చదువుకున్న వారు" తగిన అవకాశాలు దొరక్క శరీర శ్రమ చెయ్యడానికి సిద్ధపడితే అది వారికీ, ఇతరులకూకూడా అవమానకరంగా అనిపిస్తుంది. ఈ ఎక్కువ తక్కువలు మొదలై కొన్ని వేల సంవత్సరాలయింది. ఇది "అనాది"గా మాత్రం ప్రారంభమైన భావన కాదు. ఎందుకంటే తొట్టతొలి మానవ సముదాయాల్లో శ్రమవిభజన అంటూ ఉండేదికాదు. అందరూ కలిసి కష్టించేవారు. వేటలోనైనా, ఏరుకు తినడంలోనైనా పసిపిల్లలుతప్ప తిని కూర్చునే వర్గం ఉండేది కాదు. శ్రమకు ఫలితం అందరికీ సమానంగా దక్కేది. అప్పటి భాషలో "నేను" అనే పదమే ఉండేది కాదనీ "మేము" అనే మాటను మాత్రమే వాడేవారనీ కొందరు పరిశోధకుల అభిప్రాయం. ఈ సమానత్వం తగ్గి, పనుల నిర్వహణలో వ్యత్యాసాలు నెమ్మదిగా ఏర్పడసాగాయి.

అయితే ఈ శ్రమవిభజన ఈనాటిది కాదు. ఆదిమయుగంలో ఇది మొదటిసారిగా గణాచారులూ, మంత్రగాళ్లూ, మతపెద్దలూ, అతీత శక్తులను గారడీద్వారా వశపరుచునేందుకు ప్రయత్నించిన ఇతర వర్గాలతో మొదలయి ఉంటుంది. మనిషి మనుగడకు తిండీ, ఇల్లూ, బట్టలేకాక ప్రకృతి శక్తులతో సంపర్కం పెట్టుకుని వాటిని "మంచి" చేసుకోవడంకూడా చాలా అవసరమనిపించింది. ఆ రోజుల్లో కష్టాలకు ఎదురీదుతున్న మానవజాతికి ప్రకృతి ఎంత యథార్థమైనదిగా కనబడేదో వాటి వెనక ఉన్నట్టుగా వారు ఊహించుకున్న అతీతశక్తులు కూడా అంత యథార్థమైనవిగానూ అనిపించేవి. అందువల్ల ఇటువంటి పనులు చేపట్టడం సమాజశ్రేయస్సు కోసమేనని అందరూ భావించారేకాని పని ఎగగొట్టే ఉపాయమని అనుకోలేదు.

ఆనాటి సమాజంలో మొదటిసారిగా పొడచూపుతున్న ఆధ్యాత్మికధోరణులవల్ల ఈ తొలి ఆటవిక పూజారులకు శరీరశ్రమ చేసే అవసరం తప్పింది. ఇలాంటివారు ఈనాటికీ అతి పురాతనమైన ఆదివాసీ తెగలలో కనిపిస్తారు. తరవాతి దశలలో ఆత్మకూ, శరీరానికీ ఉన్న తేడాలూ, అలాగే మనసుకూ, శరీరానికీ భేదాలూ, ఆలోచనకూ, ఆచరణకూ వ్యత్యాసాలూ అవగతం కాసాగాయి. ఇది అప్పటి సమాజాన్ని ప్రగతిపథాన ముందుకు నెట్టింది. ఇందులో భాగంగానే శరీరశ్రమకూ, మానసికశ్రమకూ తేడాలు ఏర్పడడంతోటే సమాజంలో వర్గాలుకూడా మొదలయాయి. జీవనోపాధికై శ్రమించనక్కర్లేని అల్పసంఖ్యాక వర్గం ఒకటి తొలిసారిగా ఏర్పడింది.

ఒళ్లు హూనం చేసుకోకుండా తీరికగా ఉండే అరుదైన అవకాశాన్ని మనుషులు మొదటగా ఆకాశాన్ని పరిశీలించడానికే ఉపయోగించు కున్నట్టు కనబడుతుంది. ఎక్కడో ఆకాశాన ఉన్న నక్షత్రాల కేసి చూడడమూ, వాటిని గురించి ఊహించుకోగలగడమూ మనిషితప్ప మరే జంతువూ చెయ్యలేని పని. నక్షత్ర పరిశీలన క్రమంగా ఒక ఉపయోగకరమైన ప్రక్రియగా తయారు కాసాగింది. కాలంతోబాటు తారల, గ్రహాల కదలికలూ, కాలగణనానికి పనికొచ్చే ఈ మార్పులనుబట్టి పరిసరాల్లో ప్రతి సంవత్సరమూ కలిగే పరిణామాలూ అన్నీ తమ జీవితాలకు పనికొచ్చేవిగా మనుషులు గుర్తించసాగారు. అప్పట్లో ఇది ఖగోళ శాస్త్రంగా కాక మతభావనలతో కలగలిసిపోయిన అయోమయం గానే రూపొందినప్పటికీ మానవ నాగరికతకు ఇదే తొలి పునాది అయింది. ప్రాచీన ఈజిప్ట్‌లో గణిత శాస్త్రాన్ని మొదలు పెట్టింది అక్కడి పూజారి వర్గమే.

ప్రకృతిని గురించిన సమాచారమూ, దానితోబాటు మంత్ర తంత్రాలూ ఇవే మొదటగా రూపొందిన జ్ఞాన, విజ్ఞానాలు. ఇవి సమాజాన్ని నియంత్రించగలిగే శక్తివంతమైన సాధనాలుగా రూపొందుతున్న కొద్దీ వీటిని అదుపులో ఉంచుకునే అల్పసంఖ్యాకులది క్రమంగా పైచెయ్యి కాసాగింది. ఉదాహరణకు ఈజిప్ట్‌లో నైల్‌నది పొంగినప్పుడల్లా ప్రజలకు తీవ్రమైన నష్టం కలుగుతూ ఉండేది. రుతువుల మార్పునుబట్టి ఇటువంటి దెప్పుడు జరుగుతుందో ఊహించి సరిగ్గా చెప్పగలిగిన గుళ్లోని "శాస్తుర్లు"గారిని తక్కినవారు "నోరు వెళ్లబెట్టుకుని" చూడడమే కాదు, తమ ప్రాణాలను కాపాడగలిగిన దేవుడిగా కూడా భావించి ఉండవచ్చు.

అలాగే లిపులను ఉపయోగించి, రాతపని చెయ్యడం కూడా "పామరులకు" అసాధ్యంగా ఉండేది. దీని "రహస్యాలను" పూజారులు ఇతరులకు చెప్పేవారుకాదు. లిపి అనేది మొదటగా తయారైన సుమేరియన్ నాగరికతలో రాయడమనేది ఒక్క పెద్దవిషయంగా ఉండేది.

ఎం.ఎ. వనజ



ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది, మానవ హక్కుల పత్రిక 'తర్జని' సంపాదకురాలు ఎం.ఎ. వనజ (38) ఏప్రిల్ 16న మరణించారు. కళాశాల విద్యార్థిగా విప్లవ విద్యార్థి, మహిళా ఉద్యమాల ప్రభావంలోకి వచ్చిన వనజ 1990 నుంచి ఇరవై సంవత్సరాలుగా విభిన్న ప్రజా ఉద్యమాలలో క్రియాశీల పాత్ర వహించారు. తొలి రోజుల్లో హైదరాబాద్‌లో మహిళా వాహిని, మహిళా చేతన కార్యకర్తగా ఒకవైపు సాంస్కృతిక, ప్రచార కృషిలోనూ, మరొకవైపు రాజకీయ సమీకరణ కృషిలోనూ ఆమె చురుకుగా పాలుపంచుకున్నారు. ఆ తర్వాత న్యాయవాదిగా వీధి బాలల, వికలాంగుల, గృహ హింసకు బలిఅయిన మహిళల, మానవ హక్కుల కార్యకర్తగా ఆమె బహుముఖ పోరాటాలు సాగించారు. జువెనైల్ రైట్స్ ఫోరం, హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్, మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్ వంటి సంస్థలలో కార్యకర్తగానూ, నాయకురాలిగానూ పనిచేశారు. ఆ సమస్యలపై న్యాయస్థానాలలోనూ, రాష్ట్ర మానవ హక్కుల సంఘంలోనూ అనేక కేసులు వాదించి, గెలిచి, ఎన్నో ప్రజా సంక్షేమ చట్టాల, నిబంధనల రూపకల్పనలో తన వంతు భాగస్వామ్యం అందించారు. ఈ రంగాల కృషిని విస్తృతం చేయడం కొరకు ప్రత్యేకంగా ఒక పత్రిక అవసరమని గుర్తించి, సంపాదకురాలిగా 'తర్జని' పేరుతో మాసపత్రిక నిర్వహిస్తున్నారు. గృహ హింస, వీధి బాలల విముక్తి, పునరావాసం, వికలాంగుల హక్కుల పరిరక్షణ మొదలైన అంశాలపై రచనలూ, ఉపన్యాసాలూ, టెలివిజన్ చర్చలూ ఆమె అవగాహనకూ, నిబద్ధతకూ అద్దం పడతాయి. పది సంవత్సరాలుగా తీవ్రమైన అనారోగ్యం పాలై కూడా ఆమె ఈ కార్యక్రమాలన్నిటిలోనూ అగ్రభాగాన ఉండడం మాత్రమే కాక, ఇటీవల రంగారెడ్డి జిల్లా న్యాయస్థానాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ లాయర్స్ కలెక్టివ్‌కు, తెలంగాణ సామాజిక కార్యకర్తల వేదికకు ప్రోత్సాహకురాలిగా నిలిచారు. 2002లో మొదటిసారి కిడ్నీ మార్పిడి జరిగి, అప్పటి నుంచీ డయాలిసిస్ మీదనే ఉన్నా, ఆ తర్వాత గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నా ప్రజా సంక్షేమ, సామాజిక కార్యక్రమాలలో నిరంతరం పాల్గొన్నారు. వీ

జరిగిన విషయాలను రాసిపెట్టడమే కాదు, జరగబోయేవికూడా పాత రచనల్లో దాగి ఉంటాయని అక్కడి పూజారులు ఊహించసాగారు. అందులో యథార్థంతోబాటు మంత్ర భావనలుకూడా ఉండేవి. అధిక సంఖ్యాకులు చేతులతో కష్టపడి పనిచేస్తున్న యుగంలో ఒక చిన్న మేధావివర్గం తయారుకాసాగింది. క్రమంగా ఈ రెండు వర్గాలకూ మధ్య పూడ్చలేని ఎడం ఏర్పడసాగింది. కేవలం తమ తెలివితేటలతో నెట్టుకురాగలిగిన వర్గం ఇతర సామాన్య ప్రజలకు క్రమంగా దూరం అవుతూవచ్చారు. వారికి శరీరశ్రమ అంటే ఏహ్యాభావం పెరగసాగింది. కండలు కరిగించి పనిచేసే వర్గంవారు అక్షరాలా గొడ్డుచాకిరీకి మాత్రమే పనికొస్తారనే భావన ఏర్పడింది. అక్షరజ్ఞానమూ, పదసంపదా, ఆలోచించగలగడమూ "ఉన్నతమైన" లక్షణాలుగా భావించబడ్డాయి.

ఇలాంటి తూస్కారధోరణిని దాచుకోవలసిన అవసరమూ తగ్గిపోయింది. క్రీస్తుకు పూర్వం 2000 ఏళ్ల క్రితం తన కొడుకును 'వ్రాయసకాడు'గా శిక్షణ నిప్పించదలచిన తండ్రి కుర్రవాడితో జరిపిన సంభాషణ చరిత్రకారులకు లభ్యమయింది. తండ్రి ఉద్బోధ ఈ విధంగా సాగుతుంది. "శరీరశ్రమ చేసే వాడికి అది చెయ్యడం తప్ప మరో మార్గంలేదు. రాతపని చేసేవాడికి తక్కిన బరువు బాధ్యతలేవీ ఉండవు. కమ్మరి చేతివేళ్లు చూడు, మొసలి శరీరంలా కొంకర్లు తిరిగి ఉంటాయి. వాడి దగ్గర ఒకటే కంపు. ఇళ్లు కట్టేవాడెప్పుడూ పందిలాగా బురదలో దొర్లుతూ ఉండాలి. వాడి బట్టలు కూడా బురదతో అట్టలుకట్టి ఉంటాయి. బాణాలు చేసేవాడు రాతిములికి కోసమని గాడిదలాగా ఎడారుల వెంట తిరగాలి. చాకలి నైల్‌నది ఒడ్డుకు వెళితే మొసళ్లు వాణ్ణి పలకరిస్తూ ఉంటాయి. అదే రాయసకాడవైతే ఎవరూ నిన్ను గదమాయించలేరు. రాజుగారింటి భోజనం లభిస్తుంది. మంచిజీవితం, ఆరోగ్యం, సిరి సంపదలూ ఉంటాయి. నీకేకాదు, నీ పిల్లలకూ, వారి పిల్లలకూ అందరికీని".

ప్రాచీన గ్రీక్ నాగరికతలోకూడా ఇటువంటి భావనలే ఉండేవి. "చేతిపని చెయ్యడం అవమాన కరం. పొద్దస్తమానమూ గదిలో ఏ నిప్పులకుంపటి దగ్గరో కూర్చుని ఉండాలి. అలాంటి జీవితం దేహాన్నే కాదు, ఆత్మను కూడా నాశనం చేస్తుంది. ఈ పనివారికి స్నేహితం చెయ్యడమూ, పౌరబాధ్యతలు చేపట్టడమూ వీలవదు. అందుకే వీరితో ఎక్కువమంది స్నేహంగా ఉండరు. వీరికి తగినంత దేశభక్తి కూడా ఉండదు". సాటి ప్రజలకోసం రెక్కలుముక్కలు చేసుకునే వర్గం పట్ల ఈనాటికీ కనిపిస్తున్న చులకన ఏనాటిదో దీన్నిబట్టి తెలుస్తుంది.

మనిషి మనస్సు వికసించి, ఊహాశక్తివల్ల తక్కిన ప్రాణులతో పోలిస్తే అపూర్వమైన విజయాలను సాధించడం మొదట్లో మానవజాతిని ప్రభావితం చేసినమాట నిజమేకాని, ఇటువంటి నిరసన భావం మాత్రం సమాజం వర్గాలుగా విడిపోవడాన్నే సూచిస్తుంది. అంతేకాదు, భావనలూ, ఆలోచనలూ, మాటలూ మొదలైనవాటికి యథార్థప్రపంచంతో సంబంధం లేని ఒక ప్రత్యేక అస్తిత్వం ఉన్నట్టుగా భ్రమకూడా కలగసాగింది. చేతులకు మట్టి అంటుకోకుండా నెలల తరబడి ఇహ, పర లోకాలను గురించి ఆలోచిస్తూ రకరకాల ప్రతిపాదనలు చెయ్యడం, వాటి గురించి సాటి వేదాంతులతో చర్చించడం, సమాజాన్నీ, జీవితాలనీ విశ్లేషించడం మొదలైనవన్నీ మేధావివర్గానికి పరిమితమైన మేధోవ్యాపరంగా తయారైంది. యథార్థప్రపంచానికి అంతకంతకూ దూరం కాసాగిన వర్గానికి కనబడు తున్నదంతా మాయ అనీ, ఆలోచనల ప్రపంచమే నిజమైనదనీ అనిపించడంలో ఆశ్చర్యం లేదు. మతాలలోనూ, వేదాంతంలోనూ కనబడే మూలభావన ఇదే. శ్రమవిభజనను చక్కగా ఉపయో గించుకుని "పైకొచ్చిన" వర్గాలు ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయని వేరే చెప్పక్కర్లేదు.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త) వీ

వివిధ దేశాలపై అమెరికా తన పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని ఎలా చెలాయిస్తుందో తెలియజేసే 'కుట్రాజకీయం' పుస్తకాన్ని పరిచయం చేస్తున్నారు **విద్యాభూషణ్**

ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యం

వందేళ్లుగా అమెరికా తన పెత్తనాన్ని ఎలా చెలాయిస్తూ వచ్చిందో, వస్తుందో తేటతెల్లంగా తెలియజేసే పుస్తకం ఈ 'కుట్రాజకీయం'. ప్రముఖ అమెరికన్ పాత్రికేయులు స్టీఫెన్ కింజర్ రాసిన 'ఓవర్ త్రో – అమెరికా సెంచరీ ఆఫ్ రిజీమ్ ఛేంజ్ ఫ్రం హవాయ్ టు ఇరాక్' పుస్తకానికి కొణతం దిలీప్ స్వేచ్ఛానువాదం ఇది. తమను వ్యతిరేకించే ప్రభుత్వాలను తొలగించేందుకు, తమ తాబేదార్లను అధికారంలో కొనసాగించేందుకు నాటినుంచి నేటి వరకూ అనుసరించిన, అమెరికా అనుసరిస్తున్న విధివిధానాల విశ్లేషణే ఈ పుస్తకం. ఓ వందేళ్ల దురహంకారానికి అక్షర రూపం ఇది.



'సామ్రాజ్యవాదం' తన ఆధిపత్యపు నేపథ్యంలో ఏయే విలువలను, ఏయే ప్రయోజనాలను ఆశించి ఈ నైచ్యానికి పాల్పడుతుందో అత్యంత వివరంగా అవగతమవుతుంది. ఆయా దేశాల్లోని మేధావులను, మీడియాను స్వచ్ఛంద సంస్థల ముసుగులో లోబర్చుకుని తమ అనుకూల విధి విధానాలకు ఉనికినిచ్చి, ప్రభుత్వ వ్యతిరేకతకు పాదు పొయ్యడం తొలిమెట్టు.

కుట్రాజకీయం – స్టీఫెన్ కింజర్ – తెలుగుసేత: కొణతం దిలీప్ – వీక్షణం పబ్లికేషన్స్ – 114 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

తరువాత క్రమంలో సైనిక జోక్యంతో ప్రభుత్వాధినేతలను పదవీ చ్యుతుల్ని చేయడం, నిర్బంధించడం, ఆపై చంపేయడం ఈ సామ్రాజ్య వాదానికి ఓ సర్వసాధారణ ప్రక్రియ . ఈ ప్రక్రియ ద్వారా సామ్రాజ్యవాదం తన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలను ఎలా పరిపుష్టం చేసుకోగలుగుతుందీ అన్న విషయాన్నీ విడమరుస్తుందీ పుస్తకం.

ప్రపంచదేశాల్లో తనకు అనుకూల ప్రభుత్వాల నేర్పర్చుకోవడం రాజకీయ అవసరమైతే, ఆయాదేశాల ప్రకృతివనరులపై తమ పట్టును పెంచుకోవాలనుకోవడం, 'ఆర్థిక ప్రయోజనం' ఏకధృవ లక్ష్యంగా పెట్టుబడిదారీ విధివిధానాల వికాసానికై కృషి చేయడం వెనుక వారి సామాజిక సాంస్కృతిక అవసరాలూ ఉంటాయి.

ప్రపంచీకరణ విధి విధానాల ప్రవేశం నుంచి నేటి వరకూ మన సమాజంలో చోటు చేసుకున్న పరిణామాలను సమీక్షించుకుంటే మనకో విశ్లేషణ రుజువవుతుంది. కేవలం ఆర్థిక సంస్కరణల ఇరవై ఏళ్ల ప్రాయం నాటికే మన గ్రామీణ భారతం ఓ ఎడారై పోయింది. నాగరిక సమాజం 'వ్యక్తి స్వేచ్ఛ' మత్తులో నైతికంగా, దిగంతాల లోతుల్లో కూరుకుపోతోంది. 'డబ్బు' చేయనివ్వని అకృత్యం లేదు – అరాచకం లేదు. ఈ సెగ 'మీడియా'ను ఎలా దిగజారుస్తుందో నిత్యం చూస్తూనే ఉన్నాం.

అమెరికా విధి విధానాలను బలపర్చని పాలకవర్గ పార్టీలే నేడు లేవు. అధికార లక్ష్యమే ఈ పార్టీలన్నింటి ఎజెండా. ఇది సామ్రాజ్యవాదపు రాజకీయ లబ్ధి. మనం (ఈ దేశ ప్రజలు) తిన్నా, తినకున్నా ఆహారధాన్యాల ఎగుమతులు – దిగుమతులను సామ్రాజ్యవాదమే శాసిస్తుంది. ఇదే ఆర్థిక ప్రయోజనం. అనునిత్యం చోటు చేసుకుంటున్న సైబర్ ఘోరాలు – నేరాలు సామ్రాజ్యవాద విష సాంస్కృతీ ప్రభావం వలననే. ఇలా మొత్తం యావత్ ప్రపంచం మీద అమెరికా తన విదేశాంగ విధానంతో ఎలా దాడి చేసిందో విశదీకరిస్తుందీ 'కుట్రాజకీయం'.

అమెరికా ఈ తరహా కుట్రకు బీజం వేసింది 1893లో హవాయ్‌లో. రాచరికాన్ని కూలదోయడానికి, ఇక్కడ ప్రజాభిప్రాయం, ప్రజామోదం మొదలైన ప్రాథమికాంశాలకు పని లేదు. విదేశీ ప్రభుత్వాలను దారికి తెచ్చుకోవడమే ఏకైక లక్ష్యం. అత్యంత బహిరంగంగానే తన జోక్యాన్ని ప్రదర్శించేది. స్పెయిన్ పై సైతం ఇదే తరహా ఆధిపత్యం. అప్పటికే 'విదేశీ మార్కెట్లను విదేశీ సహజ వనరులను తన అదుపులో ఉంచుకొని, ఏ దేశమూ గొప్పదేశం కాజాలదు' అని ఆల్‌ఫ్రెడ్ థేయర్ అనే సిద్ధాంతవేత్త పేర్కొన్నాడు.

1893 ప్రాంతంలో మొదలైన ఈ అహంకార ధోరణి క్యూబా, ఫిలిప్పైన్స్, నికరాగువా, హోండురాస్, ఇరాన్, గ్వాటెమాల, దక్షిణ వియత్నాం, చిలీ, గ్రెనెడా, పనామా, అఫ్ఘనిస్థాన్, ఇరాక్ (2003) నాటికి ఎన్ని వెర్రితలలు వేసిందో విడమర్చి చెప్తుందీ పుస్తకం. ఈ దాడిని ఎదుర్కొనే ప్రతిదాడుల వ్యూహాలను, లక్ష్యాలను, జన సంకల్పాలను వివరించే ప్రయత్నం సైతం జరిగింది. సోవియట్ రష్యా ఆవిర్భావానికి ముందు, సోవియట్ రష్యా ఉనికిలో ఉన్న నాటికి, సోవియట్ రష్యా పతనానంతరం అమెరికా అహంకార ధోరణుల మార్పుని సామాన్యునికి అర్థమయ్యేలా ఉందీ విశ్లేషణ.

ప్రపంచీకరణ రెండు దశాబ్దాల కాలంలో సామాన్యుని అస్తిత్వాన్నే అస్థిరం చేసేసి, చెదిరిన కలగా చేసి పారేస్తున్న వేళ సైతం – ప్రపంచీకరణను వెనకేసుకొస్తున్న మేధావులు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. 'దళారీ పశ్చాత్తాపం' చదివించిన తరువాత కానీ, 'ఈ ప్రపంచీకరణ వెనుక ఇంత కథ ఉందని తెలీదు సార్' అన్న వ్యక్తులూ ఉన్నారు. అలాగే ఈ 'కుట్రాజకీయం' సైతం పలువురి ఆలోచనా ధోరణిని సక్రమ మార్గంలో పెట్టగలదేమోనన్న ఆశ కలుగుతోంది. ఏమైనా గానీ కాస్తా ఎక్కువ సమయం తీసుకున్నా మిత్రుడు దిలీప్ మరో మంచి పుస్తకాన్ని పాఠకులకు అందించినందుకు అభినందనలు.

(రచయిత సీనియర్ పాత్రికేయులు) వీ

తుపాను బీభత్సం

ఏప్రిల్ 14న మూడు రాష్ట్రాల్లో అత్యంత వేగంగా వీచిన ఈదుర గాలుల కారణంగా 120 మంది మరణించారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా, బీహార్‌లోని నాలుగు జిల్లాలు, అసోంలోని ఐదు జిల్లాల్లో నలభై నిముషాలపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఈ తుపాను గాలుల కారణంగా 60 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. చెట్లు కరెంట్ స్తంభాలు విరిగిపడి ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

మోడీపై సిట్ విచారణ

2002 గోద్రా ఘటన తర్వాత గుజరాత్‌లోని గుల్బర్గ్ సొసైటీలో జరిగిన మారణకాండపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు మార్చ్ 26న గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ హాజరయ్యారు. సిట్ అధికారి మల్హోత్రా ఈ విచారణను కొనసాగించారు. దేశంలోనే సిట్ ముందు హాజరైన మొదటి ముఖ్యమంత్రిగా మోడి నిలిచారు. 2002లో గోద్రా అల్లర్ల అనంతరం గుల్బర్గ్ సొసైటీలో ఉన్న కాంగ్రెస్ మాజీ ఎంపి ఎషాన్ జాఫ్రీతో సహా 69 మంది ముస్లింలను అల్లరి మూకలు హతమార్చాయి. మోడీతో పాటు 63 మందిపై జాఫ్రీ భార్య జకియా జాఫ్రీ ఫిర్యాదు చేశారు.

రహస్య అకౌంట్ల దేశాలు

భారతదేశంలో అక్రమంగా సంపాదించిన సొమ్ము, దేశం ఎల్లలు దాటి బెర్ముడా, బ్రిటిష్ బ్రిడ్జ్ ఐర్లాండ్స్, కేమాన్ ఐర్లాండ్స్, జిబ్రాల్టర్, గుర్న్‌సే, ఐజిల్ ఆఫ్ మాన్, జెర్సీ, నెదర్లాండ్స్ అంటిలెస్, మాకావో వంటి తొమ్మిది దేశాలకు చేరుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇక ముందు అధికారిక సంబంధాలు పెట్టుకొని, అక్రమ నిధుల ప్రవాహాన్ని ఆపేందుకు చట్టాలను మార్చాల్సిందిగా ఈ తొమ్మిది దేశాలను భారత్ కోరవచ్చు. 2009 ఆర్థిక చట్టంలో ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 90ని సవరించారు. భారతదేశం ఎటువంటి స్పెసిఫైడ్ టెరిటెరితోనైనా ఒప్పందాలు కుదుర్చుకోవడం ఈ సవరణతో వీలవుతుంది. ఆయా ప్రభుత్వాలతో ఉన్న సంబంధాలు కాకుండా ఈ ప్రాంతాలతో ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు.

మారణకాండపై తీర్పు

బీహార్‌లోని జెహనాబాద్ జిల్లాలో లక్షణ్‌పూర్ బాతే గ్రామంలో భూస్వామ్య కిరాయి సైన్యాలు చేసిన మరణకాండకు 13 ఏళ్ల న్యాయ పోరాటం తరువాత న్యాయం జరిగింది. దళితులను హతమార్చిన కేసులో 16 మందికి బీహార్ కోర్టు మరణశిక్ష విధించింది. ఈ కేసులోని మరో 10 మందికి యావజ్జీవ ఖైదుతోపాటు, ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు జరిమాన విధించింది. కేసు విచారణ కొనసాగుతుండగా ఇద్దరు మరణించారు. సరైన సాక్ష్యాలు లేని కారణంగా 17 మందిని కేసు నుంచి విముక్తులను చేశారు. ఏప్రిల్ 7న పాట్నా సివిల్ కోర్టుకు చెందిన సెషన్స్ న్యాయమూర్తి విజయ్ ప్రకాష్ మిశ్రా తీర్పును వెల్లడించారు. 58 మంది దళితులను 1997 డిసెంబర్ 1న భూస్వామ్య కిరాయి సైన్యం రణవీర్ సేన కాల్చిచంపింది. మృతుల్లో 27 మంది మహిళలు, పదిమంది పిల్లలు కూడా ఉన్నారు. లక్ష్మణ్‌పూర్ – బాతేలో జరిగిన మారణకాండ దేశవ్యాప్తంగా సంచలనం అయింది.

చట్టబద్ధమైన హెచ్చరిక

ప్రభుత్వం రూపొందించిన బయో టెక్నాలజీ రెగ్యులేటరీ అథారిటీ బిల్లు 2009 (బిఆర్ఎఐ) ను వచ్చే రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. బిఆర్ఎఐ ప్రకారం జీఎం (జెనిటికల్లీ మాడిఫైడ్) ఉత్పత్తులు భద్రం కావంటూ శాస్త్రీయ ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తే జైలుకు పంపిస్తారు. ఒక్క వంకాయే కాదు, అన్నిరకాల జిఎం ఆహార ఉత్పత్తులను కేంద్రం మార్కెట్లోకి తేవాలని ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఈ బిల్లును రూపొందించింది. ఈ బిల్లుతో జైలుశిక్ష, జరిమాన, కోర్టుకు వెళ్లే అవకాశాలు లేవు. అన్ని చట్టాలకు అతీతం. ముగ్గురికే నిర్ణయాధికారం. పర్యావరణ శాఖ పరిధి నుంచి తప్పించి సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పరిధిలోకి ఈ బిల్లును తెచ్చారు.

అక్రమ మైనింగ్ ఆపండి

దేశంలోని వివిధ ప్రాంతాల్లో సాగుతున్న అక్రమ మైనింగ్‌ను ఆపేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. వివిధ రాష్ట్రాల ప్రతినిధుల సమావేశంలో ఈ అంశాన్ని తెలిపినట్లు గనులశాఖ కార్యదర్శి శాంతాషీలా నాయర్ వెల్లడించారు. ఇలా అక్రమంగా తవ్వే ఖనిజాలను రవాణ చేయవద్దంటూ రైల్వే బోర్డు చైర్మన్‌కు లేఖ రాశామన్నారు.

ఐపిఎల్ కమిషనర్ మోడీ సస్పెన్షన్

ఐపిఎల్ టోర్నమెంట్‌లో ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు బిసిసిఐ అయనకు షోకాజ్ నోటీసు జారిచేసింది. ఐపిఎల్ కమిషనర్ పదవి నుంచి సస్పెండ్ చేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) అనేది బెట్టింగ్, మ్యాచ్ ఫిక్సింగ్, జూదంగా మారిందని ఇందులో నల్లధనం ప్రవహిస్తోందనే ఆరోపణలున్నాయి. ఐటి అధికారుల దర్యాప్తులో నెమ్మదిగా ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. కొచ్చి ఐపిఎల్ ఫ్రాంచైజీ వివాదం కారణంగా విదేశాంగ శాఖ సహాయ మంత్రి శశిథరూర్ కేంద్ర మంత్రి పదవి నుంచి వైదొలగగా, ఐపిఎల్ కమిషనర్‌ను బి.సి.సి.ఐ. సస్పెండ్ చేసింది.

రాజ్యసభలో కోటీశ్వరులు

ప్రస్తుతం ఉన్న రాజ్యసభ సభ్యుల్లో దాదాపు వంద మంది కోటీశ్వరులు ఉన్నారని ఒక అధ్యయనంలో తేలింది. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే స్వచ్ఛంధ సంస్థ రాజ్యసభకు ఎన్నికయ్యే ముందు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వ్యక్తిగత ఆస్తుల అఫిడవిట్‌లను పరిశీలించి ఈ వివరాలు తెలిపింది. రాహుల్ బజాజ్ (రు. 300 కోట్లు) మొదటి స్థానంలో ఉండగా, రెండవ స్థానంలో జనతాదళ్ (ఎస్) ఎం.పి. రామస్వామి (రు. 278 కోట్లు) ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టి. సుబ్బిరామిరెడ్డి (రు. 272 కోట్లు) మూడో స్థానంలో ఉన్నారు. మొత్తం 219 మంది సభ్యుల్లో 98 మంది కోటికిపైగా ఆస్తులు కలిగి ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ ఎం.పి.లు 33 మంది కాగా, 21 మంది బిజెపి, ఏడుగురు ఎస్.పి.కి చెందిన వారున్నారు. వీ

చట్టంగా ఆరోగ్య బీమా

అమెరికా చరిత్రాత్మక 'ఆరోగ్య బీమా' బిల్లు చట్టంగా మారింది. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణల కోసం ఉద్దేశించిన బీమా బిల్లును చట్టంగా మరుస్తూ మార్చ్ 24న వైట్‌హౌస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బరాక్ ఒబామా సంతకం చేశారు. ఆరోగ్య బీమా ద్వారా దేశంలో 95 శాతం మందికి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా నాణ్యమైన ఆరోగ్య, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

రష్యాలో బాంబు దాడులు

మార్చ్ 29న రష్యా రాజధాని మాస్కో నగరంలో రద్దీగా ఉండే రెండు అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్‌లలో నలభై నిమిషాల వ్యవధిలో రెండు ఆత్మాహుతి బాంబు దాడులు జరిగాయి. ఈ సంఘటనలో 38 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడులలో మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నారని నిఘా వర్గాలు తెలిపాయి. మొదటదాడి జరిగిన సెంట్రల్ లుబియాంకా రైల్వే స్టేషన్ దగ్గరలోనే ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ప్రధాన కార్యాలయంతోపాటు, దేశాధ్యక్షుడి భవనం 'క్రెమ్లిన్'కు కూడా ఉంది. మార్చ్ 31న చెచెన్యాకు సరిహద్దున్న కిజ్‌ల్యార్ పట్టణంలో ఉదయం రెండు చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఇందులో 9 మంది పోలీసులతో సహా 12 మంది మరణించగా 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడులకు పాల్పడింది చెచెన్యా ఉగ్రవాదులుగా నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

కిర్గిజిస్థాన్‌లో తిరుగుబాటు

మాజీ సోవియట్ దేశమైన కిర్గిజిస్థాన్‌లో తిరగుబాటు చెలరేగింది. ఏప్రిల్ 7న ప్రతిపక్ష కార్యాలయం నుంచి బయలుదేరి అధ్యక్ష కార్యాలయాన్ని ముట్టడించిన ఆందోళనకారులు రాజధాని బిష్‌కెక్‌లో బీభత్సం సృష్టించారు. ఆందోళనకారుల దాడుల్లో దేశ అంతర్గత వ్యవహారాల మంత్రితో సహా 40 మంది మరణించారు. 400 మందికి పైగా గాయపడ్డారు. పరిస్థితి తీవ్రతను గమనించిన అధ్యక్షుడు బకియెవ్‌కు దేశం విడిచి పారిపోయారు. మాజీ విదేశాంగ మంత్రి రోజా ఒతున్‌బయెవా నేతృత్వంలోని విపక్ష కూటమి ఏప్రిల్ 8న మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా పారిపోయిన అధ్యక్షుడిని హెచ్చరించింది. ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహిస్తామని అప్పటి వరకు మధ్యంతర ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని ఒతున్‌బయెవా తెలిరాపు.

పోలండ్ అధ్యక్షుడి మృతి

ఏప్రిల్ 10న జరిగిన విమాన ప్రమాదంలో పోలండ్ అధ్యక్షుడు లెక్ కజిన్‌స్కీ మృతిచెందారు. ఈ దుర్ఘటన రష్యాలోని సెవెర్నీలో నగరంలో జరిగింది. ఈ ప్రమాదంలో ఆయనతో బాటు ఆయన భార్య, ఆర్మీ చీఫ్, విదేశాంగ సహాయ మంత్రి, ఇతర ఉన్నతాధికారులతో సహా 97 మంది మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా నేత స్టాలిన్ ఆదేశాల మేరకు ఆ దేశ సైనికులు కుటిన్ ప్రాంతంలో చంపేసిన 22 వేల మంది పోలండ్ సైనికుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనడానికి కజిన్‌స్కీ తన విమానం 'తుపోలెవ్-154'లో దేశ రాజధాని వార్సా నుంచి రష్యా బయల్దేరారు. ప్రతికూల వాతావరణంలో సివెర్నీ విమానాశ్రయంలో పైలట్ విమానాన్ని దించడానికి ప్రయత్నించాడు. పొగమంచులో, చెట్ల పై భాగంలో చిక్కుకుని రన్‌వేకు మూడు వందల మీటర్ల దూరంలో కూలిపోయి, ముక్కలయి, శకలాలకు నిప్పంటు కోవడంతో అందులో ప్రయాణిస్తున్న అందరూ మరణించారు.

శ్రీలంకలో పార్లమెంట్ ఎన్నికలు

శ్రీలంకలో ఏప్రిల్ 8న జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో అధ్యక్షుడు మహీంద రాజపక్స నేతృత్వంలోని యునైటెడ్ పీపుల్స్ అలయెన్స్ (యు.పి.ఎఫ్.ఎ.) విజయం సాధించింది. ఎల్.టి.టి.ఇ. పతనం తర్వాత మొదటిసారి జరిగిన పార్లమెంట్ ఎన్నికలివి. 225 స్థానాలకు గాను 117 స్థానాలు యు.పి.ఎఫ్.ఎ. గెలుచుకుంది. ప్రధాన ప్రతిపక్షం యునైటెడ్ నేషనల్ ఫ్రంట్‌కు 46 స్థానాలు దక్కాయి. మాజీ ఆర్మీ చీఫ్ ఫోన్సెకా నాయకత్వంలోని డెమోక్రటిక్ నేషనల్ అలయెన్స్ ఐదు స్థానాలు మాత్రమే గెలుచుకుంది.

అధ్యక్షుడి విశేషాధికారాలు రద్దు

పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీకి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన విశేషాధికారాల తొలగింపు, ఇతర రాజ్యాంగ సంస్కరణలకు ఉద్దేశించిన చరిత్రాత్మక 18వ రాజ్యాంగ సవరణ బిల్లుకు పాకిస్థాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుతో గత సైనిక నియంతలు రాజ్యాంగంలో తెచ్చిన మార్పులన్నీ రద్దయ్యాయి. అధ్యక్షుడి నుంచి కొన్ని అధికారాలను ప్రధానికి బదలాయించడం సహా పలు సవరణలను సెనేట్ ఆమోదించింది. ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి ప్రధాని పదవిని చేపట్టరాదన్న పరిమితిని కూడా ఈ బిల్లు తొలగించింది. ఈ బిల్లుపై ఏప్రిల్ 19న దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంతకం చేయడంతో ఈ బిల్లు చట్టంగా మారింది.

థాయ్‌లాండ్ పార్లమెంట్ నిర్బంధం

థాయలాండ్‌లో పార్లమెంట్‌ను రద్దుచేసి, ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకారులు ఏప్రిల్ 7న పార్లమెంట్‌ను ముట్టడించారు. పార్లమెంట్ గేటు దాటి, సమావేశాలు జరుగుతున్న రెండో అంతస్తును దిగ్బంధం చేశారు. సభలో ఉన్న ఉప ప్రధాని సుథాప్ ధావుగ్సుబాన్, మంత్రులు, ప్రజా ప్రతినిధులను చుట్టుముట్టారు. వీరిని సాయుధ సైనికులు ప్రభుత్వ హెలికాప్టర్‌లలో వచ్చి రక్షించారు. ఏప్రిల్ 11న జరిగిన ర్యాలీలో నిరసనకారులకూ, పోలీసులకూ జరిగిన ఘర్షణలో 17 మంది పౌరులు మరణించారు. ఏప్రిల్ 12న మరణించినవారి మృతదేహాలతో బ్యాంకాక్‌లో 'రెడ్ షర్ట్స్' కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్‌ను వెంటనే రద్దు చేయాలనీ, ముందస్తు ఎన్నికలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 మార్చ్ 2010 నుండి 20 ఏప్రిల్ 2010 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1919)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు: వ్యవసాయ రంగం	ఆత్మహత్యలు: చేనేత రంగం	ఆత్మహత్యలు: ఇతరాలు: స్త్రీ	ఆత్మహత్యలు: ఇతరాలు: పు.	చికిత్స అందక, అనారోగ్యం: స్త్రీ	చికిత్స అందక, అనారోగ్యం: పు.	చికిత్స అందక, అనారోగ్యం: పి.	గుర్తు తెలియని: స్త్రీ	గుర్తు తెలియని: పు.	హత్యలు: స్త్రీ	హత్యలు: పు.	ప్రమాదాలు: పనిచేసే స్థలంలో	ప్రమాదాలు: కరెంట్	ప్రమాదాలు: రహదారి	ప్రమాదాలు: ఇతరాలు	పోలీసు కాల్పుల్లో: ఉద్యమ కారులు	పోలీసు కాల్పుల్లో: ఇతరులు	పోలీసులు, సైన్యం	మిస్సింగ్/లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్	–	8	–	12	13	2	6	3	–	4	1	4	5	8	10	12	–	–	–	3	14
హైదరాబాద్	–	–	–	11	29	–	–	1	1	10	4	13	2	–	49	15	–	–	–	11	–
కరీంనగర్	–	14	1	58	42	21	31	–	3	12	8	11	5	5	28	34	–	–	–	9	35
ఖమ్మం		–	–	2	5	1	5	4	–	–	3	2	7	–	12	5	2	–	–	–	4
మెదక్	–	5	–	13	12	3	5	1	1	1	–	8	2	6	30	17	–	–	1	–	–
నిజామాబాద్	–	–	–	10	19	1	–	–	1	–	–	4	4	1	25	18	–	–	–	–	–
రంగారెడ్డి	–	6	–	8	21	8	9	8	3	6	3	8	13	8	41	17	–	–	–	–	6
వరంగల్	–	–	–	2	4	–	3	–	–	1	–	2	–	9	–	1	–	–	–	–	3
అనంతపురం	వివరాలు అందలేదు																				
చిత్తూరు	–	–	–	9	3	5	8	13	4	2	5	5	12	3	30	15	–	–	–	–	20
కడప	వివరాలు అందలేదు																				
కర్నూలు	–	7	–	33	14	2	5	3	4	7	5	3	4	9	68	19	–	–	–	–	15
తూర్పు గోదావరి	–	1	–	9	15	1	1	–	2	3	–	8	2	–	41	19	–	–	–	1	–
గుంటూరు	–	–	–	9	8	–	4	–	4	4	10	8	2	1	63	9	–	–	–	4	7
కృష్ణా	1	3	–	5	9	3	2	5	2	1	4	6	2	2	18	6	–	–	–	–	3
నెల్లూరు	–	–	–	9	30	11	5	–	4	1	5	5	–	3	82	47	–	–	–	–	10
పశ్చిమ గోదావరి	వివరాలు అందలేదు																				
శ్రీకాకుళం	–	–	–	5	7	4	4	8	3	2	4	6	4	1	17	4	–	–	–	–	–
విశాఖపట్నం	వివరాలు అందలేదు																				
విజయనగరం	వివరాలు అందలేదు																				
మొత్తం	**1**	**44**	**1**	**195**	**231**	**62**	**88**	**46**	**32**	**54**	**52**	**93**	**64**	**56**	**514**	**238**	**2**	**–**	**1**	**28**	**117**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – సుమలత; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహిమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; నెల్లూరు – కె. సుబ్బనాచారి; పశ్చిమ గోదావరి – టి. హేమలత; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. అరుణ; విజయనగరం – డి. సుధాకర్


వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, ఆర్థిక వ్యవహారాలు,
ఉపాధి, పాలన, ప్రాంతీయ అసమానతలు,
ప్రజా ఉద్యమాలు, తదితర అంశాలపై


వి. హనుమంతరావు

వ్యాసాల సంకలనం

మీరు - నేను - ఆర్థికం

రు. 60





110 ఏళ్లలో 14 దేశాలపై అమెరికా దురాక్రమణల చరిత్ర


స్టీఫెన్ కింజర్

'ఓవర్ త్రో' కు
కొణతం దిలీప్ తెలుగు అనువాదం

కుట్రాజకీయం

అమెరికా దుర్మార్గాల శతాబ్ది

రు. 40



యాభై సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ సాధించిన అభివృద్ధి - వెనుకబాటుతనం,
విజయాలు - వైఫల్యాలు, రాజకీయార్థిక, సామాజిక పరిణామాలు,
వాస్తవాలు - విశ్లేషణలు, గణాంకాలు నలభై వ్యాసాల సమగ్ర సంకలనం (ఇంగ్లీష్)

సంపాదకులు : ఆర్.ఎస్. రావు, వి. హనుమంతరావు, ఎన్. వేణుగోపాల్

ఫిఫ్టీ ఈయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

సాదా ప్రతి : రు. 225

ప్రతులకు, వివరాలకు:

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 106 - May 2010
• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/04/2010 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

ఒక్క నిమిషం ఆగి ఇది చదవండి!
వీక్షణం ఆగిపోకుండా కాపాడవలసింది మీరే!!

మీరు మీ చేతుల్లోకి తీసుకుని చదవబోతున్న ఈ పత్రిక, ఎన్నో ఏళ్లుగా మీరు అభిమానించి ఆదరిస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి మీరు తెలుసుకోవలసి ఉంది.

వీక్షణం 2005 జూలై సంచిక నుంచి ఇప్పటివరకూ విడిప్రతి ఖరీదు గాని, సంవత్సర చందాగాని పెంచలేదు. మీ చేతికి ఈ పత్రిక పది రూపాయలకే అందుతున్నది. మీరు చందాదారులయితే ఆ పది రూపాయలలో కూడ మళ్లీ అర్ధరూపాయి పోస్టేజికి ఖర్చవుతుంది. మీరు దుకాణంలో కొనుక్కునే వారయితే మీరు ఇచ్చే పది రూపాయలలో నాలుగు రూపాయలు ఏజెంటుకే చేరుతాయి. అంటే చందామీద తొమ్మిదిన్నర రూపాయలు, ఏజెంటు ద్వారా అమ్మే ప్రతి మీద ఆరు రూపాయలు మాత్రమే వీక్షణంకు తిరిగి వస్తున్నాయన్నమాట. కాని వీక్షణం ఒక ప్రతి ఉత్పత్తి వ్యయం పద్నాలుగు రూపాయలు. (కాగితం, ముద్రణ ఖర్చు ఏడు రూపాయలు, కార్యాలయ నిర్వహణ ఖర్చు ఆరు రూపాయలు, రవాణా ఖర్చు ఒక రూపాయి). అంటే చందా మీద నాలుగున్నర, ఏజెంటు ద్వారా అమ్మే కాపీ మీద ఎనిమిది రూపాయలు నష్టం అన్నమాట. ప్రపంచవ్యాప్తంగా పత్రికల ఆర్థిక స్థితి ఇలానే ఉంటుంది. సాధారణంగా పత్రికలు ఉత్పత్తి వ్యయాన్ని అమ్మకం ధరగా పెట్టి, పాఠకుల మీద భారం వేయలేవు. అందువల్లనే పత్రికలు వ్యాపార ప్రకటనలు స్వీకరించి ఆ లోటును పూడ్చుకుంటాయి. వీక్షణంకు ఒకే ఒక్క ప్రకటన ఉందనీ, అది కూడా క్రమం తప్పకుండా రావడం లేదనీ మీకు తెలుసు. ప్రకటన ఉన్నప్పుడు కూడా వీక్షణం లోటులో మూడోవంతును మాత్రమే పూరించగలుగుతుంది. ప్రతినెలా కనీసం మరి రెండు ప్రకటనలు వస్తేగాని వీక్షణం ఆదాయ వ్యయాలు సమానం కావు. ఇంతకాలం వీక్షణం మాతృసంస్థ సిడిఆర్‌సి చేసిన కార్యక్రమాలతో ఈ లోటును భరిస్తూ వచ్చింది గాని అది ఎక్కువకాలం సాగదు. ఇప్పుడిక మీలో ప్రతి ఒక్కరూ పూనుకుని మీ వ్యక్తిగత బాధ్యతగా భావించకపోతే వీక్షణం ఆర్థిక పరిస్థితి నెలనెలకూ మరింతగా క్షీణిస్తుంది. వీక్షణంను ఆదుకోవలసింది మీరే.

మీరు తలచుకుంటే

- ప్రతి ఒక్క చందాదారూ తమ బాధ్యతగా కనీసం మరొక చందా చేర్పించవచ్చు.
- ఏజెంటు దగ్గర విడి ప్రతి కొనుక్కునే పాఠకులందరూ చందాదారులు కావచ్చు.
- మీకు తెలిసిన గ్రంథాలయాలకు, సంస్థలకు, విద్యాలయాలకు వీక్షణంను పరిచయం చేయవచ్చు.
- మీకు పరిచయస్తులైన శ్రేయోభిలాషుల దగ్గర, సంస్థల దగ్గర వ్యాపార ప్రకటనలు, విరాళాలు సేకరించవచ్చు.

చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
మూడు సంవత్సరాల చందా	రు.	350
ఐదు సంవత్సరాల చందా	రు.	550
పది సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao